అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక 313

సంపుటి: 38 సంచిక: 6 ఏప్రిల్ 2015

పేజీలు: 52 వెల: రు. 15

కామ్రేడ్ కవ్వాలి బాలయ్య,
కామ్రేడ్ కానూరి వెంకటేశ్వరరావులకు
అరుణారుణ జోహార్లు

ARUNATARA BOOKS

Printed and published by Viplava Rachayitala Sangam (Virasam)

ప్రస్తుతం అందుబాటులో ఉన్న విరసం ప్రచురణలు, వాటి ధరలు

కథ, నవల, కవిత్వం, సాహిత్య విమర్శ

1.	కొడవటిగంటి కుటుంబరావు సమగ్ర సాహిత్యం (19 సంపుటాలు)	రూ.4525-00
2.	సాహిత్య సమాలోచన (కృష్ణాబాయి)	300-00
3.	భావవిప్లవకారుడు కొకు	80-00
4.	కొకు సమకాలీనత - విశ్లేషణా వ్యాసాలు	75-00
5.	అక్షరతుణీరం (కె.వి.ఆర్. సాహిత్య విమర్శ వ్యాసాలు)	20-00
6.	సుబ్బారావు పాణిగ్రాహి కవిత్వం, పాటలు	25-00
7.	అంతస్సూత్రం (వరవరరావు కవిత్వం)	40-00
8.	బీజభూమి (వరవరరావు కవిత్వం)	100-00
9.	గుమ్మెటమోత (పాణి నవల)	100-00
10.	కలిసి పాడాల్సిన గీతమొక్కటే (పాణి కవిత్వం)	10-00
11.	తరాల పల్లె (కౌముది రచనలు)	50-00
12.	చలసాని ప్రసాద్ రచనలు	60-00
13.	దండకారణ్య కథలు	100-00
14.	తెలుగు భాష - కొన్ని సంగతులు (వి.చెంచయ్య)	15-00
15.	సాహిత్యధోరణులు - విప్లవ దృక్పథం	30-00
16.	విరసం సాహిత్య విమర్శ	150-00
17.	కథల పంట-3	120-00
18.	తీత్వాల్ కుక్క మరికొన్ని కథలు (సాదత్ హసన్ మంటో)	60-00
19.	జాజిపూల పరిమళం (షహీదా కథలు)	150-00
20.	ఒక మాట, ఒక సంభాషణ (షహీదా కవిత్వం)	75-00
21.	సామాన్యుల సాహసం (నిత్య, మైనా, సుజాత కథలు)	60-00
22.	ఫాల్గుణ (పద్మకుమారి నవలిక)	30-00
23.	నల్లమల (పి. చంద్ నవల)	225-00
24.	లాల్‌బనో గులామీ ఛోడో బోలో వందేమాతరం (ఎన్‌కె దీర్ఘ కవిత)	25-00
25.	ముడిమనిషి (అరుణతార కథలు 1)	30-00
26.	చేపలు (అరుణతార కథలు 2)	30-00
27.	తెహెల్కా అద్దంలో సర్కారు బింబం మరికొంత కవిత్వం (బాసిత్)	100-00
28.	ఆఖరి బిడ్డ (బాసిత్ నాటిక)	10-00
29.	కాంత, పున్నం, వెన్నెల (పద్మకుమారి కథ)	20-00
30.	రేపు (వెర్నన్ గొంజాల్వెజ్ కథ)	20-00
31.	మిగిలెటోళ్లు (బాసిత్ కథలు)	50-00
32.	రెండు పోరాట గాథలు (భారతి కథలు)	50-00
33.	కటికీ పిట్ట (పి. మోహన్ కవిత్వం)	10-00
34.	పిల్లనగ్రోవి తుఫాను (ఉదయభాను కవిత్వం)	10-00
35.	మంజీరా మూడ్స్ (మంజీరా కవిత్వం)	25-00
36.	కవితా ఝుంకార్ (విరసం కవితా సంకలనం)	75-00
37.	ఎర్రనక్షత్రం (చైనా నవల)	50-00
38.	సముద్రంతో సంభాషణ (పి. వరలక్ష్మి)	20-00
39.	నెగడు (కథలు)	90-00
40.	ఒంద్రుమట్టి (నవల)	170-00
39.	Wake of Telangana? - A docu-drama by basith	10-00

సంస్కృతి, చరిత్ర, రాజకీయార్థిక, సైద్ధాంతిక రచనలు

1.	సామ్రాజ్యవాద సంస్కృతి (జేమ్స్ పెట్రాస్ వ్యాసాలు)	125-00
2.	మావో రచనలు - 1	220-00
3.	మావో రచనలు - 2	220-00
4.	రివిజనిజం (మావో)	75-00
5.	మార్క్సిజం, లెనినిజం, మావోయిజం	125-00
6.	చారుమజుందార్ 8 డాక్యుమెంట్లు	50-00
7.	మంద్రస్థాయి యుద్ధం	100-00
8.	విద్యార్థి యువజనోద్యమాలు (లెనిన్)	30-00
9.	రాజకీయ కృషి - మన కృషి అంతటికీ జీవనాడి (చైనా విప్లవోద్యమన పత్రిక హాంకీ వ్యాసాలు)	35-00
10.	నక్సల్బరీ వెలుగులో (భారతదేశ నక్సలైట్ ఉద్యమ చరిత్ర)	125-00
11.	జగిత్యాల జంగల్‌మహల్ (1)	75-00
12.	జగిత్యాల జంగల్‌మహల్ (2)	100-00
13.	స్టోలిపిన్ అభివృద్ధి నిరోధక కాలంలో	15-00
14.	అంతర్జాతీయ విప్లవోద్యమాల్లోని ఆటుపోట్లు	60-00
15.	భారతదేశంలో ఉత్పత్తి విధానం - ఉత్పత్తి సంబంధాలు	20-00
16.	ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయోత్పత్తి సంబంధాలు	30-00

వర్తమాన సమాజం, ప్రజా ఉద్యమాలు

1.	ముజఫర్‌నగర్ మరో మానని గాయం	20-00
2.	నేటి రాయలసీమ	100-00
3.	అంతర్యుద్ధంలో ఆదివాసులు	30-00
4.	దండకారణ్యంలో గ్రీన్‌హంట్	60-00
5.	ఉద్యమ ఆకాశంలో సగం	15-00
6.	తూర్పు మధ్య భారతంలో విస్థాపన-ప్రజా ప్రతిఘటన	20-00
7.	జనతన జైత్రయాత్ర	20-00
8.	ఫిలిప్పినో ఉద్యమం	15-00
9.	ఖైదీల సైరన్	60-00
10.	విముక్తిబాటలో నారాయణపట్నా	20-00
11.	జ్ఞానం అందరిది	30-00

స్మృతి సాహిత్యం

1.	ఖాన్‌దాదా (ఎం.టి.ఖాన్ స్మృతి)	10-00
2.	ఆదర్శజీవులు అమరులు	30-00
3.	నేనున్నాను కామ్రేడ్ (గంటి ప్రసాదం స్మృతిలో)	30-00
4.	గంటి ప్రసాద్ రచనలు	25-00
5.	సూర్యుడు మరణించడు	60-00
6.	చిరునవ్వు సితార	80-00
7.	గెరిల్లా డైరీ	10-00
8.	మన్యం వెలుగులు	15-00
9.	అక్షర కిరణం	20-00

మరిన్ని వివరాలకు సంప్రదించండి

డి.వి. రామక్రిష్ణారావు, అరుణతార వర్కింగ్ ఎడిటర్, ఎం.ఐ.జి-14, ఎ.పి.ఐ.ఐ.సి., కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి, హైదరాబాద్-500 040,
ఫోన్ : 99891 89250 (ఉదయం 9 లోపు సాయంత్రం 8 తరువాత మాత్రమే) ఈమెయిల్ : arunatara1977@gmail.com

పుస్తకాల ధరకు సరిపడా డబ్బులతో పాటు, పోస్టింగ్ ఖర్చులను జతచేసి ఎం.ఓ. లేక డిడి ద్వారా పంపి పుస్తకాలను పొందవచ్చు.

ఆన్‌లైన్‌లో డి.వి.రామక్రిష్ణారావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, లాలాగూడ బ్రాంచ్, హైదరాబాద్, ఎకౌంట్ నెం. 10243583773, ఐఎఫ్ఎస్‌సి కోడ్ : ఎస్.బి.ఐ.ఎన్.0007112కి చెల్లించి పుస్తకాలను పొందవచ్చు.

పి. వరలక్ష్మి, విరసం కార్యదర్శి, 5-1820, గీతాశ్రమం వీధి, ప్రొద్దుటూరు. ఫోన్ : 81799 13123, ఈమెయిల్ : varalurwa@gmail.com

మా ప్రచురణలు నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ ఎదురుగా, కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్‌లోనూ లభిస్తాయి. ఫోన్ నెం: 040-24652387

KLVA101M177

అరుణతార
సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

313

సంపుటి : 38 ◆ సంచిక : 6 ◆ ఏప్రిల్ 2015

సంపాదకుడు
చలసాని ప్రసాద్
వర్కింగ్ ఎడిటర్
డి.వి. రామక్రిష్ణారావు
ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా,
మౌలాలి, హైదరాబాద్ - 500 040.
* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా
రచనలు పై చిరునామాకూ,
ఇ-మెయిల్ ద్వారా
arunatara1977@gmail.com కూ
పంపవచ్చు
సంపాదకవర్గం :
ఉజ్వల్, బాసిత్, కూర్మనాథ్

చందాలు పంపాల్సిన చిరునామా
మేనేజర్
వలేటి అరవింద్ కుమార్
భీమ్‌సేన్‌రావు, 1-9-52/ఎఫ్/2,
ఈ-సేవ దగ్గర, మదర్ హైస్కూల్ ఎదురుగా,
రామ్‌నగర్, హైదరాబాద్ - 500020.
సెల్ : 8142200711
(ఫోన్ చేయాల్సిన సమయం
ఉ.10 గంటల నుండి మ. 1 గంట వరకు)

విరసం కార్యదర్శి చిరునామా
పి. వరలక్ష్మి
5-1820, గీతాశ్రమం వీధి,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.
డి.టి.పి. అండ్ లే అవుట్
ఆర్. భాగ్యలక్ష్మి
మొదటి కవర్ చిత్రం గీసినది
వాన్ గో
2-3 కవర్ డిజైన్
ఆర్. భాగ్యలక్ష్మి

Like Page://arunatara viplava rachayitala sangham

Virasam website : *www.virasam.in*

ఈ సంచిక వెల : రు. 15/-

సంపాదక లేఖ...

బంగారు తెలంగాణ అంటే ఎన్‌కౌంటర్ల తెలంగాణ. ఈ మాట అంటే కేసీఆర్‌కు కోపమేం రాకపోవచ్చు. పాలించేవాళ్లకు ఆపాటి స్పష్టత ఎందుకు ఉండదు? జెయిలు నుంచి కోర్టుకు తీసికెళ్తూ ముస్లిం యువకులను కాల్చేసిన తెలంగాణ ప్రభుత్వానికి బోలెడు సమర్థన ఉంది. వాళ్లు సిమి కార్యకర్తలనే మాట ఒక్కటి చాలు.. కాల్చేయడానికి. వాళ్లు ముస్లింలు కదా. అంతకంటే ఏం కావాలి? సునాయాసంగా ఏమైనా చెప్పవచ్చు.

అయితే మాత్రం కాల్చేస్తారా? బూటకపు కథనం చెబుతారా? అని మనం అడిగినా కేసీఆర్‌కేమీ కోపం రాదు. కాకపోతే ఆయన ఆశ్రిత మేధావులకే రావచ్చు. బంగారు తెలంగాణలో ఎన్‌కౌంటర్లే కాక ఇంకా చాలా ఉన్నాయని చూపడానికి వాళ్లెంత కసరత్తు చేస్తారో.

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబైతే శేషాచలం కొండల్లో ఎర్రచందనం స్మగ్లర్లనే పేరుతో ఇరవై మంది కూలీలను కాల్చేసి నిష్పూచీగా ఉండగలడు. ఆయన చరిత్ర అంతా పెట్టుబళ్లూ, ఎన్‌కౌంటర్లే. ఆయన ఎవరినైనా కాల్చేసి ఏమైనా చెప్పగలడు. అసలు ఏమీ చెప్పకుండానే రాజధానిని షాంగై చేస్తానని ప్రకటించగలడు. రాష్ట్రాన్ని సింగపూర్ చేస్తాననేదానికి అదనం ఇది. చైనా పర్యటన తర్వాత అందుకున్న కొత్త పాట. ఆయన ఇంకే దేశం పోతాడో.. రాష్ట్రాన్ని ఏం చేస్తాడో చెప్పలేం. ఎన్‌కౌంటర్లు మాత్రం మామూలే. ఈ మాట అంటే ఆంధ్రప్రదేశ్‌లో పత్రికలకు కోపం వస్తుంది. శేషాచలం కొండల్లో ధర్మ సంస్థాపన జరిగిందని చెప్పగల బరితెగింపు కొన్ని పత్రికలకు ఉంది. పోలీసులు సమర్థవంతంగా పని చేస్తున్నారని, చనిపోయింది కూలీలు కాదని చెప్పడానికి ఎంత తాపత్రయపడ్డాయో. పత్రికలు ఇక దేవతా వస్త్రాల కథ కూడా వినిపించాలనుకోవడం లేదు. అన్నీ వదిలేసి ప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరించ దల్చుకున్నాయి. ఇరవై మందిని పోలీసులు కాల్చేసిన సమయంలో ఎర్ర చందనం కూలీలు గతంలో ఎక్కడెక్కడ పోలీసులపై దాడులు చేసిందీ చిట్టా విప్పాయి. హృదయ విదాకరంగా పాత ఫొటోలు అచ్చేశాయి. అవన్నీ నిజమే అనుకుందాం. అయితే పోలీసులు చట్ట విరుద్ధంగా కూలీలను చంపేస్తారా? చంపవలసిందే.. అని పత్రికలు చెప్పదల్చుకున్నాయి.

ఆ రకంగా పోలీసుల కంటే కూడా ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు ఎన్‌కౌంటర్‌ను సమర్థించడం చూసి మనం సిగ్గుపడనవసరం లేదు. అవి తమ అసలుసిసలైన కర్తవ్యపాలనలో ఉన్నాయని అనుకోవాల్సిందే. ఫోర్త్ ఎస్టేట్ ఇక ఎంత మాత్రం తేడా లేకుండా పూర్తిగా స్టేట్‌లో భాగమైపోయిందని చెప్పుకోవాల్సిందే. సొంత వ్యక్తిత్వం ఏమీ లేకుండా ప్రభుత్వ స్వరం వినిపిస్తున్న పత్రికలను చదివి వాస్తవాలను అర్థం చేసుకోవాల్సిన దుస్థితి రాజ్యమేలుతున్నది.

'సమాజం ఇంతగా పతనమయిపోయిందా?' అని కొందరు వాపోతుంటారు. 'ఇంతగా అంటే.. ఇదుగో పత్రికలంత..' అని ఈ పతనపు అంచులను చూపించవచ్చు.

ఎర్ర చందనం కూలీల హత్యల మీది నుంచి ప్రజల మనసు మళ్లించడానికి, వాస్తవాలను కత్తిరించి చూపడానికి, దాచేయడానికి పత్రికలు ఎంత ప్రయాస పడ్డాయో.

ప్రభుత్వాలు ఎంత దుర్మార్గాలు చేయగలవో అందరికీ తెలుసు. అందుకే వాటిపై ఎంతో కొంత నిరసన వినిపించగలం. శక్తి మేరకు పోరాడగలం. కానీ ఈ దుర్మార్గాలకు సాధికారత కల్పిస్తున్న పత్రికలపై పోరాడే రోజు ఎప్పటికైనా వస్తుందా?

తాజా కలం :

విప్లవ సాంస్కృతిక రంగంలో విశేష కృషి చేసిన కామ్రేడ్ కవ్వాలి బాలయ్య (మడుపు బాలయ్య-89) సికింద్రాబాద్ దగ్గర, గొల్లగూడలో అనారోగ్యంతో ఫిబ్రవరి 24న చనిపోయారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక సభ్యులు కామ్రేడ్ కానూరి వెంకటేశ్వరరావు (99)లకు విప్లవ రచయితల సంఘం అరుణారుణ జోహార్లు అర్పిస్తోంది. వారిపై జ్ఞాపకాలను, రచనలను వచ్చే సంచికలో అందిస్తాం. - సం.

సంచిక - 313

సంపాదకీయం (5-6)
చీకటిగలకోన(లో) సచ్చినోడిబండ విప్పి చెప్పిన మర్మం
- పి. వరలక్ష్మి

పాటలు/కవిత్వం (7-12)
కొన్ని తుపాకులు ఒక బాల్యం - వి. శ్రీనివాస్
నేను వీరున్ని చూశాను- రమేష్ గోంద్యాల
ఒక అద్భుత బాలిక కొన్ని ప్రతిరూపాలు- బాల సుధాకర మౌళి
ఇశారం - పి. బాలయ్య
ఆకలిని రెక్కలపై మోస్తూ - సువర్ణ
బతుకు - ఎం. రాఘవాచారి

కథ (10-12)
విడాకులు - సాదత్ హసన్ మంటో
తెలుగు : జఫీరా

అల్పికలు - గల్పికలు (12-15)
మూవీ మేకింగ్ - బమ్మిడి జగదీశ్వరరావు

సాహిత్య వ్యక్తిత్వం (15-20)
మూగవాని పిల్లనగ్రోవి - ఆధునిక వీరగాథ
- మధురాంతకం నరేంద్ర

కేశవరెడ్డి నవలికా ఇతివృత్తం - జి. వెంకటకృష్ణ
నేనెరిగిన కేశవరెడ్డి - ఉదయమిత్ర .

వ్యాసాలు (21-30)
బ్లడీ వుడ్.. ఓ ఎన్‌కౌంటర్ కథ వెనక - ఎం.కె. కుమార్
దండకారణ్యంలో మతాంతీకరణ ప్రయత్నాలు - జహంగీర్

పుస్తక పమీక్ష (31-37)
చారుమజుం'దారి' - కోటయ్య పిన్నిబోయిన
మరచి పోలేని నవల - మరణానంతర జీవితం
- పలమనేరు బాలాజీ
పరాజితుల గాథ 'అసురుడు' - పావని
'కట్ట' కథా సమీక్ష - వీరబ్రహ్మాచారి

కీనోట్ పేపర్ (38-47)
సామాజిక ఉద్యమాలు - ప్రజాస్వామిక విప్లవం - పాణి

సంస్మరణ (48-50)
ఉరుగ్వే అరుణపతాక, అక్షర యోద్ధ ఎడ్వార్డో గలీనో -
ముక్తవరం పార్థసారథి

విరసం కరపత్రాలను, స్టేట్‌మెంట్లను, అరుణతార పత్రికలను, విరసం ప్రచురణలను **www.virasam.in** వెబ్‌సైట్‌లో చూడవచ్చు. సాఫ్ట్‌కాపీలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
అలాగే వివిధ సాహిత్య పత్రికల బ్లాగులు, సైట్‌ల లింకులను కూడా చూడవచ్చు.

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి.
డి.డి.లను పలేటి అరవింద్ కుమార్, హైదరాబాద్ పేర తీయండి.
విడి సంచిక వెల - రు. 15; సంవత్సర చందా - రు. 180;
రెండు సంవత్సరాల చందా - రు. 350; మూడు సంవత్సరాల చందా - రు. 500;
ఐదు సంవత్సరాల చందా - రు. 800; దశాబ్ది చందా - రు. 1600/-

మీ రచనలను అరుణతారకు ఈ-మెయిల్ కూడా చేయవచ్చు!
పేజ్‌మేకర్ ఓపెన్ ఫైల్, పి.డి.ఎఫ్. పద్ధతులలో (అను 6.0లో అయితే మేలు),
మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎం.ఎస్. భాషాలో కూడా అరుణతారకు మెయిల్ చేయగలరు .
ఈ-మెయిల్ : **arunatara1977@gmail.com**
Like Page://arunatara viplava rachayitala sangham
Website : www. virasam. in

చీకటీగలకోన(లో) సచ్చినోడిబండ విప్పి చెప్పిన మర్మం

- పి.వరలక్ష్మి

తెలుగు సమాజంలో నలభై ఏళ్ల పౌరహక్కుల ఉద్యమం ఎంతో రాజ్యహింసనెదుర్కొని, ప్రాణలు కూడా బలిపెట్టి ఒక సత్యాన్ని ప్రపంచం ముందు నిలబెట్టింది. ఎన్‌కౌంటర్లన్నీ పోలీసు హత్యలేనని ఇప్పుడు కొత్తగా ఎవరూ ప్రయాసపడి నిరూపించాల్సిన అవసరం లేనంతగా అది ప్రజలకు అర్థమైంది. ఇక్కడ ఎన్‌కౌంటర్ జరగదు. "ఎన్‌కౌంటర్" చేస్తారు. "ఎన్‌కౌంటర్ చెయ్యడం" అనే వాడుక వ్యాకరణ దోషం కాదు. ప్రజల ఎరుకలో ఉన్న జీవిత సత్యం. కనుక ఎన్‌కౌంటర్ నిఘంటువు అర్థం ఎప్పుడో మారిపోయింది. ఎదురుకాల్పుల స్క్రిప్టు పాతదే. అయితే దానికి కొత్త ట్రీట్‌మెంట్ ఇవ్వడం మొదలైంది. నల్లమలలో మూడు ఎన్‌కౌంటర్ హత్యలతో నవ్యాంధ్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టిన నారా చంద్రబాబునాయుడి పాలన నారావారి పల్లెకు పది కిలోమీటర్ల దూరంలోని శేషాచలం అటవీ ప్రాంతంలో 20 మంది కూలీలను బలితీసుకుని ఎదురుకాల్పులకు సర్వజనామోద కథనాలతో సింగపూర్ వైపు దూసుకుపోతోంది. "ఎన్‌కౌంటర్" కోసం ఎంచుకున్న ప్రాంతాలు "సచ్చినోడిబండ", "చీకటీగలకోన" చూస్తే చాలా హేళన చేస్తున్నట్లనిపించిందని ఒక పౌరహక్కుల కార్యకర్త అన్నాడు. పేర్లే కాదు, ప్రాంతాలూ అట్లాగే ఉన్నాయి. అక్కడ మూడు కిలోమీటర్ల వరకు ఒక్క ఎర్రచందనం చెట్టు లేదు. రాళ్లు (సాయుధ పోలీసులను చంపగల మోస్ట్ డేంజరస్ వెపన్స్), రాళ్ల గుట్టలు లేవు. అక్కడ పడవేసిన మృతదేహాల పక్కన మూడు గొడ్డళ్లు, తుప్పు పట్టిన రెండు నాటు తుపాకులు తప్ప. శవాలను ఆనుకుని ఎప్పుడో స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు పెయింట్ వేసి క్రైం నెంబర్లు కూడా రాసి ఉన్నాయి. యథావిధిగా విగతజీవుల ఛాతి, తల భాగాల్లో తూటాలు. పౌరహక్కుల సంఘాలు నిజనిర్ధారణకు పోనక్కరలేకుండా టీవీల్లో చూసినా అర్థమయ్యేలా చంపేశాం చూసుకోండి అని సీన్ తయారుచేసి తీరిగ్గా ఎదురుకాల్పుల కథ వ్యంగ్యార్థం వచ్చేలా చెప్పారు పోలీసులు.

ఇప్పుడు చర్చల్లా ఎన్‌కౌంటర్ బూటకమా, వాస్తవమా అని కాదు. బూటకమో, వాస్తవమో, నేరస్తులను ఎన్‌కౌంటర్ చేశాం తప్పేంటి? అనే దబాయింపు మంత్రుల మాటల్లో వినపడుతోంది. అక్కడి నుండి చనిపోయిన వాళ్లు కూలీలా, స్మగ్లర్లా అనే చర్చ. ఇన్నేళ్లుగా ఎన్‌కౌంటర్ కట్టుకథల మర్మాలను విప్పి చెప్పే పని పౌరప్రజాస్వామిక హక్కుల సంఘాలు ఎట్లా చేస్తూ వచ్చాయో, పోలీసు హత్యలు తప్పు కాదు అనే ప్రచారం చాపకింద నీరులా విస్తరింపజేస్తూ వచ్చాయి పాలకపక్షాలు. చంపేశాక వాళ్లు చంపదగిన వ్యక్తులే అని పోస్టు స్క్రిప్టు పోలీసులు తయారుచేస్తే, మీడియా మసాలా అద్ది తన పవిత్ర కర్తవ్యాన్ని నెరవేర్చుతోంది. అరుదైన సన్నివేశాల్లో తప్పితే ప్రతిపక్షాలు మాట్లాడవు. వర్గప్రయోజనాలు, అధికారంతో వెంట వచ్చే అప్రతిహత నియంతృత్వాలు అన్ని బూర్జువా పార్టీలూ కోరుకుంటాయి. వరంగల్ హత్యల్లో వలె చనిపోయిన వారు ముస్లింలయితే ఆ మాత్రం కష్టం కూడా ఉండదు. తీవ్రవాదులందరూ ముస్లింలే, తిప్పి చెబితే ముస్లింలందరూ తీవ్రవాదులే. ఇది పక్కదేశాన్ని ద్వేషించే ఘనమైన దేశభక్తికి గీటురాయిగా అతివాద, మితవాద జాతీయపార్టీలన్నీ నిలబెట్టిన ధర్మం. వాదన కోసం మనబోటి వాళ్లు ఎవరైనా మరి హిందూ తీవ్రవాదుల సంగతేంటని అడిగితే -బాంబు పేలుళ్ల కేసులో నిందితులుగా హిందూమత సంస్థలకు చెందిన వారు బైటికి తేలారనే వాస్తవాన్ని చూపినా సరే- దుద్దు కర్రల మనోభావాలు దెబ్బతింటాయి.

సూర్యాపేట ఎన్‌కౌంటర్‌లో చనిపోయింది దోపిడి దొంగలో, తీవ్రవాదులో కానీ ఎన్‌కౌంటర్ అయితే జరిగింది. ఆ ఇద్దరూ చనిపోయారు. చనిపోయిన పోలీసులు నలుగురు కాబట్టి ఈక్వేషన్ కుదరలేదేమో! పంజరంలో ఉన్న చిలకల గొంతు నులిమేసినట్లు, విచారణ ఖైదీలను చేతులకు బేడీలు కూడా తొలగించకుండా చంపి శవాల చేతుల్లో గన్నులు పెట్టారు. నేర విచారణ పూర్తయితే బహుశా వారు నిర్దోషులుగా బైటపడొచ్చు కాబట్టి ముందే శిక్ష అమలైంది. ఈ మాట మాట్లాడితే తీవ్రవాదులను సమర్థిస్తారా అని హూంకరింపులు. ఎవరు తీవ్రవాదులని ఎవరు తేలుస్తారు? పోలీసులా? మీడియానా? దేశభక్తి ట్యాగ్ తగిలించుకున్న కాషాయదళాలా? సచ్చినోడిబండలో, చీకటీగలకోనలో, వరంగల్ ఎన్‌కౌంటర్‌లో పలికిన ఐరనీ లాంటిదే మన ప్రజాస్వామ్యం. చట్టం అందరికీ సమానమే. కాకపోతే కొందరికి ఎక్కువ సమానం. అటువంటి వారు నేరారోపణలతో చట్టసభలకు పోవచ్చు. హత్యారోపణలతో దేశాధినేతలు కావచ్చు. కోట్లు కొల్లగొట్టి రాష్ట్రాలనేలవచ్చు. అత్యాచారాలు చేసి అవార్డులు, ప్రమోషన్లు కొట్టొచ్చు. చట్టం దృష్టిలో అందరూ సమానమే. కాకపోతే కొందరు తక్కువ సమానం. వారు నేరారోపణతో చంపదగిన వ్యక్తులు. మావోయిస్టులైతే కాల్చి చంపొచ్చు. మావోయిస్టు సానుభూతిపరులైనా సరే. తీవ్రవాదులు.. అదీ ముస్లింలైతే చంపి పండగ చేసుకోవచ్చు. ఘరానా దొంగల స్థాయికి ఎదగలేని చిల్లర దొంగలను చంపొచ్చు, ప్రభుత్వానికి గిట్టకపోతే మరికొందర్ని చంపొచ్చు, పోలీసులకు కోపమొస్తే చేతిలో తుపాకీ ఉంటుంది కాబట్టి చంపొచ్చు. అసలు నేరస్తులు దొరక్క పోలీసులకు చికాకు కలిగితే కొసరు నేరస్తులను చంపొచ్చు. సాయుధదళాల ప్రత్యేక అధికారాలున్న చోట దారిన పోతూపోతూ ఉంటే అనుమనానమొస్తే చంపొచ్చు. ఇదేమి ప్రజాస్వామ్యని ప్రశ్నిస్తే పౌరహక్కుల కార్యకర్తలను, ప్రజాసంఘాల నాయకులను ప్రైవేటు ముఠాల ముసుగులేసుకుని ఎటూ హత్యలు చేస్తూనే ఉన్నారు.

ముఖ్యమంత్రి అయ్యారు గనక గతంలో పౌరహక్కుల సంఘం సభా వేదిక మీద కె.చంద్రశేఖరరావు మాట్లాడిన మాటలు ఆయన మర్చిపోయి ఉండొచ్చు. చట్టబద్ధపాలన అంటే ఇప్పుడాయన నవ్వుతారు కావొచ్చు. తొలివిడత ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఫ్యాక్షనిస్టుల పేరుతో కిరాయి దొంగల ఎన్‌కౌంటర్ హత్యలు చేయించిన చంద్రబాబునాయుడు ఈ విషయంలో ఇంకా అనుభవజ్ఞులు. ఇప్పుడు రక్తచందనం రాజకీయాలకు, వ్యాపారానికి కూడా కలిసి వచ్చిన వనరు కాబట్టి దానిని వినియోగించుకోవడం ఆయనకు బాగా తెలుసు. అవతలి పక్షాన్ని లొంగదీసుకోడానికి స్మగ్లింగ్ కేసులు, నిజాలను సమాధి చేయడానికి ఎన్‌కౌంటర్ హత్యలు. పాలకవర్గాల పరస్పర కొట్లాటల్లో అదే క్రూయెల్ గేమ్స్ ఒకప్పుడు ఫ్యాక్షన్ పేరుతో రాయలసీమలో జరిగినవే. ఎర్రచందనం ఎంత ప్రకృతి వనరో అంత ఎన్నికల రాజకీయాల పెట్టుబడికి వనరు. తెల్లబట్టల నుండి ఖాకీబట్టల వరకూ ఈ చందనం చల్లని నీడలో అదనపు ఆదాయాన్ని, అనుగ్రహాన్ని పొందని అధికార విభాగం లేదు. తమిళనాడు వాళ్లు మనదేదో విలువైన సంపద నరుక్కుపోతున్నారని ప్రచారం చేస్తున్నారు కాని ఇక్కడి స్మగ్లింగ్ తీగ లాగితే ఉన్నతాధికారుల, ప్రజాప్రతినిధుల డొంక కదులుతుంది. దాన్ని చల్లగా కాపాడుతూ నిరుపేద కూలీలను స్మగ్లర్లని చెప్పి అరెస్టు చేయడం ఇప్పటి వరకూ అన్ని ప్రభుత్వాలు చేసిన పనే. వారిలో అత్యధిక భాగం కరువుతో అల్లాడుతున్న రాయలసీమ పల్లెల నుండి, రాయలసీమకు ఆనుకొని ఉన్న మారుమూల తమిళనాడు పల్లె ప్రాంతాల నుండి స్మగ్లర్లు డబ్బు ఆశ చూపిస్తే తెలిసి కొందరూ, తెలియక కొందరూ జీవితాలను పణం పెట్టేవాళ్లే. రాయలసీమ జైళ్ళన్నీ ఇట్లా ఎక్కువ కూలి ఆశించి వచ్చిన కూలీలతో సందులేకుండా నిండి ఉన్నాయి. వీళ్ళని కదిలిస్తే ఇంచుమించు అందరిదీ ఒకే కథ. కరువు, దరిద్రం, అప్పులు.

ఇప్పుడు ఎర్రచందనం ప్రభుత్వానికి ఆదాయ వనరుగా కనపడింది. పట్టుబడిన దుంగలు చాలా ఏళ్లుగా అటవీశాఖ గోడౌన్లలో నిలువ ఉండేవి. వాటిని అమ్ముకునే అవకాశం ఈ ప్రభుత్వాని కొచ్చింది. మొత్తం స్టాకు సుమారు ఎనిమిది వేల టన్నులనూ అమ్మడానికి కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతి తీసుకుని మొదటి సగం గత డిసెంబర్‌లో వేలం వేశారు. మిగిలినవి మేలో అమ్మబోతున్నారు. అధికారికంగా అమ్మినా టన్నుకు గరిష్టంగా కోటిన్నర రూపాయలు ఆదాయం ఉందని తేలింది. నిజానికి ఎర్రచందనం అంతరించబోయే ప్రమాదమున్న అరుదైన జీవజాతుల్లో ఒకటి, కాబట్టి అంతర్జాతీయ పర్యావరణ చట్టాలు ఏ రూపంలోనూ వాటి అమ్మకాలను అనుమతించవు. ప్రకృతి వనరులపై పెట్టుబడి కసిగా దూసుకుపోతోంది కాబట్టి ఇప్పుడు దేన్నయినా తెగనమ్ము కోవచ్చు. ఎర్రచందనం కరువు సీమ అడవుల్ని, ప్రకృతిని, ప్రాణుల్ని, పర్యావరణాన్ని పరిరక్షించే సజీవ వృక్ష సంపద అయితేనేం. ఇవి లేకపోతే పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటేనేం. ఇక్కడ ఈ మాత్రం వర్షపాతం కూడా లేకుండా పోతేనేం. ఎర్రచందనం చెట్లు కొట్టడం కాదు సమస్య, ఎవరు కొట్టాలనేదే సమస్య. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి శేషాచలంపై కన్నుపడింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఏడాదికి సుమారు మూడువేల టన్నుల ఎర్రచందనం డిమాండ్ ఉందని ప్రభుత్వం లెక్కలు వేసింది. ఈ ఆదాయ మార్గం తెరుచుకునే క్రమంలో కూలీల ఎన్‌కౌంటర్ హత్యలు ఊపందుకున్నాయి. ఇప్పటి వరకు ఎర్రచందనం కూలీల ఎన్‌కౌంటర్లు ఎనిమిది జరిగితే అందులో అయిదు 2014 మే నుండి జరిగినవి. పెట్టుబడులు పెట్టండి, మీకన్ని సౌకర్యాలూ కల్పిస్తామని బహుళజాతి కంపెనీలను ఆహ్వానిస్తూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి బహిరంగంగా ఒక మాటన్నాడు. ఇక్కడ ఉద్యమాలు లేవు, శాంతిభద్రతల పూచీ మాది అని. తెలుగు రాష్ట్రాల ఇద్దరు ముఖ్యమంత్రులూ శ్మశాన శాంతిని స్థాపిస్తున్నామని ఎన్‌కౌంటర్ల రూపంలో సూచనప్రాయంగా ఇలా వ్యక్తం చేశారా?

ఉద్యమాల సందర్భంలో హింసాహింసల గురించి చర్చలు చేసే ఘనత వహించిన మీడియా మేధావులు ఎన్‌కౌంటర్లు చేయక తప్పని స్థితి గురించి విశ్లేషణలు చేస్తున్నారు. కూలీలు మరీ అంత తెగబడి ఎర్రబంగారాన్ని మన సరిహద్దులు దాటిస్తుంటే చంపక ఏం చేస్తారు పాపం అని ఏడాది తిరక్కుండానే ముఖ్యమంత్రికొచ్చిన కష్టం గురించి బాధపడిపోతున్నారు. బహుశా మునుపెన్నడూ లేని విధంగా హత్యలను సమర్థించే తర్కం తీస్తున్నారు. పైగా బూటకపు ఎన్‌కౌంటర్లకు ప్రజల ఆమోదం ఉందని తీర్పులు కూడా. ఒక పక్క మీడియా గొంతు నులిమేస్తున్నా ప్రజాస్వామిక హక్కుల విలువ వారికే పూర్తిగా అర్థం కానప్పుడు సామాన్య ప్రజలకు ఏమర్థమవుతుంది? చనిపోయిన ఒక తమిళకూలీ భార్య వెంట అంత మంది లాయర్లు ఎలా వస్తారు? ఏ స్మగ్లరో డబ్బులివ్వకపోతే ఆమెకంత స్తోమత ఎక్కడిదని ఒక పత్రిక రాస్తుంది. నిజానికి ఆ పత్రిక పేరు దాచనవసరం లేదు. మా అక్షరం మీ(?) ఆయుధం అనే ఆంధ్రజ్యోతి. ఎన్‌కౌంటర్ కన్నా పత్రికల ఈ నేలబారుతనం చూస్తేనే ఎక్కువ దిగ్భ్రమ కలుగుతున్నది. రాజకీయ పక్షాలకు ప్రయోజనాలుండొచ్చు. పత్రికలకూ ప్రయోజనాలుండొచ్చు. కానీ న్యాయం ఒకటుంటుందనీ, వ్యక్తిగత ప్రయోజనాలేవీ లేకుండా న్యాయం కోసం పోరాడేవాళ్లు ఉంటారని పత్రికలు గుర్తించ నిరాకరిస్తున్నాయి. హక్కుల ఉద్యమాలను, ప్రజాఉద్యమాలను ఇంతగా అవమానపర్చిన సందర్భం లేదనుకుంటాను. "తమిళనాట ఎన్‌కౌంటర్ రాజకీయాలు" అంటూ ఇక్కడ జరిగిన దుర్మార్గాన్ని సమర్థిస్తూ, అక్కడ చెలరేగిన నిరసనలకు అసహనం వెళ్లగక్కే మీడియా ఎంత సునాయాసంగా రాజ్యం పోషించే పాత్రను చేపట్టింది! తెలంగాణ రాష్ట్ర ఉద్యమం జరుగుతున్నప్పుడు రెండు ప్రాంతాల్లో రెండు వాదాలతో వార్తలు రాస్తున్నప్పుడే పాత్రికేయ ప్రమాణాలు అర్థమయ్యాయి గానీ ఎందుకనో మీడియా స్వేచ్ఛ గురించి జరిగినంత చర్చ మీడియా విలువల గురించి జరగడం లేదు. పెట్టుబడిదారీ మీడియాకిది సహజమే కదా అనే అంగీకరిస్తున్నాం. కానీ ప్రజా ఉద్యమాలు, ప్రజాస్వామిక మేధావులు ఇందులో ఎలా జోక్యం చేసుకోవాలో కూడా ఆలోచించాలనిపిస్తుంది.

నిజానికిదెంత మామూలు విషయం. కేసు లేకుండా, విచారణ లేకుండా ఇరవై మంది తమిళుల్ని చంపేస్తే తమిళనాడు భగ్గుమనదా మరి? రాష్ట్ర సరిహద్దుల్లో ఎర్రచందనం కూలీలనే అనుమానంతో చొక్కాలు విప్పి తనిఖీలు చేస్తుంటే (భుజాలపై దుంగలు మోసిన మచ్చ ఉంటుందని), కేవలం అనుమానంతోనే బస్సుల నుండి రైల్వేస్టేషన్ల నుండి అరెస్టు చేసి తీసుకుపోయి ఎన్‌కౌంటర్ చేసేస్తే కనీసం తమ వారి గురించి ఆందోళన చేయరా? నిజానికి పేద

(మిగతాది 17వ పేజీలో...)

కొన్ని తుపాకులు ఒక బాల్యం

- వి. శ్రీనివాస్

మబ్బు చిచ్చుబుడ్డి చిమ్మే
పువ్వుల్ని
భూమి కన్న ముందు అందుకునే
కొన్ని చేతులు-
ముత్యపు చిప్పల కన్న ముందే
గుప్పిట పట్టే
కొన్ని నోళ్ళు-
మొక్కల మొదళ్ళ కన్న ముందే
మట్టి సాక్సులు తొడుక్కునే
కొన్ని కాళ్ళు-
కాల్వ పక్కనే ఎదురుచూస్తున్న
కాగితపు పడవల్ని
సుతారంగా లేపి
నీటి మీద బతుకునిచ్చే
చిన్ని ప్రాణాలు-
నవ్వుల వెన్నెల్ని కాసే
నేల చందమామలు!
ఇల్లు పూలవనమైయ్యే
పుప్పొడి అడుగులు!!
అక్షరాల మీద వాలిన తూనీగల్ని
ముక్కలు చేసి
ఆయుధానికి దండేసారు!
చిగురాకుల్ని కాల్చి కాల్చి
పేగుబంధానికి చితి పేర్చారు!
కూలిన కలల తోట నెత్తుట్లో
పసివాసన నవ్వులు!
మరణించిన బాల్య పరిమళాలు!!
మినుకు మినుకు కలల
నిర్జీవ నక్షత్రాలు!
తేలిన
బాల్య పుస్తకాల శవాలు!!
ఒరేయ్!
రాజ్యం కనుగప్పిన ఆయుధమా!
నీకో బాల్యాన్నిస్తున్న
నీకో తరగతి పుస్తకాన్నిస్తున్న
నీకో సతతవసంత బడి వాతావరణాన్నిస్తున్న
నీకో ప్రేమల అమ్మ బడినిస్తున్న
నీకో హృదయపు తడినిస్తున్న
ఇక బతుకు!
బాల్యాన్ని మింగడమంటే
రేపటి ప్రపంచాన్ని చంపడమే!

నేను వీరున్ని చూశాను

- రమేష్ గోండ్యాల

నేను యుద్ధం రంగంలో నిలబడ్డ. వీరున్ని
చూశాను,,
బంది అయిన బారత మాత ను
విముక్తి చేయడానికి కదన రంగంలో
దుకిన. యొదున్ని చూశాను, ,
ఒక పక్క కాలిన శరీరాల కమురు వాసన
మరొ పక్క శ్రమ ఫలితాన్ని జుర్రెస్తుంటే
డొక్కలెండిన దీనులకు ధిక్కారం నూరి పొస్తున్న
శూరున్ని చూశాను,,
రాబందుల మధ్యనుంటునే
వ్యూహాలు రచిస్తూ
జనదారుల్ని జయకేతనం వైపు
మళ్ళిస్తున్న యొదున్ని చూశాను,,
అన్వేషణ. ఆలోచన. ఆచరణలో
నిమగ్నమై ఉన్న అ వీరుడికి
కన్న బిడ్డ. ఎదురు పడ్డప్పుడు
ఆ వీరుడి కండ్లల్లొ అమ్మ తనాన్ని
చూశాను,,
యొగ క్షేమాలు తెలుసు కొని
విముక్తి పోరాటాన్ని వివరిస్తూంటే
ప్రజల పై ఆ వీరుడి అంకిత భావానికి
గౌరవ సూచికగా
నేను
రెండు కన్నీటి చుక్కలను అర్పించాను ॥2॥

ఒక అద్భుత బాలిక కొన్ని ప్రతిరూపాలు

- బాలసుధాకర మౌళి

అంత తీవ్రంగా తీక్షణంగా సముద్రాన్నే
చూస్తున్న ఆ స్త్రీలెవరు?
సముద్రమే వాళ్ళా
వాళ్ళే సముద్రమా
అంతులేని సముద్రాన్ని
పిడికెడు గుండెల్లోనే ప్రతిష్టించుకున్నారా
లేదూ -
అంతుచిక్కని గుండెఘోషని
సముద్రంలోనే చూసుకుంటున్నారా

ఇంతకీ
రెప్పల్ని ఆకాశానికి కుట్టి
కనుగుడ్ల నుంచి
సముద్రాన్నెందుకు కారుస్తున్నట్టు -
తరతరాల స్త్రీలు
కార్చిన కన్నీరే
సముద్రంగా ప్రాణం పోసుకుందనుకోవచ్చా -

సముద్రాన్ని
అంత ప్రేమగా ఆర్ద్రతతో
సముద్రంలో సముద్రమై చూసుకుంటున్నదెందుకో!
బక్కపల్చని శరీరాలతో
గమెన్లకొద్దీ
ఎటుకబెద్దలు ఎత్తీ ఎత్తీ
రాటుదేలిన ఆ స్త్రీల్లో
అంత సౌకుమార్యత ఉందా -
కదిలిస్తే కదిలిపోయే లేత కొమ్మల్లాంటి గుణం
ఇంకా ఎక్కడో మిగిలేఉందా -

అంత పెద్ద నగరంలోనూ
సముద్రమే
బరువెక్కి కమిలిన వాళ్ళ కాళ్లపై
చల్లని గాలితో నిమిరే చెయ్యి -

ఒక అలొచ్చి
కాళ్ళని పాములా చుట్టుకుంటుంది
అచ్చం అలలానే
కేరింతు కొడుతూ కేకలు వేస్తారు
ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకుని
వేళ్ళ సందుల్లోంచి
నెమ్మదిగా జారిపోతున్న అలలాగే
సిగ్గుపడి
చిన్నపిల్లలయిపోతారు

సముద్రానికి
సకల వ్యక్తికరణలూ ఉన్న
ఒక అద్భుత బాలిక -అనే పేరు స్థిరపెడతాను

బాల్యం నుంచి
మళ్ళీ పనిలోకే వెళ్లిపోతున్న వాళ్ళనేమనాలి!

ఇశారం

- పి.బాలయ్య

కరుగుతున్న కాల పర్వతాల మీదికేలి
జీవనదిలా దుంకే బంగారు కల
గడియ రికాంలేని గతం రెక్కలు నరికి
అందంగా నిర్మిస్తదా భవిష్యత్తును!

కట్టాలను వొంటికి పూసుకున్న కాలం
సోకాలను తన పాదాల కింద అదుముకుంటది
పిడాత కుత్కెవిస్కి పికిలింది పుట్టుక
దగడు రొమ్ముల్ల పాల దవనూరాలె
కైనీడల మొకం పైన తుంపుర్లుగా నిలిచే నిరాశ
నడుమంతరాన గిరిగీలు గొట్టి బుడగై పేలింది దుక్కం
సెట్టుసెట్టుకూ పుట్టెదేడ్సిన శోకం
గావురంగ శిరసు దువ్వి దొప్పెడు దైర్నం శిప్పల వొయ్యి

గుండె గదుల్ల మోసపు కత్తులు దాసుకున్న దుష్మానీ
వొంటూపిరి గొంతుల మంట సలుతాంది
శేపోయొని రంపపు కోతల మర్మం
కిర్రుచెప్పుల రౌతపు పుర్రువోసుకున్న తడితడి ఆసన

తీపికలలను పర్రపర్ర గొరికి పైరదిరిగే పంతరాగ
పైడికంటెల గాయి గత్తర
మొర్రివోయిన లందగోలెంల మిలిగింది కన్ను
గిరిగీసుకున్న అరిసేతులకు వాట మతకాలె
అంతుదొర్కని సితపతాలం తోతుల జివునం
సముద్రమంత దుక్కంతో ఘనీభవిస్తది
ఆశల యిరుసుమీద భూమి బొంగురమై తిరుగుతూ
ఎద్దు కొమ్ముల ద్రవీభవించిన మిగ్గ మౌనంగా రోదిస్తది

సుక్కల దాకేదాకా నిక్కి నిక్కి నిలబడి
సురసుర మండే సూర్యచంద్రుల సెరొక్క సంకకెత్తుకొని
దప్పుల దరువు ఆకలి మంటల తిప్పల
దొక్క జింపుకోని నిట్టాదుగ నిలవడ్డ బతుకు
తెప్పల నడుమ మనాది సుక్కోలె వోదువంగనే
తన్మయత్వం తోటి మొగులు తల కిరీటం ధరిస్తది
మట్టి పెయ్యంత వెయ్యి కండ్లార్పకుంట
కంటి పాపలపైన దీపాలు ఎలిగించుకుంటయ్

ఆకలిని రెక్కలపై మోస్తూ

- సువర్ణ

సూర్యుడు మధ్యలోనే అస్తమించాడు
దారుణాన్ని చూడలేని చెట్లకు

పారిపోడానికి కాళ్ళు రాలేదు
రాబందులు రకరకాల వేషాలతో తిరుగుతూ
యిప్పుడు ఏ రంగులో ఉన్నాయో
ఎవరికీ అర్థం కాలేదు
రెక్కలు నిచ్చెన్లు చేసి పైకెక్కించిన పక్షులు
ఒక్కొక్కటే నేలకొరుగుతుంటే
రాజకీయ ముసుగులేసుకున్న నక్కలు
చోద్యం చూస్తున్నాయ్
అన్యాయాన్ని చూడలేక
ఆకాశం నల్లబారుతోంది

అవిగో..! మరిన్ని పిచ్చుకలస్తున్నాయ్
బ్రహ్మాస్త్రాలను సిద్ధం చేయండి
గింజలకోసం ఎగబడ్డ పిట్టల్ని
పారిపోకముందే కాల్చిపడేయండి

ఆ పిట్టలు
దుంగల కోసం వచ్చిన దొంగలా..?
పొట్టకూటికోసం నెత్తురు ధారవోస్తున్న ఎర్రకూలీలా...?

అయ్యో..! పడిపోయారా
ఈ ఖాకీవనంలో పిట్టలై
గుట్టలు గుట్టలుగా
మీ ప్రాణాల్ని
ఏ అడవి సంపదైనా వెనక్కి తెస్తుందా..?
ఏ రాబందైనా
మీ అమాయకత్వానికి విలువ కడుతుందా..?

వేల పిట్టలు నేల రాలినా
నెత్తుటి కాసారాన్ని దాటుకుంటూ
మరిన్ని వస్తూనే ఉన్నాయే..!
గూళ్ళు పెట్టుకోవడం తప్ప
మేడలు కట్టుకోడం యెరగనివి
కడుపు నింపుకోవడం తప్ప
కడుపు కొట్టడం తెలియనివి

ఓ దళిత గిరిజన పిట్టల్లారా..!
ఆకలిని రెక్కలపై మోస్తూ,
బతకడంకోసం చస్తున్న పక్షుల్లారా
రాబందుల చేతచిక్కి అల్లాడుతుంటే
ఖాకులు పొడిచి చంపుతున్నాయా?

కూలిన ఎర్ర పక్షుల్లారా..!
మీ నెత్తురు పారిన నేలలో
మొలిచే మొక్కలు
ఎర్రగానే పెరుగుతాయ్

బతుకు

- ఎం. రాఘవాచారి

మబ్బులు
నీలాలు తాపిన ఆకాశం కింద
తెలుపెక్కిన దూది ముద్దలు
కురిసీ కురిసీ నీళ్ళలోకి మారి కొన్ని
కురవక కన్నీళ్ళు పారించి కొన్ని
నీడలు పరుచుకున్న ఆకాశం కింద
తెర్లు తెర్లుగా జీవితం
నేల
అందానికి ప్రాణానికి పుట్టిల్లు
వర్ణశోభిత
పిసికితే గింజలు రాలేది కొంత
నువ్వెంత పిసుకూ ఇసుకే రాలేది కొంత
విషం గొంతులు జారుతున్న నేలమీద
గాలి దీపం సేద్యం

రాజ్యం
అధికారపు కొసమెట్టు మీద
ఒక దేహం
రెండేసి కండ్లు
రెండేసి రెండేసి నాల్కలు
రెండు రెండు హృదయాలు
పొంగీ పొంగీ
వరాలు ప్రవహిస్తున్నట్టు ఒకటి
సమస్తమూ జీర్ణించుకుంటూ
తెలియని లోతుల్లోకి ముడుచుకుంటున్నదొకటి
గిడసబారి
ముడుచుకుపోయిన హృదయంలో
బతుకు

అయినా
బతుక్కేమైందని ప్రేలాపన
ఒత్తిడిలో ఒరిపిడిలో నలుగుతూనే ఉంది
శుష్క వాగాడంబరం ఓదార్చదు
మొండి చేతుల వద్దనలు ఫలించవు
కొత్త కొత్త పరీక్షలతో పని లేదు దానికి

ఎక్కడో అగాధపు లోలోతుల్లోంచి
సన్నగా విశ్వాసంగా
నిరంతరంగా మందుతూనే ఉంది

కథ

విడాకులు

- సాదత్ హసన్ మంటో

తెలుగు : జఫీరా

"ఇక నేను నీతో వేగలేను - నాకు విడాకులు కావాలి!"

"ఏం మాట్లాడుతున్నావు - నీకు మతేమైనా పోయిందా? అప్పుడప్పుడు ఇలా పిచ్చెక్కినట్టు ప్రవర్తిస్తావెందుకు?"

"అవును మరి, పగలు రాత్రి తాగి తిరిగినా నీ తెలివి మాత్రం నిక్షేపంగా ఉంటుంది కదూ."

"నేను తాగుతానేమో కాని, నీలాగ మతి పోగొట్టుకుని గయ్యాళిగంపలా అరవను."

అంటే నేను గయ్యాళిగంపనా?

"నేను అలా అనలేదు. అది సరేకాని, ఈ విడాకుల పోరేమిటి?"

"భార్యను పట్టించుకోని నీలాంటి వ్యక్తి నుండి నాకు విడాకులు తప్ప కోరుకోవటానికి ఏం ఉంటుంది?"

"అంటే విడాకులు తప్ప నా దగ్గర ఏమీ కోరుకోవా?

"అది తప్ప ఇవ్వటానికి నీ దగ్గర ఏమీ లేదు మరి."

"నాదగ్గర ఇవ్వటానికి ఏమీలేదా? నాలాంటి భర్త ఉన్నందుకేకదే ఇంటి దగ్గర అంత హాయిగా కూర్చుంటున్నావు. నీలాంటి అదృష్టం ఇంకెవరికైనా ఉంటుందా అసలు?"

"అలాంటి అదృష్టం కంటే దురదృష్టం మేలు."

"అసలు నీబాధేమిటే? ఎందుకలా మాట్లాడుతున్నావు? ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకో. నేను నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాను. అయినా నీకు అదేమీ పట్టదు."

"అలాంటి ప్రేమ నుండి దేవుడు నన్ను రక్షించుగాక అనే నేను కోరుకుంటాను."

"మరీ అంత చేదుగా మాట్లడతావెందుకు? పోనీలే ఇదంతా నీకు మామూలే కాని, అమ్మాయిలు బడికి వెళ్ళారా?"

"వాళ్ళ గురించి నీవెప్పటి నుండి పట్టించుకోవటం మొదలుపెట్టావు? వాళ్ళు బడికి వెళ్ళినా, చచ్చినా నీకేప్పుడైనా పట్టిందా? అసలు వాళ్ళు చస్తేనే మంచిదనిపిస్తుంది."

"ఇంకో మాట మాట్లాడావంటే నీ నాలుక బయటికి లాగి కుక్కలకు పారేస్తాను జాగ్రత్త! సొంత పిల్లల గురించి అలా మాట్లాడటానికి నీకు సిగ్గుగా లేదే?"

"ఇదిగో నేను మళ్ళీ చెబుతున్నా, నన్ను అలా దూషిస్తూ మాట్లాడొద్దని. సిగ్గు అనేది నీకు ఉండాలి. ఎవరైనా భార్యను అలా తీసిపడేసినట్టు మాట్లాడతారా? భార్య అంటే ఎంతమర్యాదగా చూడాలి. అయినా నీకు ఇలాంటి విషయాలు ఎలా తెలుస్తాయి, ఆ బాపతు మనుషులతో తిరిగితే మతిభ్రమించి అలాంటి మాటలే వస్తాయి."

"మరి నీ మతి భ్రమించడానికి కారణం ఎవరో."

"ఇంకెవరు, నీవే!"

"అంతేలే ప్రతిదానికి నన్ను తప్పు పట్టటం తప్ప నీకేం తెలుసు. అయినా అసలు నీకీరోజు ఏమైందో అర్థం కావటం లేదు."

"నీకు ఏమైందో నాకూ అదే అయ్యింది. అయినా, చెప్పాను కదా నాకు విడాకులు కావాలి అని."

"ఏం, రెండో పెళ్లి చేసుకుందామని అంత తొందరగా ఉందా?"

"అసలు, నా గురించి నువ్వు ఏమనుకుంటున్నావు?"

"మరి విడాకులు తీసుకొని ఏం బాగుపడదామని అనుకుంటున్నావు?"

"నాకు నీ పీడ విరగడైతే చాలు. ఏ కూలో నాలో చేసుకొని నా పిల్లలను పోషించుకోగలను."

"ఏమిటీ. పొద్దున్న తొమ్మిది దాటితే కాని నిద్ర లేవలేవు, నీవు కూలి చేసుకొని బతుకుతావా! పొద్దున్న తిన్న తరువాత నిద్ర, మధ్యాహ్నం తిన్న తర్వాత మరో మూడు గంటలు నిద్రపోయే దానివి నీవు కూలి ఎలా చేద్దమనుకుంటున్నావో అసలు ఆలోచించావా."

"అవును మరి, నేను పొద్దస్తమానం నిద్రపోతుంటాను, నీవు మాత్రం రోజంతా మాకోసం కష్టపడుతుంటావు కదూ... ఎప్పుడో కాదు నిన్ననే, నీ ఆఫీసు నుండి వచ్చినతను నువ్వు రోజంతా బల్లమీద తల పెట్టి నిద్రపోతుంటావు అని చెప్పాడు."

"ఎవరా వెధవ చెప్పింది?"

"ఇదిగో, తిట్లు ఉపయోగించవద్దు."

"ఓహో, నీకు కోపం వచ్చినప్పుడు నీవు ఏమైనా మాట్లాడ వచ్చు, నేను మాత్రం కోపం వస్తే అలా మాట్లాడకూడదా?"

"నీ మీద కోపం ఉన్నా నేను ఎప్పుడూ ఒక్క తిట్టు కూడా ఉపయోగించలేదు. మనకు ఎంత కోపం వచ్చినా సభ్యత మరిచి మాట్లాడకూడదు. నీవు ఇలా ఉన్నావంటే అది అంతా నీ చెడు సహవాసప్రభావమే."

"అసలు, నేనొక విషయం అడుగుతాను - ఆ చెడు సహవాసులు ఎవరో చెప్పగలవా?"

"అదే, వాడెవడో ఉన్నాడు కదా, బట్టల వ్యాపారం చేస్తున్నానని చెప్పుకునేవాడు... వాడు వేసుకునే బట్టలు ఎప్పుడైనా గమనించావా? చేసేది బట్టల వ్యాపారం, కాని ఎప్పుడూ మురికిపట్టిన నాసిరకం బట్టలు వేసుకుని తిరుగుతాడు. అసలు వాడి అలవాట్లు, మాటలు అన్నీ డోకు వచ్చేలా ఉంటాయి."

"అతనికి కొంత ఆధ్యాత్మిక భావాలు ఎక్కువలేవే."

"అంటే ఏంటో?"

"ఇక నీకు చెప్తూ కూర్చుంటే నా సమయం వృథా కావటం తప్ప నీకు అర్థం అయ్యేదేమీ ఉండదు."

"అవున్లే, నాతో ఒక్క ముక్క మాట్లాడినా నీ విలువైన సమయం

వృథా అవుతుంది కాబోలు."

"నీవు చెప్పదలచుకున్నదేమిటో తిన్నగా చెప్పొచ్చు కదా."

"ఇక నేనేమీ చెప్పేది లేదు. చెప్పేదేదో ముందే చెప్పాను కదా. నీ నుండి విముక్తి పొందటానికి నాకు విడాకులు కావాలి, అంతే. ఈ రోజువారి గొడవలతో నా బతుకు నరకంగా మారిపోయింది."

"నీతో ఎవరైనా ప్రేమగా మాట్లాడినా నీకు బతుకు నరకంగానే అనిపిస్తుంది. దానికి ఎవరైనా ఏం చెయ్యగలరు!"

"విడాకులు ఇవ్వగలరు."

"సరే అయితే, ఎవరైనా ముల్లాను పిలిపించు. నీకు విడాకులే కావాలనుకుంటే నేను కాదననులే."

"ఇది మరీ బాగుంది, నేను ముల్లాను ఎక్కడి నుండి పిలిపించేది?"

"విడాకులు నీకు కదా కావాలి? అదే నాకు కావాలని ఉంటే చిటికెలో పది ముల్లాలను పిలిపించే వాడిని. ఇది నీ సమస్య, నీవే చూసుకో. ఈ విషయంలో కూడా నేను నీ పని చేసి పెడతానని అనుకోకు."

"నా కోసం నీవు ఆ మాత్రం కూడా చెయ్యలేవా?"

"లేదు"

"ఇప్పటి వరకు నన్ను తెగ ప్రేమిస్తున్నాను అని చెప్పుకొచ్చావు?"

"అవును మరి, అది నీవు నా వెంట ఉన్నంత వరకే. నీ దారిన నువ్వు వెళ్తానంటే కాదు."

"మరి ఇప్పుడు నేనేం చెయ్యాలి?"

"నాకేం తెలుసు? ఏం చేయాలనుకుంటే అది చెయ్యి, అంతేకాని నన్ను ఊరికే విసిగించవద్దు. ఎలాగైనా ఒక ముల్లాను రప్పించు, అతను విడాకుల పత్రం రాయగానే నేను సంతకం పెట్టేస్తాను."

"మరి పెళ్ళప్పుడు నాకు ముట్టచెప్పాలనుకున్న భరణం సంగతి ఏమిటి?"

"విడాకులు అడిగేది నీవు కాబట్టి, ఇక భరణం ఇచ్చే ప్రసక్తే ఉండదు."

"అలాగైతే ఎలా?"

"మీ అన్నయ్య బారిస్టర్కదా. కావాలంటే అతనికి ఒక ఉత్తరం రాసి కనుక్కో. భార్య విడాకులు కావాలని అడిగితే, భర్త భరణం ఇవ్వాల్సిన అవసరం ఉండదు."

"అలా అయితే నువ్వే నాకు విడాకులు ఇవ్వు."

"అలా నేనెందుకు చేస్తాను? నేను నిన్ను ప్రేమిస్తున్నానని చెప్పాను కదా."

"నాకు ఇలాంటి టక్కరి మాటలే నచ్చునివి. నీవు నిజంగా నన్ను ప్రేమిస్తున్నట్లైతే నాతో ఈ విధంగా ప్రవర్తిస్తావా?"

"ఏ విధంగా ప్రవర్తించానే?"

"ఏదో తెలియనట్లు మాట్లాడవద్దు. నిన్న నా కొత్త చీరతో నీ బూట్లు తుడుచుకున్నావు కదా."

"అమ్మో, నేను అలా చెయ్యలేదే."

"మరి ఎవరు చేసారు?"

"నాకు తెలిసినంత వరకు నీ ముగ్గురు ముద్దుల కూతుళ్ళు ఆ చీరతో బూట్లు తుడుచుకోవటం చూసాను. ఆ పని చేస్తున్నందుకు నేను వాళ్ళ మీద అరిచినట్టు కూడా గుర్తు."

"వాళ్ళు అలాంటి దరిద్రపు పనులు చేయరు."

"వాళ్ళు అలాంటి దరిద్రపు పనులే చేస్తారు, ఎందుకంటే నీవు వాళ్ళను సరిగ్గా పెంచలేదు కాబట్టి! కావాలంటే వాళ్ళు స్కూలు నుండి వచ్చిన తరువాత అడుగు, నీ కొత్త చీరను వాళ్ళు ఎంత బాగా ఉపయోగించుకున్నారో."

"వారిని ఏమి అడిగేది లేదు."

"ఈ రోజు నీకు ఏదో అయ్యిందే. అసలు విషయం ఏంటో తెలిస్తే కాని ఏమి చెయ్యలేం."

"నీవు ఏం చెయ్యాలనుకుంటున్నావో చేసుకో. నేను మాత్రం ఏం చెయ్యాలో నిర్ణయించుకున్నాను. నేను విడాకులు తీసుకుంటాను. భార్యను పట్టించుకోని నీలాంటి భర్తతో ఉండి ఏం లాభం?"

"నువ్వు ఏమైనా అను. నేను మాత్రం నిన్ను బాగానే చూసుకుంటున్నాను. పట్టించుకోవటం లేదని ఎందుకు అనుకుంటున్నావు?"

"రేపు ఈద్ అని నీకు తెలుసు కదా?"

"అవును, తెలుసు... ఓ, డబ్బుల కోసమా! నిన్నే కదే పిల్లలకు కొత్తబూట్లు, వాళ్ళ ఫ్రాకుల కోసం గుడ్డముక్క తెచ్చాను. అది కాకుండా వారం క్రితం నీకు అరవై రూపాయలు కూడా ఇచ్చాను కదా."

"అవును, ఆ అరవై రూపాయలతో మా కోసం ఎంతో త్యాగం చేసినట్టు!"

"త్యాగం సంగతి అలా ఉంచి, అసలేం జరిగిందో సరిగ్గా చెప్పు."

"సరే నీకు తెలుసుకోవాలని ఉంటే విను. నువ్వు ఇచ్చిన అరవై రూపాయలలో నలభై పిల్లల ఫ్రాకుల కోసం తీసుకున్న గుడ్డకే పోయాయి. ఆ టైలరు ఒక్కో ఫ్రాకు కుట్టటానికి ఏడు రూపాయలు తీసుకున్నాడు. ఇప్పుడు చెప్పు, నాకు నా పిల్లలకు నీవు గొప్ప ఏం చేసావని?"

"అంటే నీ బాధంతా, నేనిచ్చిన డబ్బు సరిపోక, నీ వద్ద ఉన్న డబ్బు ఉపయోగించాల్సివచ్చిందనా? ఆ డబ్బు ఏదో ఇప్పుడే ఇచ్చేస్తాను. అంతేనా ఇంకమైనా ఉందా?"

"చెప్పాను కదా రేపు ఈద్ అని!"

"తెలుసులే. రేపటి కోసం రెండు కోళ్ళు, సేమియా తెప్పిస్తున్నాను. మరి మిగతా ఏర్పాట్లు నువ్వు చూసుకుంటున్నావా?"

"నేనెలా చూసుకోగలను?"

"ఎందుకు? ఏమైంది?"

"మరి నేను రేపు ఆకుపచ్చ రంగు చీరతో పాటు ఆకుపచ్చ రంగు చెప్పులు కూడా తీసుకోవాలనుకున్నాను. ఆ చైనా చెప్పుల వాడికి అవి కుట్టటానికి ఇచ్చానని నీతో చెప్పాను కూడా. అక్కడికి వెళ్లి పని పూర్తయితే చెప్పులు తీసుకురమ్మని నీకు ఎన్నిసార్లు చెప్పాను. నా మాటల మీద కొంచమైనా శ్రద్ధవుంటే ఈపాటికి ఆ చెప్పులు తీసుకొచ్చేవాడివి కదా."

"ఓరి దేవుడా! ఈ రాద్ధాంతమంతా నీ చెప్పుల కోసమా! ఆ చెప్పులు నిన్ననే తీసుకొచ్చి నీ అరలో పెట్టాను. ఎప్పుడైనా నిద్ర నుండి సమయం దొరికితే కదా ఆ చెప్పులు నేను తెచ్చానో లేదో నువ్వు చూసుకునేది."

మూవీ మేకింగ్

- బమ్మిడి జగదీశ్వరరావు

ఔను, నిజమే! ఎప్పుడూ ఏదో ఒక డివిడి చూసి కథలు వంటే టాలీవుడ్ దర్శక రచయితలు డివిడిలు చూడడం మానేసారు. పంచ్ డైలాగుల కోసం చూసే పాత సినిమాలు, కొత్త పుస్తకాలు తీసి అవతల పడేసారు. చివరికి ఫైట్ మాస్టర్స్ కూడా బ్రూస్లీ జాకీచాన్ సినిమాలు చూడడం మానేసారు.

అందరూ అన్నీ మానేయడంతో సినిమాలు తీయడం మానేస్తారేమోనని కొందరు అనుమానపడ్డారు. ఇన్స్పిరేషన్ లేకుండా మక్కికి మక్కీ కాపీ కొట్టకుండా ఏదీ అనుకరించకుండా సినిమాలెలా తీస్తారని చిత్ర సాంకేతిక రంగ ప్రముఖులు తమలో తాము నవ్వుకున్నారట!?

అయితే ఇప్పుడు అందరూ ఒకటే చూస్తున్నారు!

అసెంబ్లీ సమావేశాలు. వేషాలు చూసి మంత్ర ముగ్ధులయిపోతున్నారు.

ప్రతిపక్షం అడిగిన ప్రశ్నలకు పాలక పక్షం చెప్పే కథలు మహాద్భుతంగా ఉండడంతో- అవి చూసి రచయితలు కొత్త వంటకాలు అప్పుడే మొదలు పెట్టేసారు.

'థూ...నీయవ్వ..' 'నోర్మూసుకో...మూసుకో నోరు..', 'సిగ్గు లేదా?', 'మడిచేస్తా', 'తిత్తి తీస్త..', 'కోస్తా బిడ్డా..ఏమనుకున్నావో..', 'తాట తీస్తా', 'నాలుక కోస్తా', 'నీ తల్లి కడుపున అనవసరంగా పుట్టానే అనుకుంటావ్..భూమ్మీదకు రాకుండా ఉంటే బాగుణ్ణే అనుకుంటావ్', 'ఇక్కడెవరూ గాజులేస్కోలే', 'అంత పెద్ద మగాడివా?'

పంచ్ డైలాగుల కోసం, సినిమా టైటిళ్ళ కోసం పదే పదే రివైండ్ చేసుకు మరీ వింటున్నారు దర్శక రచయితలు.

అలాగే అంగన్వాడీ కార్యకర్తల మీద లాఠీ ఛార్జీ అరెస్టులూ చూసి- ఏ యాంగిల్లో పోలీసు మహరాజుల్ని ఎలివేట్ చేసి మరో పోలీస్ స్టోరీకి పోపు కూడా పెడుతున్నారు మరి కొందరు దర్శక దిగ్గజాలు.

కేరళ అసెంబ్లీలో ఎమ్మెల్యేలు కొట్టుకోవడం, తన్నుకోవడం చూసిన మన ఫైట్ మాస్టర్స్ రియలిస్టిక్ ఫైట్స్ కంపోజ్ చేసేస్తున్నారు!

ఏపీలో కొత్త రాజధాని సెట్టూ యాదాద్రి దేవాలయం కొత్త సెట్టింగూ, ఛాతీ హాస్పిటల్లో కొత్త సెక్రెటేరియట్ డిజైనింగూ ఇవన్నీ చూసి ఆర్ట్ డైరక్టర్స్ హార్ట్‌ఫుల్‌గా మెస్మరైజయిపోయి కొత్త కళలకీ కాంతులకీ శ్రీకారం చుట్టేస్తున్నారు.

సినిమా వాళ్ళా మజాకా- పాత అసెంబ్లీ సెషన్సూ అన్నీ చూడ్డం మొదలు పెట్టేసారు.

చీరలిప్పి ద్రౌపదీ వస్త్రాపహరణం చేసిన సన్నివేశాలు చూసి మరో 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను..హరీ..హరీ..క్రిష్ణా క్రిష్ణా' రీమిక్సుల మిక్సీలు ఆన్ చేసేసారు.

మరికొందరు పార్లమెంటు సెషన్సూ పాతవీ కొత్తవీ చూసేసి ఎవరి పనుల్లో వారు బిజీ బిజీగా ఉన్నారు!

రాజకీయ నాయకుల దయవల్ల తెలుగు సినిమా రాబోయే రోజుల్లో ఒక వెలుగు వెలుగుతుందని గొప్ప నమ్మకంతో ఉంది చిత్ర పరిశ్రమ!

సినిమా సూపిత్త మామా

సినిమా మొదలయ్యింది!

హీరో రాలేదు!?

నాలుగు నెలలు కాదు...సారీ నాలుగు నాలుగుల పదహారు రోజులు నడిచాయి!

హీరో రాలేదు!?

కథ చాలా దూరం నడిచింది. క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీకి క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. రైతులు భూములు ఎందుకివ్వాలో చెప్పింది. ఎలా భూమి తీసుకుంటామో ల్యాండ్ లిక్విడేషన్ ల్యాండ్ పూలింగ్ గురించి చెప్పింది. రైతనే వాడు భూమిని వదిలేస్తే ఎంత లాభమో ప్రభుత్వానికి (అంటే ప్రజలకి?) ఎంత లాభమో సియమ్మే చెప్పేసాడు. పొగ పెట్టే, ప్రోత్సాహకాలు ఇచ్చే వేల ఎకరాల భూమిని పెత్తందారి బదులుగా ప్రభుత్వమే లాక్కుంది.

అయినా హీరో రాలేదు!

పేడింగ్ క్యారక్టర్స్ వచ్చాయి, పోయాయి.

హీరో మాత్రం కథలోకి రాలేదు!?

వచ్చినవాడే హీరో. మాట్లాడిన వాడే మొనగాడు. వాడే గన్. జగన్. సినిమా అంటే ఎవడో ఒక హీరో ఉండాలి గదా అనుకుంటే- హీరో అనుకుంటే హీరో కథలోకి- రాజధాని భూముల్లోకి కథా క్షేత్రంలోకి రాలేదు.

భూములు చేతులు మారాక వచ్చాడు.

అతను హీరో కాదన్నారు కొందరు.

కథ క్లయిమాక్స్ దాటింది. ఎండ్ టైటిల్స్ కూడా పడుతున్నాయి. అపుడూ హీరో రా...

లేదు...వచ్చాడు...'పవనం'లా వచ్చాడు. లోక 'కళ్యాణం' కోసమే వచ్చాడు. రైతు కన్నీరు మంచిది కాదన్నాడు-

కానీ అప్పటికే సినిమా అయిపోయింది!

తెరపడిపోయింది!!

గిరగిర తిరిగే భూమి

'భూమి గుండ్రంగా ఉంది! అందుకే చంద్రబాబు గారు తిరిగి తిరిగి అక్కడికే వచ్చారు! ఎవరైనా ఎక్కడెక్కడైనా తిరిగినా చివరకు అక్కడికే రావాల్సి ఉంటుందని ఆయన గొప్ప నమ్మకంతో ఉన్నారు!'

చంద్రబాబు నాయ్డు మీద పరిశోధనా సిద్ధాంత గ్రంథం రాస్తున్న యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి తను రాసిన దానికి తనే చాలా ముచ్చట పడిపోయాడు.

'భూమి-బాబు' గ్రంథంలోని ప్రత్యేక విభాగం చాలా ముఖ్యమైందనీ, 'రాజధాని' నేపథ్యంలోఇందుకు సంబంధించిన అనేక విషయాలను రికార్డు చేయడం అవసరమని గైడు గారు సూచించడంతో విద్యార్థి వరుసగా ఇలా రాసుకున్నాడు.

• భూమంటే భూమ్! భూమంటే రాజధాని! రాజధాని అంటే అభివృద్ధి!

• భూమి 'విలువ' పంట వల్ల వచ్చేది కాదు. రాజధాని వల్ల వచ్చేది. అభివృద్ధి వల్ల వచ్చేది. ఔటర్ రింగ్ రోడ్డు వల్ల వచ్చేది.

'రాజధానికి వేల ఎకరాలు ఎందుకని కొందరు ప్రశ్నిస్తున్నారు. హైదరాబాద్ చుట్టూ 160 కి.మీ. అవుటర్ రింగ్ రోడ్డు వేసినపుడు ఆ పరిధిలోని భూముల విలువ పెరిగింది. రాజధాని అంటే రెండు భవనాలు కాదు. భవనాలు కడితే చాలంటే...సచివాలయం మాదిరి రెండు మూడు ఎత్తైన భవనాలు నిర్మిస్తే చాలదా? 4000, 5000 ఎకరాల్లో నిర్మించే రాజధానితో భూములకు విలువ పెరగదు. అభివృద్ధి సాధ్యం కాదు. ప్రపంచ స్థాయి రాజధానితోనే రైతుల భూములకు విలువ వస్తుంది'

• భూమిని నమ్ముకోవడం కన్నా, భూమిని అమ్ముకోవడంలోనే రైతుకు మేలు కలుగుతుంది.

'రాజధాని నిర్మాణం రైతుల కన్నీళ్ళతో కాదు, రైతులకు మేలు జరిగే విధంగా ముందుకు వెళుతున్నాం. ఎవర్నీ మోసం చేయలేదు. బలవంతంగా పొలాలు తీసుకోలేదు. రైతులే స్వచ్ఛందంగా ముందుకొచ్చి- మా భూములు తీస్కోండి అంటే మా భూములు తీస్కోండి అని పోటీ పడ్డారు. రాజధాని వస్తే రైతుల భూములకు ధరలొస్తాయి. వారు కూడా అభివృద్ధి చెందుతారు'

• భూమున్నది అమ్ముకోవడానికే! వ్యవసాయం చెయ్యడానికి కాదు!

'ఎవరో ఓ పదిమంది భూములు ఇవ్వడానికి ఇష్టపడకపోవచ్చు. అది కూడా వాళ్ళేదో ఆ భూముల్లో వ్యవసాయం చెయ్యడానికి కాదు, వ్యవసాయం చెయ్యమనండి చూస్తాను. అదేం కాదు, రేపు రాజధాని వస్తే స్వంతంగా భూములు అమ్ముకోవచ్చని ఆలోచిస్తూ ఇదంతా చేస్తున్నారు. నిజంగా వ్యవసాయం చెయ్యడానికి కాదు.'

• వ్యవసాయం ఎందుకు దండగ? భూమి ఉండగా!

(గతంలో బాబుగారి మాటకు విస్తృత ప్రచారం కల్పించాయి ప్రతిపక్షాలు)

• భూమిని నిల్వ చేసుకోవచ్చు. నిధులుగా మార్చుకోవచ్చు. పెట్టుబడులకు కేంద్రంగా చేసుకోవచ్చు.

'స్వదేశీ ముఖ్యంగా విదేశీ పెట్టుబడిదారుల్ని ఆహ్వానించడానికి గాను 'భూ బ్యాంకు'ని సిద్ధంగా ఉంచాం. పది లక్షల ఎకరాలను చౌక ధరలకు అందించేలా భూ బ్యాంకును సిద్ధంగా ఉంచాం'

అనాదిగా అనాగరికంగా భూమిని పంటల కోణంలో పంటల దృష్టితోనే చూడడం జరిగింది. బాబుగారొచ్చాక భూమిని మరిన్ని రకాలుగా చూపించారు. భూమిని కనుగొన్న శాస్త్రకారుని కన్నా- భూమిని ఎన్ని విధాలుగా వాడుకోవచ్చో ఎరిగిన భూ శాస్త్రకారుడు బాబు.

-అని పరిశోధక విద్యార్థి పరవశిస్తూ ముగించాడు!

తారక మంత్రం

'రైతుల మీద పడి భూముల లాక్కుంటే లాక్కోవాల..పీక్కుంటే పీక్కోవాల. ...మధ్యలో మనమీద పడతాడేమిరా బాబు' ఎర్రకండువా ఎగిరెగిరి పడింది.

'కమ్యూనిస్టుల కార్యాలయాలకు పది ఎకరాలు కావాలి. కాని రాజధానికి వెయ్యెకరాలు సరిపోదా' అని మనల్ని అడుగుతున్నాడు!' మరో కండువా మండి పడింది.

'మన ఏ కార్యాలయానికి భూములిచ్చారో చెప్పమని మీడియా ముందు దులిపేసాగా?' ఎర్ర కళ్ళజోడు సవరించుకొని అంది.

'ఏం వాళ్ళ తెలుగదేశం పార్టీ ఆఫీసు వాళ్ళ సొంత జాగాలోనా పెట్టారా?' ఎర్ర కాలరు నిలదీసింది.

'గాంధీ భవన్ ఎవడమ్మ మొగుడిది...సొంత భూముల్లో పార్టీ ఆఫీసు పెట్టినోడెవడో రమ్మను...' ఎర్రసంచి మరింత సాగదీసింది.

వేడి పెరిగింది. ఏసీ పెంచారు. కొత్తగా నిర్మించుకున్న కార్పొరేట్ ఆఫీసు వాతావరణాన్ని ప్రశాంతంగా చల్లగా ఉంచేందుకు టెక్నాలజీ సపోర్టు చేస్తూ ఉంది.

'వైకాపా, కమ్యూనిస్టుల వల్లే రాజధాని భూముల విలువ పడిపోతోందట.' పతాక శీర్షికల వార్తల పుటంతో మరింత రాజుకుంది.

తెల్ల వెంట్రుకలకు ఎర్రరంగు వేసుకున్న ఒక నాయకుడు 'బాబుకు చరిత్ర తెలుసునా?' అని గంభీరంగా అడిగి, 'ఒక్క రాజధాని పరిసర ప్రాంతాల్లోనే కాదు, రాష్ట్రంలో దేశంలో ఎక్కడయినా భూపోరాటాలు చేసి భూమికి విలువ పెంచిందే మనం. మనలో మన మాట...భూముల రేట్లు పెరగడానికి వీళ్ళందరూ మన వెంట పడ్డవాళ్ళే. మనమెళ్ళి జెండా పాతితే కదా ఆ భూమి ఎజెండా మీద కొచ్చిందీ...?' కొట్టి పారేసాడు.

అక్కడి వాళ్ళ ముఖాల్లో చోటు చేసుకున్న ఎరుపు ఎప్పట్లాగే మాయమయింది.

'ఆల పార్టీలకే కాదు, ఆల భూములకీ వెన్నూ దన్నూ మనమే...' అని నవ్వేసాడు కురువృద్ధుడు.

ఉభయ తారకంగా పనికొచ్చేది మనమే అనుకున్నారట ఉభయ కమ్యూనిస్టులు.

ఎవరు?

మనకి శాఖ, ఉపశాఖలుగా మంత్రులున్నారు. అయితే ఎవరు ఏ శాఖకు మంత్రో న్యూస్ పేపరు చదివిన ఎవరయినా చెప్పేస్తారు.

అందులో ఏముంది థ్రిల్...?

వారి మాటల్ని బట్టి వారు ఏ శాఖా మంత్రో చెప్పాలి. అదే పజిల్!

'33 వేల ఎకరాల భూ సమీకరణ పూర్తయింది...'

'ఇంకా 740 ఎకరాలు మాత్రమే మిగిలిపోయింది...'

'ఒత్తిడి తెచ్చి బలవంతంగా భూసేకరణ చేయబోం!'

'భూమి ప్రభుత్వానికి అప్పగించడం ద్వారా రైతులు చాలా ప్రయోజనం పొందుతారు'

'ఎవరి మాటలో విని భూమిని ఇవ్వని వాళ్ళు నష్టపోతారు'

'భూములు ఇవ్వని రైతులే బలవంతంగా తమ వద్ద లాక్కున్నారని

ప్రచారం చేస్తున్నారు'

'భూములు అప్పగించండి. ప్రతి ఒక్క రైతు కళ్ళలో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి కోరిక'

'రాజధాని ప్రాంతంలో రెండో పంట వేయడానికి అనుమతి లేదు'

'పంటలు వేయొద్దని సిఆర్‌డిఏ చెప్పినా సరే పంటలు వేస్తే నష్టపోతారు...'

-- వ్యవసాయం వద్దని ఎవరంటారు?

ఔను.....వ్యవసాయ శాఖా మంత్రే!!

పోటు

'అందరికీ ఆరోగ్యం...' అన్నది మన ప్రభుత్వం నమ్మే రాజ్యాంగం!

'అందరికీ అందుబాటులో ఆరోగ్యం' అన్నది ప్రపంచ ఆరోగ్య సంస్థ లక్ష్యంగా లక్షణంగా-

ఇంతలో

ఛాతీ నొప్పితో కూలిపోయాడో పౌరుడు.

'ఛాతీ ఆసుపత్రికి తరలించండి...!' ఫస్ట్ ఎయిడ్ చేసిన వాళ్ళు సలహా ఇవ్వడంతో - తరలించబోయారు-

'ఆగండి...ఛాతీ ఆసుపత్రినే తరలించండి...' సర్కారు గొంతు విన్న పౌరుడికి గుండె ఆడింది. ప్రజల వద్దకే పాలనలాగ- రోగి దగ్గరికే ఆసుపత్రి' అని ఆశపడ్డాడు.

వికారాబాద్ ప్రాంతంలోని అనంతగిరి అడవుల్లోకి ఆసుపత్రి తరలిస్తున్నట్టు విని మళ్ళీ కుప్పకూలిపోయాడు పౌరుడు.

'ఏయ్యింది?'

'గుండెపోటు' అన్నాడు రోగి

'వాస్తు పోటు' అంది ఆసుపత్రి.

ట్రిక్కు

మనం ఎదురుగా ఉంటే 'హలోఁ' అంటే ఫోన్లో 'హలోఁ' అంటాడు మా బావ.

'ఏమిరా ఇది?' అని అనక ముందే 'ఇన్‌కమింగే కాదు, ఔట్ గోయింగ్ కూడా ఫ్రీ' సెల్లు కబుర్లు చెప్తాడు.

'నెట్ వర్క్ వాడిదే అయినా...చెవులూ అందులోపలి కర్ణభేరులూ మనవే కదరా' అన్నాను.

వాడు వినలేదు. ఫోన్లో చెపితే వినే వాడేమో?!

ఆ నెట్‌వర్క్‌కి వీడో నెట్ సెంటరయిపోయాడు. ఎప్పుడూ ఎంగేజ్. అలాంటిది ఈ మధ్య మిస్సుడు కాల్స్ ఇస్తున్నాడు. 'అదేమిరా' అని అనకముందే,'సెకను సెకనుకీ బాదేస్తున్నాడ్రా' అన్నాడు. 'ఫ్రీ పోయిందా?' అంటే 'కేర్ ఫ్రీ కాదూ?' తిరిగి వెక్కిరించాడు.

కట్ చేస్తే-

మా బావ షర్ట్ కూ పేంటుకూ జేబులున్నా, అందులో పర్స్ ఉన్నా ఒక్క నోటూ ఉండదు! 'ఇదేంట్రా ఏపీలా?' అని అడక్కముందే ఎటిఎం కార్డు తీసి అడ్వర్‌టైజ్‌మెంట్లా అటూ ఇటూ తిప్పి చూపించాడు. 'ఎనీ టైమ్ మనీ' అని కొత్త అర్థం చెప్పాడు. ఎప్పుడు పడితే అప్పుడు ఎక్కడ పడితే అక్కడ మన పర్స్...మనీ పర్స్ మన ఏటీఎం సెంటర్' అనేవాడు.

మా వాడికి ఎంత అలవాటయ్యింది అంటే బస్సెక్కాలన్నా బజారుకెక్కి కూరలు కొనాలన్నా చివరికి సినిమాకి వెళ్ళాలన్నా ఏటీఎం కార్డే.

అలాంటి మా బావ జీతం మొత్తం జేబులో పెట్టుకొనే తిరుగుతున్నాడు. 'సేఫ్టీ సెన్సు ఉండొద్దా?' అన్నాను. 'నీకు కామన్ సెన్స్ ఉండొద్దా?' అన్నాడు.

'సేమ్ బ్రాంచ్ ఫైవ్ టైమ్స్, అదర్ బ్రాంచ్ త్రీ టైమ్స్, బాలన్స్ చెక్ చేసుకున్నా కౌంటే- ట్రిప్పుకు ట్వంటీ రూపీస్ ఎన్‌కౌంటరే' అన్నాడు.

'బాగా అలవాటు చేసారు బావా...వాచిపోతోందనుకో. అయినా నా అకౌంట్లోంచి నేను వంద రూపాయలు తీస్తే ఇరవై రూపాయలు ఇచ్చేయాలట' ఏడుపొకటే తక్కువ బావకి!

'సర్వీసు సెక్టార్లన్నీ బిజినెస్ సెక్టార్లయిపోతున్నాయి' అన్నాను.

'బిజినెస్ చేసుకోనీ. కాని ఇదేంటిలా అడిక్ట్ చేసి' ఆవేదన పడ్డాడు బావ.

'వ్యసనం చేస్తేనే వ్యాపారం' అన్నాన్నేను, అంతకన్నా ఏమనాలో తెలీక!

ఒక లొకేషనూ మూడు చిత్రాలు

తెలుగు చిత్ర పరిశ్రమ ఒక్కసారిగా ఊపందుకుంది. ఒకే రోజు మూడు చిత్రాల నిర్మాణం పోటా పోటీగా ప్రారంభమయ్యాయి!

చంద్రబాబు హీరోగా 'ఉగ్ర చంద్రుడు' టైటిల్ ఖరారు కాగా, 'మీ కథ తేలుస్తా' టాగ్ లైను.

రోజా నటిస్తున్న లేడీ ఓరియంటెడ్ మూవీకి గాను 'అసెంబ్లీ రౌడీ' టైటిల్ ఖరారయింది. 'నా బూతే నా భవిష్యత్తు' ట్యాగ్‌లైన్.

జగన్ కథానాయకుడుగా 'ఇంగ్లిషు టీచర్' టైటిల్ ఖరారు చేసారు. అయితే మొదట ఈ చిత్రానికి 'ట్యూషన్ మాష్టారు' పేరు అనుకున్నప్పటికీ చివరకు 'ఇంగ్లిషు టీచర్‌'నే నిశ్చయించారు. 'నా మైక్ కట్ చేసారు!' దీనికి టాగ్ లైన్.

అసెంబ్లీకి వేదికగా ఈ మూడు చిత్రాలు ఒకే లొకేషన్లో జరగడం స్పీకర్ మైక్ ఆన్ చేసి షూటింగ్ ప్రారంభించడం విశేషం. 'నన్ను చంపాలి.లేదా కేసు పెట్టాలి. అంతకంటే ఏమీ పీకలేరు. నన్ను రేప్ చేసే ధైర్యం లేదు!' అని రోజా డైలాగ్ చెప్పడం తొలి షాట్‌గా చిత్రీకరించారు. కాగా ఈ సన్నివేశంలో కొడాలి నాని, చెవిరెడ్డి భాస్కరరెడ్డి కలిసి నటించారు. జగన్ మిగతా ఆర్టిస్టుల్ని ముందుకు తోసి ఉత్సాహపరిచారు.

'ఉగ్రచంద్రుడు' చిత్రానికి గాను బోండా ఉమామహేశ్వరరావు 'ఏంట్రా పాతేస్తా' డైలాగ్‌ని చిత్రీకరించారు. 'రోజా ఆంటీ' డైలాగును స్టైల్‌గా పలికారు. అయితే 'ఇంగ్లిషు టీచర్' చిత్రానికి కాల్వ శ్రీనివాసులు కథ తయారు చేయగా, 'అసెంబ్లీ రౌడీ' చిత్రానికి రోజాయే స్క్రిప్ట్ రాసుకోవడం విశేషం! 'కట్ చేస్తా' 'నా చీరిస్తా కట్టుకో' అంటూ పంచ్ డైలాగుల్ని ఆమె పలికి మరీ వినిపించారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకపోయినా ఫరవాలేదని, తమ చిత్రాలకు రాయితీలు ఇవ్వాలని వారంతా కేంద్రాన్ని కోరినట్లు తెలిసింది.

మూగవాని పిల్లనగ్రోవి - ఆధునిక వీరగాథ

- మధురాంతకం నరేంద్ర

ప్రపంచంలోని గొప్ప నవలా రచయితలందరూ తమ ప్రధానమైన పని కథ చెప్పడమేనని గుర్తించిన వాళ్ళే! తాను చెప్పదలచుకున్న కథను ఉత్కంఠభరితంగా చెప్పే విద్యను డాక్టర్ కేశవరెడ్డి గారు గ్రామీణ జానపద కళాకారుల నుంచీ నేర్చుకున్నా రనిపిస్తుంది. ఒకప్పటి నార్త్ ఆర్కాటు జిల్లాలో (స్వాతంత్ర్యం రాక ముందు చిత్తూరు జిల్లాలో కొంత భాగం, వేలూరు, చెంగల్పట్టు జిల్లాలన్నీ కలిసి) బాగా ప్రాచుర్యంలో ఉండిన మహాభారత తిరనాళ్ళు, జానపదులు రాత్రంతా పాడే కావమ్మ కథ, కాటమరాయుడి కథ, ముగ్గురు మరాఠీల కథ మొదలైన వాటిని ఆయన శ్రద్ధగా విన్నట్టున్నారు. ఆ జానపద కళాకారుల్లాగే పాఠకులను నవరసాలతో ఊపి పారేసే రసవిద్య ఆయనకు బాగా అలవడిందని చెప్పడానికి "మూగవాడి పిల్లనగ్రోవి" గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది. ఆయన కథన చాతుర్యపు ప్రభావంలో పడిన పాఠకుడు, జలపాతం కింద నిలబడ్డ వ్యక్తిలా ఉక్కిరిబిక్కిరైపోతారు. ఆ రచనకున్న సాహిత్య, సామాజిక భూమికలను పట్టించుకోలేకపోతారు. గొప్ప కళాత్మకమైన రచనల్లో కళ కనిపించకుండా మాయమైపోతుందనే నిర్వచనానికి ఆయన నవలికలు నిలువెత్తు ఉదాహరణలు.

అయితే గొప్ప నవలికల్లో కథ ఒక ప్రధానమైన అంగం మాత్రమే! అది రచయిత చెప్పదలచుకున్న విషయాలకు వాహికగా మాత్రమే ఉంటుంది. 'మూగవాని పిల్లనగ్రోవి' చదివి ముగించిన పాఠకుడు సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయి ఉంటాడు. గొప్ప కవిత అర్థంగాక మునుపే, కొంత కమ్యూనికేట్ చేస్తుందని టి.ఎస్.ఇలియట్ అంటాడు. 'మూగవారి పిల్లనగ్రోవి'లో జానపద గాథల్లో ఉండే కవితాత్మకత ఉండడంతో, అది కూడా పాఠకుడిని విశ్లేషణాత్మకంగా తరచి చూడకముందే, గొప్ప అనుభూతిని కమ్యూనికేట్ చేస్తుంది. "మూగవాని పిల్లనగ్రోవి" ఇంగ్లీషు అనువాదానికి ప్రచురణకర్తలు (ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్) Ballad of Ontillu అని పేరు పెట్టడం అందుకే సముచితంగా ఉంది.

ప్రతి గొప్ప రచనా పెద్ద భాండాగారం లాంటిది. దాన్ని తెరచి చూస్తే గానీ లోపలున్న సంపదేమిటో తెలియదు. అందుకే ఆయా రచయితలు ఆ భాండాగారాన్ని తెరిచే బీగం చెవిని కూడా ఆ రచనలోనే సరఫరా చేస్తారు. "మూగవాడి పిల్లనగ్రోవి" అనే పేరే ఆ నవలికకున్న బీగం చెవి. ఈ మూగ పిల్లవాడు నవలలోని ప్రధాన పాత్ర అయిన బక్కిరెడ్డి చనిపోయిన తర్వాతే నవలలోకొస్తాడు.

పన్నెండేళ్ళ మూగపిల్లవాడు ఆ వూరి గ్రామ మణియం ఇంట్లో సేద్యగాడు. మణియం ఆవులను గ్రామ పరిసరాల్లోని మైదానాల్లోకి తోలుకెళ్ళి మేపుకు రావడం వాడి ఉద్యోగం. పశువులు మేత మేస్తున్నప్పుడు చెట్ల నీడల్లో, బండ్ల చాటున కూర్చుని పిల్లనగ్రోవి వాయించుకోవడం వాడికలవాటు. పచ్చిక తివాచీలు పరిచినట్టుండే మైదానాలు, చల్లని నీడల్నిచ్చే పెద్ద పెద్ద చెట్లు, మైదానాల్లో గడ్డి మేస్తూ నెమరేసే పశువులు, నీడలో కూర్చుని తీయగా మురళి వాయించే మూగ పిల్లవాడూ- ఇదొక పరిపూర్ణమైన, సమతౌల్యమున్న, పరస్పర పూరకమైన సన్నివేశం.

ఆ మూగ పిల్లాడికి తల్లిదండ్రులుండే ఉంటారు. వాళ్ళే వాణ్ణి ఆ మణియం ఇంట్లో సేద్యగాడుగా చేర్చి ఉంటారు. దానికి ఆ మణియం వాడి తల్లిదండ్రులకేదో కొంత జీతం ఏర్పాటు చేసే ఉంటాడు. కానీ ఆ విషయాలేవీ ఆ మూగవాడికి పట్టవు. ఆకలేసినపుడు పిడికెడు అన్నం, కప్పుకోడానికి మూరెడు బట్టా, పడుకోడానికో కుక్కి మంచం- ఇవి తాను చేస్తున్న పనికి ప్రతిఫలంగా దొరికినవేనన్న విషయం కూడా వాడికి తెలియదు. ప్రకృతిలో భాగమైపోయి, తన స్వాభావికమైన రీతిలో భూత భవిష్యత్తులను పట్టించుకోకుండా వర్తమానంలో మాత్రమే జీవించడం వాడికి తెలుసు.

పశువుల కాపరి అయినవాడు, పశువులు తలలూపేలా మురళి వాయించేవాడూ మూగవాడు కావడమన్నదే ఈ నవలికలోని ప్రధానమైన ప్రతీకాత్మక అంశం. వాడి మూగతనం ప్రాపంచికమైన -డబ్బు, జీతం, సాంఘిక గౌరవం మొదలైన- విషయాలలోనే! పశువులతోనూ, మురళితోనూ, పాటతోనూ వాడికి పరపూర్ణమైన సంసర్గముంది. వాడు ప్రకృతిలో పరిపూర్ణమైన, పరిశుద్ధమైన అవిభాజ్యమైన భాగం. అయితే వారి మనస్సును అతలాకుతలం చేసిన సంఘటన ఒకటి జరిగింది.

ఆ గ్రామంలోని ఓ ధనవంతుల ఇంట్లో శిశుమరణం సంభవించింది. అప్పుడు కొంతమంది ఒప్పారి వాళ్ళు పాటపాడుతూ, కొప్పులు విప్పుకొని, జుత్తు విరబోసుకుని, రొమ్ముల మీద బాదుకుంటూ, రవికలను చింపుకుంటూ నేలమీద పడి దొర్లుతూ, ఏడ్పులూ, అంగలార్పులూ చేసారు. గర్భంలోనే బిడ్డను పోగొట్టుకున్న తల్లి గర్భ శోకమది. ఆ పాటలో కఠినమైన మాటల్లేవు. ఒక దురదృష్టవంతురాలైన తల్లి పగిలిన గుండెలోంచి పైకుబికిన విషాద గీతమది. ఆ దృశ్యం, ఆ పాట మూగపిల్లవానిని కుదిపి పారేసాయి. ఆ విషాదాన్ని పంచుకుంటూ వాడు అసంకల్పితంగా ఏడవసాగాడు. వాడికి జ్వరం తగిలింది. మళ్ళీ కోలుకోడానికి వాడికి చాలా కాలం పట్టింది.

నాలుగు సంవత్సరాల తర్వాత వాడు బక్కిరెడ్డనే రైతును పూడ్చిన పొలంలోకి పశువులతో బాటు వెళ్ళాడు. సంవత్సరాలుగా పశువుల గిట్టలు పడని ఆ గడ్డి మైదానంలోకి మూడు సూటి ఆవుల్ని తోలి, ఓ చెట్టుకు వాలి, మురళి వాయించడం మొదలు పెట్టాడు. బక్కిరెడ్డి మరణం, అతడి విషాద జీవితం అసంకల్పితంగా, యథేచ్ఛగా ఆ మూగవాడి అంతఃచేతనను కదలించి పారేసింది. నాలుగు

సంవత్సరాల క్రితం తాను విన్న విషాదగీతిక వాడి మురళిలోంచి తన్నుకొచ్చింది. అది ప్రకృతి పాడే విషాదగీతం. ఆ విషాద రాగాన్ని విన్న పశువులు మూడూ చావు దూడ లేసేసాయి.

అలా నవలలోని 16వ అధ్యాయంలో ప్రవేశించే మూగపిల్లాడు నవల ప్రధాన పాత్ర బక్కిరెడ్డికి మారు రూపం (డబుల్) గా తయారవుతాడు. బక్కిరెడ్డి విషాద జీవితం మూగపిల్లాడు అసంకల్పితంగా పాడే చావుపాటగా మారి, నవల ప్రకృతి పాడే విషాదగీతంగా రూపొందింది. లౌకికమైన ప్రపంచంతో ఎటువంటి సంబంధమూ లేని మూగపిల్లాడికీ, పొలాన్ని దున్ని వ్యవసాయం చేయడం తప్ప మరేమీ తెలియని బక్కిరెడ్డికీ మధ్య ఉన్న ఏకత్వాన్ని (తేడా లేనితనాన్ని) నవలా రచయిత సున్నితంగా, కళాత్మకంగా చిత్రించాడు.

బక్కిరెడ్డి ఒక మామూలు కింది తరగతి రైతు. అయిదారు దశాబ్దాలుగా తన అయిదెకరాల పొలాన్ని సాగు చేస్తున్న వ్యక్తి. ఆ నేలలోని అణువణువూ అతడి చెమటతో తడిసిందే! అతడి రక్తం, మాంసం, ఎముకలూ ఆ నేలకే ఆహుతయ్యాయి. అతడి బాల్యం, యవ్వనం, ముసలితనం అన్నీ ఆ నేలలోనే ఇంకి పోయాయి. తాను చేస్తున్న ఈ నిరంతరమైన శ్రమకు అతడు పొందింది పిడికెడు కవళం, మూరెడు బట్ట మాత్రమే. అవి కూడా అతను కావాలంటే వచ్చినవి కావు. యాదృచ్ఛికంగా వచ్చినట్టే లెక్క. నేలున్నది వ్యవసాయం చేయడానికే అనీ, రైతు జీవితపు పరమావధి వ్యవసాయం చేయడమేననీ అతడి ప్రగాఢ విశ్వాసం. అది కేవలం నమ్మకం మాత్రమే గాదు, మరోలా జీవించడం గూడా అతనికి తెలియదు. ప్రతిఫలం ఆశించకుండా వ్యవసాయం చేసే కర్మయోగి బక్కిరెడ్డి. ఆ అయిదెకరాల పొలంలాగా, ఆ పొలాన్ని దున్నే మడకలాగా, ఆ మడకను లాగే ఎద్దుల్లాగా, అతను కూడా సమతౌల్యమనే చిత్రంలోని ఒక అవిభాజ్యమైన భాగం. అతనికి పొలం కావాలిసినట్లే, ఆ పొలానికి కూడా అతను కావాలి. అదొక పరస్పర అవసరం. ప్రాకృతిక సంబంధం. ఆ చిత్రంలోని అతణ్ణి నిరాకరిస్తే, ఆ సమతౌల్యానికి భగ్నం కలిగితే ఏం జరుగుతుంది? ఆ చిత్రంలోని ఒక భాగానికి విచ్ఛిన్నత వస్తే మొత్తం చిత్రమంతా ఛిన్నాభిన్నమవుతుంది.

భూమిని అమ్మే, కొనే ఒక వినిమయ వస్తువుగా కలలో కూడా ఊహించలేని రైతు బిడ్డ బక్కిరెడ్డి. తన అయిదెకరాల భూమిని గూడా తన పెళ్ళాం పిల్లలలాగా, ఇరుగుపొరుగు వాళ్ళలాగా, బంధుమిత్రుల్లాగా జీవమున్న దానిలాగే భావించే మనిషి. భూమికి భౌతిక మానసికాలే గాకుండా ఆధ్యాత్మికమైన జీవనముందని నమ్మినవాడు. మనిషికీ ప్రకృతికీ మధ్య ఉండే సంబంధాన్ని ప్రాచీన రచయితలూ, కవులూ చాలా స్పష్టంగానే గుర్తించారు. ఇంగ్లీషు రొమాంటిక్ కవి విలియం వర్డ్స్‌వర్త్ ప్రకృతికి ప్రత్యేక ఆత్మ ఉందని నమ్మాడు. ప్రకృతి ఇచ్చే వనరుల్ని పొందే మానవుడు ప్రకృతిలోని అవిభాజ్యమైన భాగమని రవీంద్రనాథ టాగూరు అంటారు. మనిషి మనస్సుకూ, ప్రకృతికీ దగ్గరి సంబంధముందనీ, అవి రెండూ పరస్పరం ప్రభావితం చేసుకుంటాయనీ ఆయన భావించాడు. ప్రతి మనిషీ మానసికంగా ప్రకృతిలోని ఏదో ఒకదానికి- కొండో, గుట్టో, నదో, చెరువో లేదో ఒకటి-ముడి వేయబడి ఉంటాడని, అది గుర్తించిన మనిషి ప్రకృతి సమతౌల్యానికి కృషి చేస్తాడనీ రవీంద్రనాథ టాగూరు తన 'ముక్తధార' నాటకంలో పేర్కొంటారు. ప్రకృతి సమతౌల్యాన్ని పాడుచేసే ప్రతి పనీ పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించాడు.

ప్రకృతికీ, మనిషికీ మధ్య ఉండే అవిభాజ్యమైన సంబంధాన్ని, భూమికీ రైతుకూ మధ్య ఉండే సంబంధంగా అనువర్తింప జేసినపుడు శ్రమకూ ప్రతిఫలానికే మధ్య ఉండవలసిన న్యాయమైన, ప్రాకృతికమైన సంబంధమేమిటో స్పష్టంగా అర్థమవుతుంది. అప్పుడు 'మూగవాని పిల్లనగ్రోవి' అనేకరాకాల దుర్మార్గాలతో నిండిన సమకాలీన సమాజంపై ఎక్కుపెట్టిన విమర్శనాస్త్రంగా బోధపడుతుంది. శ్రామికులనూ, పనివాళ్ళనూ దోచుకునే సోమరి కుహనా విలువలు సమాజానికో హెచ్చరికగా నిలబడుతుంది. అందేగాదు, ధర్మాగ్రహంతో నేటి సమాజాన్ని శపిస్తుంది.

'మూగువాని పిల్లనగ్రోవి' ఒక మణియం, ఒక కరణం, తలారి వాళ్ళు ఇంకా రకరకాల గ్రామీణ ఉద్యోగులు ఉండే 'ఒంటిల్లు' అనే గ్రామం కథ. ఆ ఊర్లో చాకళ్ళూ, మంగళ్ళూ, కుమ్మరివాళ్ళూ, కమ్మరివాళ్ళూ, రైతులూ, వడ్డెవాళ్ళూ, హరిజనులూ అందరూ ఉన్నారు. అయితే కేశవరెడ్డి గారి 'రాముడుండాడు రాజ్జెముండాది"లోలాగా, ఈ నవల కుల వ్యవస్థను గురించినది కాదు. గ్రామ మణియం తప్ప, మిగిలిన వాళ్ళందరూ ఒకే రకమైన ఆర్థిక పరిస్థితులలో ఉన్న బడుగు జీవులే. రెక్కాడితే గానీ డొక్కాడని బీద జనం. ఆ ఊరి రైతులందరికీ ఉన్న పొలం అంతంత మాత్రమే! కేవలం వర్షంపై మాత్రమే ఆధారపడే రాయలసీమ మెట్ట ప్రాంతం అది. వర్షం కంటే కరువే ఎక్కువ పలకరించే ప్రాంతమది. ప్రతి సంవత్సరమూ బావులెండి పోయినప్పుడు, ఎండిపోతున్న తమ పంటలకు నిస్సహాయులైన సాక్ష్యులుగా మిగిలే రైతులున్న చోటది. బావులు తవ్వించడం కోసం తమకున్నదంతా తెగనమ్ముకునే రైతులు వాళ్ళు. అలా ఉన్నదంతా పోగా, కూలీలుగా మారి, కౌలు భూములకు శ్రమని ధారబోసి, చితికిపోయిన జనం వాళ్ళు. కొందరు అవమానాల్ని భరించలేక పనులు వెతుక్కుంటూ నగరాలకు పారిపోయారు. ఇంకొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు. బక్కిరెడ్డి ఈ రైతుల జాబితాలోని వాడు. తన పుట్టుక, పెరుగుదల, జీవితం, సుఖమూ, శాంతి అన్నీ ఆ భూమితోనే ముడిపెట్టుకున్నవాడు. ఆ భూమి చేజారితే, తాను జీవమున్నా శవమేనని నమ్మినవాడు.

ఆ ఊరి మణియం మిద్దెదొరస్వామిరెడ్డి దీనికి పూర్తిగా భిన్నమైనవాడు. జమీందార్లు, పాలెగాళ్ల వారసుడు. అతగాడి పూర్వీకులు చోటా రాజులు. అతడి తాత ముత్తాల్లో ఒకడు బ్రిటీషు వాళ్ళతో పోరాడలేక ఆత్మహత్య చేసుకున్నాడు. అతగాడు రాజ్యాధికారం కోసం, పదవి కోసం చచ్చాడే గానీ, మరో దాని కోసం కాదు. శారీరక శ్రమ అంటే ఏమిటో అతడికి తెలియదు. అతడి వారసులైన మిద్దె దొరస్వామిరెడ్డికి ఆ గ్రామంలో మూడంతస్థుల మహాడీఉంది. ఆ ప్రాంతంలో అతడంత ధనవంతుడు ఇంకొకడు లేడు. ఆ మహాడీలోని రెండో అంతస్థులోని ఇనప్పెట్టె నిండా అతడు కొన్న భూముల పత్రాలే ఉన్నాయి. బక్కిరెడ్డి పోగొట్టుకున్న శాంతిలాగా, ఆ మణియం కొనుక్కున్న భూముల పత్రాలూ అంచెలంచెలుగా పెరిగిపోతున్నాయి. బీద రైతులు పీడించబడుతూ, బద్ధకపు భూస్వాములు లాభపడుతూ ఉన్న గ్రామం అది. అయితే ఆ మణియం

రైతుల భూముల్ని అవినీతి మార్గంలో అన్యాయంగా దోచుకోవడం లేదు. మరోదారి లేక అమ్ముకుంటున్న భూముల్ని కొంటున్నారంతే! బక్కిరెడ్డి విషాదానికి మణియం కారణం కాదు. మరెవరు కారణం? బద్ధకపు పరాన్న జీవులను ప్రోత్సహిస్తూ, శ్రమజీవుల్ని అణచిపెట్టే సామాజిక పరిస్థితులే కారణం. ఈ దురన్యాయం ఇలాగే పెరిగి, ఈ దోపిడీ ఇలాగే కొనసాగితే ఏం జరుగుతుంది?

వర్షాలు సరిగ్గా కురవక, పంటలు సక్రమంగా పండడం లేదు. బక్కిరెడ్డి లాంటి వాళ్ళు చితికిపోతారు. మడకలు గట్టకపోవడంతో పొలాల్లో గడ్డి బలిసిపోతుంది. ఎద్దుల మెడలపైన వెంట్రుకలు పెరిగిపోతాయి. మడవల్ని చెదపురుగులు మేస్తాయి. పశువుల శాలల్లో గుడ్లగూబలూ, గబ్బిలాలూ గూళ్ళు కట్టుకుంటాయి. ఈ అవమానాలకూ, అష్టకష్టాలకూ తట్టుకోలేక రైతులకు పిచ్చి బట్టుతుంది. కొందరు పిచ్చి రైతులు కనీసం తమ పొలాల్లో తమను పూడ్చుబెట్టుకుంటే చాలుననీ, అలాగైనా తమ పొలాన్ని తాము కాపాడుకోవచ్చుననీ భ్రమిస్తారు.

బక్కిరెడ్డి లాంటి రైతులను బతకనివ్వకుండా చేసినపుడు వ్యవసాయమే గతిని చేరుతుంది? కొందరు కౌలు రైతులుగా, రైతు కూలీలుగా మారతారు. తమ భూస్వామి సంపద పెరిగేలా వాళ్ళు శ్రమ పడుతూనే ఉంటారు. ఈ దురన్యాయాన్ని సమాజం సహిస్తూనే ఉంది. కానీ ప్రకృతి సహించదని నవలా రచయిత హెచ్చరిస్తున్నాడు. తనలో సహజమైన భాగాలుగా మారలేని పరాన్న జీవులను ప్రకృతి మన్నించదు. తనదైన రీతిలో ప్రకృతి ప్రతీకారం తీర్చుకుంటుంది. తనకు పిల్లలుగా కాకుండా, యజమానులు కావాలనుకునే మనుషులను త్యజిస్తుంది. వాళ్ళు అడుగుమోపడానికి వీలుగాకుండా చిట్టడివిగా మారుతుంది. "బక్కిరెడ్డి కోన" ఈ ప్రకృతి ఆగ్రహానికంతా పెద్ద ప్రతీక.

ఎంత ధనవంతుడైన మణియం అయినా అన్నమే గానీ డబ్బూ, పత్రాలూ తినలేడు. మనిషి జీవించడానికి రైతు పండించిన పంటే అవసరం. అందుచేత ఇతరులు రైతుకు రుణపడి ఉన్నారు గానీ రైతు ఇతరులకు రుణపడి లేడు. కానీ ఇప్పుడు రైతు పెద్ద అనాథగా జీవిస్తున్నాడు. రైతును పట్టించుకోని గ్రామమూ, దేశమూ బక్కిరెడ్డి కోనగానే మిగులుతుంది. ఈ విషయాన్ని నవలా రచయిత కేవలం ఒక కవి సమయంగా మాత్రమే కాకుండా శాస్త్రీయంగా కూడా నిరూపిస్తాడు. ధనవంతుల ఈ దుర్మార్గాన్ని రైతులెంతకాలం సహిస్తారు? బక్కిరెడ్డి లాంటి బీదరైతు తిరగబడితే ఏమవుతుంది? రైతు తనకు కావల్సినంత పంటే పండించుకుని, ఇతరులను పట్టించుకోకపోతే ఏం జరుగుతుంది? ఇతరుల దగ్గరున్న వస్తువులు తనకు లేకపోయినా రైతు బతకగలడు. రైతు లేకుండా ఇతరులెలా బతగ్గలరు? ఈ ప్రశ్నలకంతా "బక్కిరెడ్డి కోన" పెద్ద సమాధానం.

"మూగవాని పిల్లనగ్రోవి" మార్మిక కథ (మిత్) రూపంలో ఉన్న సామాజిక పత్రం. 'నాంది' లో ఈ నవలిక నమ్మకత్వానికి ప్రతీకయిన హనుమంతుణ్ణీ, త్యాగానికి మారు రూపమైన పాళెగాడి కూతుర్నీ పరిచయం చేస్తుంది. ఆ రెండు గుణాలూ మూర్తీభవించిన 'బక్కిరెడ్డి' అనే కర్మయోగిని ఆ తరువాత పరిచయం చేస్తుంది. క్రమంగా బక్కిరెడ్డి కూడా ఒక మిత్‌గా మారి, అటువైపు వచ్చే వ్యక్తులందరూ వాళ్ల తలపాగాలు తీసి భక్తితో నమస్కరించేలా రూపొందడం చిత్రిస్తుంది. అలా నవలా రచయిత శ్రామిక జీవులపై జరుగుతున్న దురన్యాయాలను మాత్రమే గాకుండా, వారి పట్ల ఇతరుల కుండవలసిన గౌరవ మర్యాదలనూ సూచించాడు.

"మూగవాని పిల్లనగ్రోవి" ప్రాచీన జానపదగాథల (బల్లాడ్) శిల్పాన్ని పుణికి పుచుకోవడంతోనే రచయిత ఆంతర్యమేమిటో స్పష్టంగా బోధపడుతుంది. బొబ్బిలియుద్ధం, పల్నాటి యుద్ధం, కాటమరాజు యుద్ధం లలాగే ఇది కూడా ఒక వీరగాథ. కేశవరెడ్డి గారి ఈ నవలిక బక్కిరెడ్డి అనే కర్మవీరుడి పోరాటాన్ని కళాత్మకంగా ఆవిష్కరించిన ఆధునిక వీరగాథ.

(6వ పేజీ తరువాయి...)

కూలీల కోసం తమిళనాడే కాదు ఆంధ్రప్రదేశ్ కూడా నిరసన గళమెత్తాలి. అలా జరక్కుండా ఏ ప్రచారం పని చేస్తున్నది? "మనింట్లో దొంగతనానికి వస్తే చంపక ఏం చేస్తాం, అటవీ సిబ్బందిని చంపుతుంటే ఊరుకోవాలా.." ఇటు వంటి తర్కం సమాజాన్ని ఎక్కడికి తీసుకుపోతుంది? నిజమే! కోర్టులు, కేసులు, విచారణ పట్ల ప్రజల్లో నమ్మకం పోతోంది. మరి పోలీసు వ్యవస్థ పట్ల నమ్మకం ఉందా? పత్రికలు ఈ తరహా చర్చలు చేస్తూ తమకు ఇబ్బంది కలిగినప్పుడు మాత్రం ప్రజాస్వామిక హక్కుల గురించి మాట్లాడతాయి.

అటవీ సిబ్బందిని చంపిన ఆరోపణ కింద వందల మందిపై హత్యానేరం నమోదు చేశారు. ఆ విషాదం వెంట మరెంత కథ నడిచిందో మీడియా చెప్పదు. 2013లో జరిగిన ఆ సంఘటనకు ప్రతీకారం కోసం ఎన్ని జైళ్లు నిండాలో, ఎంత నెత్తురు పారాలో మరి. చెట్టుకొట్టిన వారిని ఎన్‌కౌంటర్ చేశారు. మరి చట్టాలను ఉల్లంఘించి అడవిని నాశనం చేసే మైనింగ్ మాఫియాను ఎన్‌కౌంటర్ చేస్తారా? నదీ గర్భంలో ఇసుక తోడేస్తూ సజీవమైన భూమిని అస్తిపంజరాలు చేస్తున్నవారిని ఎన్‌కౌంటర్ చేస్తారా? భూకబ్జాదారుల్ని ఎన్‌కౌంటర్ చేస్తారా? లక్షల కోట్ల ప్రజాధనం కొల్లగొట్టే వారిని ఎన్‌కౌంటర్ చేస్తారా? స్విస్‌బ్యాంకు ఖాతాదారులను ఎన్‌కౌంటర్ చేస్తారా? దిక్కు లేని కూలీలనైతే చంపుతారు కాని స్మగ్లర్లను, వారి వెనక కథ నడిపే బాడా బాబులను చంపుతారా? ఈ ప్రశ్నలూ అడిగే ప్రజలున్నారు.

పోలీసులు పౌరులు కాదా? ప్రశ్న చాలా పాతదే. "మాలోని వానివే మావాడివే నీవు, పొట్టకూటికి పోలీసువైనావు" అన్నాడు చెరబండరాజు. కూలీలను చంపిన పోలీసుల మీద ఎఫ్ఐఆర్ రాయమని ఆదేశాలొస్తే పేర్లు లేకుండా గుర్తుతెలియని పోలీసులు అని రాశారట. ఒక రకంగా అదీ నిజమే కావచ్చు. వారు కేవలం ప్రభుత్వం చేతిలో పనిముట్లు కాబట్టి పేరున్న మంత్రులపై, ఆ పేరున్న మంత్రులతో "అడవిలోకి వచ్చేవారందకీ ఇదే గతి పడుతుందని" చెప్పిస్తున్న ముఖ్యమంత్రిపై కేసులు నమోదు చేయాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాక బయటి రాష్ట్రాల్లో విచారణ జరగాలి. రాజ్యాంగబద్ధంగా పాలిస్తామని ప్రమాణం చేసి వచ్చి చట్టవ్యతిరేకంగా చంపుతాం అని బహిరంగంగా హెచ్చరిస్తున్న మంత్రులకు ఎంత మాత్రం పాలించే అర్హత లేదు.

సాహిత్య వ్యక్తిత్వం:

కేశవరెడ్డి నవలికా ఇతివృత్తం

- జి. వెంకటకృష్ణ

కేశవరెడ్డి గారి నవలా ప్రపంచం పాఠకులకు ఒక పాత లోకాన్ని పరిచయం చేస్తుంది. 'ఓబు కాలం' నాటి మార్మికతలోకి తీసుకెళ్తుంది. ఆయన కథా వస్తువులన్నీ ఫ్యూడల్ సంబంధాల్నీ, ఫ్యూడల్ దాష్టీకాల్ని చిత్రిస్తూ పరిష్కారాల కోసం ఆధునిక అంచుల్లో నిలుస్తాయి. నవలాకారుడిగా కేశవరెడ్డిని పురికొల్పే అంశం ఆధునిక పూర్వకతే అని అతని నవలలు చదివే పాఠకులకు తెలుస్తుంది.

కేశవరెడ్డి గారు 1946 మార్చి 10న జన్మించినట్లు తెలుస్తోంది. ఆయన బాల్యం గడిచిన రాయలసీమ, మరీ ముఖ్యంగా చిత్తూరు జిల్లా జీవితమే, భాషే ఆయన సాహిత్యంలో ప్రతిఫలించింది. యవ్వన మలి దశలోకి అడుగు పెట్టినప్పటి నుండీ కేశవరెడ్డి గారు తెలంగాణ నిజామాబాద్ డిచ్‌పల్లిలో ఉండిపోయారు. అది కూడా ఫ్యూడల్ పరిస్థితులు రాజ్యమేలే ప్రాంతమే కావడం గమనార్హం. చివరి దశ దాకా తెలంగాణాలోనే ఉన్నా ఆ జీవితమేదీ ఆయన నవలల్లోకి ఎక్కలేదు. ఆయన రాసిన నవలికలన్నీ ఫ్యూడల్ సంస్కృతిని స్పర్శించి ఆయన మనసును అల్లకల్లోలం చేసిన పాతకాలపు ఇతివృత్తాలే.

అంటే కేశవరెడ్డి గారి నవలికా ప్రపంచంలో రూపుదిద్దుకున్న వాతావరణమూ, సంఘటనలూ, పాత్రలూ, పరిణామాలూ అన్నీ కూడా ఆయన బాల్యం నుండీ యవ్వనం దాకా చూసిన, విన్న, ఎరిగిన కాలానివి, ఆయన మొదటి 20-25 ఏళ్ళ ప్రాయానివి, ఆయన సాహిత్య ప్రపంచపు వస్తువు 1940ల నుండీ 1970ల దాకా ఉండొచ్చు. ఆ కాలంలో తెలుగు సమాజంలో రాజ్యమేలుతున్న ఫ్యూడల్ భావజాలం ఆయన సాహిత్యంలోకి వచ్చింది. ఆ మేరకు ఒక విప్లవకారుడి నిర్బంధం మీద రాసిన నవలికా(2004లో అరుణతారలో సీరియల్‌గా అచ్చయింది), మొదటి సంవత్సరపు వైద్య విద్య చదువుతున్న విద్యార్థి ధిక్కార ఆలోచనల్ని చైతన్య స్రవంతిలో చిత్రించిన 'సిటీ బ్యూటిఫుల్' నవలికలే ఇటీవలి కాలానికి. కాలరీత్యా 2010లో రాసిన 'మునెమ్మ' నవలిక 1940ల కాలానిది. లేదా అంతకన్నా ముందుది.

'ఇన్‌క్రెడిబుల్ గాడెస్', 'శ్మశానం దున్నేరు', 'చివరి గుడిసె', 'మూగవాని పిల్లనగ్రోవి', 'అతడు అడవిని జయించాడు', ఇత్యాదివన్నీ చాలా పాతకాలానివి. ఫ్యూడల్ ఆధిపత్యాల్నీ, వాతావరణాన్నీ చిత్రించినవి. ఈ నవలికలన్నీ ఆధునిక పూర్వ స్థితిలో ప్రారంభమై, అందులోనే ముగిసిపోయేవి. 'సిటీ బ్యూటీఫుల్' ఆధునిక విలువల్లోని డొల్లతనం వల్ల పరాయీతనానికి గురైన యువకుడి కథ. అంతో ఇంతో గ్రామాల్లోకి వచ్చిన మేరకైనా అభివృద్ధి భావజాల పరిణామాలు చిన్నా చితకా కులాల్నీ, వృత్తుల్నీ ఛిన్నాభిన్నం చేసి, నిర్వాసితం చేస్తాయని చెప్పిన 'రాముడుండాడూ రాజ్జిముండాది' నవల కూడా యజ్ఞం కథ కాలంది. ఆధునికత అంచుల్లోకి వచ్చి నిలిచిన ఇతవృత్తాలివి.

అతడు అడవిని జయించాడు- ఒకరోజు సాయంత్రం మొదలై మరుసటి రోజు పొద్దు పొడవడంతో ముగుస్తుంది. ఒక రాత్రి ఒక నిస్సహాయ మానవుడు ప్రకృతితో చేసే యుద్ధం. ప్రకృతి నుండే మనిషికి విముక్తి లభిస్తుందా, లేక ప్రకృతితో రాజీ పడాలా, జీవిత ఘర్షణ నుండే మనిషి శాంతినెలా పొందాలి అనే మార్మిక ప్రాచీన భావనను చిత్రించిన నవలది. మనిషికీ ప్రకృతికీ మధ్యా ఉన్న మౌలిక భావన మీద కేశవారెడ్డిగారి దృష్టికోణమది. ఆది మానవుడ్ని పురికొల్పిన స్వేచ్ఛా ఆకాంక్షంత పాత కాలనిదీ ఇతివృత్తం. అందుకే పాత వాసన వేయకుండా ఉంటుందా... పాచిపట్టిన నీటి చల్లదనమూ, వాసనా - ఆ నవల. ఆస్వాదించాల్సిన నవల.

మూగవాని పిల్లనగ్రోవి నవల ఇతివృత్తం, రామయణంలోని బాలకాండలో ఒక ఉదంతాన్ని తీసుకొని రాసాడని కొందరంటారు. వాతావరణ రీత్యా, శిల్ప రీత్యా మార్మికత నిండిన వస్తువది. ఫ్యూడల్ దుర్మార్గాన్ని బక్కిరెడ్డి ఐపు నుండీ ఎదిరించడం- అందుకు పనిముట్టు 'శాపం విధించడం'. సాహిత్యంలో కాల్పనికతకు పెద్దపీట వేస్తేనే సాహిత్యమవుతుందంటే- మూగవాని పిల్లనగ్రోవిని మించినది ఉండదు. ఇన్‌క్రెడిబుల్ గాడెస్ నవలిక ముగింపు మీద ఎంతో చర్చ నడిచింది. దళితుల్ని అవమానించాడని అన్నారు. కథనలా చిత్రించడానికి కారణం, కేశవరెడ్డిగారు తీసుకున్న ఇతివృత్త కాలంలో వాస్తవం అదే కాబట్టి. ఎదిరించాల్సిన దానికి దాసుడిలా వ్యవహరించిన రంపాల రామచంద్రుడి మీద, అర్జునుడి నిరసన, ఫ్యూడల్ భావజాలంలో మాత్రమే సాధ్యమయ్యే ప్రతీక.

చారిత్రకంగా అన్ని వ్యవస్థల్లోనూ మనిషికి సామాజిక అవరోధాలున్నాయని కేశవరెడ్డిగారు చెబుతాడు. ఆ అవరోధాల్ని చిత్రించడానికీ, ఎదుర్కోవడానికీ రచయిత వాడే ప్రతీకలు కాల్పనికంగా మలచడంలో కేశవరెడ్డిగారి మొగ్గు ఆధునికత పూర్వంలో ఉంటుంది. ఆయన సాహిత్యానికున్న బలం అది. వాస్తవ జీవితాన్ని సౌందర్యాత్మకమైన కాల్పనికతతో చెప్పడం, వర్తమానాన్ని అంతకంటే వెనుకటి ప్రతీకల్లో పొందుపరచడం, కథన వ్యవస్థను గతంలో ఉంచడం ఆయన ప్రత్యేకతలు. ఆయన నవలికల్లోని పాత్రలు అణగారిన వర్గాల వ్యక్తులు అయి ఉండటం, స్వేచ్ఛ కోసం ప్రయత్నించడం. అంతో ఇంతో ఆశావాదంగా ముగియటం కూడా గమనించవచ్చు. స్వేచ్ఛా, సౌభ్రాతృత్వం, సమానత్వం శిలాజ వ్యవస్థ ముందు తేలిపోతూ ఉండటం, అపోహగానే ఉండటం కూడా గమనించవచ్చు. ఆయన పాత్రల్లో దైన్యంతోపాటు, చైతన్యంతో స్వేచ్ఛ కోసం పరితపించేవాళ్ళూ, అందుకోసం యుద్ధం చేసే వాళ్ళూ కన్పిస్తారు.

'పధ్నాలుగు వందలా నలభై రెండు నిమిషములు' నవలికలోని విప్లవకారుడు అక్రమ నిర్బంధంలో పోలీసులు పెట్టే చిత్రహింసల్ని

నేనెరిగిన కేశవరెడ్డి

- ఉదయమిత్ర

Take him away, Lord, for he runs away from fragrance and chases after filth. He has nothing but contempt for the modesty....Faces blackened by evil, he loves to wash with tender care to make visible their eal features.....

- Sadat Hasan Manto...

*"పందిలో నందిని సందర్శించగల్గిన, నైచ్యం అనబడే దానిలో ఔన్నత్యం చూడగల్గిన, హేయంలో ప్రేయం అనుభూతించిన" కేశవరెడ్డి గారి పరిచయం నాకు చిన్నదయినా, అపురూపమైనది

సుమారుగ యాభై ఐదు సంవత్సరాల తర్వాత మొట్ట మొదటి సారిగా నేను విశాఖపట్నం దగ్గర సముద్రాన్ని చూసినపుడు, ఈ సముద్రమేదో నాకు చిన్నప్పట్నుంచి తెలిసిన దానిలా అన్పించింది. మొట్టమొదటి సారిగా కేశవరెడ్డి గారిని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో కల్సినప్పుడె సరిగ్గా ఇలాంటి అనుభవమే ఎదురయ్యింది. 'ఈ మనిషిని చాలా రోజుల్నుంచి నేను ఎరిగున్నాను' అన్పించింది. అండ్ ద ఫ్రెండ్షిప్ కంటిన్యూడ్.

అప్పటికే నేనాయన పుస్తకాలు ఏమీ చదువలేకపోయినా, పత్రికల్లో వస్తున్న వ్యాసాలు చూసి అభిమానం పెంచుకున్న. అన్వేషణ మొదలయ్యింది. మెల్ల మెల్లగా ఆయన పుస్తకాలు కొనటం మొదలెట్టాను. "మూగవాని పిల్లనగ్రోవి" "అతడు అడవిని జయించాడు" "చివరి గుడిసె" "రాముడుండాడు రాజ్యముండాది" ఇట్లా ఒక్కొక్కటిగా నా చిన్న లైబ్రరీలో చేరిపోయాయి. అయితే ఆ పుస్తకాల్లోని గాఢత, యాస, తాత్వికత, వర్ణనలు ఒక పట్టాన నన్ను ముందుకు సాగనిచ్చేవి గావు. ఇవి నిదానంగా చదవాల్సిన పుస్తకాలు అన్పించి, అన్ని పుస్తకాల్ని ఒక దగ్గర పెట్టుకున్నా.

"మునెమ్మ" పుస్తకం చేతిలోకొచ్చినాక, ఎట్లాగో ఆయన సెల్ నెంబర్ సంపాదించి ఆయన్తో మాట్లాడటం మొదలెట్టాను. "మునెమ్మ" మీద ఎన్ని వివాదాలు రేగినా, నాకు ఆ కథ బాగా నచ్చింది. అంగడి నుండి వస్తున్న తన భర్తను చంపిన వ్యక్తిని, తన ఎద్దుకు తర్ఫీదునిచ్చి, ప్రతీకారం తీసుకోవడం నాకు కొత్తగా అన్పించింది. ('ఓ' హెన్రీ "ద రివేంజ్" కథలో కూడా ఇట్లాంటిదే ఓ గొప్ప ముగింపు కనబడుతుంది. అందులో తన భర్తను చంపిన వ్యక్తి మీద, తన కుక్కకు తర్ఫీదునిచ్చి, ప్రతీకారం తీర్చుకుంటుది ఓ స్త్రీ)

ఏకబిగిన చదివిన తర్వాత నేనాయనతో మాట్లాడాను. ఆ శైలి, ఆ గాఢత, మాండలికం ఎట్లా వచ్చింది అంటే, నవ్వి ఊరుకునేవాడు. తన సొంతూరు ప్రభావం గురించి అప్పుడప్పుడు మాట్లాడుతుండేవాడు. ఆ తర్వాత 'మునెమ్మ' పుస్తకం మీద వచ్చిన సమీక్షల్ని గుడిపూడి గారు సంకలనంగా తెస్తున్నారని తెల్సి, నేనప్పటికే 'మునెమ్మ' మీద రాసిన వ్యాసాన్ని గుడిపూడి గారికీ, కేశవరెడ్డి గారికీ పంపాను. గాఢతను బాగా ప్రేమించిన మనిషి గావటం వల్లనో ఏమో, నా వ్యాసం ఆయనకు తాకలేదు. మామూలుగా మాట్లాడాడు. అయితే సమీక్షల సంగతి పక్కన బెడితే, వస్తున్న విమర్శలకు బాగా బాధపడేవాడు.

"చూసారా, ఎన్ని సూటిపోటి మాటలంటున్నారు. వీళ్ళకేం తెలుసని ఇదంతా అక్కసుతో కూడిన పని. కావాలనే నా మీద దాడి చేస్తున్నారు" అంటూ బాధపడేవాడు. "అదేంటి సార్ మీరు వాళ్ళతో

ఎట్లా భరిస్తాడు? ఆ భరించే శక్తి ఎక్కడ్నుంచీ తెచ్చుకుంటాడు, అన్నదాన్ని కేశవరెడ్డిగారు ఎంతో కాల్పనికతతో చిత్రించారు. విప్లవకారుడి మనోశక్తి, అతని విప్లవ జ్ఞాపకాలే, ప్రతి చిత్రహింస కల్గించే నొప్పికి ఓదార్పు చిత్రహింసలు పెట్టేటప్పుడు రక్తం ఇంకి పోవడానికి పోసిన ఇసుకలో నుంచే పొందుతాడు. ఆ ఇసుకలోని ఒక్కో ఇసుక రేణువు ఒక్కో సహచరుడై, ఆ ఇసుక అడవిలోని వాగులోని ఇసుకై ఆ ఇసుకలో అతడ్ని సహచరులంతా తాకుతున్నట్టు ఊహించుకోవడం ద్వారా ఆ నొప్పిని జయిస్తాడు. ఇదే నవలలో భీష్ముడిలా మనుషులకు ఇచ్ఛా మరణం లభించాలనీ, ఎప్పుడు ఎలా మరణించాలో విప్లవంలో వీరులు నిర్ణయించుకోగలరంటాడు. ఇసుక రేణువులను జ్ఞాపకాల దేహాలుగా కాల్పనికంగా వాడుకోవడం, భీష్ముడిలాంటి పురాణ ప్రతీకను విప్లవానికి అన్వయించడం కేశవరెడ్డి ఇతివృత్తతత్వం.

ఇక మునెమ్మ నవల ఎంత ఇటీవల కాలంలో రాసినా అది 1940ల కాలపు కథ, అంత పాత కథకు మనో వైజ్ఞానిక కోణాన్ని అద్ది ఒక ఫక్తు ప్రతీకార నవలగా రాయడంలో కేశవరెడ్డిగారు తన తల్లిని జ్ఞాపకం చేసుకున్నారు. ఆ నవల మీద దుమారం రేగుతున్నప్పుడు ఒక చోట ఈ విషయమే చెప్పుకున్నారు కూడా. అయితే ఆ నవలలో చూడాల్సిన కోణం, రచయిత సైన్సు చదివిన వాడై, ఎన్నో సైన్సు వ్యాసాలు కూడా రాసిన వాడవడం. దానికి తోడు పూర్తి స్థాయి కాల్పానిక నైపుణ్యాన్ని రచనలో రంగరించ గలవాడు కావడం. తన ఆధునిక పూర్వ కల్పనల్ని ఆధునికత అంచుల్తో సానబెట్టే గుణం గలవాడు కావడం. కేవలం మనో వైజ్ఞానిక ఫ్రాయిడ్ ఆలోచనా విధానంతో ఆలోచిస్తేనే కేశవరెడ్డిగారి సాహిత్య నైపుణ్యాన్ని ఈ నవలలో ఆస్వాదించగలం.

ఇట్లా కేశవరెడ్డిగారి ఇతివృత్తాలన్నీ కూడా ఆధునిక పూర్వపు వాతావరణాల్లో తేలియాడుతూ వచ్చి ఆధునికతా గడపలో తచ్చట్లాడతాయి.

మాట్లాడొచ్చు గదా" అంటే "ఏం మాట్లాడుతాం" అంటే నిట్టూర్చేవాడా మౌనముని.

నేనాయనతో మాట్లాడుతున్నపుడు, కాస్తంత అమాయకంగా "సార్ నా కవిత్వం చదివారా?" అని అడిగితే "అరుణతారలో చూస్తుంటాను. మొన్న ఏదో చూసాను" అనేవాడు. ఆయన ఆ మాటలు మొహమాటం కొద్దీ అన్నాడే గానీ, నేనాయనలోకి డిగ్ చేయలేకపోయానని నా కర్థమయ్యింది. అయినా సాహిత్యానికి మించిన స్నేహ పరిమళమేదో మమ్మల్లుకునేది.

ఒక్కోసారి మనిషితో ఏర్పడ్డ అనుబంధంతో బాటు, అతడుంటున్న ప్రాంతలోనూ మనకు ఎమోషనల్ బాండ్ ఏర్పడుతుందేమో నేను ఆదిలాబాద్ పోయేటప్పుడల్లా, డిచ్‌పల్లి మిషనరీ హాస్పిటల్ పక్కనుండి పోతూ ఉంటే, ఓ లిప్త కాలానికి ఓ గొప్ప పరిమళమేదో నన్ను కమ్ముకునేది. "ఇది మా దవాఖాన. ఇక్కడ మాసారుంటాడు" అనిపించేది ధీమాగ.

'హి ఈజ్ ఎ బ్యాడ్ టాకర్, బట్ ఎ వైజ్ థింకర్'. ఎప్పుడు మాట్లాడినా చాలా సీదాసాదాగ, పొడి పొడిగా మాట్లాడేవాడు. పల్లెటూరి మనిషి లాగ మాట్లాడేవాడు. ఎక్కడా తానొక గొప్ప రచయితననే ఫీలింగ్ ఉండేది కాదు. నేను కూడా పాత దోస్త్ మాదిరిగానే చొరవ తీసుకుని ప్రశ్నించేవాడిని. "గదేంది సార్. మీరెక్కడా ఒక్క మీటింగ్ కాడ కనబడరు?" అంటే " నా కలవాటు లేదండీ" అనేవాడు. "ఇయ్యాల రేపట్ల కొంచెం పేరొచ్చినా, పెద్దగ ప్రచారం చేసుకంటారు కదా, మీరేంది మీ ఇంట్ల గూచుంటే ఎట్ల. అస్సలు నిజామాబాద్‌ల కూడా ఎక్కడికీ పోరా?" అంటే "చాలా తక్కువ" అనేవాడు.

హి ఈజ్ రెక్లస్. ఓ విధమైన బైరాగితనం ఈయనలో ఉండేదేమో నన్పించింది. తన పేరు ప్రతిష్టలు తననంటని ఒక విశిష్ట వ్యక్తిత్వం ఈయన్లో స్ఫటికంలాగా ఉండేది. శేషు సార్, బాలగోపాల్ గార్లు కూడా అంతే. ఏమయినా వాళ్ళ గురించి మాట్లాడితే గొప్పగా చెబితే "నాదేముందండీ" అంటూ ముఖం పెట్టేసేవాళ్ళు. బాలగోపాల్ గారయితే కొంటెగా నవ్వి ఊరుకునేవాడు. "ఇంత గొప్పవాళ్ళు ఇంత సింపుల్‌గా ఎట్లుంటారు?" అనేది నన్నెప్పుడూ తొలుస్తూ ఉండే ప్రశ్న.

కొందరు రచయితలు తమ అహాన్ని జీవిత కాలం కొనసాగిస్తే, కొందరు కొంత కాలం తర్వాత, దాన్ని రద్దు చేసుకునే ప్రయత్నంలో పడతారు. కేశవరెడ్డి గారు మాత్రం తన అహాన్ని ముందుగానే రద్దు చేసుకుని, సాహిత్యంలోకి వచ్చాడేమో అనిపించింది. ఇతరుల సాహిత్యం గురించి ఇంతో అంతో మాట్లాడేవాడు గాని, తన పుస్తకాల కొచ్చిన పేరు ప్రతిష్టల గురించి అస్సలు మాట్లాడేవాడు కాదు. అవి నేను పత్రికల్లో చదివి తెల్సుకోవాల్సిందే.

ఆయన పరిశీలనా శక్తి అనితర సాధ్యమైంది. చేసేది డాక్టరు వృత్తి. ఉండేది టౌన్లో. మధ్య తరగతి జీవితం అయినా ప్రకృతి లోలోతుల్లోకి ఎట్లా పొరలు పొరలుగా విచ్చుకుని పోగలిగాడన్నది ఆశ్చర్యమనిపిస్తుంది. బాపన చీమలు, తోటిగువ్వ, తీంట్రపొద, సుక్కపంది, ఎంద్రకాయలు, బిలిచిత్రి పూలు, సుంక్రేసు ఆకులు అబ్బో ఇలా ఒకటేమిటి, ఆయన దృష్టిని దాటిపోనిది ఏదయినా ఉందా? అనిపిస్తుంది. అంతటి పరిశీలనా శక్తి గనకనే, అంతటి గాఢత, అంతటి నిబద్ధత.

కేశవరెడ్డి విడిచిన సాహితీ వారసత్వం, అంత సులభంగా ఫాలో అయ్యేది కాదు. కఠినమైన దారుల నడిచి, కఠినమైన సాధన చేయమంటున్నాడు. సాహిత్యానికి షార్ట్‌కట్ రూట్ ఏదీ లేదంటున్నాడు.

కాలు విరిగినపుడు నేనాయనకు ఫోన్ చేస్తే, అదేదో మామూలు విషయమన్నట్లుగా మాట్లాడేవాడు. తన విరిగిన కాలు మీద తానే జోకులేసేవాడు. "లేచి నడుస్తున్నాను. అప్పుడప్పుడూ బయటికి పోయి వస్తున్నాను" అన్నాడు "ఫరవాలేదు" అనుకుంటుండగానే ఈ మరణ వార్త.

ఆయన మరణించాడు అన్నది ఎంత వాస్తవమో, 'ఆయన మాలో జీవించి ఉన్నాడు' అన్నది అంతకంటే వాస్తవం. నేనా పాత్రల ద్వారా, రచనల ద్వారా ఆయన్తో మాట్లాడుతూనే ఉంటా. నిరంతరమీ దీపం వెల్గుతుంటది.

చివరగా ఒక మాట. ఎక్కడో పుట్టిన పెర్ల్ బక్ చైనా కొచ్చి "గుడ్ ఎర్త్" నవల రాసి, నోబెల్ ప్రైజ్ తీసుకొని, చైనాలోనే కన్నుమూసింది. ఆమెను చైనా గుండెలకు హత్తుకున్నది. కేశవరెడ్డి గారు చిత్తూరు వాసి అయినా, నిజామాబాద్‌లో స్థిరపడిపోయారు. ఇక్కడి సాహితీకారులకు ఆత్మబంధువుగా మిగిలిపోయారు.

నిజామాబాద్ సాహిత్యానికి, కళలకు ప్రసిద్ధి అని విన్నాను. ఆయన నివసించిన చోటో లేదా పనిచేసిన చోటనో ఆయన పేరు మీద ఒక మెమోరియల్ గాని మ్యూజియం గాని పెడితే సముచితంగా ఉంటుంది. ఇది నా విన్నపం.

సృజన 1966-1992 డివిడి కొన్నవారికి విజ్ఞప్తి

సృజన ఆధునిక సాహిత్య వేదిక 1966-1992 సర్వస్వం డివిడిలో జూన్ 1973 (సంచిక 45) స్కానింగ్‌లో రెండు పేజీలు పొరపాటున తప్పిపోయాయి. అలాగే మే 1979 (సంచిక 91)లో మరొక సంచిక నుంచి పది పేజీలు కలిసి, అక్కడ ఉండవలసిన పేజీలు తప్పిపోయాయి. ఈ పొరపాట్లకు చింతిస్తున్నాం. సృజన డివిడి కొనుక్కున్నవాళ్లు srujana.missingpages@gmail.comకు మీ మెయిల్ ఐడి పంపితే ఆ రెండు సంచికలూ సవరించిన ప్రతులు పంపుతాం. మీ డివిడిలో లేదా కంప్యూటర్‌లో పాత ప్రతుల బదులు కొత్త ప్రతులు చేర్చుకోవచ్చు.

- సాహితీమిత్రులు

బ్లడీ వుడ్.. ఓ ఎన్‌కౌంటర్ కథ వెనక

- ఎం.కె.కుమార్

పనికెళ్లిన తన భర్తను పోలీసులు చంపేశారని 43 రోజుల పసికందు తల్లి హృదయవిదారకంగా ఏడుస్తుంటే, ఆమెను, ఆమెతోపాటు ఉన్న పసిపిల్లల తల్లుల దు:ఖాన్ని, ఆవేదనను తీర్చడం గుమికూడిన వేలమందికి సాధ్యం కాలేదు. కనీసం వారి భర్తలు చనిపోయిన ప్రదేశంలో నివాళులివ్వడానికి ప్రభుత్వం అవకాశం కల్పించలేదు. మృతదేహాలు తిరునల్వేలి ప్రభుత్వ ఆసుపత్రులో ఉన్నాయి. అవి బూటకపు ఎన్‌కౌంటర్‌కు మౌనసాక్ష్యం చెబుతున్నాయి. కాబట్టి వాటిని తీసుకుపోవడానికి నిరాకరిస్తున్నామని వారు అన్నారు. ఒక శవానికి కన్నులేదు. మరో శవానికి కాలు సగం నరకబడిఉంది. నిప్పుతో కాల్చిన ఆనవాళ్లు, కర్రలతో కొట్టిన గుర్తులు శవాలపై స్పష్టంగా కన్పిస్తున్నాయని వారి బంధువులు ఆరోపిస్తున్నారు. తిరుపతిలోని శ్రీవారిమెట్టుకు రెండు కిలోమీటర్ల పరిధిలో 2015 ఏప్రిల్ 7వ తేదీ తెల్లవారుజామున జరిగినట్టుగా చెపుతున్న ఎన్‌కౌంటర్ కథలో ప్రాణాలు కోల్పోయిన 20 మందిలో ఏడుగురి కూలీల భార్యలు, తమ పిల్లలతో సహా ఏప్రిల్ 12న చంద్రగిరి పోలీసు స్టేషన్‌కు వచ్చారు. తమ భర్తలు చనిపోవడానికి కారుకులైన పోలీసు, అటవీసిబ్బందిపై హత్యానేరం మోపాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు మేరకు వచ్చిన సందర్భంలో పెల్లుబికిన దు:ఖం అది. తమవారు మొత్తం 8 మంది కూలీ నిమిత్తం తిరుపతికి వస్తున్న క్రమంలో వారిని అనుమానంతో ఏప్రిల్ 6 సాయంత్రం నగరి-పుత్తూరు మధ్యలో బస్సులోనుండే పోలీసులు అరెస్టు చేశారని, ఒక్కరిని (శేఖర్) మాత్రం అరెస్టు చేయకపోవడంతో, అతను తన గ్రామంలోని పెద్దలకు చెప్పడంతో వారు లాయర్లతో మాట్లాడి తమవారిని విడిపించే నిమిత్తం తిరుపతికి ప్రయాణమవుతున్న సందర్భంలో వారి మరణవార్తని వినాల్సొచ్చిందని వాపోయారు. ఈ విషయాన్ని తిరువన్నామలై జిల్లా, అనందపురం మాజీ కౌన్సిలర్ పళనిస్వామి, పడవేదు పుదూర్ గ్రామానికి చెందిన సర్పంచ్ మూర్తి ధృవీకరించారు.

చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన ప్రభుత్వం పోలీసులతోనే, పోలీసుల పైన విచారణకు ఆదేశించింది. ఈ ప్రభుత్వ నిర్లక్ష్యపు ధోరణి బాధితులను, ముఖ్యంగా తమిళులను మరింతగా ఆవేదనకు లోనుచేసింది. నిజానికి అందరూ డిమాండ్ చేస్తున్నట్లుగా సిబిఐ విచారణకు ప్రభుత్వం ఆదేశించివుంటే అందరూ హర్షించేవారు. అది జరుగకపోగా సాక్షాత్తు కేంద్ర, రాష్ట్ర మంత్రులే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తుండటంతో వారు ఇరు రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టినట్టయింది. గద్దెనెక్కిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వల్పకాలంలోనే తమ విశ్వశనీయతను కోల్పోవడంతో తాత్కాలికంగా ప్రజల ఆలోచనల్ని మళ్లించడానికి ఈ విషాదాన్ని అవకాశంగా మలుచుకోవడం అత్యంత బాధాకరమైనది.

కూలీలా, స్మగ్లర్లా? లేక కూలీలే స్మగ్లర్లా?

ఎర్రచందనం కూలీలు వీరప్పన్ అనుచరలని, వీరు కరుడగట్టిన నేరప్రవృత్తి కలవారిని అవసరమైతే చంపడానికి సైతం వెనుకాడరనే ప్రచారం ప్రణాళికాబద్ధంగానే ప్రభుత్వం, పోలీసు అధికారులు చేస్తున్నారు. అందుకుగాను గతంలో 2013 డిసెంబర్ 13న చనిపోయిన ఇద్దరు అటవీసిబ్బంది దేవిడ్, శ్రీధరరావు హత్యలను ప్రస్తావిస్తున్నారు. నిజానికి ఈ హత్యలపై జ్యుడీషియల్ విచారణను హక్కుల సంఘాలు అప్పుడే డిమాండ్ చేశాయి. అటవీసిబ్బందికి ఆత్మరక్షణార్థం ఆయుధాలివ్వాలని, వారిని స్మగ్లర్ల చేతిలో బలిపశువులు కానియ్యద్దని పదే పదే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. వందలమందితో కూడిన ఎర్రచందన కూలీల బృందం శేషాచల అటవీప్రాంతంలోకి ప్రవేశించిందనే స్పష్టమైన సమాచారం ఉన్నప్పటికీ అటవీశాఖ అధికారులు ఇద్దరు సిబ్బందిని, అదికూడా ఆయుధాలు లేకుండా ఎందుకు పంపించారనేది శేషప్రశ్న. అటవీశాఖ అధికారులకు, స్మగ్లర్లకు మధ్య ఉన్న లావాదేవీల మూలంగా నిజాయితీపరులైన అటవీసిబ్బంది, పోలీసుసిబ్బంది బలైపోతున్నారనే విషయం అందరికీ తెలిసిందే. అటవీసిబ్బంది హత్యలో పాల్గొన్నారనే నెపంతో సుమారు 450 మంది కూలీలపై ప్రభుత్వం హత్యానేరం కింద కేసు మోపింది. వారిలో నిజానికి 98 శాతంమందికి ఆ హత్యతో సంబంధం లేదు. గత రెండు సంవత్సరాలుగా వారు జైళ్లలో మగ్గుతుంటే వారి కుటుంబాల కన్నీళ్లను తుడపడం ఎవ్వరికీ సాధ్యం కావడం లేదు. దీనివెనుకున్న అసలు స్మగ్లర్లు ఎవరో ప్రభుత్వం ఇంతవరకు బహిరంగపర్చలేదు. ఇప్పటివరకు 100 మంది అటవీ, పోలీసు సిబ్బందిపై క్రమశిక్షణాచర్యలు చేపట్టింది. ఇందులో ఒక్క అధికారి లేకపోవడం గమనార్హం. ఉన్నా బదిలీతోనే సరిపెట్టింది. మరోవైపు ప్రతిపక్షపార్టీలు, అధికారవర్గానికి కొమ్ముకాసే స్మగ్లర్లను, అధికారులను ప్రభుత్వం చూసిచూడనట్టు వదిలేస్తుందని మిగిలిన వారిని మాత్రమే అరెస్టు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. చనిపోయిన ఎర్రచందనం కూలీల భార్యలు సైతం గతంలో అటవీసిబ్బందిని చంపిన కూలీలపై పెట్టిన హత్యానేరం కేసులనే, తమ వారిని చంపిన పోలీసులపై పెట్టమంటున్నారు. ప్రజాస్వామ్యదేశంలో చట్టానికి వర్గదృష్టి ఉంటుందని వారికి బహుశా తెలియకపోవచ్చు.

ఎర్రచందనం చెట్టు కొట్టడం, తరలించడం చట్టప్రకారం తప్పు కావచ్చు. అందుకు ఆ కూలీలను ఆ మేరకు కేసులు పెట్టి న్యాయవ్యవస్థ ఆదేశానుసరం శిక్షలు ఖరారుచేయచ్చు. తనకొచ్చిన కూలీతో అతను కుటుంబపోషణకు ఉపయోగించుకుని మిగిలిన సొమ్మును తన అవసరాలకు ఉపయోగించుకుని, ఇంకా మిగిలిన సొమ్మును అతను వడ్డీకో, లాభాలకోసం మరో రంగంలో

పెట్టుబడులకో పెట్టుకుని, ఆ పెట్టుబడితో లక్షలు గడిస్తే అతను స్మగ్లర్లవుతాడు. కాని కూలీలెవ్వరు ఎర్రచందనం అక్రమ రవాణాతో సంపాయించిన సొమ్మును పూర్తిగా తమ కుటుంబ సాధారణ పోషణనిమిత్తమే ఉపయోగించారు. కాబట్టి వారెన్నట్టికీ స్మగ్లర్లు కాదు. ఇప్పటివరకు చనిపోయిన, అరెస్టు కాబడ్డ కూలీల ఇండ్లను అనేక హక్కుల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సందర్శించారు. అందరూ పేదవారు, అందులో ఎక్కువ భాగం దరిద్రులు. వీరి సంవత్సర ఆదాయం లక్షకు మించిలేదని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి.

వీరప్పన్ వుండే సత్యమంగళం అడవులకు, వీరు నివసించే జవ్వాది కొండలకు చాలా దూరం ఉంది. ఈ చుట్టుప్రక్కలున్న మొత్తం 212 గ్రామాలకు వీరప్పన్‌కు అస్సలు సంబంధంలేదు. వీరి అడవుల్లో ఎర్రచందనం వృక్షాలు లేవు. వీరంతా వ్యవసాయ కూలీలు. వీరిలోకొంతమంది గతంలో తమ జీవనాధారం కోసం అడవిలోని సిల్వర్‌ఓక్ చెట్లను కొట్టి డ్రస్సింగ్ చేసేవారు. అటవీశాఖ హెచ్చరికలతో వారు అడవి నుండి దూరమయ్యారు. వ్యవసాయంలో ఏర్పడిన సంక్షోభంతో వలసబాట పట్టారు. చెరకు పంటల కాలంలో కొంతమందికి అక్కడ ఉపాధి దొరుకుతుంది. మిగిలినకాలం పస్తులుండాల్సిందే. అందుకే వారు తమ కుటుంబాలను వదిలి పక్కరాష్ట్రాలకు పనికోసం వెళ్లి పదిరోజులకో, నెలకో ఇంటి కొస్తుంటారు. వీరికి నేరప్రవృత్తి లేదు. ఇప్పటివరకు ఈ గ్రామాల్లోని మెజారిటీ ప్రజలపై మామూలు కేసులు కూడా లేవు.

కూలీలు దళితులు కాదా!

చనిపోయిన కూలీలు తమిళులని, దళితులు కారని, కాబట్టి మనకు సంబంధం లేనట్టు చాలా సామాజిక బృందాలు ప్రవర్తించడం శోచనీయం. ప్రస్తుతం చనిపోయిన 20 మందిలో ఎక్కువమంది ఓబిసీలు, వన్నియార్‌కునాలనికి చెందినవారు, మిగిలిన వారు ఎస్‌టీలు, ఆదివాసీలు. గతంలో చనిపోయిన 11 మంది, జైళ్లలో చనిపోయిన మరో ముగ్గురి విషయానికొస్తే వీరిలో బిసీలతో పాటు దళితులే ఎక్కువమంది ఉన్నారు. తమిళులైనప్పటికీ వారు మనుషులు కదా, కనీసం భారతీయులు కదా! ఆపైన ప్రపంచ శ్రామిక సోదరులు. అమెరికాలో ఒక్క నల్లజాతీయుడ్ని పోలీసులు కాల్చిచంపితే అక్కడ దేశవ్యాప్తంగా అన్ని జాతులు కలిపి పెద్ద ఎత్తున నిరసన జరిపి ప్రజాస్వామిక విలువలను కాపాడే ప్రయత్నం చేశారు.

అడవి నిషేధిత ప్రాంతమా?

ఎన్‌కౌంటర్ ప్రదేశాలను పరిశీలించడానికి వచ్చిన 7 రాష్ట్రాలకు చెందిన వివిధ హక్కుల సంఘాల ప్రతినిధులు అటవీఅధికారుల అనుమతిలేకుండా అడవిలోకి ప్రవేశించారని వారిపై కేసులు నమోదు చేస్తామని బెదిరింపులకు గురిచేశారు. 4,756 చ.కిమీ విస్తీర్ణంలో ఉన్న శేషాచల అటవీప్రాంతాన్ని తమ గుత్త సొత్తుగా, చెట్ల సంరక్షణ పేరుతో అడవిలోనికి ప్రవేశించిన వారిని చంపుతామని ప్రభుత్వం హెచ్చరిస్తోంది. ఈ లెక్కన శేషాచల అటవీప్రాంతంలోనే ఉన్న తిరుమల ఆలయానికి రోజుకు వచ్చే సుమారు 60,000 మంది శిక్షార్హులే అవుతారు. ఎందుకంటే వీరు గుంపులుగుంపులుగానే వెళతారు. ఎర్ర చందనం కూలీలందరూ శ్రీవారి భక్తుల వేషాధారణలో వస్తుంటారని అటవీ అధికారులు పేర్కొంటున్నారు. అడవిలో కూలీల హత్యలతో తమిళనాడు గ్రామాల ప్రజలు తిరుమలకు రావడం మానేశారు. చెన్నై నుండి కాలిబాటను తిరుమలకు వచ్చే సంఖ్య గణనీయంగా తగ్గింది. తమిళనాడు, ఆంధ్ర సరిహద్దు ప్రాంతాలలో బస్సులు ఆపి, తమిళులను కిందకి దింపి, వారి చొక్కాలనిప్పి, భుజాలను చూసి మరీ పంపిస్తున్నారు. ఎర్రచందనం దుంగ భుజంపై మోస్తారు కాబట్టి అక్కడ చర్మం కమిలుంటుందని, గట్టిగా కాయకట్టిఉంటుందని పోలీసుల నమ్మకం. పోలీసుల ఈ దుశ్చర్య ఎందరో తమిళ సోదరులను మనోవేదనకు గురిచేస్తోంది. ఈ దేశంలో స్వేచ్ఛాయుతంగా సంచరించే హక్కును కోల్పోయి, దొంగలుగా, నేరస్తులుగా అనుమానించబడటం వారిని మరింత కుంగదీస్తోంది. అనుమానితులనే గాకుండా ప్రతి తమిళపౌరుడ్ని ఆ విధంగా చేయడం వల్లే ప్రస్తుతం వారు ఆంధ్రప్రాంత ప్రజల్నే ద్వేషిస్తున్నారు. అందుకే కూలీల హత్యల నేపథ్యంలో విధ్వంసానికి పాల్పడుతున్నారు. దీనికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి.

వేలసంవత్సరాలుగా శేషాచల అటవీప్రాంతాన్ని నమ్ముకుని లక్షకు పైగా చుట్టుపక్క గ్రామాల్లోని ప్రజలు తమ జీవనాన్ని సాగిస్తున్నారు. అడవిలో 144 సెక్షను పెట్టడం రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగంలోని 5వ,6వ షెడ్యూల్లు ప్రకారం, 1/70 చట్టం ప్రకారం ఆదివాసీలకు, గిరిజనులకు, దాని చుట్టపక్కల ప్రజలకు అడవిపై, అటవీ ఉత్పత్తులపై హక్కుంది. వీరికున్న హక్కును సంరక్షించేందుకే అటవీసిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగింది. కానీ రాజ్యం ఎప్పటికీ, ఉత్పత్తి శక్తులపై పెత్తనాన్ని కల్గి ఉన్న సామాజిక వర్గానికే వత్తాసు పలుకుతుంది. రాజ్యం చేతిలో అడవుంటే, అటవీసంపద, అందులోని సహజవనరులు ఫ్యూడల్, కార్పొరేట్‌వర్గాల చెంతకే చేరతాయి.

కట్టెముక్క ఆస్తి ఎలా అయింది?

పొయ్యిలోకెళ్లే కట్టెముక్క ఇప్పుడు ఆస్తయి కుర్చుంది. తన ఉపయోగపు విలువకన్నా, మారకపు విలువను అమాంతం పెంచుకుని తమను ఇన్నాళ్లు కంటికిరెప్పలా కాపాడుకున్న అణగారిన వర్గాల నెత్తురునే అది కోరుకుంటోంది. ఎర్రచందనం దుంగ మాఫియా చేతిలో బందీఅయ్యి లక్షల విలువచేస్తోంది. చనిపోయిన మృతుల కుటుంబాలకు తమిళనాడు ప్రభుత్వం రూ. 2 లక్షలు మాత్రమే ఇచ్చింది. వారు మోసిన 30 కిలోల దుంగ విలువ సుమారు రూ. 10 లక్షల పైమాటే. ఆ విషయం తెలీని కూలి ఆ ఒక్క దుంగను కొట్టి, డ్రస్సింగ్ చేసి, తీసుకెళ్లేదానికి వెయ్యి రూపాలకు కక్కుర్తిపడి, చివరికి తన కుటుంబం కోసం ప్రాణాలే విడిచాడు. బ్లడీ వుడ్, తన పాలిట బ్లడ్ వుడ్ అవుతుందని కూలీలకు తెలిసుండక పోవచ్చు. తెలిసినా అతని ఆర్థిక పరిస్థితి అతన్ని చావడానికే సిద్ధం చేసుండొచ్చు.

ఎర్రచందనంచెట్లు సముద్రమట్టానికి 750 మీటర్ల ఎత్తులో, మధ్య తరహావాతావరణ పరిస్థితుల్లో అధికంగా వృద్ధి చెందుతాయి. ఈ వాతావరణం శేషాచల అటవీప్రాంతంలో ఉంది. చైనా మార్కెట్లో ఎర్రచందనం విలువ ఒక కేజీ లక్ష రూపాయలుంటుంది. గ్రామాల్లోని ప్రజలు కలపగా ఉపయోగించినంత కాలం దీనిగురించి ఎవ్వరూ

పెద్దగా పట్టించుకోలేదు. ఇది సరుకైన తర్వాతే మనిషి ప్రాణాలకన్నా దీని విలువ అధికమైపోయింది. కేంద్రప్రభుత్వం దీన్ని అమ్మడాన్ని, కొనడాన్ని నిషేధించిన తర్వాత, బ్లాక్ మార్కెట్లో దీనివిలువ అమాంతం పెరిగి, స్మగర్ల పాలిట కల్పవృక్షమైపోయింది. గత 7 సంవత్సరాలుగా స్మగర్లు తరలించిన ఎర్రచందనం విలువ రూ. 70 వేల కోట్లు ఉందని ఒక అంచనా. ఇంకా తిరుమల అటవీ ప్రాంతంలో లక్షకోట్ల రూపాయలు పలికే ఎర్రచందనం చెట్లున్నాయి. ప్రభుత్వ గోదాముల్లో రికవరీ చేసిన దుంగల విలువే రూ. 36 వేల కోట్లు.

ఇప్పటివరకు ఎర్రచందనం అక్రమ నరికివేత, తరలింపుకు సంబంధించిన కేసుల్లో ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు 1,060 మంది, తమిళనాడువారు 1070 మంది, కర్ణాటకవారు 460 మంది, కేరళవారు 80 మంది, మిజోరాం నుండి 17 మంది, మణిపూర్ నుండి 10 మంది, ఢిల్లీ నుండి 8 మంది ఉన్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు నేపాల్ నుండి ఆరుగురు, బర్మా నుండి నలుగురు, దుబాయి నుండి ఇద్దరు, చైనా నుండి ఇద్దరు ఉన్నారు. స్మగ్లర్లకు ప్రాంతీయ భేదం లేదు. ఏ రాష్ట్రానికి చెందిన కూలీలనైనా తమ లాభం కోసం వాడుకుంటారు. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలోని బడాస్మగ్లర్ల సంఖ్య 50 వరకు ఉంటుందని ఒక అంచనా. దీనికి తోడు విదేశీ స్మగ్లర్లు 20 మందికి దాకా ఉంటారని ప్రభుత్వం భావిస్తోంది. ఎర్రచందనం ఎక్కువగా మలేషియా, దుబాయి, చైనా, తైవాన్, నేపాల్, సింగపూర్, హాకాంగ్, జపాన్‌లకు దొంగ రవాణా అవుతోంది. అంతర్జాతీయ మార్కెట్ ఈ దేశాలలోనే ఎక్కువగా ఉండటంతో రాష్ట్రంలోని తీరప్రాంతాలనుండే గాక, చెన్నై, ముంబై లాంటి హార్బర్ల నుండి కస్టమ్ అధికారుల అండదండలతో యథేచ్ఛగా స్మగ్లింగ్ జరుగుతోంది. వీరందరిని వదిలివేసి పొట్టకూటికోసం వస్తున్న కూలీలనే ప్రభుత్వం టార్గెట్ చేస్తుడటం చూస్తే స్మగ్లింగ్‌లో అధికారపార్టీకి హస్తముందని విదితమౌతోంది.

ఎన్‌కౌంటర్ మెంటాలిటీ

ప్రభుత్వం ఉత్సాహంగా ఎన్‌కౌంటర్లకు పాల్పడటానికి ప్రధాన కారణం పెద్ద ఎత్తున సామాజిక ఆమోదం లభించడమే. ముఖ్యంగా మధ్యతరగతి ఇన్‌స్టెంట్ కాఫీ లాంటి తక్షణ పరిష్కారం కోసం వెంపర్లాడటమే. తప్పు చేసిన వాడిని, తన తప్పుకు తగ్గట్టుగా శిక్షించకుండా, వాడ్ని చంపాలని, నరకాలనే ఉన్మాదానికి ప్రజాసమూహం లోనవుతుంటుంది. ఎన్నికల ఫలితాల మాదిరి ప్రతి సమస్యకు క్షణాల్లో పరిష్కారం దిశగా వారి ఆలోచనలను పెట్టుబడి ప్రభావితం చేస్తోంది. తమిళ కూలీలకు అడవుల్లో ఏంపని, మన ఇంట్లో దొంగతనానికి వస్తే వాడ్ని చంపాలి కదా అని సగటుమనిషి ప్రశ్నిస్తున్నాడు. దొంగతనానికి వచ్చినవాడ్ని దొంగతనం నేరం కింద అరెస్టు చేయకుండా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే విధంగా ప్రోత్సహిస్తున్న ఈ పోలీసింగ్ మన ప్రజాస్వామ్య వ్యవస్థకు మరో పార్శ్వం. పోలీసులను చట్టబద్ధమైన హంతకులుగా మార్చడానికి వీరి ప్రోత్సాహం ఎక్కువగా ఉంది. అత్యాచారాలు చేసినవారిని పోలీసులు చంపేస్తే, ఆ పోలీసులకు సన్మానాలు చేసే సామాజిక బృందాలకు ఈ వ్యవస్థలో కొదవలేదు. ఈ అసంగత చలనం అడవిలో ప్రవేశించే ఏ వ్యక్తికైనా వర్తించే రోజులు ఎంతో దూరంలో లేవు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రతిపక్ష రాజకీయనాయకులు, వారి అనుచరులను ఊచకోత కోసే అధికార పార్టీ మల్లే, అధికార పార్టీ మద్దతున్న స్మగ్లర్లు, తమ విరోధుల గొంతులు కోయడానికి పోలీసులను ఎన్‌కౌంటర్ల పేరుతో ఉసిగొల్పుతున్నారు. జీతం తీసుకున్నందుకు అసలు స్మగ్లర్లను ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలోఉన్న పోలీసులు అసహనంతో కూలీలపై తమ ప్రతాపాన్ని చూపుతున్నారు.

ఆంధ్రుల ఆస్తిని తమిళజాతివారు ఎలా లాక్కుపోతారని, ఆ ఎర్రచందనం వనరులు మన ప్రాంతానికే స్వంతమని, ఎన్ని కేసులు పెట్టినా మళ్లీ, మళ్లీ వస్తుంటే కాల్చి చంపకుండా ఏం చేయాలని ఈ హత్యలను సమర్థించేవారు చాలా మందే ఉన్నారు. పోలీసుల నైతిక సామర్థ్యం దెబ్బతినకుండా ఉండటానికి వారికి ప్రోత్సహకాలూ ఇవ్వాలని అడిగేవారున్నారు. అడవిని ఆస్తిగా పరిగణించే ప్రభుత్వం, మధ్యతరగతి వర్గం అదే అడవి పేదల ఆస్తంటే బహుశా ఒప్పుకోదు. ఆ వనరులు అడవిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారికే చెందాలని రాజ్యాంగంలో చెప్పబడిన అంశాన్ని ఉద్దేశపూర్వకంగానే పక్కన పెడతారు. ఇప్పటివరకు ఎర్రచందనం మాఫియా దోచుకున్న లక్షకోట్ల రూపాయలు ఎన్నికల్లోను, ఆస్తుల రూపంలోను, సేవారంగాల్లో పెట్టుబడుల రూపంలోను ఖర్చుయి విపరీతంగా అదనపు లాభాలను తెచ్చిపెట్టింది. స్మగ్లర్ల ఆస్తులను జప్తు చేయాలని, ఎన్నికల్లో ప్రవహించిన డబ్బులకు లెక్కలు చెప్పాలని ఎవరూ కోరటం లేదు. ప్రభుత్వం గతంలో హెలికాప్టర్లలో ఎర్రచందనం విత్తనాలను చల్లి విరివిగా అవి పెరిగేవిధంగా దోహదపడింది. అవి ఇప్పుడు అన్ని రాజకీయపార్టీలకు భారీ పరిశ్రమనిచ్చాయి.

చెట్టు కొట్టడాన్ని నిరసించే చాలామంది, కూలీని చంపడాన్ని మాత్రం వ్యతిరేకించలేకపోతున్నారు. చెట్టు కోసం, పిట్ట కోసం మనుషుల్ని చంపే ఆటవిక, అనాగరిక రాజ్యాన్ని తిరిగి ఆవిష్కరింప జేసుకుంటున్నారు. కూలీలను చంపితేనే వారు అడవుల్లోకి రారు అనేది తప్పుడు ఆలోచన. ఇప్పటికీ ప్రభుత్వం 8 బూటకపు ఎన్‌కౌంటర్లలో 31 మంది తమిళ కూలీలను చంపింది. 5,000 మందికి పైగా తమిళ, తెలుగు కూలీలు జైళ్లల్లో మగ్గుతున్నారు. ఆంధ్రప్రదేశ్ జైళ్లంతా వారితోనే నిండిపోయాయి. భవిష్యత్తులో జైళ్ల కొరత కూడా ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. వీరంతా ఎస్‌సి, ఎస్‌టి, బిసి కూలాలకు చెందిన పేదవారు. అయినా చెట్ల కొట్టివేత, అక్రమ రవాణా ఆగలేదు. కూలీలను చంపిన మరుసటి రోజే 150 మంది కూలీలు శేషాచలం అడవుల్లోకి వచ్చినట్లు అటవీశాఖ సిసి కెమెరాలు చెప్తున్నాయి. శ్రామిక రిజర్వు సైన్యం దేశంలో లక్షల సంఖ్యలో ఉంది. వీరంతా స్మగ్లర్ల మాఫియాకు వారి దారిద్ర్యం దృష్ట్యా పావులుగా మారడానికి సిద్ధంగా ఉన్నారు. మొదట్లో తెలుగు రాష్ట్ర పేదవారు ఈ పనికి సిద్ధపడితే, అటు తర్వాత అది తమిళ, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు పాకింది. ఇప్పుడు తమిళ కూలీలను చంపితే, రేపు కేరళ కూలీలను చంపాల్సొస్తుంది. దీనికి అంతముండదు. రాజకీయ నాయకుల ముసుగులో ఉన్న స్మగ్లర్లను వెంటనే అరెస్టు చేసి, వారి ఆస్తులను జప్తు చేయనంత కాలం స్మగ్లింగ్ కొనసాగుతూనే ఉంటుంది.

కూలీలకు సరైన ఉపాధి లేకపోవడంతోనే దుంగలను కొట్టి నేరస్తులు కావడానికి సిద్ధపడుతున్నారు. చనిపోయిన కూలీలలో డిగ్రీ, బిఇడి చదివిన వ్యక్తి ఉండటం ఉపాధిలేమి వల్లే పేదవారు నేరస్తులుగా రూపొందుతున్నారని తెలియపరుస్తోంది. దీనికి తమిళనాడు ప్రభుత్వం బాధ్యత వహించి, వారికి ఉపాధిని అందించే దిశగా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి సరిగా అందడం లేదు. తల్లకిందుల సిద్ధాంతాన్ని ప్రభుత్వం కావాలనే చేపట్టింది. స్మగ్లింగ్‌కు మూలం కూలీలనే తప్పుడు ప్రచారం చేస్తోంది. వందల కోట్ల రూపాయలను మింగిన రాజకీయ నాయకులు, బ్యూరోక్రాట్లు ప్రజల మధ్య స్వేచ్ఛగా తిరుగుతూ, వారి హక్కుల కోసం రాజ్యాంగంలోని ప్రతి పేజీని తిరగేస్తున్నారు. 7 వేల కోట్ల రూపాయలను మింగిన సత్యం రామలింగరాజును కోర్టు శిక్షించినప్పటికీ అతనికి మధ్యతరగతినుండి బలమైన మద్దతు చేకూరుతోంది. ఫేస్‌బుక్‌లో అతనికి మద్దతుగా పెద్ద ఎత్తున ప్రచారమే ఊపందుకుంది. కూలీల విషయంలో మాత్రం చట్టాలు, రాజ్యాంగాన్ని పక్కన పెట్టి ఆటవికదశ ఆలోచనల్ని అమలుచేస్తున్నారు. సాంకేతిక పురోగమన బుద్ధిజీవుల ఆలోచనల్లో ఏ మాత్రం అభ్యుదయకర మార్పు తీసుకురాకపోగా, వారిని వెనుకటి దశల్లోకి నెడుతోంది. రాజ్యం సమస్యను తుపాకీతోనే పరిష్కారం చేయగలమని బలంగా భావిస్తోంది. దానికి తెలిసింది భయపెట్టడం, భయపడకపోతే కాల్చిచంపడం. ఇదే ఫిలాసఫీని ప్రజా ఉద్యమాలపైన, వాటికి మద్దతిస్తున్న మేధావులపైన అనాదికాలంగా ప్రయోగిస్తూనే ఉంది.

అది దరిద్రులను ప్రాంత, కుల, జాతి, మత ప్రాతిపదికన విభజించి చంపుకుంటూ పోతూ ఉంది. వారి ఓటుబ్యాంకుగాను, వారి సైన్యానికి తర్ఫీదు పొందడానికి టార్గెట్లగానూ నిరుపేదలు ఉపయోగపడుతున్నారు. అప్పటివరకు చావకుండా బతకడానికి, సంక్షేమపథకాలను విదిల్చి వారికి ఉపాధిని కావాలనే దూరం చేస్తోంది ప్రభుత్వం. ఎన్‌కౌంటర్ హత్యలను సమర్థించే ప్రజానీకం రోజురోజుకి పెరగడటం పౌరసమాజానికి తీవ్రమైన హాని కలుగజేస్తుంది. ఇప్పటికే మావోయిస్టులకు సహకరిస్తున్నారని మేధావులను అరెస్టు చేస్తూ, ఆదివాసీలను, గిరిజనులను, పేదవాళ్లను మావోయిస్టులని కాల్చిచంపుతున్న ప్రభుత్వం, తాజాగా అదే ప్రణాళికతో ఎర్రచందనం కూలీలను స్మగ్లర్లనే పేరుతో చంపుతోంది. నిజానికి మెజారిటీ మౌనం వీరందరిని ప్రభుత్వం చేత చంపిస్తోంది. పత్రికలు మెజారిటీ భావాలకు ముఖ్యంగా రాజ్యపు ఆలోచనలకు తగ్గట్టుగానే వాస్తవాలను వక్రీకరిస్తున్నాయి. మీడియా, కొన్ని సామాజిక బృందాల అంగీకారం ఈ ఎన్‌కౌంటర్‌కు లభించడం సాధారణ విషయమే. ముస్లింలంటే ఉగ్రవాదులని, తమిళ కూలీలంటే కరుడుగట్టిన వీరప్పన్ అనుచరులని చాలామంది బలంగా నమ్ముతున్నారు. అసలు దోషులను శిక్షించకుండా వుండటానికి ప్రభుత్వం చట్టాన్ని అమలు చేయకుండా, న్యాయ విచారణకు తావులేకుండా నేరస్తులను చంపడమే కర్తవ్యంగా పెట్టుకుంది. శాంతి భద్రతల పేరుతో జరుగుతున్న ఈ మారణకాండ ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నప్పటికీ వారి మౌనం రాజ్యానికి మరింత ఉత్సాహానిస్తోంది. ఎన్‌కౌంటర్ పేరుతో హత్యలు చేస్తున్న పోలీసు అధికారుల ప్రేరణతో సినిమాలు తీస్తే అవి 100 రోజులు 100 సెంటర్లలో ఆడటం అందరిలో వ్యవస్థీకృతమైన హింసాప్రవృత్తికి అద్దం పడుతోంది. ఇది బాలీవుడ్ నుండి టాలీవుడ్ వరకు అంటువ్యాధిలా పాకింది. అందుకే శేషాచలంలో జరిగిన హత్యలకు అల్లిన ఎన్‌కౌంటర్ కథను నిజం అన్ని నమ్మించడానికి కూడా పోలీసులు ఏ మాత్రం ప్రయత్నించకపోవడం రాజ్యపు ఫాసిస్టు స్వరూపాన్ని మరోసారి విశదపర్చింది. అసలు కూలీలను చంపిన ప్రదేశాలు సచ్చినోడిబండ, చీకటీగల కోన రెండూ చాలా చిత్రంగా ఉన్నాయి. ఆ ప్రాంతాలనే పోలీసులు ఎంచుకోవడం వెనుక చాలా హేళన ఉంది. చీకట్లో తమకు కూలీలు తారసపడితే, ఆత్మరక్షణార్థం వారిని చంపివేశామనే కట్టుకథకు సింబాలిక్‌గా ఆ రెండు ప్రాంతాలను ఎంచుకున్నట్టు అనుమానం కలుగుతోంది.

జాతీయ మానవహక్కుల సంఘం సూచనలు

కూలీల హత్యలకు ముందు రోజు 2015 ఏప్రిల్ 6న కూలీలతో పాటే బస్సులో తిరుపతి కొస్తున్న శేఖర్(54), బాలచంద్రన్(29)లు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఎన్‌హెచ్‌ఆర్సీ ఎదుట వాంగూల్మం ఇచ్చారు. శేఖర్ వాంగూల్మం ప్రకారం పూడూరు కొల్లమేడు, తిరువణ్ణామలై జిల్లా నుంచి బస్సులో చెన్నైకు బయలుదేరి, మధ్యాహ్నం 2.30కు ఆర్కాట్ బస్టాండ్ దాటుతుండగా తనతో వచ్చిన మూర్తి, మునస్వామిలను పోలీసులు అరెస్టు చేశారు. చనిపోయిన కూలీలలో మూర్తి, మునస్వామి ఉండటం అతన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. దినసరి కూలీ అయిన బాలచంద్రన్ 5.4.15న మరో 8 మందిని తీసుకుని పని నిమిత్తం ఆర్కాట్ బయలుదేరడానికి బస్సుస్టేషన్‌కు చేరుకోగా, తను మద్యం కోసం దుకాణానికి వెళ్లే వచ్చే లోపల మిగిలిన వారు కనిపించలేదని, బృందంలోని శివకుమార్ అనేవ్యక్తికి ఫోన్‌చేయగా ఎవరో ఫోన్ తీసుకుని మీవారు తిరుపతికొచ్చారని, పళని అరెస్టుకాబడ్డారని చెప్పాడన్నాడు. మరుసటి దినం తన తండ్రి, మిగిలిన వారు చనిపోయిన వారిలో ఉన్నట్టు పేపరులో చూశానని ఘోరుమన్నాడు. సాక్షులకు రక్షణకల్పించాలని, వారికి మద్దతిస్తున్న గ్రామ పెద్దలకు సైతం తమిళనాడు ప్రభుత్వం రక్షణ కల్పించాలని, ఘటన సమయంలో విధుల్లో ఉన్న అటవీ, పోలీసు అధికారుల పేర్లను వెల్లడించాలని, ఎస్టీఎఫ్, బాధితులు ఉపయోగించిన ఆయుధాలను కస్టడీలో ఉంచాలని, ఇతర కాగితాలు, డాక్యుమెంట్లు, రిజిస్టర్లు భద్రంగా ఉంచాలని ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశించింది.

స్వచ్ఛంద సంస్థల, రాజకీయపార్టీల పాత్ర

శేషాచల అటవీ ప్రాంతంలో కూలీలను చంపిన ప్రదేశాలైన సచ్చినోడిబండ, చీకటీగల కోనలకు అందరికంటే ముందు ప్రతిపక్ష రాజకీయనాయకులు, స్వచ్ఛందసంస్థలు పోవడం మరింత ఆందోళన కల్గించే అంశం. రాష్ట్రంలో అభ్యుదయకర శక్తులు పేపరు ప్రకటనకే పరిమితమవడం, వెంటనే కార్యరంగంలోకి దిగకపోవడం ఆ సంఘాలలో ఉన్న స్తబ్దతను తెలియజేస్తోంది. రాజకీయ నాయకులు ఈ సంఘటనను దళిత కుల, తమిళ జాతి ప్రాతిపదికన మార్చడానికి తీవ్రంగా ప్రయత్నించి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టి తమ రేటింగ్‌ను పెంచుకోవడానికి ప్రయత్నించారు. హైకోర్టు, సుప్రీంకోర్టులలో కేసులు వేసి పోలీసులపై హత్యానేరం కింద కేసులు మోపడానికి వారు

ప్రయత్నించలేదు. ఆ డిమాండ్‌ను చేయలేదు. స్వచ్ఛందసంస్థలు ఇంకొంచెం ముందుకు పోయినప్పటికీ వారు స్మగ్లింగ్ మూలమైన ప్రధాన విషయాలను పట్టించుకోలేదు. తమిళనాడులోని ప్రతిపక్ష రాజకీయపార్టీలు బాధితులకు మద్దతుగా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో వారు ఈ కేసును నీరుగార్చే ప్రమాదముంది. నిజానికి బాధితులకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలనే డిమాండే ప్రధానంగా వినిపించింది. పోలీసులపై హత్యానేరం కేసు అనే విషయంలో వారి నైతిక సామర్థ్యం దెబ్బతింటుందని, గతంలో కూలీల చేతిలో అటవీఅధికారులు చనిపోయిన విషయాన్ని పరిగణనలోనికి తీసుకోని పోలీసులను వదిలివేయాలనే అనే భిన్న వాదనలు వినిపించారు. స్వతంత్ర పౌర హక్కుల సంఘాలు మాత్రమే ఈ విషయంలో రాజ్యహింసను ప్రధానంగా ప్రస్తావిస్తూ, వారిపై హత్యానేరం కింద కేసులు మోపాలని వాదిస్తున్నాయి.

మరోవైపు తమిళనాడు రాజకీయపార్టీలు తమిళనాడులో ఆంధ్రుల ఆస్తులపై, ఆర్‌టిసి బస్సులపై దాడులు చేస్తూ, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వారు ఆంధ్రులందరిపై తమ ప్రతాపాన్ని చూపడం మొదలు ప్రశాంతంగా ఉన్న రెండు జాతుల మధ్య చిచ్చు రగిలే ప్రమాదం వచ్చిపడింది. దీనికితోడు చంద్రబాబు ప్రభుత్వ చర్యలు మరింత ఉద్రిక్తతను రేపుతున్నాయి. చిత్తూరు జిల్లాకే చెందిన అటవీశాఖా మంత్రి తమిళ్ ఛానల్ ఇంటర్వ్యూలో తమిళులు శేషాచల అడవుల్లోకి వస్తే కాల్చిచంపుతామని, వారికి ఇక్కడి అడవుల్లో ఏంపనని హెచ్చరించాడు. ఇది అంతిమంగా తమిళనాడులో ఉన్న ఆంధ్రులకు పెద్దఇబ్బందిగా మారబోతోంది. ఇప్పటికే గత పదిరోజులుగా తెలుగు రాష్ట్రాల బస్సులు తమిళనాడుకు పోవడంలేదు.

పోలీసులూ పౌరులే. అందుకే వారినీ చట్టబద్ధంగా విచారించాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి, ప్రజల ఆలోచనలను మరల్చడానికి, నిసిగ్గుగా ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అమలుపర్చడానికే కూలీలను చంపారనేది సుస్పష్టం. స్మగ్లర్లను పట్టుకోవడంలో కావాలనే అలసత్వం ప్రదర్శిస్తూ, కూలీలను చంపడం ఆందోళనకల్గించే విషయం. ఇప్పటికీ 5000 మంది కూలీలపై కేసులు పెట్టినా, వారిలో చాలామందిని సంఘటనా స్థలంలో కాకుండా, రైల్వేస్టేషన్లలో, బస్సుస్టేషన్లలో పట్టి అనుమానంపేరుతోనే పోలీసులు అరెస్టులు చేశారు. దీన్ని శాంతి భద్రతల సమస్యగా ప్రభుత్వం చూపే ప్రయత్నం చేస్తోంది. కూలీలు అడ్డొచ్చిన పోలీసులను, అటవీసిబ్బందిని చంపుతున్నారని, ఆత్మరక్షణార్థం వారిని చంపుతున్నామని బుకాయిస్తోంది. ఎన్‌కౌంటర్లలో పాల్గొన్న పోలీసులందరిపై హత్యానేరం కింద కేసుమోపి వారు తప్పుచేయలేదనే విషయాన్ని వారే నిరూపించుకోవాలి. ఇందులో వారి ఆత్మస్థైర్యం దెబ్బతినే అంశమేలేదు. బాధ్యతాయితమైన, చట్టబద్ధమైన ప్రభుత్వానికి ప్రజాస్వామ్య విలువలు కాపాడటానికి ఇది అత్యవసరం. కూలీలను చంపిన పోలీసులను కాల్చిచంపాలని ఎవ్వరూ డిమాండ్ చేయడం లేదు. అది అప్రజాస్వామికం కూడా. వారు చట్టాన్నితమ చేతుల్లోకి తీసుకున్నప్పటికీ, వారికి శిక్షలు చట్టబద్ధంగా, చట్టపరిధిలోనే విధించాలని పౌరసమాజం డిమాండ్ చేస్తోంది.

రాజకీయ కోణం

ఇవి ముమ్మాటికీ రాజకీయ హత్యలనే వాదన కూడా ముందుకొస్తోంది. ముఖ్యంగా చనిపోయిన కూలీలు, అరెస్టు కాబడ్డ కూలీలు ప్రతిపక్షపార్టీలకు చెందినవారు, వారి మద్దతుదారులుగా ఉన్నవారే అధికం. 20 మంది స్మగ్లర్లను అరెస్టు చేశామని ప్రభుత్వం చెప్పినప్పటికీ, అందరూ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ప్రతిపక్షపార్టీ కార్యకర్తలే గావడం గమనార్హం. సీమలోని ప్రతిపక్షానికి చెక్ పెట్టడానికి ఇప్పటికే ఆపరేషన్ గంగిరెడ్డిని చేపట్టిన ప్రభుత్వం, కావాలనే ఆ కేసులో తాత్సారం చేస్తోంది. ఇది ప్రతిపక్షంలోని నాయకులు ఆ పార్టీని నుండి వెలుపలికి వచ్చేదానికి ఇచ్చిన వార్నింగ్. మరోవైపు సీమ ఫ్యూడల్ వర్గాలకు ప్రస్తుతం ఎర్రచందనమే అత్యంత కీలకమైన ఆదాయవనరు. గత ఎన్నికల్లో పెద్దపార్టీలన్నీ ఈ డబ్బునే మంచినీళ్లలా ఖర్చుపెట్టాయి. మొదటినుండి స్మగ్లింగ్‌పై రెడ్డి సామాజిక వర్గమే ఆధిపత్యాన్ని, పట్టును కల్గిఉంది. ఇది అధికార ప్రభుత్వానికి బాగా కలిసొచ్చింది. ఎర్రచందనంపై ఉక్కుపాదం పేరుతో ఆకర్ష్ పథకాన్ని అమలుజరుపుతున్నారు. ఈ ఆధిపత్యవర్గ పోరులో తమిళ నిరుపేద కూలీలు బలైపోతూ, పావులుగా ఉపయోగపడుతున్నారు. ఈ క్లీన్ శేషాచలంలో ఎందరో కిందిస్థాయి అటవీ, పోలీసు సిబ్బంది తమ ఉద్యోగాలను వదులుకున్నారు. ఇద్దరు అటవీసిబ్బంది ఈ రెండు సామాజిక వర్గాల పోరులో అశువులు బాశారు. అధికారపార్టీకి ఈ హత్యలు పేరుని, ప్రతిష్టను తీసుకురావడంతో పాటు ప్రతిపక్షాలకు చెక్ పెట్టడానికి ఉపయోగపడుతుండటంతో ఈ హత్యల పరంపరను ప్రతి 6 నెలలకోసారి కొనసాగిస్తూనే ఉంది. చివరికి కూలీలను చంపుతున్నా స్మగ్లింగ్ ఆగటం లేదని ఇంకా వందల సంఖ్యలో కూలీలను చంపాలనే మూకభావజాలాన్ని జనాల్లో హిస్టీరియాలా వ్యాపింపజేస్తోంది. మీడియా, మంత్రులు ఇప్పటికే ఇదే విషయాన్ని ప్రచారంలో పెట్టారు. అందుకే ఇప్పుడు శేషాచల అటవీప్రాంతం నిషిద్ధ ప్రాంతం. ఇది స్మగ్లర్లకు, వారికి కొమ్ముకాస్తున్న రాజ్యపు ఆస్తి. కూలీలకు,పేదలకు ఇందులో ప్రవేశంలేదు. సహజవనరుల నిక్షేపాలున్న అనేక అడవులను, ప్రాంతాలను మధ్య భారతంలో కార్పొరేట్లకు అమ్మి, అక్కడ నివసిస్తున్న లక్షలమంది ఆదివాసీలను ఖాళీచేసే క్రమంలో పడుతున్న ఇబ్బందులను ముందే పసికట్టిన ప్రభుత్వం ఆపరేషన్ గ్రీన్‌హంట్ తరహాలో, క్లీన్ శేషాచలాన్ని చేపట్టింది. త్వరలో 4,756 చదరపు కిలో మీటర్లు గల శేషాచల అటవీ ప్రాంతాన్ని కార్పొరేట్లకు ఇచ్చి వారితో ఎమ్ఒయులు కుదుర్చుకోబోతోంది. ఎర్రచందనాన్ని వారే పెంచాలి. వారే దాన్ని సరుకుగా చేసుకుని మార్కెట్ చేసుకోవాలి. సంవత్సరానికి అతి తక్కువ రాయిల్టీని మాత్రమే ప్రభుత్వం తీసుకుంటుంది. అందుకే ఇది పౌరుల నిషిద్ధ ప్రాంతం. ☆

వ్యాసం

దండకారణ్యంలో మతాంతీకరణ ప్రయత్నాలు

\- జహంగీర్

దేశంలో 16వ లోక్‌సభకు ఎన్నికలు జరిగి భారతీయ జనతా పార్టీ మెజార్టీ సీట్లను గెలుచుకొని జాతీయ ప్రజాతంత్ర కూటమి నాయకత్వంలో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పర్చడం, మోదీ ప్రధానమంత్రి కావడంతో దేశంలో బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు శక్తుల విజృంభణకూ, దాడులకూ అడ్డూ, అదుపూ లేకుండా పోయింది. దేశంలో దాదాపు 700 సంవత్సరాల తర్వాత హిందుత్వం గద్దెనెక్కిందనీ విశ్వ హిందూ పరిషత్‌కు చెందిన కరుడుగట్టిన మతోన్మాద శక్తులు తెగ సంబరపడిపోతున్నాయి. దేశం దాదాపు 1200 సంవత్సరాలు బానిసత్వంలోనే మగ్గిందని ఏకంగా ప్రధాన మంత్రే సెలవిస్తున్నాడు. చెప్పన్నారు దేశాలను ఒక కొలిక్కి తెచ్చి భారతదేశంగా నిలిపిన ముస్లింల పాలన సహా 1200 సంవత్సరాల కాలాన్ని మోదీ బానిసత్వంగానే చూస్తున్నాడు. 2004 వరకు గడిచిన ఐదేళ్ళ పాలనలో ఎన్.డి.ఎ. అధికారంలో ఉన్నప్పటికీ, గత పదేళ్ళుగా అది లేని కొరత తీర్చుకోవడానికి హిందూ మతోన్మాద సంస్థలన్నీ శక్తులన్నీ వాటి మాతృ సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.) నాయకత్వంలో బరితెగించి ఎన్నికల బరిలోకి దిగాయి. ఆర్.ఎస్.ఎస్. తన సుదీర్ఘకాల రాజకీయేతర సోకాల్డ్ సాంస్కృతిక సంస్థ అనే పొసగని ముసుగును చించివేసి తన మతతత్వ రాజకీయాలతో బహిరంగంగా రంగంలోకి దిగి నాయకత్వం వహించింది. మితవాద రియాక్షనరీ శక్తులన్నీ ఢిల్లీ పీఠాన్ని కైవశం చేసుకునే ఏకైక లక్ష్యంతో చతురోపాయాలతో మున్నెన్నటికన్నా దూకుడుగా ముందుకు వచ్చాయి. ఎన్నికల బరిలో వీరంగమాడటానికి తగిన వ్యక్తిగా నరేంద్ర మోదీని ఆర్.ఎస్.ఎస్. ఖరారు చేసింది. తమ వద్ద గల చతుర రాజకీయ దురంధరులలో మోదీని మించిన వారు మరొకరు లేరని గుర్తించి, వృద్ధ జంబూకాలను నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టి, ఆయన్ని తగిన అభ్యర్థిగా ఎంపిక చేసింది.

గుజరాత్‌లో ఎంతో లబ్ధి పొందిన కార్పొరేట్ శక్తులు మోదీ ఎంపికలో కీలక పాత్రే పోషించి ఉంటాయి. ఆ తరువాత మోదీని వికాస పురుషుడిగా ప్రపంచం ముందు నిలపడానికి అదానీలు, అంబానీలు, టాటాలు, ఎస్సార్‌లు సహా తదితర కార్పొరేట్ శక్తులు నడుం బిగించాయి. గుజరాత్ నరమేధంలో మానవ నెత్తుటి రుచి మరిగిన మోదీని మానవేశుడిగా, కొత్త అవతారంలో వారు ముందుకు తెచ్చారు. ఈ యావత్తు కసరత్తులో అంబానీ, అదానీ, టాటా సహిత అనేక ఘరానా కార్పొరేట్ శక్తుల పెట్టుబడులు మీడియాను మున్నెన్నడూ లేని స్థాయిలో ప్రచారానికి దించి మత్తెక్కించాయి. పదేళ్ళ కాంగ్రెస్ నాయకత్వ యూపీఏ పాలనతో విసుగెత్తిన కార్పొరేట్ శక్తులకు ఓటర్ల నాడీ అర్థమై మోదీని ప్రమోట్ చేసాయని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఈ సారి ఎన్నికలలో తమ ఓటమి తప్పదని గ్రహించిన కాంగ్రెస్ పార్టీ పాత్ర గూడా మోదీని గెలిపించడంలో ఎంతగానో తోడ్పడిందన్నది ఒక వాస్తవం. ఆర్.ఎస్.ఎస్. తన హిందూ మతతత్వ మితవాద రాజకీయాలను బాహాటంగా ప్రచారం చేయగా, భారతీయ జనతా పార్టీ శక్తులన్నీ అభివృద్ధి మంత్రం జపించాయి. ఎట్టకేలకు దేశంలో మూడు దశాబ్దాల తర్వాత ఎన్నికలలో ఒకే పార్టీకి మెజార్టీ సీట్లు లభ్యమయ్యాయి. భారీ పెట్టుబడులు, మతోన్మాదశక్తులు తాము అనుకున్న విధంగా 'అబ్ కా బారీ, మోదీ సర్కార్' నినాదాన్ని నిజం చేసాయి. కాశీ విశ్వనాథుడి సాక్షిగా ఎన్నికలలో గెలిచిన మోదీ, దేశంలో గతంలో ఎన్నడూ లేనంత అట్టహాసంగా ప్రధాన మంత్రి పదవీ ప్రమాణం చేసిన నాటి నుండీ ఇప్పటి వరకూ మతోన్మాదం, భారీ పెట్టుబడులు కలిసికట్టుగా, ప్రణాళికాబద్ధంగా రెండు రంగాలలో ఇప్పటి వరకూ జరుపుతూ వచ్చిన కృషి లోక్‌సభ శీతాకాల సమావేశాల ద్వారా చట్టం ముసుగు ధరించింది.

దేశ ప్రజలు అనుభవిస్తున్న అనేక దీర్ఘకాల మౌలిక సమస్యలను పక్కన పెట్టి, మరో మాటలో చెప్పాలంటే వాటి జోలికి వెళ్ళకుండా రాజ ప్రసాదం లాంటి లోక్‌సభలో రోజులకు రోజులు కోటాను కోట్ల ప్రజల ధనాన్ని దుర్వినియోగపరుస్తూ, కాలయాపన చర్చలతో కాలాన్ని వృథా చేసారు. స్విస్ బ్యాంకుల్లో (విదేశీ) దాచుకున్న 'నల్ల డబ్బు'ను వెనక్కి తేవడమేమైందన్నది పెద్ద చర్చ! డబ్బులు నల్ల డబ్బులుగా విదేశీ బ్యాంకుల్లో దాచింది వాళ్ళో, వాళ్ళ బాస్‌లో అయినపుడు వాటిని వెనక్కి తెచ్చేదెవడు? వాటిని దేశంలో పెట్టుబడిగా మార్చి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామన్న పతంజలి (మెగా రాందేవ్) ప్రగల్బాలను, మోదీ వీరావేశ ఉపన్యాసాలను దేశంలోని అమాయకపు ఓటర్లు తప్ప ఏ ప్రతిపక్ష రాజకీయ నాయకుడూ నమ్మలేదు. ఆ డబ్బు అసలు వెనక్కి వస్తుందన్న భ్రమలతో వాళ్ళెవరూ లోక్‌సభలో చర్చలు చేయడం లేదు. అంతా హుళక్కేననీ వాళ్ళందరికీ తెలుసు. అదే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం గొప్పతనం. నల్లడబ్బు తర్వాత లోక్‌సభలో వేడి వేడి చర్చ జరిగిందంతా మత మార్పిడుల పైనే! మత మార్పిడుల నిరోధక చట్టాన్ని కేంద్రం తేవాలన్నది సంఘ్ శక్తుల అభీష్టం కాగా ఉన్న చట్టాలు సరిపోతాయన్నది ప్రతిపక్షాల వాదన. దీన్నే 'ఘర్ వాపసీ'గా హిందీలో, 'పునరాగమనం'గా తెలుగులో సెలవిస్తున్నారు. ఛతీస్‌గఢ్‌లో 'ఘర్ వాపసీ' బ్రిగేడియర్‌గా అపకీర్తిని ఆర్జించి, దేహావసానం చేసిన యంపీ దిలీప్ సింగ్ జుదేవ్ ఉండి ఉంటే ఆ చర్చలకు మరింత రక్తి కట్టేదే! నిజానికి ఆ చర్చల్లో ఎవరూ అసలు సమస్య మూలాల్లోకే వెళ్ళడం లేదు. వెళితే గనుక, పరమ దోషులుగా ప్రజల ముందు అగుపడేవన్నీ ఆ ముఖాలే. ఈ సంగతి వారికి తెల్సు గనుక వారు అందులోకి వెళ్ళడం లేదు. సమస్య మూలాల్లోకి వెళ్ళడం వారి స్వభావమే కాదు. లోక్‌సభ శీతాకాలం సమావేశాలు 22 రోజులు జరిపి 18 బిల్లులను ఆమోదించారు. ఆ బిల్లులు దేశ సార్వభౌమత్వానికీ, ప్రకృతి సంపదలకూ, ప్రజల ఆస్తులకూ తీవ్ర నష్టం కలిగించి ప్రజల అస్తిత్వానికే పెను సవాళ్ళను

విసిరే స్వభావాన్ని కలిగి ఉన్నప్పటికీ అవి ఆమోదం పొందాయి.

పై నేపథ్యంలో దండకారణ్యంలో ప్రమాదకరంగా ముందుకు వస్తున్న 'పునరాగమనం' సమస్యను చూద్దాం.

దండకారణ్యంలో ప్రధానంగా బస్తర్‌లో హిందూ మతోన్మాద శక్తులు గత కొద్ది మాసాలుగా తమ పునరాగమన (ఘర్ వాపసీ) కార్యకలాపాలను తిరిగి తీవ్రం చేసాయి. గత దశాబ్ద కాలానికి పైగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీకి కేంద్రంలో అధికార పగ్గాలు తమ చేతిలోకే రావడంతో ఎక్కడ లేని ఉత్సాహంతో ఆదివాసీలలో పునరాగమన దాడులను తీవ్రం, వేగవంతం చేయడానికి దారులు మరింత తెరుచుకున్నాయి. మతోన్మాదుల దాడులకు రాజ్యం తీవ్రం చేస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడులు ఎంతగానో తోడ్పడుతున్నాయి.

19వ శతాబ్దం రెండవ అర్ధ భాగంలో క్రైస్తవం దండకారణ్యంలో అడుగు పెట్టినట్టు చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. అప్పటి నుంచి సోకాల్డ్ స్వాతంత్ర్యం సిద్ధించే వరకు క్రైస్తవం ప్రధానంగా ఆర్థిక ప్రలోభాలతోనే ఆదివాసీలను తనలో ఇముడ్చుకుంది. 1947కు ముందు ఆదివాసీలలో క్రైస్తవ మత మార్పిడి అతి తక్కువగానే జరిగిందని చెప్పుకోవచ్చు. చర్చిల నిర్మాణం, క్రైస్తవ మతాచార్యుల నియామకం నామమాత్రంగానే ఉంటూ అక్కడక్కడ క్రైస్తవ ఆసుపత్రుల నిర్మాణం మాత్రం జరిగాయి. వ్యవహారికంలో ఇవి మిషన్ ఆసుపత్రులుగా ప్రజలకు పరిచయమయ్యాయి. ఉదా: గడ్చిరోలి జిల్లాలోని నాగపెల్లి వద్ద గల మిషన్ హాస్పిటల్ అలాంటిదే. ఇది ఇలా ఉండగా, తొలినాటి జనగణనాలలో దేశంలోని ఆదివాసీలను ట్రైబల్ మతం లేదా ఎనిమిజం గానే పేర్కొన్నారు. అంటే అప్పటికీ అధికారికంగా మత మార్పిడి చర్యలు ఇంకా ప్రారంభం కాలేదనుకోవచ్చు. 1947కు ముందు హిందూ మత మార్పిడుల గురించి జరిగిన దౌర్జన్యాలు కూడా పెద్దగా వెలుగులోకి రాలేదు. కాకపోతే దండకారణ్య అడవులలోకి క్రీస్తుపూర్వమే బౌద్ధం, హైందవం అడుగిడినట్టు అక్కడక్కడ ఆధారాలు మాత్రం దొరుకుతాయి. ఇదంతా గతానికి సంబంధించిన విషయం కాగా 1947 తర్వాత జరిగిన మార్పులు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

1947 తర్వాత ఆదివాసీలను హిందువులుగా మార్చే ప్రక్రియ చాలా వేగవంతమైంది. సోకాల్డ్ సెక్యులర్ ప్రభుత్వాలు ఆదివాసీలను హిందువులుగా పేర్కొనడం అన్ని విధాలుగా ముందుకు వచ్చింది. ప్రతి పదేళ్ళ కొకసారి జరిపే జనగణనలు ముఖ్యమైనవి. జనాభా లెక్కల సేకరణకు వచ్చే ప్రభుత్వ ఉద్యోగులు తమ అధికారుల ఆదేశాల మేరకు శిక్షణ మేరకు ఆదివాసీలను, వారి అభీష్టాన్ని ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండానే హిందువులుగా పేర్కొనడం పరిపాటయింది. వాస్తవం చెప్పాలంటే మతాల లోతుపాతులు, వాటి హంతక చరిత్రలు, అవి తెచ్చే ప్రమాదాల గురించి తెలియని ప్రజలే ఎక్కువగా ఉంటారు. వారందరినీ ప్రభుత్వ యంత్రాంగం తమ చిత్తానుసారంగా హిందువులుగా పేర్కొనడం భారతదేశంలోని ఇరవై శాతం భూభాగంలో విస్తరించి ఉన్న ఎనిమిది శాతం ఆదివాసీలు ఎదుర్కొంటున్న పెద్ద సమస్య. అది ఒడిశా కావచ్చు, బీహార్ కావచ్చు, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర లేదా మరో రాష్ట్రం ఏదైనా కావచ్చు! ప్రభుత్వోద్యోగుల దృష్టిలో అంతా హిందువులే అవుతారు. తమంత తాముగా క్రైస్తవం అని చెప్పుకుంటేనే తప్ప నిర్దిష్టంగా వారి మతం గురించి పేర్కొనే సంప్రదాయమే లేదు. పోతే ప్రభుత్వం నుంచి దొరికే రిజర్వేషన్ సదుపాయాలు క్రైస్తవులని చెప్పుకుంటే దొరకవనీ, హిందువులుగా పేర్కొనడం ద్వారానే అవి పొందే అర్హత తమకు దక్కుతుందని కూడా అనుభవంలో గ్రహిస్తున్న వారు తాము తమ తాతముత్తాతల నాడే క్రైస్తవాన్ని స్వీకరించినప్పటికీ అక్కర నిమిత్తం హిందువులుగా చెప్పుకుంటున్నారు. ఇదంతా అధికారికంగా జరుగుతున్నదే.

ఆదివాసీ ప్రాంతాలలోని పాఠశాలలలో విద్యార్థులుగా చేరే పిల్లలందరినీ హిందువులుగానే నమోదు చేసుకుంటున్నారు. ఇది ఒక సహజ ప్రక్రియగానే తయారైంది. వారిని హిందువులుగా పేర్కొనడం సరైందిగాదనీ, వారిది నేచురల్ రిలీజియన్ అనీ ప్రాథమిక పాఠశాలలలోని అధికశాతం ఉపాధ్యాయులకు నిజంగానే తెలియదు. కాబట్టి ఆదివాసీ అని రాయడం మేరకే ఉంటే ఆ ప్రాంతాలకు సరిపోతుంది. కానీ పైనంతా లౌకికవాదం ముసుగులో బ్రాహ్మణీయ హైందవమే రాజ్యమేలుతున్నపుడు తమ మతతత్వ కుట్రల విస్తరణను పై వారెందుకు ఆపుకుంటారు? ఫలితంగా అన్ని పాఠశాలలలో విద్య నభ్యసించే ఆదివాసీలంతా హిందువులుగానే నమోదవుతున్నారు. అది దట్టమైన అడవులు, ఎత్తైన కొండలతో కూడుకున్న మాడ్ ప్రాంతంలో ముప్పై ఏళ్ళుగా నిరాటంకంగా కొనసాగుతున్న రామకృష్ణ ఆశ్రమాలే కావచ్చు, లేదా నిర్మలా తాయి దేశ్‌పాండే (ప్రముఖ కాంగ్రెస్ వాది) సంస్థ నడిపిస్తున్న పాఠశాలలే కావచ్చు, లేదా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పరచిన బడులే కావచ్చు! ఏవైనా, అక్కడ మాత్రం అమలయ్యేది 'సమ న్యాయమే'! బడి పిల్లలంతా హైందవులే అవుతారు. ఇక ఈ తరుణ విద్యార్థులలో తాము హైందవులం అని గట్టిగా, నిస్సంకోచంగా చెప్పుకునే స్థాయిలో ఆ భావన ఘనీభవిస్తున్నది. అయితే, ఇది ఏదో కేవలం వారు హిందువులుగా నమోదు కావడం ద్వారానే వారిలో ఈ భావన ఇంతగా బలపడడం లేదు. వారికి తమ స్కూల్ జీవితం నుంచే అంటే పలకా-బలపం పట్టి అక్షరపోరుకు సిద్ధమవుతున్నప్పటి నుంచే హిందూ పూజలు, ప్రార్థనలు, పాఠ్యాంశాలలో హిందుత్వ బోధనలు నేర్పుతూ వారి దైనందిన కార్యకలాపాలన్నీ బ్రాహ్మణీయ హిందూ భావజాలానికి అద్దం పట్టే విధంగానే మూర్తీభవించి ఉంటూ వారిని అలా తయారు చేస్తుంది.

పాఠశాలలో పిల్లలను చేర్పిస్తున్నపుడు వారి తల్లితండ్రులు చెప్పే పేర్లు కూడా ఉపాధ్యాయుల చేత హైందవీకరించబడుతున్నాయి. నేచరిజాన్ని ప్రతిబింబించే వారి అసలు పేరు ఆపై హిందూయిజానికి అద్దం పట్టే విధంగా మారిపోతుంది. రామే (రామచిలుక) అంతా రములుగా మారిపోతుంటే, ఇడ్మాల్ (ఇప్ప పూవు) అంతా హితేషులవుతున్నారు. ఇక రములు, హితేషులు దేవీ ప్రార్థన చేయకుండా సాధారణ ఆదివాసీ రామే, ఇడ్మాల్‌లా భోజనం చేయరు. హిందూ సంస్కృతి విస్తరిస్తున్న దగ్గర రామేలు, ఇడ్మాల్‌ల సాయంవేళ సామూహిక నృత్యాలు కనుమరుగవుతూ రాత్రి వేళలో పాఠశాలలలో గణపతి నవరాత్రులో, దేవీ నవరాత్రులో, ఇవేవీ కాకుంటే భజన కార్యక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. పాఠశాలలో వినబడే 'గోల' అది ప్రార్థనే కావచ్చు, భజనే కావచ్చు, పెద్దలకు మాత్రం అంతా పిల్లల విద్యాభ్యాసంగానే ఉంటుంది. ఆదివాసీ చిన్నారుల జీవన విధానాన్ని సమూలంగా మార్చే ప్రక్రియనంతా పాఠశాలలోనే రంగరించి పోస్తున్నారు. గమనార్హమైన విషయమేమిటంటే

విప్లవోద్యమం బలంగా కొనసాగుతున్న ప్రాంతాలలో సైతం ఇలా జరుగుతున్నది. వారు దీన్ని సైతం తమ ఎజెండాలోకి తీసుకొని బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు శక్తుల కుట్రలకు, కుహకాలకు వ్యతిరేకంగా, సోకాల్డ్ లౌకికవాదానికి వ్యతిరేకంగా తక్షణం పోరాటాలు చేపట్టాల్సిన అవసరం గతం కన్నా ఎంతగానో పెరిగింది. వాస్తవంగా చెప్పాలంటే ఇప్పటికే చాలా జాప్యం జరిగింది. సెన్సస్ నుంచి మొదలుకొని జనన, మరణ ధృవీకరణ పత్రాలు ఇచ్చేవరకు, పాఠశాలలో ప్రవేశం నుంచి ఉద్యోగాల కోసం ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్‌లలో పేరు నమోదు చేసుకునే వరకు, రేషన్ కార్డుల కేటాయింపుల నుంచి భూమి పట్టాలు, డ్రైవర్ లైసెన్స్‌ల పంపకాల వరకు అవసరమైన అన్నిచోట్లా ప్రభుత్వాలు అది కేంద్రం కావచ్చు లేదా రాష్ట్రం కావచ్చు ఉద్దేశ్య పూర్వకంగానే ఆదివాసీలను హిందువులుగా పేర్కొంటున్నారు. దానిపై గ్రహీతలు (లబ్ధిదారులు) చాలా వరకు అభ్యంతరం (చెపితే ఏం నష్టం వాటిల్లుతుందోనన్న భయాందోళనలతో) చెప్పడం లేదు. ఇక ప్రైవేట్ మత కార్యకలాపాలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

దండకారణ్యంలోకి విప్లవోద్యమం ప్రవేశించిన 1980వ దశకం నాటికే కొన్ని చోట్ల హిందూ మతోన్మాద సంస్థలు విజృంభణ దశలో ఉన్నాయి. ప్రధానంగా వాటి కార్యకలాపాలు ఆనాటికి ఉత్తర దండకారణ్యంలో తీవ్రంగా ఉండగా అప్పుడప్పుడే దక్షిణానికి వాటి విస్తరణ ప్రారంభమైంది. విప్లవోద్యమ విస్తరణ సరిగ్గా అందుకు విరుద్ధ దిశలోనే ఉండింది. అంటే దక్షిణ దండకారణ్యం (సిరొంచ, అహిరి, కోంటా, కిష్టారం, మద్దేడ్, బాసగూడెం, బీజాపూర్ మొదలైనవి) లో సాపేక్షికంగా పటిష్టమైన విప్లవోద్యమం ఉత్తరానికి తన విస్తరణను 1980ల చివరి నాటికి చేపట్టింది. మధ్యలో మాడ్ పర్వతాలుంటాయి. ఉత్తరానికి విస్తరించిన విప్లవోద్యమం ప్రధానంగా నేటి ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో హిందూ మతతత్వ శక్తులను గట్టిగా ఎదుర్కోవలసి వచ్చింది. వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్, ఏకల్ విద్యాలయ, సేవా భారతి, వివేకానంద కేంద్ర, భారత కళ్యాణ్ ప్రతిష్టాన్, ఫ్రెండ్స్ ఆఫ్ ట్రైబల్ సొసైటీ వంటి 32 వివిధ సంస్థలతో కూడిన వనవాసీ కళ్యాణ్ పరిషత్ లాంటి సంస్థలు ఆనాడు ప్రాబల్యంతో ఎంత మాత్రం లేవు. కానీ మరో రకమైన హిందూ మతోన్మాద సంస్థలు హరిద్వార్, రుషికేష్, గాయత్రీ లాంటి కరడుగట్టిన సంస్థలు తమ మత మార్పిడి కార్యకలాపాలను ఆదివాసీలలో కొనసాగిస్తూండేవి.

వీటిలో గాయత్రి సంస్థ సంస్థాపకుడు బీహారీదాస్ అందరిలోకి కుఖ్యాతి గాంచినవాడు. ఇతడిని 'చప్కా బాబా' అనేవారు. చప్కా అనే ఆదివాసీ గ్రామంలో తన ఆశ్రమాన్ని నెలకొల్పి సంస్థ కార్యకలాపాలు కొనసాగిస్తున్నందున ఆయనకు ఆ పేరు వచ్చింది. కాంతి బాబా అనే మరో పేరు కూడా ఉండింది. దేశంలోని జటాజూటధారులైన బాబాలందరి నైజమే ఆయన నైజం. కాకపోతే ఆయన ద్విపత్నీ వ్రతుడు. ఆ సంస్థ కార్యకలాపాలన్నీ దూకుడుగా, హింసాత్మకంగానే ఉండేవి. ఆదివాసీలలోకి తమ హిందూ మతాన్ని వేగంగా విస్తరింప చేయడానికి వారు ఎంచుకున్న పద్ధతులు ఇవి. ఆదివాసీ గ్రామాలలోని రాజకీయ, సాంస్కృతిక కేంద్రాలైన గోటుల్ (పెంకుటిండ్లు లేదా గడ్డి గుడిసెలు)లను తగలబెట్టించడం, ఆదివాసీ ఇండ్లపై దాడులు చేసి మద్యపాన తయారీ పాత్రలు (సారా వండే కుండలు) ధ్వంసం చేయడం, అడ్డు వచ్చిన వారిని చితకబాదడం లాంటి దుర్మార్గ చర్యలు ఒకవైపూ, మరో వైపు గుట్టుచప్పుడు కాకుండా, కొన్ని సందర్భాలలో చౌర్యంగానూ ఆదివాసీ స్త్రీ దేవతలతో హిందూ విగ్రహాలకు మతాంతర వివాహాలు జరిపించడం జరిగేవి. సాధారణంగా ఆదివాసీ దేవతలు అడవిలో భద్రత అవసరం లేకుండానే ఉండేవి. దాన్ని అవకాశంగా తీసుకొని చప్కాబాబా తన హిందూ దేవుళ్ళకు ఆదివాసీ దేవతలతో పెళ్ళిళ్ళు జరిపి మత మార్పిడి చేసేవారు. తమ దేవుళ్ళలో కలుపుకునేవారు. హిందువుల ముక్కోటి దేవతలలో ఇలా చేరిన వారి సంఖ్యే అత్యధికం కావచ్చు! ఇవన్నీ కొనసాగిస్తూనే ఆదివాసీ సమాజంలోని సంపన్నులను చేరదీసి వారిని మత మార్పిడికి ప్రోత్సహించేవారు. గోండు సమాజంలో జరుగుతున్న అంతర్గత మార్పుల రీత్యా సంపన్నులకూ, ఫ్యూడల్స్‌కూ మత మార్పిడి ఆనాడు అవసరమయ్యింది. ఆదివాసీలుగా ఉంటే వారి వికాసానికి అడ్డంకిగా ఉందని భావించి వారు హిందూ మతం పుచ్చుకోసాగారు.

ప్రధానంగా వ్యవసాయ సమాజాలలో కలిసిపోవడానికి, మరో రకంగా చెప్పాలంటే కాలం చెల్లిన ఆదివాసీ సంప్రదాయాలు తమ వ్యవసాయాభివృద్ధికి ఆటంకంగా ఉన్నాయనుకున్న వారు హైందవంలోకి మారారు. హైందవం స్వీకరిస్తే సమాజంలో ఉన్నత స్థాయిలో 'గౌరవం' లభిస్తుందన్న ఆలోచనలు కూడా వెనుకబడిన ఆదివాసీ సమాజాన్ని వదలడానికి వారికి తోడ్పడినాయి. సమాజంలో ఎవరైతే మతం మార్చుకొని హిందువులయ్యారో వారంతా ఆదివాసీలను శూద్రులుగా పరిగణించసాగారు. వారిని ఆదివాసీలు తమ సమాజం నుండి విడివడిన వారుగా చూస్తూ 'మాల బిత్తలు' అనడం మొదలైంది. అంటే వీపున జంధ్యం ధరించినవారన్న మాట. వారు జంధ్యంతో పాటు శాకాహారులయ్యారు. హిందూ పూజా విధానాన్ని చేపట్టడమే కాకుండా తమ ఆదివాసీ పేర్లను మార్చుకోవడం, గోత్రాలను సంస్కృతంలోకి తర్జుమా చేసుకోవడం అందులో భాగమైంది.

బస్తర్‌లో మాల బిత్తలుగా మారి 'ఆదివాసీ విప్రులు'గా అవతారమెత్తిన వారిలో అపకీర్తి శేషుడైన బలిరాం కశ్యప్ ఒకడు. బలిరాం అనేది ఆయన తల్లితండ్రులు పెట్టిన పేరు అయి ఉండదు. వారి గోత్రం ఏముల్. అంటే తాబేలు. దీనిని హిందీలోకి తర్జుమా చేసి కశ్యప్ (కచ్‌వా) లయ్యారు. ఇక ఈ తరంలో పేరు చివరన రాం అనే తోక లేకపోతే తలవంపుగానే భావించే అధ్వాన్నమైన సంస్కృతి ప్రవేశించింది. బలిరాం కశ్యప్ కొండగాం ప్రాంతంలోని దుష్ట భూస్వాములలో ఒకడు. ఈయన చివరి వరకూ ఆ ప్రాంతం నుంచి భారతీయ జనతా పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తూ పార్లమెంటు సభ్యుడిగా కొనసాగాడు. ఇప్పటికీ ఆయన కుటుంబమంతా కాషాయ రాజకీయాలకే అంకితమై ప్రజా పీడకులుగా కొనసాగుతున్నారు. అయితే వారు సంపన్నులు కావడం వెనుక ఆ ప్రాంతం ఆదివాసీ ప్రజల చెమట, నెత్తుర్లను ఎంతగానో దోచుకున్న చరిత్ర ఆ కుటుంబానిది. వారు లోక్‌సభ, విధాన సభలకు ఎన్నికవడానికి ఆ ప్రాంతం ఓటర్లలో చోటు చేసుకున్న భయాందోళనలే కారణం.

ఇక్కడ ఒక విషయం గుర్తు చేయడం అవసరం. 2010లో బలిరాం కశ్యప్ పుత్ర రత్నాలలో కరుడుగట్టిన దుర్మార్గుడు తాన్‌సేన్ విప్లవ గెరిల్లాల దాడిలో అంతమయ్యాడు. మిగిలిన పుత్రులలో దినేష్ కశ్యప్ తండ్రి స్థానానికి లోక్‌సభలో ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఆయన తమ్ముడు రమణ్‌సింగ్ మంత్రి వర్గంలో కేబినెట్ హోదాలో ఉన్నాడు. దండకారణ్యంలో వర్గ పోరాటం తీవ్రంగా కొనసాగుతున్న ప్రస్తు పరిస్థితులలో కేంద్రంలో సంఘ్ ముఠా అధికారాన్ని చేపట్టడం,

ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ బహిరంగంగా హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం, మత మార్పిడులను ప్రోత్సహించడంతో పాటు యావత్తు కాషాయ బ్రిగేడ్ దేశ వ్యాప్తంగా ఒక పథకం ప్రకారం 'పునరాగమనానికి' (ఘర్ వాపసీ) నడుం బిగించగా, బృహత్ బస్తర్‌లో దినేశ్ కశ్యప్ ఆ దాష్టీకానికి పూనుకుంటున్నాడు. అతడి హింసాత్మక ఘర్‌వాపసీ అభియాన్‌కు ఆపరేషన్ గ్రీన్‌హంట్ పూర్తి అండగా నిలిచింది.

దండకారణ్యంలో మత మార్పిడుల గురించి చెప్పుకునేపుడు ప్రజలపై తీవ్రమవుతున్న పోలీసు, అర్ధ సైనిక బలగాల దాడుల నేపథ్యంలో కూడా చూడాల్సి ఉంటుంది. గత 35 సంవత్సరాలుగా దండకారణ్యంలో కొనసాగుతున్న విప్లవోద్యమం ఒకవైపు తీవ్రమైన వర్గపోరాటాన్ని కొనసాగిస్తూనే, మరో వైపు హిందూ మతోన్మాద దాడులను ఎదుర్కొంటూ క్రైస్తవ మత మార్పిడులను నిరుత్సాహపరుస్తూ ప్రజలను రాజకీయ అధికార స్వాధీన బాటలో పురోగమింపజేస్తున్నది. విప్లవోద్యమం గత మూడున్నర దశాబ్దాల కాలంలో దోపిడీ పాలక వర్గాల భద్రతా బలగాలు చేపట్టిన అనేక అణచివేత అభియాన్‌లను ఓడిస్తూనే బలపడింది. 2009 జూలై నుంచి అంటే గత ఐదున్నర సంవత్సరాలుగా దేశవ్యాప్త విప్లవోద్యమం ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో దోపిడీ పాలకవర్గాలు కొనసాగిస్తున్న బహుముఖ దాడిని ధృడంగా ఎదుర్కొంటున్నది. ఇది గత అణచివేత అభియాన్‌లన్నింటి కన్నా దీర్ఘకాలికమైంది. బహుముఖమైంది. తీవ్రమైనది. అనేక రాష్ట్రాలను కేంద్రం సమన్వయం చేస్తూ లక్షలాది బలగాలతో కొనసాగిస్తున్న కేంపెయిన్ ఇది. దీనికి సామ్రాజ్యవాదుల పూర్తి అండదండలున్నాయి. ఆపరేషన్ గ్రీన్‌హంట్ యావత్ విప్లవోద్యమాన్ని తుదముట్టించే లక్ష్యంతో సాగుతోంది. విప్లవోద్యమం నిర్మిస్తోన్న ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థను నిర్మూలించడం అందులో భాగమే.

దండకారణ్యంలోని ప్రజలు అతి ప్రాథమిక స్థాయిలోనే అయినప్పటికీ తమ ప్రభుత్వాలను - జనతన సర్కార్లు - తామే నడుపుకోడం, అవి ఈనాడు దేశ ప్రజల ముందు ఒక నమూనాగా నిలవడాన్ని సహించలేకపోతున్న పాలకవర్గాలు వాటిని రూపుమాపడానికి పూనుకున్నాయి. విప్లవోద్యమంపై దోపిడీ రాజ్యం విరుచుకుపడుతున్న పరిస్థితులలో మతోన్మాద శక్తుల తీవ్ర దాడులకు పూనుకోవడం దండకారణ్య ప్రజలకు కొత్తేమీ కాదు. ఇంకా చెప్పాలంటే అనేక విప్లవోద్యమాలు ఇలాంటి దాడులను ఎదుర్కొని పురోగమించినవే అనడానికి విప్లవ పూర్వ రష్యాలోని స్టోలోఫిన్ కాలం ఒక మంచి ఉదాహరణ. ఉద్యమం గడ్డు పరిస్థితులలో ఉన్నప్పుడు శత్రువు దానిని అదనుగా తీసుకొని అన్ని రంగాలలో దాడులను తీవ్రం చేస్తాడు. ఈ వాస్తవాల నేపథ్యంలోనే దండకారణ్య విప్లవోద్యమాన్ని పరిశీలిస్తే 1991 నుంచి మత మార్పిడుల పరిణామాలు, నిర్బంధం జమిలిగా సాగడం కొట్టొచ్చినట్లు అగుపడతాయి. దేశ పాలక వర్గాలు సామ్రాజ్యవాదుల నూతన ఆర్థిక విధానాలను తలకెత్తుకున్నది సరిగ్గా అప్పుడేనన్నది తప్పనిసరి గుర్తు పెట్టుకోవాలి. ఆ ఆర్థిక విధానాలను అమలు చేయడానికి దోపిడీ రాజ్యం తీవ్రంగా పూనుకుంటూ అందులో భాగంగా అణచివేత కేంపెయిన్లను తరచుగా చేపడతున్నది. విప్లవోద్యమ వాటిని ప్రతిఘటిస్తూ ఓడిస్తూ ప్రత్యామ్నాయ రాజ్యాధికార వ్యవస్థను నిర్మిస్తూ ముందుకు పోతున్నది.

ప్రజల అస్తిత్వానికే పెను ప్రమాదకరంగా ఉన్న ఆ ఆర్థిక విధానాలను (ఎల్‌పీజీ విధానాలు) ప్రజలు తమ అస్తిత్వం కోసం ఎదుర్కొంటున్న ఫలితంగా గత 35 ఏండ్ల కాలంలో అభివృద్ధి పేరుతో దండకారణ్యంలో ఎక్కడా ఏ రకమైన గనుల తవ్వకాలే కానీ, జల వనరుల తరలింపే కానీ, బహుళ జాతి కార్పొరేషన్‌ల లేదా దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల పరిశ్రమలే కానీ వెలుగు చూడలేదు. పర్యావరణానికి తీవ్ర విఘాతాన్ని కలిగించే పరిశ్రమలేవీ స్థాపించలేదు. తుదకు వ్యాపారం కోసం చేసే జంతువుల వేట, విషపూరిత రసాయనిక క్రిమి సంహారాలతో వక్షులను, చేపలను అంతమొందించడం కూడా నిషేధమైంది. విప్లవోద్యమం సాధించిన అతి పెద్ద విజయాలలో వీటిని తప్పక చెప్పుకోవాలి. దేశంలోని మరే ప్రాంతంలోనూ బహుశా ఇలాంటి అనుభవం లేదేమో! ఇది తీవ్రమైన వర్గపోరాటం ద్వారానే సాధ్యమైందన్నది నిర్వివాదాంశం. కేంద్రంలో మతోన్మాద శక్తులు అభివృద్ధి పేరుతో అధికారాన్ని చేపట్టిన వెంటనే బస్తర్‌కు పది బెటాలియన్‌ల కేంద్ర అర్ధ సైనిక బలగాలను కేటాయించారు. ఈ బలగాలన్నీ దశాబ్దాలుగా గనుల తవ్వకాలు నిలిచపోయిన ప్రాంతాలలోకే తరలించబడినాయి. ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకుడి నుంచి దేశ ప్రధానిగా మారిన నరేంద్ర మోదీ, నిన్నటి గుజరాత్ మారణహోమాన్ని మరచిపొమ్మంటున్నాడు. మత మైనారిటీలపై సాగించిన ఆ మారణకాండను యావత్ప్రపంచం ఖండించగా ఆనాటి ప్రధాని, నేటి భారత రత్న గ్రహీత, ఆ పార్టీ వయోవృద్ధ నేత దానిని ఆనాడు సిగ్గుచేటన్నాడు. దాని నుంచి గుణపాఠం తీసుకున్న సంఘ్ శక్తులు చాలా పకడ్బందీ పథకంతో మోదీని వికాస పురుషుడిగా ప్రపంచం ముందుకు తెచ్చాయి. ఆయన ఇప్పుడు ప్రపంచాన్ని చుట్టి వస్తున్నాడు. ఎనిమిది నెలల పదవీ కాలంలో నెల రోజులు విదేశాలలో గడిపిన ప్రధాని బహుశా మోదీనే అయి ఉండాలి.

గుజరాత్ మారణకాండకు నిన్నటి వరకూ ఐకాన్‌గా నిల్చిన మెదీ దానిని షిఫ్ట్ డిలిట్‌తో కొట్టేసి 'మేక్ ఇన్ ఇండియా' అంటూ 'గుజరాత్ వైబ్రంట్' అంటూ సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న సామ్రాజ్యవాద దేశాలకు ఎర్ర తివాచీలు పరచి దేశానికి ఆహ్వానిస్తూ 'సబ్ కే సాథ్, సబ్ కా వికాస్' ఐకాన్‌గా మారడానికి ఉబలాట పడుతున్నాడు. ఆయన సబ్ కా వికాస్ అంటున్నది పూర్తిగా ప్రజలను మోసగించడానికే. ఎఫ్‌డీఐ (ఫస్ట్ డెవలప్‌మెంట్ ఇండియా) నుంచి పోలీస్ (పీఓఎల్ఐసీఈ) వరకూ నూతన నిర్వచనాలతో ప్రజలను మోసగిస్తున్నాడు. సుపరిపాలన అంటూ 'మినిమం గవర్నమెంట్, మాగ్జిమం గవర్నెన్స్' అంటూ ప్రజల జీవితాలను మార్కెట్‌లో వేలం వేస్తున్నాడు. కోటాను కోట్ల పేద ప్రజలు కడుపు కట్టుకొని కూడబెట్టుకునే చిన్న మొత్తాలను జన్‌ధన్ అంటూ లాగేసుకుంటూ దోపిడీదార్లకు దొడ్డిదారిన అందజేస్తున్నాడు. విదేశీ పెట్టుబడులు, ప్రైవేట్ పెట్టుబడులు దేశ ఆర్థిక అభివృద్ధికి బాటలు పరుస్తాయనీ ఢిల్లీలోని రాంలీలా మైదాన్ నుంచి న్యూయార్క్‌లోని మెడిసినల్ స్క్వేర్ వరకూ ఏ దేశమేగినా, ఎందుకాలిడినా, మా దేశం రండంటూ, కారు చౌక వనరులంటూ దేశాన్ని బహిరంగంగా అమ్మకానికి పెడుతూ దేశ యువతను మహా చెడ్డ ప్రలోభాలకు గురిచేస్తూ రసవత్తరంగా ఉపన్యసిస్తున్నాడు.

చాయ్‌వాలా మోదీ ఉపన్యాస శైలి విన్న వాళ్ళెవరికైనా నియంత హిట్లర్ గుర్తుకు వస్తాడనుకుంటాను. ఈయన గారు దేశ విదేశాల్లో

సెలవిస్తున్న 'మేక్ ఇన్ ఇండియా' కలలు నిజం కావాలంటే రెడ్ కారిడార్‌గా పిలవబడుతున్న అపార సంపదల ప్రాంతం వారికి క్లియర్ కావాలి. అది వారి హోల్డ్‌లోకి వెళ్ళాలి. ఆ తర్వాత అక్కడ అభివృద్ధి పేరుతో సర్వం విధ్వంసం జరుగుతుందన్నమాట! అక్కడ పెట్టుబడి పెట్టిన లక్షలాది డాలర్లు ఏళ్ళ తరబడిగా వినియోగంలోకి రాకుండా మూలుగుతున్నాయి. వాటిని అమలులోకి తేవడం తక్షణ ఎజెండాగా ఆయన ముందుంది. అందుకు మావోయిస్టులను అడ్డు తొలగించుకోవాలి. అందుకే మోదీ ఆగస్టు 15 నాడు ఎర్రకోట బురుజులపై నుండి వినిపించిన తొలి ఉపన్యాసంలో నక్సలైట్లను (మావోయిస్టులను) తుపాకులు వదిలి నాగళ్ళు పట్టమని పిలుపు ఇచ్చాడు. అంటే ఆయనకు 'నాగలి పట్టిన రైతు చేతికే ఈ దేశంలో రైఫిలొచ్చిందన్న విషయం తెలియదు కాబోలు! మరో వైపు ఢిల్లీ విధాన సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ అరాచకాలే చేయాలంటే అడవుల కెళ్ళి నక్సలైట్లతో కలవండంటూ ఆప్ (ఆమ్ ఆద్మీ పార్టీ)కి ఉపదేశం ఇచ్చాడు. కానీ, ఈ దేశంలో మతోన్మాదం ఎంతటి అరాచకం సృష్టిస్తుందో మోదీ జాతీయ నేర రికార్డుల బ్యూరో రిపోర్టులను చూస్తే తెలుస్తుంది.

దండకారణ్యంలో హైందవం ప్రధానంగా అధికార బలంతో దౌర్జన్యంగా విస్తరిస్తుంటే, క్రైస్తవం చాపకింద నీరులా విస్తరిస్తున్నది. గడ్‌చిరోలిలోని లోతట్టు అటవీ గ్రామాలలో ఇప్పుడు క్రైస్తవులు లేని గ్రామం ఎక్కడైనా ఉంటే అరుదేమో! చర్చీలు, మత ప్రచారకులు తరచుగా తారసపడుతుంటారు. మాడ్ కొండలలోని గ్రామాలలో కూడా 'సువార్త వాణి' వినబడుతున్నది. ప్రస్తుత క్రైస్తవ మత విస్తరణ వెనుక అనేక కారణాలున్నాయి. వాటిలో ఆపరేషన్ గ్రీన్‌హంట్ ఒకటి. క్రైస్తవం స్వీకరిస్తే, ఖాకీలు వదిలేస్తారని మత ప్రచారకులు చేసే ప్రచారం వెనుక ఆపై విప్లవ కార్యకలాపాలకు సదరు వ్యక్తులు దూరం గావడాన్ని వారు మరుగున పెడుతుంటారు. క్రైస్తవం స్వీకరిస్తే యేసు కృపతో దీర్ఘ కాల జబ్బుల నుంచి ఉపశమనం దొరుకుతుందని ప్రచారకులు చెబుతుంటారు. దానిని అమాయక ఆదివాసీలు నమ్మి బాప్టిజం పొందుతున్నారు. వారికి సువార్తవాణి వినిపిస్తూ విప్లవానికి దూరం చేయడం ప్రచారకులు కొనసాగిస్తున్నారు.

దీని నుంచి ప్రజలను బయటకు తేవడానికి జనతన సర్కార్లు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. వర్ణాశ్రమ ధర్మాల గురించి ఓపికతో ప్రజలకు బోధిస్తున్నాయి. అయితే మతం వ్యక్తిగత విషయం అని తన విధానం-కార్యక్రమంలో జనతన సర్కార్ ప్రజలకు స్పష్టంగా హామీనిచ్చింది. అదే సమయంలో ఆదివాసీలు చాతుర్వర్ణ వ్యవస్థలో భాగం కారనీ, బ్రాహ్మణీయ హిందూ మతంతో వారికి ఎటువంటి మతపరమైన సంబంధం లేదనీ విప్లవోద్యమం స్పష్టం చేస్తున్నది. హిందూ మతోన్మాదులు బహిరంగంగా కొనసాగిస్తున్న మతోన్మాద చర్యలను విప్లవోద్యమం స్పష్టం చేస్తున్నది. హిందూ మతోన్మాదులు బహిరంగంగా కొనసాగిస్తున్న మతోన్మాద చర్యలను విప్లవోద్యమం తీవ్రంగా ఖండిస్తోంది.

ముఖ్యంగా దసరా సందర్భంగా 'రావణ వధ'ను ఆదివాసీ ప్రజల మధ్య గైరాదివాసులు పాటించడాన్ని వ్యతిరేకిస్తున్నది. ఆదివాసీల చరిత్రను పరిశీలిస్తే రావణుడు వారికి దైవంతో సమానం. వారు ఆయన్ని కొలుస్తారు. తమ బిడ్డలకు ఆదివాసీలు ఆయన పేరు ప్రియంగా పెట్టుకోవడం పరిపాటి. కానీ, ఈ చరిత్రను వక్రమార్గం పట్టిస్తూ ఆదివాసీ ప్రజలపై తమ ఆధిపత్యాన్ని చాటుకుంటూ హిందువులు రావణ దహనం చేస్తున్నారు. ఆదివాసీలతో చేయిస్తున్నారు. రామాయణ కాలంలో రావణుడు రాజుగా లంకను ఏలుతున్న పరిస్థితులలో ఆర్య మునులు తమ సంస్కృతినీ, సభ్యతనూ విస్తరించ పూనుకున్నప్పుడు రావణుడు వ్యతిరేకించి ఆర్యులను తన రాజ్యం నుండి బయటికి గెంటివేసాడు. దీనితో ఆగ్రహోదగ్రులైన మునులు అయోధ్య రాజు దశరథుని వద్దకు వెళ్ళి వేడుకోగా అతడు రామ, లక్ష్మణులను రావణుణ్ణి ఓడించే 'పవిత్ర' లక్ష్యంతో పంపాడు. వారు ముందుగా తాటకినీ, ఆ తర్వాత శూర్పణఖ అవయవాలను ఉత్తరించడం, పిదప కపట ఎత్తుగడలతో వాలినీ, శంభూకుణ్ణి చంపి చివరకు విభీషణుడిని లోబరుచుకొని రావణుణ్ణి సంహరించడం, రామ, రావణ యుద్ధంలో ముండాల్ (వానరులు) మారీచు (మృగ), నిషాద్ (కుక్క), సంథాల్ (సోన్ శునకం), శంవర్ (వరాహం) భీల్ (మొసలి) జటాయి (గద్ద) మొదలైన గోత్రాల వారిని 40 వేల మందిని సంహరించినట్టు ఆదివాసీలు చెప్పుకుంటారు. (చూ. రామ్‌చరిత 3.2.15) ఆదివాసీ ప్రజలలో విద్యావంతులు, మేధావుల సంఖ్య పెరుగుతూ ఉండడంతో చాలా మందిలో తమది ఆర్య సంస్కృతి కాదనీ, తాము ద్రావిడులమనీ, ఆర్యులు అన్ని విధాల తమను తొలి నుండి వెంటాడుతున్నారనీ, దాడులకు దిగుతున్నారనీ, కొల్లగొడుతున్నారనీ, హతమార్చుతున్నారనీ చారిత్రక ఆధారాలతో బలమైన అభిప్రాయాలు ఏర్పడుతున్నాయి.

ఆదివాసీ ప్రజలు హిందువులు కారనీ, వారి దేవతలు వారికి ఉన్నాయనీ, వారి రీతి, రివాజులు, సంప్రదాయాలు వారికున్నాయనీ చరిత్రకారులు, ప్రజాస్వామికవాదులు, ఆదివాసీ మేధావులు, విప్లవకారులు స్పష్టంగానే చెబుతున్నారు. నంగ భీమాల్, ఏముల్ (తాబేలు) గోత్రం వారి దేవుడు. ఓయం వాళ్ళ దేవుడు ముద్దరాజు, గడి, కామాలు! కారం గోత్రం వారి దేవుడు బొమ్మల్, ఉంగాల్, ఇలా ప్రతి గోత్రానికి ఒక దేవుడున్నాడు. ఈ దేవుళ్ళంతా మగాళ్ళే కావడం ఆదివాసీ సమాజంలో పితృస్వామ్య భావజాల ఆధిక్యతను వ్యక్తం చేస్తున్నది. చరిత్రలో కాస్త వెనక్కి వెళితే ఆదివాసీల దేవతలు తల్లూర్ ముత్తె, మారై శేదోలనే చెప్పుకుంటారు. ఇప్పటికే ఈ స్త్రీ దేవతలను ఆరాధించడం చాలా చోట్ల ఉనికిలో ఉంది. ప్రతి కుదురు (గోత్రం) కు ఒక పెద్ద దేవత పెర్స పేన్ ఉంటుంది. కోయలో పేన్ (దేవత) స్త్రీ వాచకంగానే ఉంది. వాస్తవంగా ఒక 6,7 దశాబ్దాలకు పూర్వం ఆదివాసీలకు రాముడు అంటే ఎవరో కూడా తెలియదని దండకారణ్యంలోని ముసలాళ్ళు చెబుతారు.

రాముడిని పూజించే పద్ధతి కూడా వారికి తెలియకపోవడంతో వెంకటాపురంలో (ఖమ్మం జిల్లా) హిందువులు తమకు శిక్షణ ఇచ్చారనీ, కొబ్బరికాయలు. అగరబత్తీలు మొదటగా ఉచితంగా ఇచ్చారనీ, పూజా విధానం నేర్పించారనీ తర్వాత వాటి అమ్మకం మొదలైందనీ ఆదివాసీలు తమ గత అనుభవాన్ని వివరిస్తారు. నిజంగా నేటి తరానికి ఈ గత అనుభవాలే తెలియకుండా పోతున్నాయి. వాజేడ్, వెంకటాపూర్ ప్రాంతాలలో ఇప్పుడు శ్రీరామ నవమి పెద్దెత్తున జరుగుతుంది. ఇలాంటి అనుభవమే మరోటి చూద్దాం. 1990 ల చివర్లో ఉత్తర బస్తర్‌లోని లంజోడా గ్రామంలో 'వనవాసీ కళ్యాణ్ ఆశ్రమం' ఏర్పడింది. వాళ్ళు శ్రీ కృష్ణాష్టమి పాటించడాన్ని ఉట్లు కొట్టడం, రూ.500 ఉట్లు కొట్టిన వారికి బహుమానం ఇవ్వడంతో ఉనికిలోకి తెచ్చారు. అంతకు ముందు వాళ్ళకు అష్టమీ లేదు, కృష్ణుడూ తెలియదు. తాజా విషయం చెప్పుకోవాలంటే సమ్మక్కను (వరంగల్

(మిగతాది 50వ పేజీలో...)

చారుమజుం'దారి'

- కోటయ్య పిన్నిబోయిన

కామ్రేడ్ చార్‌మజుందార్ 1965-67 మధ్యకాలంలో ఆనాటి కమ్యూనిస్టు పార్టీల, ప్రధానంగా సిపిఎం ఆర్థిక, రాజకీయ రివిజనిస్టు పోకడల గురించి; దేశంలో విప్లవ అనుకూల పరిస్థితులు, విప్లవపార్టీ ఆవశ్యకత గురించి ఈ రెండేళ్ళ కాలంలో ఎనిమిది డాక్యుమెంట్లు వెలువరించారు. ఈ డాక్యుమెంట్లనే తెరాయి దస్తావేజులు అని కూడా అంటారు.

ప్రపంచ కమ్యూనిస్టు పార్టీల మధ్య ప్రధానంగా రష్యా, చైనా పార్టీల మధ్య 1950-60 సంవత్సరాలలో ఒక దశాబ్దకాలం సాగిన "మహత్తర చర్చ" (గ్రేట్ డిబేట్) ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలపైన ఒక బలమైన ముద్ర వేసింది. ఆ గ్రేట్ డిబేట్‌లో 1956లో కృశ్చేవ్ ప్రతిపాదించిన వర్గ సామరస్య సిద్ధాంతాన్ని, రివిజనిస్టు వైఖరిని చైనా కమ్యూనిస్టు పార్టీ అధినేత కామ్రేడ్ మావో సేటుంగ్ నిర్ద్వంద్వంగా ఖండించారు. వర్గ సామరస్య సిద్ధాంతానికి బదులు కారల్ మార్క్స్ ప్రతిపాదించి, కామ్రేడ్ లెనిన్‌చే ఆచరణలో రుజువయిన వర్గపోరాట సిద్ధాంతాన్ని ప్రతిపాదించి రివిజనిస్టు వైఖరిని ఖండించాడు. ఈ ప్రభావం భారత కమ్యూనిస్టు పార్టీపై పడి 1964లో సిపిఐ, సిపిఎంగా రెండు పార్టీలుగా చీలిపోయింది. సి.పి.ఐ. రష్యా కమ్యూనిస్టు పార్టీని పూర్తిగా సమర్థించగా, సిపిఎం ప్రథమంలో మధ్యస్థంగా ఉండినా తర్వాత చైనా కమ్యూనిస్టు పార్టీతో పూర్తిగా విభేదించింది.

ఆనాటికి కమ్యూనిస్టు పార్టీలో విప్లవకర శక్తులుగా ఉన్న వర్గం సిపిఎంలో కొచ్చారు. భారతదేశంలో ప్రజా ఉద్యమాలు ఉవ్వెత్తున లేస్తున్న కాలం అది. భూమి లేని రైతులు భూమి కోసం తిరుగుబాటు బాటపట్టారు. విద్యార్థులు, యువకుల్లో బతుకుదెరువు కోసం అలజడి ప్రారంభమయింది. కార్మికుల సమ్మెలను, హర్తాళ్ళను ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్నది. భారతదేశంలో విప్లవాలకు అనుకూల పరిస్థితులు కన్పిస్తున్నాయి. కానీ ఉద్యమాలకు పోరాటాలకు నాయకత్వం వహించాల్సిన సిపిఎం పాలక పార్టీలతో పొత్తులు కుదుర్చుకొని బెంగాల్, త్రిపుర, కేరళలలో అధికారం కోసం వెంపర్లాడుతున్నది. పాలకపార్టీలతో కలసి ప్రజా పోరాటాలను అణచివేస్తున్నది. ఈ నేపథ్యంలో బెంగాల్ రాష్ట్రంలోని డార్జిలింగ్ జిల్లా సిలిగురి సబ్ డివిజన్ సిపిఎం పార్టీ కార్యదర్శిగా ఉన్న కామ్రేడ్ చారుమజుందార్ ఈ ఎనిమిది డాక్యుమెంట్లు ప్రవేశపెట్టారు.

ప్రస్తుత భారత ప్రభుత్వం తన ఆంతరంగిక సంక్షోభాన్ని పరిష్కరించుకోడానికి ఆంగ్లో అమెరికన్, రష్యన్ సోషల్ సామ్రాజ్యవాదుల పెట్టుబడులను దిగుమతి చేసుకోవడం ద్వారా తన సంక్షోభం నుండి బయటపడడానికి ప్రయత్నిస్తున్నదనీ, ప్రభుత్వం సామ్రాజ్యవాదంపై ఎంత ఎక్కువగా ఆధారపడుతుందో తన ఆంతరంగిక సంక్షోభాన్ని పరిష్కరించడంలో అది అంత ఎక్కువగా విఫలమవుతుందనీ, అందుచేత కమ్యూనిస్టు పార్టీ రానున్న యుగంలో ప్రజల విప్లవ పోరాటాలకు నాయకత్వం వహించే బాధ్యత స్వీకరించాలని అంటాడు కామ్రేడ్ చారుమజుందార్.

ఇంకా, ప్రస్తుత సిపిఎం నాయకత్వం భారత దేశంలో ప్రజాస్వామిక విప్లవ బాధ్యతను చేపట్టడానికి నిరాకరిస్తోంది. వారు మాటల్లో విప్లవకారులుగానూ, చేతల్లో బూర్జువా వర్గానికి తోకగానూ ఉండే ఆధునిక రివిజనిజం జిత్తులమారి ఎత్తుగడలకు పాల్పడుతున్నారు. అందుచేత ఆ పార్టీ 'నిర్మాణ క్రమశిక్షణ, నిబంధనావళి" చట్రాలను ధ్వంసం చేయడం ద్వారా మాత్రమే విప్లవ పార్టీ పుట్టుక రాగలదు అంటాడు.

కామ్రేడ్ చారుమజుందార్ ప్రస్థుత కాలాన్ని వివరిస్తూ మన శకం ప్రస్తుత లక్షణం ఏమిటంటే ప్రభుత్వం ప్రతి ఉద్యమంపైనా హింసాయుతమైన దాడులు కొనసాగించడం ద్వారా ఉద్యమాలను అణచివేయాలని చూస్తున్నది. అందుచే ప్రజలకు సాయుధ ప్రతిఘటనా ఉద్యమం అత్యంత ముఖ్యమైన అవసరంగా తయారైంది. ప్రజా ఉద్యమాల ప్రయోజనాల కోసం కార్మికవర్గానికి, రైతాంగానికి పోరాడుతున్న ప్రతి జాతికి "ఆయుధాలు చేపట్టండి, ఘర్షణకు సాయుధ యూనిట్లను నిర్మించండి, ప్రతి సాయుధ యూనిట్‌నీ రాజకీయంగా విద్యావంతం చేయండి" అంటూ పిలుపిచ్చాడు.

కార్మిక వర్గ నాయకత్వంలో వ్యవసాయక విప్లవం ప్రాతిపదికపై ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కష్టజీవులంతా సాయుధ పోరాటానికి సన్నద్ధమై, రైతాంగ తిరుగుబాట్ల ద్వారా దాని అత్యంత బలహీనమైన ప్రాంతాల్లో చావుదెబ్బ కొట్టడం ద్వారా విముక్త రైతాంగ ప్రాంతాలను నిర్మించాలని పిలుపునిచ్చాడు. రైతుల్లో ప్రధానంగా నాలుగు వర్గాలున్నాయని అవి (1) ధనిక, (2) మధ్య తరగతి, (3) పేద, (4) భూమి లేని రైతాంగం. మార్క్సిస్టులు ఎప్పుడూ పేద, భూమిలేని రైతుల నాయకత్వాన్ని నెలకొల్పడానికి ప్రయత్నించాలి. ఎందుచేతనంటే వారు మాత్రమే రైతాంగ వర్గాలలో అత్యంత విప్లవకరమైన శక్తి అంటాడు చారుమజుందార్.

కామ్రేడ్ చారుమజుందార్ విప్లవ పార్టీకి ఉండవలసిన మూడు ప్రధాన విషయాలు స్పష్టం చేసాడు (1) కార్మిక వర్గ నాయకత్వం కింద కార్మికుల, రైతుల ఐక్యత (2) సాయుధ పోరాటాన్ని చైతన్యవంతంగా సృష్టించడం, పోరాట రాజకీయాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చెయ్యడం (3) కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన్ని దృఢంగా ప్రతిష్టించడం.

వ్యవసాయ విప్లవం ఈనాటి తక్షణ కర్తవ్యం. రాజ్యాధికారాన్ని ధ్వంసం చెయ్యకుండా వ్యవసాయ విప్లవాన్ని ముందుకు తీసికెళ్లలేం. అందుకొరకై రాజకీయ చైతన్యంతో ఉత్తేజితమైన, ఘర్షణల ద్వారా గట్టిపడిన విప్లవ ప్రజాసేన్యాన్ని అభివృద్ధి కాదు. మరణాన్ని ధైర్యంగా ఎదుర్కొనేవాళ్లే నిజమైన విప్లవకారులంటాడు చారుమజుందార్.

పుస్తక సమీక్ష

మరచి పోలేని నవల - మరణానంతర జీవితం

- పలమనేరు బాలాజీ

నిరంతరం మారుతున్న సమాజంలో పూర్తి ఆపాయకరమైన పరిస్థితులలో మరణించనీయకుండా మనిషిని బతికించుకోవటానికి ఏం చెయ్యాలి?

నిరంతం మారుతున్న సామాజిక విలువలు, అభిప్రాయాలు, ఆదర్శాలు, సత్యాలు, నీతి నిజాయితీలు, వృత్తి ధర్మాలు, మానవీయ విలువలు మానవ సంబంధాలు కలిగించే సంఘర్షణల్లోంచి బతికి బయటపడాలంటే మనిషికి ఏం కావాలి?

సిరియాపై రసాయనిక దాడులు, సిరియాలో అంతర్గత అలజడులకు సైనిక చర్యలకు అగ్ర రాజ్యాలు చేస్తున్న కుటిల ప్రయత్నాలు ఒక వైపు, చిన్న, బలహీన రాజ్యాలను, దేశాలను బల ప్రయోగంతో, కుట్రతో అనుభవించాలని, ఆక్రమించుకోవాలని, మరింత బలహీనపరచాలని తమ చెప్పు చేతల్లో ఉంచుకోవాలని అభివృద్ధి చెందిన పెద్ద రాజ్యాలు, గొప్ప దేశాలు నిరంతరం చేస్తున్న కుటిల ప్రయత్నాలు మరొక వైపు.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ, నైతిక వ్యవస్థ కుప్ప కూలి మనం పోగొట్టుకున్న రూపాయి ఏడ్పు మరొకవైపు. యాసిడ్ దాడులు సామూహిక ఆత్యాచారాలు హత్యలు, ఆత్మహత్యలు, కిడ్నాప్స్, అమ్మాయిల అక్రమ రవాణా, వేశ్యాగృహాల పాలవుతున్న చిన్నారులు, రైతు సహా ఆత్మహత్యల పాలవుతున్న అనేక వృత్తుల వాళ్ళు, కార్మికులు, చలి గాలులు, వడదెబ్బలు, జలుబు, జ్వరాలు, వైరస్లతో మరణిస్తున్న సామాన్యులు, అదృశ్యమవుతున్న భాషలు, జాతులు, ఉద్యమకారులు, ప్రయాణాల్లో ఆకస్మికంగా ప్రమాదాల కారణంగా మరణిస్తున్న వాళ్ళు, శిశు హత్యలు, ఎన్నో రకాల మరణాలు - సహజ, అసహజ, అదృశ్య మరణాలు.

మరణం అంతిమ సత్యం కాదు. అసలు సత్యం కూడా కాదు. మరణం ఒక సత్యం అంతే. ఎవరూ కాదనలేని ఒక సత్యం. బతకటం ఒక అబద్ధం. అందరూ ఒప్పుకోలేని ఒక సత్యం.

బతకటానికి మనిషికేం కావాలి? ఖలేజా కావాలి. గుండె ధైర్యం కావాలి.

మనిషి బతకాలంటే చచ్చేంత ధైర్యం కావాలి.

మనిషిని బతికించే పుస్తకాలు మరణించిన మనిషిని సజీవంగా ఉంచగలిగే పుస్తకాలు కొన్నుంటాయి. కొన్నే ఉంటాయి. మనిషి గురించి మరణం గురించి, జీవితం గురించే కాదు మరణానంతర జీవితం గురించి, కళ్ళకు కనబడి చెవులకు వినబడే వాస్తవాలనే కాక, కనబడని వినబడని సత్యాల్ని కూడా తెలియచేసిన నవల మరణానంతర జీవితం. రచయిత నందిగం కృష్ణారావు.

"నీకంత ప్రేమ, నీకీపాటి కోపం, నీకీ మాత్రం ద్వేషం, నీకీ రకమైన వెక్కిరింతా, నీకింత దయా, దాక్షిణ్యం లేనప్పుడు ఏ మాత్రం ధర్మ పక్షపాతంగానీ లేకుండా, ఎందుకురా వెధవా సాహిత్యం జోలికి పోవడం అని ఎవర్నైనా అడగాలనిపిస్తుంది" అంటారు కె.ఎన్.వై. పతంజలి.

పతంజలి చెప్పిన అలాంటి జీవ లక్షణాలున్న రచయితలు తెలుగులో కొందరున్నారు. కొందరే ఉన్నారు. అలాంటి అరుదైన రచయితల్లో నందిగం కృష్ణారావు ఒకరు.

నాలుగు కాళ్ళ న్యాయం (కథా సంపుటి), చీకట్లో నల్ల పిల్లి (నవల) ద్వారా చాలా మంది విమర్శకుల ప్రశంసలు పొందిన రచయిత నందిగం కృష్ణారావు గారి మరొక విలక్షణమైన నవల మరణానంతర జీవితం

వృత్తిపరమైన రహస్యాలు, తంత్రాలు ఆయా వృత్తుల వారికి తప్ప అన్యులకు అంతగా తెలిసే అవకాశం లేదు. ఇతరులు ఎంత తెలిసిందనుకున్నా, వారికి తెలియనివి మూలమైనవి, కీలకమైనవి ఏవో కొన్ని మిగిలే ఉంటాయి. దాన్నే వృత్తి రహస్యం అంటారేమో. అలాంటి వృత్తి రహస్యాలు తెలిసిన రచయిత చేసే రచనలు చాలా కీలకమైనవి.

నిత్యం అనేకమంది సంక్లిష్టమైన వ్యక్తుల్ని, దుర్మార్గమైన లోకం పోకడని, చట్టంలోని లోసుగుల్ని చాలా దగ్గరగా గమనించే న్యాయవాద వృత్తిలో ఉండటం వల్ల వీరి రచనలు ఉత్కంఠ భరితంగా ఉంటాయి. ఉత్కంఠభరితమైన రచనల్ని చదవటం ఏతరం పాఠకులకైనా ఆసక్తికరంగానే ఉంటుంది.

కథలు, నాటకాల్లోని ఉత్కంఠభరితమైన సంఘటనలు, సన్నివేశాలు వేరు. నవలల్లోని సన్నివేశాలు వేరు. నవలల్లోని జీవితం, సంఘటనలు, సన్నివేశాలు, కథాంశం, పాత్రల ప్రవర్తన, ఆలోచనలు, పరిణామశీలత ఆద్యంతం అబ్బురం అనిపిస్తాయి. పాఠకులకు గుర్తొస్తూ ఉంటాయి.

వర్గపోరాటం మాత్రమే కమ్యూనిస్టులకు నిజమైన పాఠశాల. మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం వెలుగులో వర్గపోరాటాన్ని ముందుకు తీసుకుపోవాలని కామ్రేడ్ చారుమజుందార్ తన ఎనిమిది డాక్యుమెంట్లలో భారత ప్రజలకు పిలుపునిచ్చాడు.

ఈ డాక్యుమెంట్లు విరజిమ్మిన విప్లవ వెలుగులు రివిజనిస్టు కమ్యూనిస్టు పార్టీల నడుం ఇరగ్గొట్టి నక్సల్బరీ, శ్రీకాకుళం, భీర్భూం, ఉత్తర తెలంగాణ, దండకారణ్యమంతా ప్రతిఫలించాయి. నేడు దండకారణ్యంలో పొడుస్తున్న పొద్దులా జనతన సర్కార్, సోషలిస్టు మానవిగా ఆదివాసీ మహిళ, నడుస్తున్న చరిత్రలా అడవి - ఈ నూతన వెల్లువకి ఆద్యుడు కామ్రేడ్ చారుమజుందార్.

రివిజనిస్టు వ్యతిరేక చారిత్రక ఎనిమిది డాక్యుమెంట్లు (1965-67) చారుమజుందార్, వెల కేవలం రూ 50/-

సహజమైన పాత్ర చిత్రణ, పాత్రోచితమైన వర్ణనలు, భాష, భావోద్వేగాలు, సంభాషణలు, సంఘర్షణలు, వివేచనా కలిగిన కథనం, అనువైన కంఠస్వరం, వస్తు శిల్పాల ఐక్యత, చదివించే గుణం, కథనంలో వేగం, కలిగిన నవలలు పాఠకులకు ఆసక్తిని, ఇష్టాన్ని, ఉత్కంఠను కలిగిస్తాయి. ఆద్యంతం పాఠకులకు ఉత్కంఠను ఆసక్తిని కలిగించే రచనలు ఏ భాషలో అయినా అరుదుగానే ఉంటాయి. తెలుగులో అట్లాంటి అరుదైన నవలల్లో మరణానంతర జీవితం ఒకటి.

ఈ నవలలో ఆదర్శాలు, నటనలు, మొగమాటాలు లేవు. నీతి సూత్రాలు, పరిశోధనాత్మక కథనాలు, ఊహా చిత్రాలు, శిల్ప, భాషా ప్రయోగాలు లాంటివి లేవు. మనిషిని, మనిషి లోపలి మనుషుల్ని యథాతథంగా చిత్రించటం వల్ల, జనాభాలో అత్యధిక వర్గానికి ప్రతినిధులైన సామాన్యులు మరణాలకో, జీవితాలకో సంబంధించింది కావటం వల్ల ఈ నవలా కథనం చాలా ఆసక్తికరంగా సాగుతుంది. ఒకసారి మొదలు పెట్టాక పఠనం ఎక్కడా ఆగదు.

మనిషి లోపలి రచయిత కాకుండా, రచయిత లోపలి మనిషి రాయటం వల్లే ఈ నవల ప్రత్యేకంగా కనబడుతుందేమో.

జీవితకాలంలో మనిషి ప్రతిక్షణం జీవించనట్లే ఒక్కసారే మరణించడు కొద్ది కొద్దిగా మరణిస్తూ ఉంటాడు. మనిషి జీవితం ప్రదర్శితం కాబట్టి తెలుస్తుంది. మనిషి లోపల మనిషి మరణం పైకి తెలియంది కాదు కాబట్టి అదృశ్యంగానే ఉంటుంది. మనిషి అంతర్లోకాల్ని చూడాలంటే, అదృశ్య సత్యాల్ని చూడాలంటే సత్య దృష్టి కావాల్సిందే. అట్లాంటి సత్య దృష్టి కలిగి, మనిషి పట్ల అవాజ్యమైన ప్రేమ, నమ్మకం, భయం, బాధ్యత, జాగ్రత్త కలిగిన రచయితలు చేసేరచనలు విలక్షణంగా ఉంటాయి.

తెలుగు నవలా సాహిత్యంలో విలక్షణమైన రచయితల వరుసలో నిలబడతగిన వారిలో నందిగం కృష్ణారావు ఒకరని ఈ నవల నిరూపిస్తుంది.

అభిప్రాయాలు, ఆలోచనలు, ఆదర్శాలు- ఆచరణకు, నీతి - అవినీతికి మధ్య అవిశ్రాంతంగా కొనసాగే ఒక సంఘర్షణాత్మక పరిస్థితిని, మనిషి పరిణామశీలతలోని సాంద్రతని, మనిషి బహిర్గత, అంతర్గత స్వభావాన్ని, మరణించే మనిషితనాన్ని ఈ నవలలో చిత్రించిన తీరు బాఉంది.

మనిషి సమాజం ప్రమాదకరంగా తయారయ్యే కొద్దీ ఇరు వర్గాల మధ్య రాజీ పడటం కొనసాగుతూనే ఉండటం మూలంగా సమాజం మనిషి ఒకర్నొకరు ప్రశ్నించటం కానీ, సంస్కరించాలనుకోవటం కానీ జరగదు. ఈ క్రమంలో కనబడే ఘర్షణ, కనబడని సంఘర్షణలు, రాజీ పడటాలు - వాస్తవ జీవితాన్ని జీవిత వాస్తవాల్ని తెలియ చేస్తాయి. అట్లాంటి వాస్తవాల కూర్పు ఈ నవల. బహూశా కథావస్తువు, కథాంశం, కఠినమైన జీవిత వాస్తవికత రచయితను సంపూర్ణంగా ఆవహిస్తే తప్ప ఇంత సమగ్రంగా నవలా రచన సాగటం అసాధ్యం అనిపిస్తుంది. అనుభవాలు, కళ్ళెదుటి జీవన భీభత్స దృశ్యాలు కదిలించి రాయకుండా వుండనీయకుండా రాయించి ఉంటాయేమో.

రావి శాస్త్రి, కే. ఎన్. వై. పతంజలి నవలలు, విభూతి భూషన్ బెనర్జీ బెంగాలీ నవలలు పాఠకులకు గొప్ప ఉత్కంఠను కలిగిస్తాయి. చాలా సులభంగా హంగామా లేకుండా పాఠకులకు కఠినమైన జీవిత సత్యాల్ని తెలియచేస్తాయి. అడుగడుగునా మనిషి, రాజ్యం స్వభావం తెలిసిపోతూ ఉంటుంది. అంతకు ముందు చాలా సాధారణం సహజం అనిపించిన విషయాల్లోని అసాధారణత, అసహజత్వం, నీతి, సత్యం అప్పుడు కానీ పాఠకులకు అర్థం కాదు. అటాంటి టెక్నిక్ ఏదో ఈ నవలా రచనలో అదృశ్యంగా ఉందనిపిస్తుంది.

అత్యంత బలహీనమైన పాలనావ్యవస్థ, అంతులేని అవినీతితో నడిచే పాలనా యంత్రాంగాలు, మనిషి జీవితం, మరణం తాకట్టులోకి వెళ్ళడం, డబ్బు, కులం ప్రభావితం చేసే మానవ సంబంధాల్ని ఈ నవలలోచూడగలుగుతాం. ముఖ్యంగా మనుషుల ప్రవర్తన వెనుక గల కారణాలు, రాజీ పడటాలు, భవిష్యత్ ఆశలు, భయాలు, నమ్మకాలు, చేతకానితనాలు, జీవిత అనుభవాల్ని ప్రతి పాత్రకు అన్వయించిన తీరు అపూర్వం అనిపిస్తుంది.

కఠినమైన జీవన భీభత్స దృశ్య కావ్యంలో ప్రేమ, కరుణ, సత్యవంతమైన జీవిత విధానం పట్ల నమ్మకం కలిగిన వ్యక్తిత్వం ఉన్న మనిషిగా స్వప్న అడుగడుగునా చూపించే ధైర్య, సాహసాలు, తెలివి తేటలు అబ్బురం అనిపిస్తాయి - మనిషితనం పట్ల నమ్మకాన్ని నమ్మకంగా నిలబెడతాయి. నిస్సందేహంగా జీవితం కఠినమైనదే. అయితే జీవితంలో విషాదం ఒక్కటే శాశ్వతం కాదని, మనిషితో బాటు మనిషితనాన్ని, వ్యక్తిత్వాన్ని కోల్పోవడం తప్పనిసరి కాదని మనిషి ప్రేమ నిజమైనదైతే, మరణం తర్వాత కూడా ఆ మనిషి తన కుటుంబాన్ని ప్రేమిస్తునే ఉంటాడనే సాధారణ, సగటు మహిళ నమ్మకాన్ని 'స్వప్న' ప్రదర్శిస్తుంది.

ఒక మనిషి ఆకస్మికంగా లేకుండా పోతే ఆ కుటుంబంలో ఏర్పడే సంక్షోభం ఎంత తీవ్రంగా ఉంటుందో అది స్వయంగా అనుభవిస్తే తప్ప అర్థం కాని విషయం. చిన్న పిల్లల దృష్టి కోణం లోంచి మరణాన్ని, మరణానంతర కర్మ క్రియల్ని, బాధ్యతల్ని నిర్వహించటాన్ని చిత్రించటం.

హఠాత్తుగా ఇంట్లో మారిపోయిన వాతావరణాన్ని అంతే ఆకస్మికంగా మారిపోయిన మనుషుల ప్రవర్తనను పిల్లలు వారి పరిధిలో అర్థం చేసుకునే ప్రయత్నం గురించిన సన్నివేశాల చిత్రణ - ఇవన్నీ జీవిత వాస్తవాలు తప్ప మరొకటి కావు. కనిపించే వాస్తవం వెనుక గల కనిపించని వాస్తవాన్ని ఈ రచయిత నేర్పుగా కనపరుస్తాడు. వ్యక్తి, రాజ్యం, సమాజం అర్థమైతే తప్ప ఇట్లాంటి రచనలు చేయడం సాధ్యం కాని విషయం. ఇట్లాంటి రచనలు చేయడానికి చాలా ధైర్యం కావాల్సి ఉంటుంది. సమాజంలో మార్పు కోరే మనుషులు తప్పకుండా చదివి, చదివించాల్సిన మంచి పుస్తకాల్లో ఈ నవల కూడా ఒకటి. మరణానికి ముందూ తర్వాత మనిషి జీవితం ఏమిటి అనే విలువైన ప్రశ్నకు ఒక అర్థవంతమైన జవాబు ఈ నవల మనం మనుషులం కాబట్టి తప్పకుండా ఈ నవలను చదవాల్సి ఉంటుంది. చాలా విలువైన, కఠినమైన జీవిత సత్యాలను అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

జీవితానికి ఎన్నో ప్రారంభోత్సవాలుంటాయి.

"మరణానంతర జీవితం" చదివిన తర్వాత చాలా మంది మళ్ళీ మొదలవుతారని కొత్త జీవితోత్సాహాన్ని, లోతైన ఆలోచనలతో అవగాహనతో మొదలుపెడుతారని ఒక నమ్మకాన్ని, ఒక ఆశను, ఈ రచయిత కలిగిస్తున్నాడు.

ఈ నవల సురేందర్ రెడ్డి అనే యువకుడి మరణంతో

మొదలవుతుంది. స్వప్న అతడు ప్రేమించి పెళ్ళాడిన యువతి. ఒక కొడుకు, ఒక కూతురు. ప్రేమ వివాహం కారణంగా పెద్దల ప్రేమ, ఆదరణలకు దూరమైనా అతడు తన భార్యాబిడ్డల్ని ఉన్నంతలో అపురూపంగా చూసుకునే వ్యక్తిత్వం కలిగినవాడు. వాచ్‌మెన్ గా పనిచేస్తూనే, మధ్యలో ఆర్థిక కారణాల వల్ల ఆగిపోయిన చదువును పూర్తి చేస్తాడు. అతడు ఒక రోడ్డు ప్రమాదంలోఆకస్మికంగా మరణించిన తర్వాత ఎన్నో నాటకీయ పరిణామాలు అతడి శవం సాక్షిగా జరిగిపోతాయి. ఇరు పక్షాల పెద్దలు, తాకట్టు పుష్పావతి, ఇద్దరు లాయర్లు, వారి గుమాస్తాలు, మరణానంతర పూజా కార్యక్రమాల్ని నిర్వహించే బ్రాహ్మణులు, వారి శిష్యగణం, చనిపోయిన వాడ్ని ఆస్పత్రిలో ఉంచుకొని చికిత్స అందించినట్లు నటించి, మనిషి ముఖ్య శరీరావయవాల్ని కొట్టేసిన ఆధునిక ఆస్పత్రి యాజమాన్యం పోస్ట్‌మార్టంలోలాలూచి పడే డాక్టరు, అంత్యక్రియలు, ఆత్మ శాంతి పేరిట జరిగేతంతు, నష్టపరిహారం, కోసం అటూ ఇటూ బంధువులు, కుటుంబ సభ్యుల ఆరాటాలు, పోరాటాలు, న్యాయవాదుల లీలలు, న్యాయ పరిష్కారాలు, పరిస్థితులు నేర్పించే చావు తెలివి తేటలు - మనుషుల్లోపలి మనుషుల గురించిన నవల ఇది.

మనిషి మరణం కలుగచేసిన విషాదాన్ని మించిన విషాదం మనుషుల ప్రవర్తన వల్ల కలుగుతుంది. మరణాన్ని మించిన విషాదాన్ని, శవంతో రకరకాల వృత్తుల వాళ్ళు అడుగడుగునా చేసే వ్యాపారరాజకీయాల్ని చూసాక, బహూశా చావంటే భయంపోయి బతుకంటే భయం కలుగుతుందేమో.

ఆలోచనలు, ఆశలు, కోర్కెలు, అభిప్రాయాలు, సంస్కారం, మానవ సంబంధాలు, బాధ్యతలు, హక్కులు మనిషి మరణానికి ముందూ, తర్వాత ఎట్లా ఉంటాయో అత్యంత వాస్తవికంగా, నిర్మొహమాటంగా, నిష్పక్షపాతంగా చిత్రించిన ఈ నవల అడుగడుగునా పాఠకుడ్ని కదిలిస్తుంది. ఇదేనా జీవితం? ఇదీ జీవితం అని తెలుసుకునేలా చేస్తుంది. మనుషుల అవకాశవాదం, లంచగొండితనం, స్వార్ధం, కుట్రలు, భయాల్ని కూడా వ్యాపారాలకు మూల పెట్టుబడి పెట్టగలిగిన విద్యావంతుల ప్రవర్తన భయాన్ని, ఆశ్చర్యాన్ని, అసహ్యాన్ని కలిగిస్తుంది.

మనుషులు నిజ స్వరూపాలు తెల్సినా వారిని ఎందుకు అంగీకరించాల్సి వస్తుందో మనుషుల బలహీనతలు వ్యామోహాలు, ప్రలోభాలను, నటనలను శాస్త్రవేత్తలా అర్ధం చేసుకుని ప్రతి సన్నివేశమూ సహజంగా కనబడేల్లా, మళ్ళీ మళ్ళీ చదివించే భాషతో, ఉత్కంఠ కలిగించే కథన చాతుర్యంతో మంచి శిల్ప సౌందర్యంతో రాయబడిన మరణానంతర జీవితం నవల చదవటం ఒక గొప్ప అనుభవం.

మనిషి అర్ద్రతను కోల్పోవటం ఎంత విషాదమో ఈనవల హెచ్చరిస్తుంది. తాగి యాక్సిడెంట్ చేసిన ధనవంతుడ్ని పోలీసులు ఇంతగా కాపాడుతారా? శవంతో వ్యాపారం జరుగుతుందా ? అని సాధారణ పాఠకులు ఆశ్చర్యపోతారు. కానీ శవంతో ఇన్ని రకాల వ్యాపారాలు జరుగుతున్న వాస్తవాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించటంలో రచయిత ఎంత శ్రమ పడ్డాడో కానీ... పాఠకులకు ప్రతి పేజీలో దిగ్భ్రాంతి కలుగుతూనే ఉంటుంది.

మనుషుల ఆలోచనల మేరకే వాళ్ళ వ్యక్తిగత సామాజిక జీవితాలు ఏర్పడుతూ మారుతూ నిరంతరం సంఘర్షిస్తూనో రాజీ పడుతూనో సంఘర్షిస్తున్నట్లు కనబడుతూనో ఉంటాయి. కొన్ని సార్లు కొందరు మనుషులు వాళ్ళ ఆలోచనలు, ఆదర్శాలు, అభిప్రాయాలు, నమ్మకాలు, సిద్ధాంతాలు గెలిచినట్లే అనిపిస్తాయి కనిపిస్తాయి కూడా. మరికొన్ని సార్లు ఓడి పోయినట్లే ఉంటాయి. గెలుపోటముల మాట ఎట్లా ఉన్నా వాటి వెనుక గల వాస్తవం చూడటానికి దృష్టి చాలదు, సత్య దృష్టి కావాల్సిందే.

ఆలోచనలకు, అభిప్రాయాలకు, ఆదర్శాలకు, ఆచరణకు, నీతికి, అవినీతికి మధ్య అవిశ్రాంతంగా కొనసాగే ఒక సంఘర్షణాత్మక పరిస్థితిని, మనిషి పరిణామ శీలతలోని సాంద్రతని మనిషి బహిర్గత, అంతర్గత స్వభావాన్ని మరణించే మనిషితనం లోని అనివార్యతని సత్సదృష్టితో చిత్రించిన ఈ నవల చదవటం పాఠకులకు ఒక అపూర్వ అనుభవం. సమాజానికి మనిషికి మధ్య ఒక రహస్య ఒప్పందం అనాదిగా కొనసాగుతూనే ఉంది. జీవితం ఎందుకింత దారుణంగా ఉందో సమాజానికి తెలుసు. సమాజం ఎందుకింత ప్రమాదకరంగా ఉందో మనిషికీ తెలుసు. అయితే పరస్పర కారకాలు ప్రేరకాలు అయిన సమాజం, మనిషి ఒకరినొకర్ని, ప్రశ్నించటం సంస్కరించే ప్రయత్నం చెయ్యటం సాధారణంగా జరగదు.

అట్లాంటి మనుషులు, అట్లాంటి సమాజం ఎవరికి వారు, ఒకరితో ఒకరు రాజీ పడటం గురించి, దు:ఖితులు పరిస్థితులతో, దోపిడీదారులతో, కుట్రదారులతో, హంతకులతో, ఉపాదుల్ని పోగొట్టిన వాళ్ళతో, వడ్డీలకు వడ్డీలు వసూలు చేసే వాళ్ళతో దొంగ అప్పుల్ని అంటగట్టే వాళ్ళతో మరణించిన మనిషిపేరిట ఆత్మ శాంతి పేరిట మనుషుల మనశ్శాంతిని పోగొట్టి సనాతనాచారాల పేరిట దురాచారాలతో, దేవుడు, దెయ్యం, ఆత్మ అనే భయాల్ని కలిగించే భయంకరులతో రాజీ పడటం వెనుక లక్షలసార్లో, కోట్లసార్లో మనుషులు మరణించటం వెనుక గల నరక యాతనను రచయిత చిత్రించిన తీరు ఈ నవలను విలక్షణంగా నిలబెడుతుంది.

నిరంతరం మనిషి ఎవరిపట్ల దేనిపట్ల జాగురూకతతో ఉండాలి, ఎరుక కలిగి వుండాలి అనే ప్రశ్నకు జవాబు ఈ నవలలోఉంది. మనిషి ఆలోచించవలసింది, అవగాహన చేసుకోవలసింది, అర్థం చేసుకోవలసింది, అంగీకరించవలసింది, సంస్కరించుకోవలసింది ప్రక్షాళన చేసుకోవలసిందీ ఎప్పుడూ ఎదుటి మనిషిని కాదని, తనను తానే అనే స్పృహని కలుగ చేస్తుందీ నవల.

మనుషుల పట్ల మనుషులు చూపించే ప్రేమలు, స్నేహాలు, బాధ్యతలు, నటనలు ఎవర్ని వాళ్ళు మోసం చేసుకునే కుట్రలకు పరాకాష్టలు మాత్రమే అని చెపుతూ, మనస్తత్వ శాస్త్రం కూడా కొంత మేరకే ఊహించగలిగిన మనిషి ప్రవర్తనను నగ్నంగా చిత్రించిన మనస్తాత్విక నవల మరణానంతర జీవితం.

గతం వర్తమానం, భవిష్యత్‌పట్ల స్పృహ, భౌతిక, ఆర్థిక, సాంఘిక, సామాజిక, రాజకీయ కారణాలు, పరిస్థితులు, కులం సమకాలీన విలువలు, అవసరాలు లాంటి ఎన్నో ప్రభావాలు రూపొందించే మనిషి ప్రవర్తనను, గుంపు మనస్తత్వం కలిగిన మానవుడ్ని అర్ధం చేసుకోవటం, అవగాహన చేసుకోవటంతో బాటు అట్లాంటి సాధారణ మానవుడి సాధారణ, అసాధారణ -సహజ, వాస్తవిక ప్రవర్తనని చిత్రిస్తూ, అతడి చరిత్రకు సాహిత్యంలో స్థానం కలిగించటం సాహిత్య చరిత్రకారుడి లక్షణం. అట్లాంటి సాహిత్య చరిత్రకారుడు సృష్టించే సాహిత్యం నేడొక చారిత్రక అవసరం. కాలక్షేపానికి పుస్తకాలు చదివే కాలం పోయి చాలా కాలమే

పరాజితుల గాథ 'అసురుడు'

- పావని

ఈ పరిచయం ఆనంద్ నీలకంఠన్ రాసిన "అసురుడు" అనే పుస్తకం గురించి. ఈ మధ్య కాలంలో భారతీయ సంస్కృతి గురించీ.. అస్తిత్వ చింతనల గురించీ ఎన్నో పుస్తకాలు వస్తున్నాయి. ఈ పుస్తకం కూడా అలాంటిదే. ఈ దేశ మూలవాసుల రాజు, ప్రజల చరిత్ర. పుస్తకంలోని ఇతివృత్తానికి వస్తే.. ఒక్క ముక్కలో చెప్పాలంటే రామాయణ కథ. ఈ దేశంలో రామాయణం.. రాముడి కథ ఆధారంగా రాసిన పుస్తకాలు లెక్కకు మించి ఉన్నాయి. రామాయణాన్ని ఎంతో మంది ఎన్నో రకాలుగా రాశారు. సంస్కృత రామాయణానికి వేల ప్రక్షిప్తాలు ఉన్నాయంటారు. దక్షిణ ఆసియాలోని పలు దేశాల్లో తమదైన రామాయణ కథ ప్రచారంలో ఉంది. మన నేల మీద రాముడు దాటని నది లేదు.. పాండవులు నివశించని గుహలేదు అని నానుడి.

అయితే అసురుడు కూడా రామాయణ కథే అని ఎవరైనా అంటే రచయిత ఒప్పుకోడు.. ఇది రావణాయణం అంటాడు.. ఇది రావణుడి కథ. ఓడిపోయిన వీరుడు.. అతని ప్రజల కథ అంటాడు. రావణుడి కథ అనగానే.. తమిళుల ద్రవిడ ఉద్యమం ఉచ్ఛదశలో వచ్చిన పుస్తకాలు గుర్తొస్తాయి. అయితే వీటికి, అసురకు తేడా ఏంటా అనే ఆసక్తితోనే ఈ పుస్తకం చదివాను. కథ చిన్నప్పటి నుంచి విన్న.. చదివిన కథే.. అయితే.. పుస్తకంలో ఆద్యంతం తర్వాత ఏం జరుగుతుందో అనే ఉత్కంఠ కొనసాగుతుంది. అదీ ఈ పుస్తకం గొప్పతనం.

కథ విషయానికి వస్తే.. రచయితే చెప్పుకున్నట్లు.. ఇప్పటి వరకూ చరిత్రను ఎప్పుడూ విజేతల వైపునించే చెప్పారు. ఈ కథ పరాజితుల కథ. 3000 సంవత్సరాలుగా పీడితులు ఎంతో ప్రేమతో కాపాడుకుంటూ వస్తున్న గాథ. రావణుడు ఎవరు? అపర కుబేరుడికి తోడబుట్టిన వాడు.. అత్యంత దయనీయంగా ఎందుకు పెరిగాడు.. అంతటి చక్రవర్తి ఎలా అయ్యాడు. ఈ దేశంలో అసురులు ఎందుకు పరాజితులయ్యారు? రావణుడికి రాముడితో వైరం ఎందుకు వచ్చింది? ఇటువంటి విషయాలను సుదీర్ఘంగా చెబుతుందీ పుస్తకం. ఈ దేశంలోకి ఆర్యులు ఎలా చొచ్చుకు వచ్చారో అద్భుతంగా, ఆసక్తికరంగా చెప్పుకొచ్చాడు ఆనంద్ నీలకంఠన్.

ఈ పుస్తకంలో చాలా విషయాలతో నేను ఏకీభవించలేక పోయినా.. చాలా విషయాలను నమ్మలేక పోయినా.. ఎన్నో విషయాలు అతిశయోక్తులుగా అనిపించినా.. నచ్చిన విషయాలూ ఉన్నాయి. ఆలోచింపదగ్గ విషయాలూ ఉన్నాయి. ఇది ఓడిన వారివైపు కథ. ఓడిన వాడు చెప్పుకున్న కథ. తన ఓటమికి విశ్లేషణ అందించుకున్న కథ. తన జాతి నాశనానికి కారణం చెప్పిన కథ. అసురుడు.. రావణాసురుడు.. అతడి సైనికుడి కథ..

యుద్ధంలో ఓడిపోయి.. చావు అంచుల్లో ఉన్న రావణుడు తన స్వగతంగా ఈ అసురుడి కథను చెబుతాడు.. ఇందులో రావణుడు... అతని అనుచరుడు భద్రుడు ఇద్దరు ప్రధాన పాత్రలు.. అసురుడి జీవితం ఆలా ఎందుకు అంతమైంది.. అతని జీవితంలో భద్రుడి పాత్ర ఏంటి అనేదే అసలు కథ. రచయితే చెప్పుకున్నట్లు.. అసురులు మూడు వేల ఏళ్లుగా భద్రంగా కాపాడుకుంటూ వస్తున్న కథ.

ఇక్కడ మనం తప్పకుండా చెప్పుకోవాల్సిన విషయం రచయిత నేపథ్యం గురించి. కేరళ లోని మారుమూల పల్లెలో బాల్యం గడిపిన ఆనంద్ నీలకంఠన్ తర్వాత చదువులు.. ఇంజనీరింగ్ కోసం తను పుట్టి, పెరిగిన ఊరును వదిలేశాడు. కానీ తన గ్రామంలో లెక్కకు మించి ఉన్న ఆలయాలు.. తన ఇంట్లో ఉండే ఆడవాళ్ల భక్తి.. తాను చిన్నప్పటి నుంచి వింటూ వస్తున్న రామాయణం గురించి ఆయనే చెప్పుకున్నాడు. అప్పుడే.. రావణుడి పాత్ర, వ్యక్తిత్వం తన మనసులో ముద్రించుకు పోయాయని రచయిత చెప్పుకున్నాడు. ఉన్నత చదువుల తర్వాత బెంగుళూరులో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఉద్యోగంలో స్థిరపడినా.. రావణ పాత్ర తనను వెంటాడి.. తన కథ రాయించుకుందని.. ఆదే అసుర రాయడానికి ప్రేరణ అని రచయిత ముందు మాటలో చెప్పారు. ఇదంతా ఎందుకంటే.. పుస్తకంలో చాలా విషయాలు ఈ నేపథ్యంతో సంబంధం ఉన్న విషయాలు.

అసుర ఒక కల్పిత గాథ, ఓడిపోయిన వాడి స్వగతం అంటూ సబ్ టైటిల్ ఉంది. అందువల్ల ఈ కథను మనం కల్పిత గాథగా తీసుకుంటే.. అసురుడి కథ అద్భుతంగా ఉంటుంది. రావణుడు అనే యువకుడు.. అసురులకు ఎలా చక్రవర్తి అయ్యాడు.. మహోన్నత మైన అసుర సామ్రాజ్యాన్ని నిర్మాణం చేసిన అతను.. ఆ సామ్రాజ్యం కూలిపోడానికి ఎలా కారణమయ్యాడో రచయిత చెప్పుకుంటూ వచ్చాడు. సురులకు, అసురులకు మధ్య వైరాన్ని వివరించాడు. హిస్టారికల్ మైథాలజీ వంటి ఈ కథ ఆద్యంతం అద్భుతంగా సాగుతుంది. సింగిల్ అవుతోంది. రేపటి కాలాన్ని తెలుసుకోవటం కోసం పుస్తకాలు చదివాల్సిన కాలం ఇది.

మొత్తం మీద మరణానంతర జీవితం అనే నాటకాన్ని మీరూ చూడండి. కథాంశం గురించో, పాత్రలు, సంభాషణలు, సంఘటనలు, వర్ణనలు, ముగింపు, శైలి, శిల్పం, కథనం, కంఠస్వరం లాంటి అంశాల గురించే కాదు కానీ – బతకటానికి నిత్యం మరణించే మనుషుల చర్మం లోపలి రక్త నాళాలకు తెలిసిన లోపలి మనిషి గురించి తెల్పినందుకు, పాత భయాల్ని చంపి, కొత్త భయాలు కలిగించినందుకు, ఎవర్ని వారు ప్రేమించేలా, ద్వేషించుకునేలా, ప్రశ్నించుకునేలా, సరిదిద్దుకునేలా, సంస్కరించుకునేలా ప్రేరణ కలిగించే రచన చేసినందుకు నందిగం కృష్ణారావు గారికి తెలుగు నవలా పాఠకులందరి తరఫున ధన్యవాదాలు.

లైన్లో కథ చెప్పాలంటే.. రామ, రావణుడి కథే కానీ.. కథనం ఎంతో విభిన్నమైనది.. వాల్మీకితో సహా.. ప్రచారంలో ఉన్న ఎన్నో రామాయణాలకు ఈ కథకు ఎక్కడా పోలిక ఉండదు. పాత్రలన్నీ దాదాపు అవే.. కానీ పాత్రల చిత్రణ, వ్యక్తిత్వం భిన్నం. అలా అని తమిళులు రాసుకున్న రావణ కథలాంటి ఏక పక్ష కథ కూడా కాదు.

నేను ఎనిమిదో తరగతిలో ఉండగా.. టి.వి.లో భూ కైలాస్ అనే (ఎన్.టి.ఆర్‌ది కాదు) సినిమా వచ్చింది. అందులో సీత రావణుడి కూతురుగా చూపిస్తారు. ఆ తర్వాత మళ్లీ ఈ పుస్తకంలో కూడా అలాంటి వాదమే ఉంది. ఐతే ఆ ఒక్క పోలిక తప్ప సినిమా కథకూ ఈ అసురుడికి ఎలాంటి సంబంధంలేదు.. ఈ విషయం ఎందుకు చెప్పానంటే.. రావణుడిని సమర్థిస్తూ వచ్చిన వాదాల్లో ఇది ఒక వాదం కావడం వల్ల. అసురుని కథలో విభీషణుడు చేసిన ద్రోహం వల్ల రాముడి చేతిలో తీవ్ర గాయాలపాలై యుద్ధ భూమిలో కుప్పకూలి పోయిన అసురుడు.. రావణుడు.. ఈ పరిస్థితికి కారణాలు వెతుక్కుంటూ.. ఆత్మవిమర్శ చేసుకుంటాడు.

రామయణ కథ జరిగిందా.. ? లేదా? జరిగితే.. ఎప్పుడు జరిగింది.. ? ఎన్నివేల సంవత్సరాల క్రితం జరిగింది.. ? అనే అంశాలపై ఇప్పటికీ ఎన్నో విశ్లేషణలు.. అభిప్రాయాలు.. చర్చలు ఉన్నాయి. అవి ఎప్పటికీ ఒక కొలిక్కి వచ్చే అవకాశంలేదు.. చరిత్ర పట్ల మన దేశంలోని కొంత మంది మేధావులకు ఉండే హ్రస్వ దృష్టిగురించి మాత్రమే నేనీ వ్యాఖ్యలు చేశాను.

అసుర కథ అనేక ఆధునిక పోకడలకు పోతుంది. స్వగతాన్ని మొదలు పెట్టిన రావణుడు తమ అసుర జాతిలోని లోపాల వల్లే ఆసురులు నాశనమయ్యారంటూ.. అసుర సభ వివరాల్లోకి వెళతాడు. సురుల దాడులు మొదలు కాగానే... అసుర సభ జరిపిన రాజులు.. తామే ఆర్యులను వెతుక్కుంటూ వెళదాం అంటూ ప్రతిపాదన తెస్తారు.. ఆలా ఆర్యులను వెతుక్కుంటూ వెళ్లడం.. మైదానంలో జీవితానికి అవాటుపడ్డ ఆర్యులు.. మంచుకొండల దాకా వెళ్లి ఇబ్బందులు పడటం.. అలగ్జాండర్, చంద్రగుప్త మౌర్య యుద్ధాన్ని.. ఆర్యులు పదే పదే భారత భూభాగంలోకి దండెత్తిరావడం.. మహ్మద్ ఘోరీ, మొఘల్ రాజ్యస్థాపకుడు బాబర్ దండయాత్రలను గుర్తుకు తెస్తుంది.

అనైక్యత వల్ల ఆర్యుల చేతిలో ఓడిపోవడంతో అసురుల ప్రాభవం తగ్గిపోవడం మొదలైతుంది. ఆర్యులు అసుర రాజ్యంలో గ్రామాలను పట్టణాలను నాశనం చేసుకుంటూ ముందుకు పోయే క్రమంలో కథలోని మరో పాత్ర భద్రుడి కథ మొదలైతుంది. రావణుడు, భద్రుడి కథలు సమాంతరంగా నడుస్తూ ఉంటాయి.

కథలో కొన్ని చరిత్ర ప్రభావాలు కనిపిస్తాయి. కొన్ని ఆధునిక పోకడలు అనుకోకుండా.. మూడు వేల ఏళ్లపూర్వపు కథలోకి వచ్చేస్తాయి. దీనికి ఉదాహరణ మొదట చెప్పుకున్న ఆర్యులు ప్రధాన భూభాగంలో(ఇప్పుడు భారత దేశం) దాడులు చేయడం, లంకను జయించేందుకు రావణుడు, చివర్లో రాముడు సముద్రాన్ని దాటేందుకు సముద్రపు దొంగ వరుణుడు సహాయం చేయడం.. లంకలోనూ, ప్రధాన భూభాగంలోనూ యూరప్ నుంచి.. ఇతర ప్రాంతాలనుంచి సుగంధ ద్రవ్యాలు అమ్ముకునే వర్తకులు రావడం వంటి అంశాలు.. రచయిత చెప్పినంత పాత విషయాలు కాదు.. అయితే ఇవన్నీ కథలోకి వస్తాయి. కథలో మరో అంశం రామాయణంలో ఉండే పుష్పక విమానాన్ని యంత్ర పరికరంగా చెప్పడం. మండోదరి తండ్రి మయుడు వీటిని తయారుచేస్తాడు. అతడి పాత్రను పిచ్చి సైంటిస్టులా చిత్రించారు రచయిత. ఈ కథను రావణ కథగా తీసుకునేందుకు మనకెలాంటి అభ్యంతరం లేకపోయినా.. భారత దేశ చరిత్రలో భిన్నకాలాల్లో జరిగిన అనేక అంశాలను కలిపి ఈ కథ నడుస్తుంది.

అసురుడు కథను కేవలం కల్పిత గాథగా తీసుకుంటే.. రావణుడనే పేరున్న పాత్ర చుట్టూ ఒక మైథలాజికల్ స్టోరీగా అనుకుంటే.. అద్భుతంగా ఉంటుంది. కథనం హ్యారీ పోర్టర్, అవతార్ వంటి అద్భుత కథనాల్లా పాఠకులను ఆకట్టుకుంటుంది. దాంతోపాటు ఒక అసుర చక్రవర్తి.. అతడి వద్ద పనిచేసే బటుడి కథ ద్వారా ఈ దేశంలో చక్రవర్తులు.. సామాన్యుల జీవితం ఎలా ఉండిందో దగ్గరగా చూపించే ప్రయత్నం రచయిత చేశారు. భారత ఉపఖండంలోకి కులాలు ఎలా వచ్చాయి.. మనువు వారసులు వాటిని ఎంత పటిష్టంగా అమలు పరిచారు.. అసురులకు వీటిపై ఎలాంటి వ్యతిరేకత ఉండేది.. అసురుల జీవితాల్లో లేని పౌరోహిత్యం, చాతుర్వర్ణం ఎలా ఫ్యాషన్ అయిపోయి.. వాటిని అసురుల్లోని ఉన్నత వర్గాలు ఆహ్వానించాయి. వర్కింగ్ క్లాస్ వాటిని ఎలా ప్రతిఘటించింది వంటివిషయాలను సైతం చూపించే ప్రయత్నం చేసింది. భారతీయ సంస్కృతి అంటూ మన మీద రుద్దిన సంస్కృతిని అసురులు ఎందుకు వ్యతిరేకించారు.. గెలిచిన వారి సంస్కృతి అందరి సంస్కృతి ఎలా అయ్యింది.. వంటి విషయాలు చక్కగా వివరించాడు రచయిత.

పరాజితులు తమ కథను చెప్పుకుంటే ఎలా ఉంటుందో ఈ పుస్తకం చెబుతుంది. ఓడిపోయిన వారికి కూడా తమ వాదన వినిపించే అవకాశం ఇస్తే అది ఈ పుస్తకంలా ఉంటుంది. ఈ దేశంలో మూలవాసులు, వారి సంస్కృతి ఎందుకు 'అనాగరికం' అయ్యాయో కళ్లకు కట్టినట్టు వివరిస్తుందీ పుస్తకం. ఇప్పటికీ ఈ దేశంలో మూలవాసుల పోరాటం ఎందుకో అర్థమైతుంది. భారతీయ సంస్కృతి గురించి తెలునుకోవాలి అని అనుకుంటున్న వారంతా, మూలవాసులకు.. నాగరికులం అనుకునేవారికి వైరం ఎందుకో అర్థం చేసుకోవాలనుకుంటే తప్పక చదవాల్సిన పుస్తకం.

అయితే.. ఈ పుస్తకం చదువుతున్నంత సేపూ.. రచయిత చెప్పిన మూడువేల సంవత్సరాలు.. కథలో చెప్పే అనేక కల్పనలు.. ఒకే ఫ్రేంలోకి వచ్చి ఇబ్బంది పెడతాయి. ☆

అరుణతార చందాదారులకు విజ్ఞప్తి !

ఏ కారణం చేతనైనా మీకు అరుణతార అందకపోతే పిన్‌కోడ్‌తో సహా మీ చిరునామాను మరోసారి 8500809250 మొబైల్ నంబర్‌కు మెసేజ్ పెట్టగలరు.

గమనిక : ఈ నెంబర్ కేవలం మెసేజ్‌ల కొరకు మాత్రమే! – సం.

'కట్ట' కథా సమీక్ష

- వీరబ్రహ్మాచారి

ఓ...ఓయ్....ఒయక్ డోకొస్తోంది. 'కట్ట'కాడి కంపు అంతా కాగితాల్లోకి ఛీ ఛీ అక్షరాలకు అశుద్ధం అద్ది శారదామాత నవమాన పరుస్తారా?! అంతఃపురాల అసూర్యం పశ్యల అతివల అంగాంగ సోయగాల శృంగార పరిమళాలద్ది సాహిత్యానికి సౌరభాల నాసికాగ్రాల నలరించి మేఘాల అంచుల విహరింపచేసే సాహిత్య ప్రయోజనాన్ని విస్మరించి అలగా జనం ఆడాళ్ళ లేమి లేకి దరిద్రాన్నంతా కథా సాహిత్య పుటల్లోనికి ఒంచిన వాళ్ళు సరే. ఒంచుకున్న వాళ్ళ ఇంగిత మేద చచ్చింది. సాహిత్య సాంస్కృతిక మాసపత్రికని బహు గొప్పగా రాసుకుంటిరి గదా. ఇదా మీ సాహిత్యం. ఇదా మీరు మోయవలసిన సాంస్కృతికత.

ఇంత చేసింది చాలక మధ్య మధ్యలో బంతిపూలూ, చేమంతి పూల చెందులూనట. ఆ పూలతో మా ఆలయాలు అలంకరిస్తారా ఏం? "వుండతో గుండ్రంగా చూడ్డానికి ఓ చిన్నసైజు..." చౌకబారు 'వినోదా'నందం. ఔనులే. చౌకబారు మనుషులూ చౌకబారు ఆనందాలూనూ. ఛ ఛ గోఘృతంలో వేయించి చేయించిన లడ్డే ఆయినా ఇపుడింక ఆరగించ మనస్కరించుట లేదు. అకటా ఎంత కష్టకాలం దాపురించె గద. వీటికి తోడు ఇంకా తగుదునమ్మా అన్నట్లు రాజుగానూ రామలింగడి కథలొకటి. అన్ని అశుద్ధ సందర్భాలవే.

యాక్! అదెవతి వజ్రమ్మట. దాని శ్రాద్ధం బెట్ట. కంపులో నిండుగా పండిన దోసకాయలట. మొన్న కూరగాయల మార్కెట్ కెళ్ళినపుడు వాటి బంగారపు నిగనిగలు మెండుగా పండిన పరిమాణం చూసి మనసుపడి తెచ్చా. నేతిలో వేయించి రోటిలో నూరి రెండు రోజులు ఆ పచ్చడి రుచితో తదాత్మ్యం చెందానే.

'ఒసేవ్ ఇంటావిడా.'

'ఆ..ఆ...ఇంటావిడా ఏవిటింటావిడా బైటావిద కూడా ఉందా ఏవి?'

'అబ్బా నీ ఛలోక్తుల చాతుర్యానికి సంతోషించాం గానీ ఆ దోసకాయ ఆవ పచ్చడి ఆవల విసిరేయ్..'

'అదేం'

'ఇదో ఈ కట్ట కథ చదివావా'

'ఆ...ఏం?!'

'ఐతే ఏమని నింపాదిగా అడుగుతున్నావా? ఈ రెండ్రోజులు తిన్నందుకు శంఖ ప్రక్షాళన చేసికోవా లింటిల్లిపాదిమీ. చదివితే నాలుక, రాస్తే వేలు తెగనరికి వేయవలసిన జాతులకు విద్య నేర్పిన పాపానికి మనను మనం చెప్పుతో కొట్టుకోవాలి'

'ఏవిటో అంతా మీ ఛాదస్తం. మీరు తెచ్చినవి అక్కడే పండినవిన గ్యారంటీ ఏమి? ఇక విద్యనంటారా మీరు నేర్పకున్నా వాళ్ళే నేర్చుకుంటున్నారు. ఇక చెప్పంటారా? అదీ వాళ్ళే చేసింది. దాంతో కొట్టుకున్నా ఇంకో మైలనే అంటించుకోటం'

'ఏమో ఎక్కడ పండినవో ఎవరికెరుక. ఇంకా వాళ్ళకు వాళ్లే నేర్చుకున్ననాడు ఊర్కున్నావేటి? వేళ్ళూ నరికేసాం, తలలూ తీసేసాం'

'సరే. తెల్వకుండా తింటే ఏం లేదా? అపుడు లొట్టలేయించిన పచ్చడి ఇపుడు కక్క వలసినదయిందా!'

'అవునూ ఆ గుంట వసతి గృహంలో నెలలో వత్సరాలో ఉండి సాత్వికాహారాని కలవాటు బడిందే గదా. సెలవులకొచ్చిన నాల్రోజులు నాల్కనదుపులో ఉంచుకోగూడదా?అదేమన్నా ఆజ్యంలో వేయించిన గోంగూర పచ్చి మిరపకాయలో ఉడికించి నూరినయేనట. పోపయినా పెట్టిందో లేదో. అపురూప అమృతమైనట్లు పీకలదాకా కూరడమేనా? కదుపుమంటా విరోచనాలూ గాక మరేమవుతుందేం? జిహ్వాచాపల్యపు గుంటలు'

'అదిసరే. ఈ రోజు ముద్దపప్పు, నించుదొంకాయ కూర, బంగాళాదుంప వేపుడు, సాంబారు చేయలే. చేతనవుతలేదు. సరిపెట్టుకుంటారా?'

'ఊ....సరే, మంచిది. కనీసం పచ్చిపులుసులో నువ్వులపొడి బెల్లం వేయి. వడియాలయితే ఉన్నాయి గదా'

జిహ్వాకు చాలప్యం లేకుండెట్లుంటది. ఎదటి వాళ్ళ ఆయాసంతో దానికేం పని. ఎవరి దురద వారిది. కథలో సన్నదారిలో సైకిల్ మీది పోకిరి లాగా ఎవరి ఆనందం వారిది.

'ఏంటోయ్ ఏవిటో గొణుగుతున్నావ్'

'ఆ. ఏం లేదు లెండి. జిహ్వా వేరు, ఉదరం వేరుగదా. జిహ్వాకు ఉదరాయాసంతో ఏంపనీ అన్నా. ఐనా అది వాస్తవం కాదు కథే కద. అది చదివి ఇంత అదయిపోతున్నారేటి?'

'అదే వచ్చింది తంటా. ఆవిడెవరో మహాతల్లి దరిద్రపు జీవితాన్ని కళ్ళ ముందు దృశ్యమానం చేసేంతగా చెక్కింది. చెక్కి అఘోరించింది'

'అంత దృశమానమే అయినట్లుంటే చివరి ఆ కరుణమ్మమ్మ మరణం మీ గుండెలు పిండలేదా?'

'ఆ అదేమన్నా మనముందు జరిగిందా'

'చాపల్యమున్న నాలుకకు నరం కూడా ఉండదన్న సంగతి మరిచిపోయా...'

కీ నోట్ పేపర్

సామాజిక ఉద్యమాలు - ప్రజాస్వామిక విప్లవం

(ఫిబ్రవరి 7, 8 తేదీల్లో బొబ్బిలిలో జరిగిన విరసం సాహిత్య పాఠశాలలో)

- పాణి

ఉపోద్ఘాతం

"సామాజిక ఉద్యమాలు-ప్రజాస్వామిక విప్లవం" అనే అంశం కేంద్రంగా జరుగుతున్న విరసం సాహిత్య పాఠశాలకు వచ్చిన విప్లవ, విప్లవ సాహిత్యోద్యమ అభిమానులకు సాదర స్వాగతం. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని వివరించే క్రమంలో మొదటి నుంచి భారత దేశంలో జరిగిన బ్రాహ్మణేతర ఉద్యమాల గురించి, ముఖ్యంగా భక్తి ఉద్యమ సంప్రదాయాల గురించి విశ్లేషిస్తూ వచ్చాం. ఇంకా వెనక్కి వెళ్లి చార్వాకం, బౌద్ధం వంటి అవైదిక తాత్విక, మత సంప్రదాయాలను ఆనాటి చారిత్రక పరిస్థితుల్లో భాగంగా విశ్లేషిస్తూ వచ్చాం. ముఖ్యంగా వలస కాలంలోని దళిత బహుజన ధిక్కార ఒరవడిని ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా చెప్తూ వచ్చాం.

ఈ కోణంలో సామాజిక ఉద్యమాల గురించిన చర్చ విప్లవోద్యమంలో ఆది నుంచీ ఉన్నది. విప్లవోద్యమ ప్రారంభ దినాల్లోనే దళిత పాంథర్స్ ఉద్యమం పట్ల సాహిత్య, రాజకీయ రంగాలు రెండిట్లో చాలా పట్టింపు ఉండింది. మహారాష్ట్ర ప్రత్యేక పరిస్థితుల్లో అక్కడ మొదలైన దళిత బహుజన సంచలనాలను విప్లవోద్యమం జాగ్రత్తగా పట్టించుకున్నది. వాటి నుంచి విప్లవోద్యమం వైపు ఆసక్తి చూపిన వాళ్లూ ఉన్నారు.

అయితే మొదట్లో వివిధ సామాజిక ఉద్యమాల గురించి, సామాజిక ఉద్యమకారుల గురించి తగినంత సమాచారం విప్లవోద్యమానికి లేదు. ఉదాహరణకు జ్యోతిరావు పూలే గురించి 1980ల్లోగాని తెలుగు సమాజంలోని విప్లవ శిబిరానికి తెలియదు. అట్లాగే అప్పట్లో సామాజిక ఉద్యమాలపట్ల స్థూలమైన విప్లవకర అవగాహన మాత్రమే ఉండేది. నిజానికి నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగమని చెప్తూ వచ్చిన రైతాంగ, ఆదివాసీ ఉద్యమాలన్నిటి గురించీ మొదటే సొంతం తెలియదు. ఒక క్రమంలో అలాంటి వాటిపై అధ్యయనం పెరిగింది. దీనికి ప్రబల ఉదాహరణ.. బస్తర్‌లోని గుండాదుర్ పోరాటం. ఇవాళ దండకారణ్య విప్లవోద్యమానికి "భూంకాల్" గొప్ప ప్రేరణ. ఆ ప్రాంతానికి విప్లవోద్యమం వెళ్లే వరకు గుండాదుర్ గురించి పెద్దగా తెలియదు. తెలిసినా ఇవాళ ఉన్నంత పట్టింపు లేదు. అట్లాగే నూతన ప్రజాస్వామిక విప్లవ క్రమం మొదలైందని విప్లవ శక్తులు భావించే 1857 ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే ముస్లిం సమాజం నుంచి బ్రిటిష్ వాళ్లకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటాలు జరిగాయి. వాటి గురించి మొదట్లో పెద్దగా తెలియదు. అలాంటి అధ్యయనాలు ఆ తర్వాతే జరిగాయి. నిజానికి ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ముస్లింల పాత్ర కూడా అప్పట్లో స్థూలంగా చెప్పుకోవడం తప్ప వివరాల్లోకి పెద్దగా వెళ్లలేదు.

ఇవన్నీ నూతన ప్రజాస్వామిక విప్లవం రంగం మీదికి వచ్చిన తొలి దశకు సంబంధించిన పరిమితులు, ప్రత్యేకతలు. ఆ కాలంలో నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయాలు, సిద్ధాంతం, నిర్మాణం, పోరాట రూపాల.. వంటి మౌలిక విషయాల్లోనే అపరిపక్వత ఉండేది. అది సామాజిక ఉద్యమాల విషయంలోనూ తప్పలేదు.

సాహిత్యం రంగంలో దీనికి కొంచెం భిన్నంగా ఉండేది. నిజానికి ఆస్థానేతర, బ్రాహ్మణేతర, అవైదిక, జానపద, దేశీ సాహిత్యం, కళలను ప్రజా సంప్రదాయాలుగా ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీనే గుర్తించింది. మార్క్సిస్టులకు సంబంధించినంత వరకు ఇదేదో గొప్పగా చెప్పుకోవలసింది కాదు. చాలా మామూలు విషయమే. వాటి ఒరవడిని ఆనాటి సాంస్కృతికోద్యమాలు స్వీకరించాయి. ఈ ఉద్యమాల్లో భాగంగానూ, విడిగానూ చార్వాక, నాస్తిక, హేతువాద దృక్పథాలతో అనేక మంది ఈ ఒరవడిపై గొప్ప రచనలు చేశారు. ఇది చాలా విస్తారమైన కృషి.

నక్సల్బరీతో విప్లవ సాహిత్య, సాంస్కృతికోద్యమాలు ఈ ప్రజా సంప్రదాయాన్ని విప్లవీకరించి అత్యున్నత స్థాయిలోకి తీసికెళ్లాయి. చరిత్రలో జరిగిన వివిధ సామాజిక ఉద్యమాల సాంస్కృతిక ప్రతిఫలనాలను గుర్తించాయి. ఈ అవగాహనలో, రచనల్లో విప్లవ రాజకీయాలతోపాటు సామాజిక నొక్కు కూడా ఉంది. మొదట్లో ఈ అవగాహనకూ పైన చెప్పిన పరిమితులు ఉండేవి. అయితే విప్లవోద్యమ పునర్నిర్మాణ దశలో అంతక ముందటి పరిమితులను, లోపాలను సవరించుకొనే క్రమం మొదలైంది. ముఖ్యంగా విప్లవోద్యమ నిర్మాణం, పోరాట రూపాలు, దీర్ఘకాలిక ప్రజా యుద్ధ పంథా వంటి మౌలిక విషయాల్లో సవరణలు జరగడంతోపాటు సాంఘిక సంబంధాల దృష్టి, సామాజిక ఉద్యమాలపై నొక్కు పెరిగింది. సాహిత్యంలో, కళల్లో సాంఘిక, రాజకీయార్థిక సంబంధాల అపూర్వ సృజన మొదలైంది.

దీనికి సామాజిక ఉద్యమాలు దోహదపడ్డాయి. విప్లవోద్యమం సామాజిక ఉద్యమాల ప్రభావానికి గురి కావడం దాని సజీవ లక్షణానికి గుర్తు. దాని వల్లనే అది వివిధ సామాజిక శక్తులను ప్రభావితం చేస్తోంది. వాటి ప్రభావానికి గురవుతూ ఉంది.

వీటన్నిటి వల్ల ఇవాళ మనం ఉన్న మేధో ప్రపంచం గతానికంటే పూర్తి భిన్నంగా మారింది. ప్రజాస్వామిక విప్లవం మొదలైందని చెప్పే 1857 నాటికన్నా, నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమం మొదలైందని భావించే 1967 నాటికన్నా ఇప్పటి మేధో వాతావరణం చాలా మారింది.

మేధో వాతావణం దానికదే మారిపోతుందా? అనే ప్రశ్న వస్తుంది. దేశీయంగా, అంతర్జాతీయంగా రాజకీయార్థిక రంగంలో వచ్చిన మార్పుల వల్ల మారిన వాతావరణం ఇది. మారిన భౌతిక పరిస్థితికి తగిన నుడికారం, విశ్లేషణ పరికరాలు, పాత పదాలకే కొత్త అర్థాలు, పూర్తిగా కొత్త పరిభాష.. వీటన్నిటి ద్వారా మారుతున్న వాస్తవికతను మరింత సన్నిహితంగా, నిజంగా తెలుసుకునే మార్గాలు

మేధో రంగంలో ముందుకు వస్తాయి. వీటన్నిటి వల్ల నూతన ఆవిష్కరణలు జరుగుతాయి.

ఈ మాట అనగానే ఇదంతా మార్క్సిజానికి భిన్నమైనదా? అనే ప్రశ్న తలెత్తుతుంది. లేదా ఏకంగా మార్క్సిజానికి దూరమయ్యే ప్రయాణమా? అనే భయం కూడా కలుగుతుంది. ఆ సందేహాలకు గురి కానవసరం లేదు. మారిన పరిస్థితులపట్ల స్పష్టత లేకపోతేనే ఇలాంటి భయ సంకోచాలు కలుగుతాయి. మారిన .. లేదా మారుతూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోడానికి చేసే ప్రయత్నాలపట్ల అనుమానం కలుగుతుంది. వీటిని నిర్భీతిగా తీసి పక్కన పెట్టవచ్చు. వర్గపోరాట భూమికపై దృఢంగా నిలబడి మార్క్సిస్టు సిద్ధాంత, రాజకీయ రంగం ఇలాంటి కొత్త వాతారణంలోకి చేరుకున్నదనే స్పష్టత ఉంటే చిక్కే లేదు. మారుతున్న భౌతిక వాస్తవికతను విశ్లేషించగల, మార్చగల శక్తి మార్క్సిజం కంటే ఇంక దేనికి ఉంటుంది. ఈ నిత్య నూతనత్వం మరే సిద్ధాంతానికి ఉంటుంది? చారిత్రకమైన ఏ విషయాన్నయినా విశ్లేషించగల ఆవరణ చారిత్రక భౌతికవాదంలో లేదని ఇప్పటికెవరైనా నిరూపించారా? ఫలానా విషయాన్ని మార్క్సిజం విశ్లేషించలేదని, వర్గపోరాటం పరిష్కరించలేదనే అభిప్రాయ ప్రకటనలు వినిపిస్తూ ఉంటాయి. వాటికి ఏ సిద్ధాంత ప్రతిపత్తీ లేదు. ఏవో కొన్ని రాజకీయ, ఉద్యమ సంబంధమైన వాదనలు ఉన్నాయి.. అంత వరకే. అయితే ఈ నూతన మేధో ప్రపంచం రూపు దిద్దుకోవడం వెనుక మార్క్సిస్టు శిబిరానికి వెలుపల జరిగిన అనేక పోరాటాలు, ముఖ్యంగా సామాజిక అస్తిత్వ పోరాటాల పాత్ర గణనీయమైనదని విస్మరించడానికి లేదు.

ఇవన్నీ కలగలసిన నూతన మేధో వాతావరణంలో మనం సామాజిక ఉద్యమాలు-ప్రజాస్వామిక విప్లవం అనే అంశం గురించి మాట్లాడుకుంటున్నాం. ఈ స్పృహ లేకపోతే మన మాటలు మనకే ప్రతిధ్వనించే ప్రమాదం ఉంటుంది. లేదా ఏ అర్థంలో ఏం మాట్లాడుకుంటున్నామో తెలియక గందరగోళం ఏర్పడుతుంది. ఈ స్పష్టత కోసమే ఇదంతా. ఈ విషయంలో అప్రమత్తం కాకుండా ఎంత ప్రసంగం చేసినా ప్రయోజనం కలగకపోగా అదే సమస్యాత్మకం అవుతుంది. పైగా ఇది కీనోట్ పేపర్ కాబట్టి తన కంఠస్వరాన్ని, తాను మాట్లాడుతున్న వాతావరణాన్ని గుర్తింపజేయడమే అన్నిటికంటే ముఖ్యం.

అందువల్ల విప్లవోద్యమం ప్రారంభ దశలోనే సామాజిక వ్యవస్థల గురించి, సామాజిక ఉద్యమాల గురించి మాట్లాడినదానికీ, ఆ తర్వాత మాట్లాడుకుంటున్నదానికీ సహజంగానే తేడా ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1980లలో వెల్లువెత్తిన విప్లవ ప్రజా సంచలనాల నుంచి ఈ నూతన దశ మొదలైందని చెప్పవచ్చు. ఈ దశలో కూడా సామాజిక ఉద్యమాల గురించి ఎన్నోసార్లు మాట్లాడినా మరోసారి "సామాజిక ఉద్యమాలు-ప్రజాస్వామిక విప్లవం" గురించి ఈ సాహిత్య పాఠశాల ఇతివృత్తంగా ఎంచుకున్నది. ఈ ప్రత్యేకతను, నేపథ్యాన్ని చెప్పాల్సి ఉన్నందున ఈ ఉపోద్ఘాతంలో కాస్త ఎక్కువ సమయం తీసుకోవాల్సి వచ్చింది.

పరిశీలనా చట్రం:

సౌలభ్యం కోసం సామాజిక ఉద్యమాలను ఈ కీనోట్ పేపర్ నాలుగు దశలుగా చెప్తుంది. అవి....

1. భక్తి ఉద్యమ కాలం
2. ఫూలే కాలం
3. ఉధృతమైన జాతీయోద్యమ కాలం
4. వలసానంతరం

సామాజిక ఉద్యమాలను విడిగా కాకుండా ప్రజాస్వామిక విప్లవ చట్రంలో భాగంగా చూడటం ఈ పాఠశాల ఉద్దేశం. అట్లని ప్రజాస్వామిక, లేదా నూతన ప్రజాస్వామిక పోరాటాల్లో సామాజిక ఉద్యమాలను కుదించాలని కాదు. దాని వల్ల ఏ ప్రయోజనమూ ఉండదు. వాస్తవ సామాజిక చలనాల అధ్యయనానికి ఆ పద్ధతి ఉపయోగపడదు. సామాజిక ఉద్యమాల్లోని సాంఘిక విముక్తి ఆకాంక్షను గుర్తించడమే అసలు ఉద్దేశం. ఈ ఆకాంక్ష వ్యక్తమైన వేర్వేరు చారిత్రక దశల్లో ప్రజాస్వామిక విప్లవ క్రమం సాగి ఉన్నందు వల్ల దాన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజాస్వామిక విప్లవ పోరాటాలంటే సామ్రాజ్యవాదంపై, భూస్వామ్యంపై జరిగిన వర్గపోరాటాలు. సమాజంలోని వర్గ సంఘర్షణ, ముఖ్యంగా వలస పెట్టుబడి వల్ల తలెత్తిన పరిణామాల ఆవరణలోంచి వ్యక్తమైన సాంఘిక విముక్తి ఆకాంక్షలను అంచనా వేయడం ఈ పత్రం లక్ష్యం. నిజానికి వర్గ సంఘర్షణ వలసానంతరం మరింత తీవ్రమైంది. కాబట్టి వలసానంతరం సాంఘిక విముక్తి ఆకాంక్షల వ్యక్తీకరణలో వచ్చిన మార్పులను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి. అట్లాగే సాంఘిక విముక్తి ఆంకాంక్షలు వలస కాలానికి ముందు నుంచీ చరిత్రలో వినిపిస్తూ వచ్చాయి. అంటే వలస పెట్టుబడి వల్లనే సాంఘిక విముక్తి స్వరం రూపుదిద్దుకున్నదనుకుంటే పొరబాటు చేసినట్లే.

ఈ పాఠశాల ఎంపిక చేసుకున్న అంశానికి ఉన్న ప్రత్యేకత వల్లే నూతన ప్రజాస్వామిక విప్లవం అనకుండా ప్రజాస్వామిక విప్లవం అనాల్సి వచ్చింది. ప్రధానంగా వలస కాలాన్ని కేంద్రం చేసుకొని సామాజిక ఉద్యమాల గురించి ఇక్కడ చర్చించుకుంటాం. దీనికి అవసరమైన వరకు వలసపూర్వ, వలసానంతర కాలాలకు విస్తరిస్తుంది.

1857లో జరిగిన ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం ప్రధానంగా ఫ్యూడల్ వర్గాల నాయకత్వం వల్ల ఓడిపోగా, ఆ తర్వాత ప్రజాస్వామిక విప్లవానికి బదా బూర్జువా వర్గం నాయకత్వం వహించింది. ఆ కాలంలో ప్రపంచ యుద్ధాలు, విప్లవాల వల్ల ప్రజా చైతన్యం వెల్లివిరిసి భారతదేశంలో ఉధృతమైన పీడిత జనోద్యమాలకు భయపడ్డ బూర్జువా వర్గం సామ్రాజ్యవాదంతో, భూస్వామ్యంతో రాజీపడి ప్రజాస్వామిక విప్లవానికి విఘాతం కల్గించడంతో కార్మికవర్గ నాయకత్వంలో నూతన ప్రజాస్వామిక విప్లవం మొదలైంది. దీని వల్ల నూరేళ్లకు పైగా సాగుతూ, విద్రోహానికి గురవుతూ వచ్చిన ప్రజాస్వామిక విప్లవం జనతా ప్రజాస్వామిక విప్లవంగా పరిణమించిందని మార్క్సిస్టు లెనినిస్టు ఉద్యమ అవగాహన.

ప్రజాస్వామిక విప్లవ దశలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా రైతాంగ తిరుగుబాట్లు, ఆదివాసీ తిరుగుబాట్లు ఎన్నో జరిగాయి. 1855లో సంతాల్ తిరుగుబాటు, 1900లో బీర్సాముండా నాయకత్వంలోని పోరాటం, 1922లో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలోని మన్నెం పోరాటం, 1765 నుంచి 1900 దాకా దేశవ్యాప్తంగా అనేక వీరోచిత రైతాంగ పోరాటాలు ఎన్నో జరిగాయి. టెర్రరిస్టు పోరాటాలుగా పిలవబడ్డ విప్లవ పోరాటాలు, కమ్యూనిస్టు

పార్టీ నాయకత్వంలో జరిగిన పోరాటాలు నడిచాయి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రత్యేకంగా చెప్పుకోదగ్గది. భారత బూర్జువా వర్గం ప్రజాస్వామిక విప్లవానికి చేసిన విద్రోహం, కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ సాయుధ పోరాట విరమణ అనే ముందు వెనుకల అధికారమార్పిడీ జరిగింది. ఈ అన్ని కారణాల వల్ల ప్రజాస్వామిక విప్లవం ఆగిపోయాక తిరిగి నక్సల్బరీ పోరాటంతో నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమం మొదలైంది. అంటే 1857 నుంచి తెలంగాణ సాయుధ పోరాటం, 1967లో నక్సల్బరీ పోరాటం, 1980ల తదనంతర పరిణామాల దాకా ప్రజాస్వామిక, నూతన ప్రజాస్వామిక విప్లవ క్రమాన్ని నేపథ్యంలో ఉంచుకొని సామాజిక ఉద్యమాలను పైన చెప్పిన నాలుగు విభాగాల్లో ఈ పత్రం చర్చిస్తుంది.

ఈ కీనోట్ పేపర్‌లోని ఫ్రేమ్‌వర్క్ ఈ అంశంపై సాగవలసిన మిగతా ప్రసంగాలకు అవసరమైన కొన్ని మౌలిక పరిశీలనలను, పద్ధతులను క్లుప్తంగా అందిస్తుంది. అట్లాగే ఈ అంశం ప్రధానంగా ఉద్యమాలకు సంబంధించింది కాబట్టి సామాజిక, ప్రజాస్వామిక విప్లవోద్యమాల వెనుక ఉన్న సిద్ధాంత అవగాహనలను అవసరమైన మేరకే చర్చిస్తుంది. నేరుగా ఆ విషయాల్లోకి వెళ్లడం లేదు. ఇది ఈ పత్రానికి ఉన్న పరిమితి.

1. భక్తి ఉద్యమాల కాలం:

భారత సామాజిక వ్యవస్థలో ఉన్న అమానుషమైన అసమానతలు, వివక్షలు, వెలి.. అంటరానితనాలకు వ్యతిరేకంగా చరిత్ర పొడవునా అనేక ధిక్కార స్వరాలు వినిపించాయి. తిరుగుబాట్లు జరిగాయి. వైదిక, బ్రాహ్మణీయ భావజాలానికి, సంస్కృతికి వ్యతిరేకంగా ఇవన్నీ ముందుకు వచ్చాయి. బ్రాహ్మణ మతానికి వ్యతిరేకంగా వచ్చిన ఈ సంప్రదాయాల్లో భౌతిక, సామాజిక దృష్టి ఉన్నది. దీనికి భక్తి ఉద్యమం కంటే ప్రబలమైన ఉదాహరణ లేదు. అవి సమాజాన్ని మత, తాత్విక, సాంఘిక, సాంస్కృతిక రంగాల్లో తీవ్రంగా ప్రభావితం చేశాయి. భూస్వామ్య గర్భంలోనే మరో సమాజానికి సంబంధించిన అంశాలు పెరిగే క్రమంలో ఈ ఉద్యమాలు భూస్వామ్యాన్ని, వర్ణ వ్యవస్థను వ్యతిరేకించాయి. చేతి ఉత్పత్తులు, వర్తకం, నగరాలు పెరిగే రాజకీయార్థిక క్రమాన్ని ఈ ఉద్యమాలు సూచిస్తాయి. అయితే చాలా వరకు ఇవన్నీ మత రూపంలోనే జరగడం ఆ కాలానికి సంబంధించిన ప్రత్యేకత. పరిమితి. ఆ వ్యవస్థలోని ఉపరితల అంశాలను బట్టి భక్తి ఉద్యమ రూపాలు ముందుకు వచ్చాయి. వైదిక మతం ఆధిపత్య మత రూపంగా ఉపరితలంలో ఉన్నందున దానికి వ్యతిరేకంగా వచ్చిన తిరుగుబాట్లు కూడా మత రూపాన్నే ఆశ్రయించాయి. ఇందులో భావవాద దృక్పథం ప్రధానం. మానవ జీవితానికి సంబంధించిన భౌతిక దృష్టి ఉన్నప్పటికీ అవి కొత్త మత ధోరణిగానే వ్యక్తమయ్యాయి. ఫ్యూడలిజంతో పెనవేసుకపోయిన కేథలిక్ చర్చికి వ్యతిరేకంగా వచ్చిన ఆందోళన ప్రొటెస్టెంట్ మత రూపంలోనే వచ్చింది.

వైదికంలో అసంఖ్యాక దేవతలు ఉంటే భక్తి ఉద్యమాల్లో ఏకేశ్వరోపాసన ఒక సాధారణ ధోరణిగా ఉండేది. అసంఖ్యాక దేవతలు, వాళ్లకు యాగాలు, పూజలు, బలులు, మంత్రాలు, కర్మకాండలు.. వగైరా సెటప్‌నంతా ఏకేశ్వరోపాసన వ్యతిరేకించిందని గుర్తిస్తే ఆ రోజుల్లో మానవ సామాజిక జీవితంలో అది తెచ్చిన కొత్తదనం ఎంత విలువైనదో మనకు అర్థమవుతుంది. ఇందులో ఇంకో అంశం కూడా ఉంది. పైన చెప్పిన సెటప్ వల్ల మనిషికి, దేవుడికి మధ్య బ్రాహ్మణ శక్తుల జోక్యం, లేదా ప్రాబల్యం, లేదా అనివార్యం స్థిరపడిపోయాయి. తద్వారా ఆ శక్తులు సామాజిక జీవితం మీద ఆధిపత్యాన్ని సంపాదించుకున్నాయి.

భక్తి ఉద్యమాలన్నీ మూకుమ్మడిగా దీని మీద దండయాత్ర చేశాయని చెప్పవచ్చు. ప్రజలు నేరుగా భగవంతుడ్ని ఆరాధించుకోవచ్చని, మధ్యవర్తుల ప్రమేయం రద్దు కావాలని ఇవి కోరుకున్నాయి. పైన చెప్పినట్లు భూస్వామ్య సమాజంలో తలెత్తుతున్న నూతన పోకడల వల్ల ఆ ప్రజలు విడివిడిగా, వ్యక్తులుగా తమంత తాము భగవదారాధన చేసుకోడానికి తగిన పద్ధతులు ఈ మత ఉద్యమాల వల్ల ముందుకు వచ్చాయి. అందులో ప్రత్యేకతలు, విశిష్టతలు ఉన్నప్పటికీ సాధారణీకరించి చెప్పగల అతి ముఖ్యమైన విషయం ఇది. బ్రాహ్మణులు రూపొందించి బలవంతంగా సమాజంపై రుద్దిన కర్మకాండల వ్యవహారానికి భిన్నంగా వ్యక్తులు విడిగా భగవంతుడ్ని సేవించడానికి అవసరమైన కీర్తనలు, పదాల వంటి కవితా రూపాలను భక్తి ఉద్యమ కారులందరూ అల్లారు. నిజానికి భక్తి ఉద్యమ ప్రచారమంతా వీటి ద్వారానే జరిగాయి. అవి మామూలు ప్రజలందరూ పాడుకునేలా ఉండేవి. ఆ రకంగా వైదిక మతంలోని సంస్కృత భాషా ఆధిపత్యాన్ని, మార్మికతను, గోప్యతను కూడా దెబ్బతీశాయి. వీటన్నిటిని సామాజికంగా చూస్తే "వ్యక్తి" ఆవిర్భావం జరుగుతున్నదనే బలమైన సూచన అందులో ఉంది. భూస్వామ్యగర్భంలో మొలకెత్తుతున్న నూతన శక్తుల స్వభావాన్ని భక్తి.. లేదా మతం రూపంలో ఈ ఉద్యమాలు వ్యక్తం చేశాయి. ఆనాటి ఉపరితల రూపాలకు భిన్నమైన కొత్త ఉపరితలాంశాలుగా ఇవన్నీ ముందుకు వచ్చాయి. ఆ రకంగా భక్తి లేదా మతం అనే వాటికి భూస్వామ్యంలో ఉన్న సామాజిక పునాదిని కూడా ఈ అన్ని ధోరణులు ప్రశ్నించాయి.

ఇస్లాంలో సూఫీని కూడా ఇట్లాగే చూడాలి. మత, సాంఘిక పరమైన అంతరాలు, మధ్యవర్తిత్వాలు లేకుండా ప్రేమ, త్యాగం అనే నూతన ప్రాతిపదికలను సూఫీ మతం సామాజిక జీవితానికి పరిచయం చేసింది. అయినా అదీ ఒక మత రూపమే. దానికి సాంఘిక పార్శ్వం ఉండవచ్చు. అయినా అది పాత వ్యవస్థలోని ఒకానొక మత జీవన విధానం. ఆ సంగతి మర్చిపోయి ఎక్కువ వెయిటేజ్ ఇవ్వడానికీ లేదు.

భక్తి ఉద్యమకారుల్లో బ్రాహ్మణ కులస్తులు ఉన్నప్పటికీ కింది కులాల నుంచి కూడా చాలా మందే ఉన్నారు. ముఖ్యంగా కింది కులాలను ఉద్దేశించే ఇవన్నీ జరిగాయి. భక్తి వ్యవహారాల్లో మార్పులకే కొన్ని భక్తి ఉద్యమాలు పరిమితమైతే(అవీ ఆ కాలానికి విలువైనవే), కొందరు భక్తి ఉద్యమకారులు మత, సాంఘిక, సాంస్కృతిక సంస్కరణల దాకా పోయారు. అవి ఎంత ప్రధానమైనవంటే 18, 19 శతాబ్దాల్లో జరిగిన అన్ని రకాల సంస్కరణోద్యమాల్లోని ఆలోచనలు, ఆకాంక్షలను భక్తి ఉద్యమకారులు ముందే ప్రకటించారు. తర్వాతి కాలంలో రూపొందిన జాతీయతా భావనకు పూర్వరంగంలో భక్తి ఉద్యమాలను గుర్తించడం కూడా బాగుంటుంది.

అయితే వీటికి చారిత్రకంగా ఉన్న పరిమితి, లేదా ప్రత్యేకత ఏమంటే ఇవి ఏ సాంఘిక, మత, ధార్మిక, సాంస్కృతిక ఆధిపత్యాలకు

వ్యతిరేకంగా పోరాడాయో వాటి పునాది అయిన భూస్వామ్యం మీద ఈ కోణాల్లో తప్పు నేరుగా పోరాడగలిగేవి కాదు. దానికి సంబంధించిన సాంఘిక వ్యవస్థల మీద మాత్రమే పోరాడాయి. నిజానికి అనేక సాంఘిక, సాంస్కృతిక, మత సంబంధాల మాధ్యమం ద్వారా ఆనాటి భూస్వామ్య దోపిడీ జరుగుతూ వచ్చింది. దాని మనుగడ కొనసాగింది. భూస్వామ్యం ఎక్కడైనా అట్లాగే ఉంటుంది. అట్లా ఉంటేనే భూస్వామ్యం. ఆ రకంగా భూస్వామ్యానికి సంబంధించిన సాంఘిక సాంస్కృతిక విషయాల మీద పోరాడటమంటే ఆరోజుల్లో ఆ వ్యవస్థలకు ఉండే సాన్నిత్యం వల్ల భూస్వామ్యం మీద పోరాడినట్టే. అయితే వాటి స్వభావం వల్లే మౌలికంగా భూస్వామ్యాన్ని రద్దు చేయగలిగే ఉద్యమాలు కావు. వాటికి ఆ లక్ష్యం లేదు. అందుకే భక్తి ఉద్యమాల నుంచి పుట్టిన మత జీవన విధానం, ఆరాధన పద్ధతులు తర్వాత్తర్వాత వేర్వేరు మత శాఖలుగా స్థిరపడ్డాయి. చాలా విచిత్రంగా అవి బ్రాహ్మణ లేదా వైదిక సంబంధమైన గుర్తింపు పొందాయి. నిజంగానే అలా తయారయ్యాయి. అదంతా పూర్తిగా వేరే కత.

అయినా... ఆ కాలంలోని రాజకీయార్థిక మార్పుల నేపథ్యంలో వచ్చిన భక్తి ఉద్యమాలకు, వాటి సాహిత్య సాంస్కృతిక వ్యక్తీకరణలకు (మత రూపంలోనే కావచ్చు..) ఇవ్వాల్టి భాషలో చెప్పాలంటే సాంఘిక విముక్తి అనే అర్థం ఉన్నదని గుర్తించడమే వాటి మీద చారిత్రక అంచనా. ఆ ఉద్యమాల మీద ఎవరెంత సమాచారం ఇచ్చినా, ఎన్ని అంచనాలు చెప్పినా వాటిలోని సాంఘిక విముక్తి ఆకాంక్షను పసిగట్టడమే కీలకం కావాలి.

కాబట్టి సాంఘిక విముక్తి ఆకాంక్ష అతి ప్రాచీనమైనది. భక్తి ఉద్యమాల కాలంలోనే కాదు... భారతదేశంలో కుల సాంఘిక సంబంధాలు ఉనికిలోకి వచ్చిన కాలం నుంచి వాటిలోని అమానుషత్వానికి వ్యతిరేకంగా ఆ కాలాల్లోని ప్రత్యేక, విభిన్న కంఠస్వరాల్లో సాంఘిక విముక్తి ఆకాంక్ష చరిత్ర పొడవునా వినిపిస్తూనే వచ్చిందనడానికి వలస పూర్వకాలంలోని భక్తి ఉద్యమాలు మంచి ఉదాహరణ.

2. పూలే కాలం:

భక్తి ఉద్యమాల గురించి ఎందుకు చెప్పుకోవాలంటే.. ఆనాటి సాంఘిక విముక్తి ఆకాంక్షకు, ఆ తర్వాత ముందుకు వచ్చిన సామాజిక ఉద్యమాల్లోని సాంఘిక విముక్తి ఆకాంక్షకు మధ్య వలసవాద చట్రమనే అతి ముఖ్యమైన తేడా ఉందని గుర్తించడానికి. అది ఎలా ఉండిందో గుర్తించడానికి. అది ఎంత ప్రధానమైందంటే సాంఘిక విముక్తి ఆకాంక్షలను ప్రేరేపించిన రాజకీయార్థిక శక్తుల్లోనే వలస కాలంలో కీలక మార్పులు వచ్చాయి.

అనేక చారిత్రక కారణాల వల్ల యూరప్‌లో తలెత్తిన పెట్టుబడిదారీ విధానం వలస రూపంలో ప్రపంచమంతా విస్తరించింది. వలసవాదవాదంగా సామ్రాజ్యవాదం ఈ దేశంలోకీ వచ్చింది. ఇక్కడి రాజకీయార్థిక వ్యవస్థలో వేర్వేరు దశల్లో వేర్వేరుగా జోక్యం చేసుకొని ఈ సమాజ చలనాలకు చోదకంగా పని చేసింది. కాబట్టి ఆ రాజకీయార్థిక, సాంఘిక సంచలనాల్లో వినిపించిన సాంఘిక విముక్తి ఆకాంక్ష చరిత్రలో అంతక ముందటి కంటే పూర్తి భిన్నమైన పరిస్థితుల్లో వ్యక్తం కావడం మొదలైంది. అంతక ముందు కులమనే సాంఘిక వ్యవస్థ ద్వారానే వర్గ దోపిడీ జరుగుతూ ఉండేది. ఆ దశలో కులం అంత ప్రధానమైనది. వలస విధానాల వల్ల.. ఇంకా బాగా చెప్పాలంటే మొగల్ పాలన కాలం నుంచే భారత దేశ కుల వ్యవస్థలో మార్పులు మొదలయ్యాయి. కులం పని చేసే పద్ధతి మారుతూ వచ్చింది. సారాంశంలో కులం వర్గ విభజనకు లోను కావడం మొదలైందని గమనించవచ్చు. ఈ మాట కులం పట్టు సడలిందని చెప్పడానికి కాదు. అది పని చేసే పద్ధతిలో అప్పుడప్పుడే మార్పులు మొదలయ్యాయని గుర్తించడానికే. కులం సజీవ వ్యవస్థ కాబట్టి(సజీవ వ్యవస్థ అంటే మంచిదని కాదు. పెట్టుబడిదారీ వ్యవస్థ కూడా సజీవమైనదే. అంత మాత్రాన అది మంచిదని చెప్పినట్టు కాదు కదా) అది నిరంతరం మార్పుకు లోనుకావడం సహజం.

భారతదేశంలో వలస పాలకుల రాజకీయార్థిక విధానాల వల్ల సాంఘిక, సాంస్కృతిక రంగాల్లో జరుగుతున్న మార్పుల నుంచి ప్రాచీన నాగరికతా ఆరాధకులు ముందుకు వచ్చారు. ఆ కాలంలో వీళ్ల మీద వలసవాదం వల్ల పట్టుబడ్డ ఆలోచనల ప్రభావం ఎంత ఉన్నదో ప్రాచీన సంస్కృతి ప్రభావమూ అంతే ఉన్నది. వీరిలో రాజారామ్మోహన్‌రాయ్ ప్రథముడు, ప్రముఖుడు. భారతీయ సాంఘిక వ్యవస్థను, దాని చరిత్రను అర్థం చేసుకొనే క్రమంలో దాంతో బ్రిటిష్ వాళ్ల వ్యవహారశైలి మారుతూ వచ్చింది. సాంఘిక, సాంస్కృతిక విషయాల్లో జోక్యం చేసుకుంటే ఎలాంటి స్పందనలు వచ్చేదీ అనుభవంలోకి వచ్చాక ప్రాచీన సంస్కృతీ ఆరాధకులతో వలసవాదం ఒక రకమైన ఒప్పందంలోకి వచ్చింది.

వలసవాదం వర్సెస్ ప్రాచీన సాంఘిక మూలాలు అనే సంఘర్షణ, సర్దుబాట్ల చట్రంలో మనం సంఘసంస్కరణ, లేదా జాతీయ పునరుజ్జీవనం అనే పరిణామాలను చూడగలం. పైన చెప్పిన చట్రం నుంచి రెండు స్థాయిలలో కదలికలు వచ్చాయి. **ఒకటి:** పై కులాల్లో ఉన్న సాంఘిక దురాచారాల్లో మార్పులు తీసుకరావాలని ఆ కులాల నుంచే బయల్దేరిన సంస్కర్తల ప్రయత్నం. **రెండు:** తరతరాల కింది కులాల ప్రజల సాంఘిక వివక్ష, పీడనల నుంచి బయటికి రావడానికి ఆ కులాల నుంచే ఆలోచనాపరులు చేసిన ప్రయత్నం.

ఇలాంటివి గతంలో జరిగే ఉండవచ్చు. ఇప్పుడు మాత్రం వలసవాద నేపథ్యం ఉంది. ఉత్పత్తి వ్యవస్థలో కీలకమైన మార్పులు జరుగున్న కాలానికి సంబంధించినవి. అందువల్ల అవి అప్పటికి సంబంధించినవే కాదు, చరిత్ర గతిలో వీటికి ఉన్న దీర్ఘకాలిక ప్రభావం చూస్తాం.

ఉదాహరణకు బ్రహ్మసమాజం దగ్గరి నుంచి ఆ కాలంలోని రకరకాల సంస్థలు మత, సాంఘిక సంబంధమైన సంస్కరణలు కావాలని కోరుకున్నవే. వలస వాదం వల్ల నూతన ఆలోచనా ధోరణులు పట్టుబడ్డా.. వాళ్లు తాము ఎంచుకున్న పనులకు వేదాలను ప్రమాణంగా తీసుకున్నారు. ఈ ఒరవడి చూపింది రాజారామ్మోహన్ రాయ్. వాళ్లలో వాళ్లకు ఎన్ని తేడాలు ఉన్నప్పటికీ వేద ప్రామాణ్యం విషయంలో పూర్తి ఏకీభావం ఉంది. ఇంగ్లిషు విద్యకావాలని కోరుకున్నా వేదాలను మాత్రం వదులుకోలేదు. సారాంశంలో ఇలాంటి వాళ్లు చేసిన పనుల వల్ల మతం ప్యూరిఫై అవుతూ వచ్చింది. వేద, సనాతన, హైందవ భావజాలానికి, జీవన విధానానికి అనేక కొత్త నిర్వచనాలు ఇచ్చారు. వలసవాదం వల్ల చరిత్రలో జాతి భావన ముందుకు రావడం సహజమే. అది హిందూ జాతి భావనగా

స్థిరపడటం వెనుక బ్రహ్మ సమాజం వంటి రకరకాల సంస్థల పాత్ర ఉన్నదని ఇప్పుడు చెప్పవచ్చు. చరిత్రలో దీని పర్యవసానాలను ఈరోజు చూస్తునే ఉన్నాం. సనాతనత్వం దాని పాత ముఖాన్ని మార్చుకొని కొత్త ముఖంతో రంగం మీదికి రావడానికి ఈ వ్యవహారం దోహదపడింది.

పై కులాల నుంచి వచ్చిన ఈ సంస్కర్తల్లో హేతుబద్ధతను ప్రదర్శించి ఆనాటికి ప్రగతిదాయకమైన వైఖరులు తీసుకున్న వాళ్లు కూడా ఉన్నారు. ఈ రెండు వైఖరులకు ఆంతరంగికంగా జరిగిన సంఘర్షణకు ఒక ఉదాహరణ చెప్పుకోవచ్చు.

బ్రహ్మ సమాజం దేవేంద్రనాథ్ ఠాగూర్ కాలంలో కూడా రామ్మోహన్‌రాయ్ మార్గం తూచా తప్పకుండా నడిచింది. 1850ల చివరికల్లా నాయకత్వంలోకి వచ్చిన కేశవచంద్ర సేన్ కులాంతర వివాహాలు చేపట్టాలనేసరికి అందులో ఉన్న వేద ప్రామాణికులు అడ్డం పడ్డారు. ఈ కారణం వల్లే బ్రహ్మ సమాజం చీలిపోయింది. దాదాపుగా పై కులాల నుంచి వచ్చిన సంస్కర్తలందరూ వలసవాద నేపథ్యంలో అందివచ్చిన ఆసరా తీసుకొని ప్రధానంగా(కొన్ని సమాజం మొత్తానికి సంబంధించిన ఉంటే ఉండవచ్చు) పైకులాల సాంఘిక, సాంస్కృతిక జీవితంలో కొన్ని మార్పులు తేవడం కోసం వేదాలను ప్రమాణంగా చేసుకున్నారు. ఆ కాలంలో, చాలా పరిమిత అర్థంలో వాటి వల్ల కొంత మేలు జరిగినా వైదిక మతం చరిత్రలో సరికొత్తగా పని చేయడానికి, వ్యక్తం కావడానికి వీళ్ల ప్రయత్నాలు కారణమయ్యాయి. వాళ్లు ఈ ఉద్దేశంతోనే ఈ పని చేశారని నిర్ధారించేవాళ్లూ ఇప్పుడు ఉండవచ్చు. దీని వల్ల కుట్ర సిద్ధాంతానికి ప్రాధాన్యత పెరిగి, సామాజిక విశ్లేషణ విస్మరణకు గురవుతుందేమో ఆలోచించాలి. ఏ సామాజిక, భావజాల కారణాల వల్ల ఆ కాలంలో వాళ్లు ఈ వైఖరి తీసుకున్నారు? అవి ఎందుకు అనేక విపరిణామాలకు దారి తీశాయి? అనే చర్చ వల్లే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది.

ఈ సంస్కర్తలకు చరిత్రలో సాంఘిక ఉద్యమకారులుగా, పునరుజ్జీవన ఉద్యమకారులుగా గుర్తింపు ఉంది. వలస పాలన నేపథ్యంలో వీళ్లు దేన్ని పునరుజ్జీవింపచేయదల్చుకున్నారు? అనేది చాలా ముఖ్యమైన ప్రశ్న. సనాతనత్వాన్ని పునర్జీవింప చేయదల్చు కున్నందు వల్లే వీళ్లకు వేదాలు ప్రమాణం అయ్యాయి. వాస్తవానికి యూరప్‌లోని పునరుజ్జీవన కాలంలో ప్రాచీన గ్రీకు, రోమన్ ఆలోచనాధారలను ముందుకు తెచ్చారు. మతంపై విమర్శతో అవి బయల్దేరాయి.

మన దగ్గర పునరుజ్జీవన కార్యక్రమాలకు ప్రాచీన కాలంనాటి అవైదిక, బ్రాహ్మణేతర ఆలోచనాధారలు ప్రమాణం అయి ఉండాలి. చార్వాకం, లోకాయతం, బౌద్ధం ఒరవడిని ముందుకు తెచ్చి ఉండాల్సింది. కానీ పైకులాల నుంచి వచ్చిన సంస్కర్తలు తమ భావజాలం వల్ల వేదాలను పుణికి పుచ్చుకున్నారు. అందువల్ల సనాతనత్వం కొంత రూపం మార్చుకొని పునర్జీవించింది. తర్వాతి చరిత్రలో ఇది చాలా హానీ చేసింది.

ఆ కాలంలో ఈ వైదిక సంస్కృతి మీద తిరుగులేని విమర్శ పెట్టిన వాళ్లలో అగ్రగణ్యుడు మహాత్మా జ్యోతిరావు పూలే. ఆయన పై కులాల సంస్కర్తల కంటే చాలా విభిన్నంగా.. వాళ్ల మార్గానికి వ్యతిరేక దిశలో నిజమైన పునరుజ్జీవన శకంలో తనదైన పాత్ర పోషించాడు. వేద ప్రామాణ్యాన్ని ధిక్కరించి, ప్రాచీన అవైదిక సంప్రదాయ ఒరవడిని మరింత ముందుకు తీసికెళ్లాడు. భారత కుల సాంఘిక సంబంధాల విశాల ఆవరణలో నిలబడి ఆయన వాటి పునాదులపై తీవ్ర విమర్శ పెట్టాడు. అనేక వైపుల నుంచి, అనేక రూపాల్లో ఆయన తన కార్యాచరణ కొనసాగించాడు. బహుశా కుల సాంఘిక సంబంధాలను అంత విస్తృత అర్థంలో ఆనాటికి మరెవ్వరూ గుర్తించలేదని గట్టిగా చెప్పవచ్చు. ఈ దేశంలో ఏది పునర్జీవనం కావల్సి ఉన్నదో గుర్తించిన ద్రష్ట ఆయన. అందువల్లే మనం ఈ దేశంలో పునరుజ్జీవన పితామహుడని అనదల్చుకుంటే ఆ స్థానం ఆయనకే ఇవ్వాలని గతంలోనే చెప్పాం. సంప్రదాయక అర్థంలో రాజారామ్మోహన్‌రాయ్‌కి ఈ స్థానం అనుచితంగా కట్టబెట్టడం జరిగింది. నిజానికి ఆయననుగాని, అలాంటి వాళ్లనుగాని.. ఆనాటి స్థలకాలాల్లో వాళ్లు నిర్వహించిన పాత్రలోని పాజిటివ్ ఫలితాలను గుర్తిస్తూనే సంస్కర్తలని చెప్పగలం. అది కూడా పై కులాల్లోని కొన్ని దురాచారాలను, మూఢనమ్మకాలను ఎదిరించిన వాళ్లుగా గుర్తించగలం. సాంఘిక ఉద్యమకారులని అనడం కూడా కష్టమే. పైన చెప్పినట్లు ఈ పరంపరలోనే ప్రజాస్వామిక చైతన్యాన్ని ప్రదర్శించిన వాళ్లూ ఉన్నారు. వాళ్ల పాత్ర చాలా గణనీయమైనది. వాళ్ల కృషి చరిత్రలో చాలా సానుకూల ఒరవడిని అందించింది. వాళ్ల హేతుచింతన ప్రగతి మార్గం విశాలం కావడానికి దోహదపడింది. వీళ్లందరికీ జాతీయోద్యమశక్తుల పట్ల అనుమానం ఉండేది. విమర్శ ఉండేది.

సాంఘిక విషయాల్లో ఈ అందరికంటే విభిన్నమైన, విశిష్టమైన పాత్ర పోషించిన పూలే అయితే ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామాన్ని అనుమానాస్పదంగా, వ్యతిరేకంగా చూశాడు. మామూలుగా సామ్రాజ్యవాద వ్యతిరేక వ్యక్తీకరణగా చూసే ఈ పోరాటంపై దేశీయ ఆలోచనాపరుల విమర్శగా దీన్ని చూడవచ్చు. వలసవాదం వల్ల కోరలు ఊడిపోయిన అగ్రకుల, రాజరిక శక్తులు దీని ముందు, వెనుక ఉన్నందున.. వాళ్లు తమ అధికారాన్ని కాపాడుకోడానికి చేసిన తిరుగుబాటుగా ఆయన చూశాడు. ఇందులో నిజం లేకపోలేదు. ఈ అగ్రకుల రాజరిక శక్తుల దుర్మార్గాలు అందరికీ తెలిసినవే. అయితే ఆ చారిత్రక దశలో వలసవాదమనే వాస్తవం కూడా ఉన్నది. దాన్ని ఆయన పట్టించుకోకపోగా, దేశీయ సాంఘిక వ్యవస్థలో చిన్న చిన్న మార్పులు రావడానికైనా ప్రత్యక్షంగా, పరోక్షంగా వలస పాలన దోహదపడుతోంది కాబట్టి దానిపై పోరాటాన్ని ఆయన అంగీకరించ లేదు. ఆయన ప్రాపంచిక దృక్పథమే దేశీయ సాంఘిక వ్యవస్థపై నిరసనతో పదునెక్కింది. అందువల్ల సహజంగానే ఆయన ఆనాటి సంఘర్షణలో వలసవాదుల పక్షం తీసుకున్నాడు. దేశీయ సాంఘిక, సాంస్కృతిక విషయాలపట్ల శ్రద్ధ ఉన్న ఆలోచనాపరులు, ఆందోళనాకారులు అందరూ ఈ వైఖరి తీసుకోడానికి ఒక ముఖ్యమైన కారణం ఉంది. తాము ఆశిస్తున్న సాంఘిక పరివర్తనకు ఆ కాలంలో వలస ప్రభుత్వం తప్ప(అక్కడక్కడా కొన్ని విషయాల్లో కొద్దిగా ప్రజాస్వామికంగా ఆలోచించిన సంస్థానాధీశులు తప్ప) మరే ఆలంబన సమాజంలో లేదు. అత్యంత నికృష్టమైన ఈ సాంఘిక వ్యవస్థలో మార్పు కోసం ప్రయత్నించేవారికి అండగా నిలబడే ఆంతరంగిక శక్తి ఏదీ లేదు. బహుశా ఆ కాలంలో చాలా పరిమిత స్థాయిలో సంస్కరణల కోసం ప్రయత్నించిన వాళ్లకు కూడా ఈ ఇబ్బంది తప్పలేదు. సతీ సహగమనం అమానుషం అన్నవాళ్లు సనాతనవాదుల

ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వచ్చింది. దానికి వాళ్లు వేదాలనే ఆధారం చేసుకున్నారు. అయినా వలస ప్రభుత్వం ఆసరా లేకుంటే అది చట్టం అయ్యేది కాదు. ఈ పరిస్థితుల్లో ఫూలే ఎజెండా మీద అగ్రకుల, సనాతన శక్తులు తీవ్రంగానే దాడి చేశాయి.

మొత్తంగా సామ్రాజ్యవాద నేపథ్యంలో చూస్తే ఆయన వైఖరిని అంగీకరించడం కష్టమే. కానీ ఆయన నిలబడ్డ సమాజం, ఆయన ఎంచుకున్న లక్ష్యం, దానికి ఉండే అపారమైన ప్రాధాన్యత రీత్యా ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంపై ఆయన దేశీయ విమర్శను అర్థం చేసుకోవాలి. ఆ కాలంలో వలస ప్రభుత్వం పట్ల ఇలాంటి వైఖరి తీసుకున్న వాళ్లందరినీ ఈ విషయంలో ఇలాగే చూడాలి. తమ సాంఘిక ఆందోళనలు ముందుకు పోవడానికి వలసవాదుల పట్లగాని, సంస్థానాధీనులపట్ల కాని వాళ్లు పెట్టుకున్న నమ్మకాన్ని సంయమనంగా, వాస్తవ చారిత్రక ప్రత్యేకతల్లో భాగంగా పరిశీలించాలి.

ఒక్కమాటలో ఇది రాజాశ్రయానికి సంబంధించిన విషయం. పైకులాల నుంచి, కింది కులాల నుంచి వచ్చిన సంస్కర్తలు, సాంఘిక ఉద్యమకారులు అందరూ బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఆశ్రయించినవాళ్లే. ఆ మాటకొస్తే ఈ పని పైకులాల సంస్కర్తలకే ఎక్కువ అవకాశం ఉంటుంది. రాజారామ్మోహన్‌రాయ్ చివరి మొగల్ చక్రవర్తికి ఎక్కువ భరణం కావాలని మంతనాలు జరపడానికి లండన్ వెళ్లాడు. వాళ్ల దగ్గరా, వీళ్ల దగ్గరా ఆయనకు అంత పలుకుబడి ఉందన్నమాట.

ఫూలేలాంటి వాళ్లు తరతరాలుగా అంటరానితనానికి, వివక్షకు గురైన అశేష ప్రజల తరపున ఎంచుకున్న పోరాటానికి వలస పాలకులను ఆసరాగా తీసుకున్నారు. ప్రథమ సాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వాళ్ల నేపథ్యం వల్ల కూడా ఈ వ్యతిరేక లేదా విమర్శా వైఖరి తీసుకున్నాడు.

ప్రజాస్వామిక విప్లవ ఆరంభ సన్నివేశం మీది ఈ విమర్శపట్ల మార్క్సిస్టు లెనినిస్టు శక్తులకు మొదట్లో ఏ అభిప్రాయాలున్నా వర్తమాన సామాజిక ఉద్యమ చైతన్యంలో, మారిన మేధో వాతావరణంలో దీనికి చాలా విలువ ఉంటుంది. ఈ దేశీయ సాంఘిక విమర్శలో సామ్రాజ్యవాద వ్యతిరేకత లేకపోయినా.. గాఢమైన సాంఘిక విముక్తి కాంక్ష ఉన్నది. ఆత్మగౌరవం, సమానత్వం, సమాన అవకాశాలు అనే విషయాలు అందులో ఉన్నాయి. చరిత్రలో అంతక ముందు వ్యక్తమైన సాంఘిక విముక్తి ఆకాంక్షల కంటే చాలా విస్తారమైనవి. తీవ్రమైనవి. వాటి ప్రకంపనాలు అక్కడితో ఆగిపోకుండా కాలం పొడవునా ప్రసరిస్తూనే ఉన్నాయి.

అంతక ముందు సాంఘిక సమస్యలపై కింది కులాల నుంచి తమ తమ పద్ధతుల్లో నిరసన తెలిపిన వాళ్లకూ ఫూలే కాలం అని చెప్పుకునే దశలోని సాంఘిక ఉద్యమకారులకు మధ్య వలసవాదమనే గుణాత్మక తేడా ఉంది. ఒక రకంగా వీళ్లందరూ వలసవాద నేపథ్యంలోనే చరిత్రలో రూపొందారు.

ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాల్లో సాంఘిక విముక్తికి ముఖ్యమైన చోటు ఉంది. దాన్ని సమగ్రంగా అర్థం చేసుకునే క్రమంలో పై విమర్శనూ సవ్యంగా అర్థం చేసుకోగలం. ఆ దృష్ట్యా ఫూలే ఒక్కడే కాదు.. ఆ కాలంలో కింది కులాల నుంచి వచ్చిన సాంఘిక ఉద్యమకారులందరి ఆకాంక్షలకూ విలువైన చోటు ఉంటుంది.

అయితే ఫూలే సత్యశోధనలో వైదిక ప్రత్యామ్నాయ సామాజిక, సాంస్కృతిక ఆలోచనా ధారతోపాటు ఆధ్యాత్మికత కూడా ఉన్నది. ఫూలే దైవారాధకుడు. అయితే అది సనాతనత్వానికి వ్యతిరేకమైనది. భక్తి ఉద్యమం మత రూపంలో వ్యక్తమైనట్టే .. సత్యశోధక సమాజానికి కూడా మత, ఆధ్యాత్మిక కోణం బలంగా ఉంది. అందులో ఒక రకమైన ప్రత్యేక ఆరాధనా పద్ధతులు ఉండేవి. ఆ రకంగా ఫూలే సత్యశోధనకు మతం, వలస ప్రభుత్వం ఆలంబనగా నిలిచాయని చెప్పవచ్చు.

3. జాతీయోద్యమ దశలో..

..ఇది కూడా వలస కాలంలో భాగమే అయినా స్థూలంగా ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామ కాలానికి, ముమ్మర జాతీయోద్యమ కాలానికి ఉన్న తేడా వంటిది. అందువల్ల సహజంగానే ఈ దశలో జరిగిన సామాజిక ఉద్యమాలు అంతక ముందుటి కంటే చాలా విభిన్నమైనవి. ఆత్మగౌరవం, సమానత్వం, సమాన అవకాశాలు అనే వాటి గురించి ఫూలే మాట్లాడిన పద్ధతికి, అంబేద్కర్ మాట్లాడిన పద్ధతికి తేడా మనం గమనించవచ్చు. ఫూలే కొనసాగింపుగా సామాజిక ఆకాంక్షలు విస్తరించాయి. ముఖ్యంగా ఫూలే కాలంనాటికి మనకు చరిత్ర రచనా పద్ధతి పెద్దగా తెలియదు. అందువల్లే కావచ్చు ఆయన పురాణాలను తిరగేసి వైదిక ధర్మంపై దాడి చేయడమేగాక పీడిత కులాల ప్రాచీన చరిత్రను అందులో వర్ణనాత్మకంగా చిత్రించాడు. సృజనాత్మక రచయితగా సాంఘిక సాంస్కృతిక రంగాలను ప్రధానంగా ఎంచుకున్న ఆచరణశీలి ఫూలే. దాంతోపాటు ఇతర రంగాల సమస్యలనూ పట్టించుకున్నాడు. ఆ అర్థంలో ఆయన రచయిత, తత్వవేత్త, సాంఘిక ఉద్యమకారుడు.

అంబేద్కర్ కాలంనాటికి సామాజిక శాస్త్రాలు దేశమంతా పరిచయం అయ్యాయి. దీనివల్ల సాంఘిక విముక్తి ఆకాంక్షలను బలంగా వినిపించడానికి సామాజిక శాస్త్ర పద్ధతి దోహదపడింది. వలస వ్యతిరేక ఉద్యమం ఊపు మీద ఉండింది కాబట్టి రాజకీయ రూపంలో కూడా అవి వ్యక్తమయ్యాయి. అంత మాత్రాన సాంఘిక విముక్తి ఆకాంక్షలు మతంతో తెగ తెంపులు చేసుకున్నాయని చెప్పడానికి లేదు. ఆ సంగతి తర్వాత చూద్దాం.

జాతీయోద్యమం ముమ్మరమయ్యాక వినిపించిన సామాజిక ఉద్యమ స్వరాల్లో చాలా వైవిధ్యం, తేడాలు ఉన్నప్పటికీ వాటన్నిటికీ ప్రతినిధి అంబేద్కర్. ఆయన సామాజిక ఉద్యమకారుడిగా, రాజకీయ ఉద్యమకారుడిగా, సామాజిక సిద్ధాంతకారుడిగా కృషి చేశాడు. వాస్తవానికి ఆయన సామాజిక ఉద్యమకారుడిగా బయల్దేరినా.. బ్రిటిష్ వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన జరుగుతున్న రాజకీయ వాతావరణంలో నిలబడి ఆయన తన సాంఘిక విమర్శ వినిపించడం మొదలు పెట్టాడు. అందువల్ల ఆనాటి రాజకీయ రంగాన్ని విస్మరించి తన సాంఘిక కార్యక్రమాలు చేస్తూపోవడం కుదరదు. చాలా సహజంగానే ఆయన వలస విముక్తి అనే భావన మీద తన సాంఘిక విమర్శ ఎక్కుపెడుతూనే దళితుల రాజకీయవేత్తగా చాలా భిన్నమైన పాత్ర పోషించాల్సి వచ్చింది. నిజానికి అంబేద్కర్ కాలంనాటి రాజకీయ వాతావరణం చాలా సంక్లిష్టమైనది. సాంఘిక రంగంలో ఉన్న అననుకూలతల మధ్యనే ఆయన ఈ రాజకీయ పాత్ర పోషించాల్సి వచ్చింది. దాని సారాంశం ఏమంటే బ్రిటిష్‌వాళ్లు వెళ్లిపోతే ఈ దేశంలోని అంటరానికులాల ప్రజలకు ఏం వస్తుంది?

అని. దీన్నుంచి వలస విముక్తి వర్సెస్ సాంఘిక విముక్తి అనే తీవ్ర సంఘర్షణ రంగం మీదికి వచ్చింది. అంబేద్కర్ కాలంనాటికి దేశవ్యాప్తంగా అనేక మంది సాంఘిక ఉద్యమకారులు ముందుకు వచ్చారు. వాళ్ల నాయకత్వంలో ప్రజలు కులవ్యవస్థపై తమ నిరసన స్వరాన్ని వినిపించారు. కొన్ని చోట్ల తీవ్ర ఆందోళనలు జరిగాయి. దేశమంతా బ్రిటిష్ వ్యతిరేక ఆందోళనల వెల్లువ సాగుతున్న కాలంలో జాతీయోద్యమానికి వెలుపల ఇవన్నీ జరిగాయి.

ప్రజాస్వామిక విప్లవ క్రమంలో బ్రిటిష్ పాలకులు వెళ్లిపోవడం ఒక ముఖ్యమైన ఘట్టం. దాని మీద అంబేద్కర్ వినిపించిన ఈ విమర్శకు ఇప్పటికీ ప్రాసంగికత ఉన్నది. దేశం వలస పాలనా చట్రం నుంచి బయటపడ్డా అంటరానితనం నుంచి బయటపడలేదని అందరికీ తెలుసు. ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాలు ఇంకా పరిపూర్తి కాలేదని భావిస్తున్నట్లే సాంఘిక విముక్తి లక్ష్యాలు కూడా నెరవేరలేదు. అందుకే ఇవాళ సాంఘిక విముక్తి ఆకాంక్షలకు ఆయన నిలువెత్తు సజీవ ప్రతీక అయ్యాడు.

అంబేదర్కర్ చాలా స్పష్టంగా పెట్టుబడిదారీ విధానాన్ని, బ్రాహ్మణిజాన్ని శత్రువులుగా గుర్తించాడు. అందులో ఆయన చైతన్యయుతంగా బ్రాహ్మణిజంపై పోరాటాన్ని ప్రధానంగా ఎంచుకున్నాడు. ఆ వైపు నుంచి భారత దేశ సామాజిక చరిత్రను అధ్యయనం చేశాడు. ఆయన కాలం నాటికి ఆ విషయంలో ఆయనే విస్తృత పరిశోధనలు చేశాడు. ఇప్పటికీ ఆ రంగంలో ఆయనే ప్రథమం. ఇదంతా సామాజికశాస్త్రవేత్తగా ఆయన స్థానాన్ని ఎత్తిపడుతుంది.

అయితే సామాజిక శాస్త్రవేత్తగా ఆయనకు కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. అది ఆయనకు పట్టుబడ్డ లేదా ఎంచుకున్న సంవిధానానికి సంబంధించింది. ఆ వివరాల్లోకి ఇక్కడ వెళ్లలేం కాని, రెండు మూడు మాటలు చెప్పుకోవాలి. ఆయన భారత సామాజిక చరిత్రను హిందూ మతం (లేదా సనాతనత్వం) వైపు నుంచి చూశాడు. అది రూపొందుతూ బలపడుతున్న క్రమంలో కులవ్యవస్థను చూశాడు. ఇతర మత సంప్రదాయాలతో దానికి ఆయా సమయాల్లో జరిగిన సంఘర్షణలను గుర్తించాడు. ఆయన పరిశీలనల్లో బౌద్ధం విప్లవం.. హిందూ మతం ప్రతిఘాతుకం అనేది కీలకం. అలాంటి ఎన్నో పరిశీలనల్లో ఆయన బ్రాహ్మణిజం వల్ల అంతరాల సాంఘిక సంబంధాలు రూపొందాయని అనేక రకాలుగా చెప్తాడు. ఈ మొత్తాన్ని ఒక మాటలో సులభంగా అర్థం చేసుకోవాలంటే... హిందూ మతం నుంచి, బ్రాహ్మణ భావజాలం నుంచి కుల వ్యవస్థ పుట్టిందని అంబేద్కర్ అభిప్రాయం. కుల వ్యవస్థ బతికి బట్టకట్టడంలో వాటి పాత్ర గణనీయమే. అనుమానం లేదు. అయితే కుల సాంఘిక సంబంధాలనే భౌతిక వాస్తవితకు, అదీ తొలి రోజుల్లో ఉత్పత్తి సంబంధాలతో నేరుగా ముడిపడిఉన్న కుల వ్యవస్థకు కారణాలను మతంలో, భావజాలంలో వెతకడం పొరబాటు. చారిత్రకంగా అది నిజం కూడా కాదు. మతం లేని సాంఘిక జీవితాన్ని ఆయన ఊహించలేదు. చరిత్రలో మతం నిర్వహించిన పాత్ర చాలా ఉంది. కానీ మనిషికి ఎప్పటికైనా మతం ఉండాల్సిందే.. అనే భావన ఆయన ఆలోచనల్లో కీలకం. ఇలాంటివన్నీ ఆయన సంవిధానాన్ని ప్రభావితం చేశాయి. చరిత్రను దాని భౌతిక దృష్టితో అధ్యయనం చేయడంలో ఆయనకు పరిమితులు ఉన్నాయి. కులవ్యవస్థను అర్థం చేసుకోడానికి అవసరమైన అతి ముఖ్యమైన పరిశీలనలు, సూత్రీకరణలు చేసినా కుల సంబంధాలు మార్పుకు గురవుతున్నాయనే విషయాన్ని దాదాపుగా పట్టించుకోలేదు. కుల వ్యవస్థ సజీవమైనది కాబట్టి అందులో నిరంతరం మార్పులు వస్తుంటాయని, వర్గంలో వచ్చే మార్పుల వల్ల కులానికి-వర్గానికి మధ్య సంబంధాలు మారుతూ ఉంటాయని, తద్వారా కులం పని తీరులో మార్పులు వస్తుంటాయనే విషయాలను ఆయన గమనించలేదు. అయితే ఇలాంటి ప్రాథమిక విషయాలను సహితం కమ్యూనిస్టులు కూడా చాలా కాలం పట్టించుకోలేదు. అయితే 1950ల నాటికి ఈ మార్పులు చాలా మందకొడిగా ఉండేవి. అంత స్పష్టంగా అర్థమయ్యేలా లేవు. అయినా.. చరిత్రకారుడిగా వందల వేల ఏండ్ల కులవ్యవస్థ అధ్యయనంలో అంబేద్కర్ ఈ విషయం గుర్తించే అవకాశం ఉండింది.

జాతీయోద్యమ కాలంలో ప్రధానంగా కాంగ్రెస్, కమ్యూనిస్టులు, “టెర్రరిస్టులు” అనబడే విప్లవకారులు రంగంలో ఉండేవారు. కాంగ్రెస్‌లో అతివాదులు, మితవాదులు, అనేక రకాల వాళ్లూ ఉండేవాళ్లు. ఆ కాలంలో జరిగిన సామాజిక ఉద్యమాలు ఈ మూడు స్రవంతుల్లో దేనికీ దగ్గరిగా లేనట్టే అంబేద్కర్ కూడా వీటిలో దేనికీ దగ్గరిగా లేడు. కొంత కాలం.. కొన్ని విషయాల్లో కమ్యూనిస్టులకు దగ్గరిగా ఉన్నా ఆయన ఉద్దేశపూర్వకంగానే తర్వాతర్వాత వాళ్లకు దూరమయ్యాడు. దీనికి వాళ్లు ఎంత కారణమనేది కుల సమస్య-కమ్యూనిస్టులు అనే అంశంలో చర్చకు వస్తుంది. అంబేద్కర్ సందర్భంలో పెద్దగా అవసరం లేదు. ఆ కాలంలోని సామాజిక ఉద్యమాల్లో వచ్చిన మార్పులను అర్థం చేసుకోడానికి అంబేద్కర్ అవగాహన వరకే పరిమితం కావచ్చు.

సాంఘిక ఉద్యమకారుడిగా, రాజకీయవేత్తగా అంబేద్కర్‌కు ఉదారవాద ప్రజాస్వామిక సంస్థలపట్ల విశ్వాసం బలంగా ఉంది. నిజానికి ఆలోచనాపరుడిగా, కార్యకర్తగా ఆయన ప్రయాణం వాటితోనే మొదలైంది. సాంఘిక సమస్యలపై తొలిదశలో అనేక పోరాటాలు చేసిన అంబేద్కర్ జాతీయోద్యమ సన్నివేశంలో నిలబడి ఉదారవాద ప్రజాస్వామిక సంస్థల్లో దళితుల భాగస్వామ్యం గురించి ఆలోచించాడు. ఆ విషయంలో అటు గాంధీతో, బ్రిటిష్‌వారితో అనేక రకాలుగా సంభాషించాడు. ఆయన దృష్టిలో దీనికి ఒక స్పష్టమైన అర్థం ఉంది. సాంఘిక విముక్తికి దారి ఏమిటి? అనే సమస్యకు ఆయన ఉదారవాద ప్రజాస్వామికసంస్థల్లో పరిష్కారం చూశాడు. వ్యవస్థీకృతమైన కులం నుంచి విముక్తి కావాలంటే నూతన సంస్థల ఆలంబన అవసరం అనే అవగాహన ఆయనకు ఉన్నది. ఆయన దృక్పథం వల్ల, ఆయన నిలబడ్డ చారిత్రక సందర్భం వల్ల కూడా అలాంటి సంస్థలు ఉనికిలోకి వస్తూ ఉన్నాయి. తెల్ల వాళ్లు వెళ్లిపోవడం సంగతి అలా ఉంచితే వాళ్ల పాలనలోనైనా భారతీయులకు అలాంటి సంస్థల్లో చోటు దొరికేటట్లయితే అందులో దళితులకు కూడా అవకాశం ఉండాలని ఆయన ఆలోచించాడు. ప్రతి మనిషికీ ఓటు, ప్రతి మనిషికీ ఒకే విలువ వంటి ప్రజాస్వామిక విలువల ప్రాతిపదికపై రూపొందే ఈ సంస్థలు సాంఘిక విముక్తికి సాధనాలవుతాయని ఆయన గట్టిగా విశ్వసించాడు.

వలస పాలన పొడవునా సాగిన సామాజిక ఉద్యమాల కొనసాగింపుగా ఈ అవగాహనను చూడాలి. సాంఘిక విముక్తి, దోపిడీ రద్దు అనే ప్రక్రియలను సుస్థిరంగా ముందుకు నడపగల

నిర్మాణాలు ఉండాలనే ఆలోచన సరైందే. అట్లాగే చారిత్రకంగా బూర్జువా ప్రజాస్వామిక సంస్థలు ఆ కాలంలో ముందుకు రావడం వల్ల సామాజిక ఉద్యమకారులు ఇలా ఆలోచించే అవకాశం వచ్చింది. అంతక ముందు రోజుల్లో సాంఘిక సమస్యలపై పోరాటానికి వలస ప్రభుత్వాన్ని ఆలంబనగా చూసినట్టే .. అధికార మార్పిడి క్రమంలో ఆ తరం సామాజిక ఉద్యమకారులకు ఈ ఆలోచన కలిగే ఆస్కారం ఉండింది.

ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుంటూనే ఈ వైఖరిని విమర్శనాత్మకంగా చూడాలి. ఎందువల్లంటే ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాలు పరిపూర్తి కాలేదు. బ్రిటిష్ వాళ్ల హయాంలోనైనా, అధికార మార్పిడి తర్వాత అయినా ఉత్పత్తి సాధనాల మీద యాజమాన్యం మారలేదు. రాజ్యాంగ యంత్రం మీద దోపిడీ వర్గ ఆధిపత్యమే కొనసాగుతూ బూర్జువా ప్రజాస్వామిక సంస్థలు ఉనికిలో వచ్చాయి. అందువల్ల సాంఘిక విముక్తికి అవి ఎంత వరకు దోహదపడతాయనే ప్రశ్న ఉంటుంది. అంబేద్కర్ ప్రతిపాదించిన అందరికీ ఒకే విలువ అనే సూత్రాన్ని రూపంలో ఈ సంస్థలు అంగీకరించినా సారంలో మార్పు జరిగిందా? రాజకీయ అర్థంలో మార్పు వచ్చిందని అంగీకరించినా సామాజిక జీవిత క్షేత్రంలో మార్పు సాధ్యమైందా? అదే జరిగితే అంటరానితనం రద్దయి ఉండాలి.

అంబేద్కర్ కోరుకున్నట్లు బూర్జువా ప్రజాస్వామ్యం అందరికీ ఓటు అనే విలువనైతే పాటించింది. ఆ రకంగా ఉదార ప్రజాస్వామ్య సంస్థల్లో ప్రజాప్రాతినిధ్యం అమలైనట్టే. అంత వరకు మంచిదే. ఓటింగ్ ప్రక్రియ ఏలా ఉందనే విషయం అలా ఉంచినా ఉత్పత్తి సాధనాల మీది యాజమాన్యం మారలేదు కాబట్టి ప్రజాప్రాతినిధ్యం అనే పేరుతో అగ్రకుల, సంపన్న వర్గాలే అధికారంలోకి వెళ్లాయి. అంటే అందరికీ సమాన అవకాశాలు అనే మాట రాజకీయ రంగంలో కూడా ఏ మాత్రం అమలు కాలేదని అర్థం చేసుకోవచ్చు.

ఈ విషయంలో అంబేదర్కర్‌కూ అనుమానం ఉంది. దీనికి రాజ్యాంగ రచనానంతరం ఆయన చేసిన ప్రసంగంలో ... సాంఘిక సమానత్వాన్ని సాధించలేకపోతే ఈ రాజ్యాంగాన్ని తగలబెట్టాల్సిందే.. అనే వ్యాఖ్య మంచి ఉదాహరణ.

ఈ మాట సాంఘిక విముక్తి పట్ల ఆయన అనురక్తిని, భారత పాలక వర్గాల పట్ల సందేహాన్ని తెలియజేస్తుందేగాని, మౌలికంగా బూర్జువా ప్రజాతంత్రవాదం పట్ల తన నమ్మకాన్ని వదిలేసుకున్నట్లు కాదు. బూర్జువా ప్రజాస్వామ్యానికి దూరమైనట్టు కాదు. ఆయనకు బూర్జువా ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని చెప్పడానికి, రాజ్యాంగ ఆదర్శాలు అమలు కాకపోతే.. అనే సందేహ ప్రకటనలోనే ఆయన విప్లవానికి చేరువయ్యాడని ఎవరైనా ఉత్సాహంగా చెప్తే ... అది ఆయన అవగాహనకు వ్యతిరేకం. ఆయనకు అపచారం.

ఇదంతా ప్రత్యేకించి అంబేద్కర్‌పై చర్చగా ఉంటుంది కాని, దీనికి ఒక ప్రాధాన్యత ఉంది. వలసపాలన పొడవునా జరిగిన సామాజిక ఉద్యమాల్లోని సాంఘిక విముక్తి ఆకాంక్ష ఒక స్పష్టమైన మార్గం సంతరించుకోవడం వెనుక ఆయన ఆలోచనలు ఉన్నాయి. ప్రజాస్వామిక విప్లవానికి బూర్జువా వర్గం నాయకత్వం వహించలేని చారిత్రక పరిస్థితుల్లో కార్మిక వర్గమే ఆ పని చేయవలసిన దశలో దళితుల సాంఘిక విముక్తికి బూర్జువా మార్గం ముందుకు రావడం వల్ల ఈ చర్చ ప్రాధాన్యత సంతరించుకుంటుంది. అయితే దళితుల సాంఘిక విముక్తి ఆకాంక్ష ముందుకు బూర్జువా మార్గం అంబేద్కర్ వల్లనే వచ్చిందని ఎవరైనా అనుకుంటే అది వాస్తవం కాదు. వ్యవస్థ పని తీరులో వచ్చిన మార్పులను దీనికి కారణంగా చూడాలి.

అట్లాగే సాంఘిక విముక్తికి ప్రజాస్వామిక విప్లవంలో ఎంత వరకు చోటు ఉండింది? అనే ప్రశ్న కూడా వేసుకోవాల్సిందే. ఆనాటి కమ్యూనిస్టుపార్టీని వలస వ్యతిరేక జాతీయ దృక్పథం నడిపించింది. పరాయి పాలన అనే వాస్తవం కళ్ల ముందు ఉంది కాబట్టి ఈ దృక్పథం ఏర్పడటం సహజమే. అయితే సాంఘిక విముక్తి మాటేమిటి? కుల సమస్యపై యాక్షన్ ప్లాన్ రూపొందించుకున్నా, గ్రామాల్లో వివిధ సమస్యలపై "కూలి జనా"ల్ని అంటే దళితులను సమీకరించినా ... చరిత్ర పొడవునా అంటరాని కులాల ఆకాంక్షగా వినిపించిన సాంఘిక విముక్తి గురించి ప్రత్యేకించి పట్టించుకోలేదు.

వాస్తవానికి సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ వాదం తప్ప కమ్యూనిస్టుపార్టీకి ఉండాల్సిన వర్గ పోరాట దృక్పథమే సవ్యంగా పట్టుబడలేదు. కింది స్థాయిలో పని చేసే కార్యకర్తల్లో, ఆమేరకు నాయకత్వ మార్గదర్శకత్వంలో పేదలపట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించడం మాత్రమే కనిపిస్తుంది. పేదల పక్షాన ఉండటం అంటే దళితుల పక్షాన ఉండటం అనే పార్టీ అనుకుంది. ఈ అవగాహనతో వాళ్లకు సంబంధించిన అనేక సమస్యలపై పోరాడింది.

ఆనాటికి కులాల్లో వర్గ విభజన బాగానే జరిగినా దళితుల్లో అది పెద్దగా కనిపించేది కాదు. అందువల్ల కులమంటే వర్గమనే అనుకున్నారు. దళితులకు భూమి సమస్య(వర్గ) కూడా ప్రబలంగా ఉన్నందున అది పరిష్కారమైతే అన్నీ తీరిపోతాయని అనుకున్నారు. ఆనాటికి వర్గ సమస్యకు, దళితుల సాంఘిక సమస్యకు దగ్గరి సంబంధం ఉన్నప్పటికీ అంటరానితనం సాంఘిక సమస్య అనే అవగాహన లేకపోయింది. ఆ రకంగా సాంఘిక సమస్యగా అది ప్రత్యేక గుర్తింపు పొందలేదు.

అందువల్ల ప్రజాస్వామిక విప్లవంలోని ఒక ప్రధానశక్తిగా ఉండిన కమ్యూనిస్టు పార్టీ జాతీయోద్యమంలోని వేర్వేరు శక్తులతో సంబంధం పెట్టుకున్నది కాని, సమాంతరంగా అంబేద్కర్ తదితరుల నాయకత్వంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న సామాజిక ఉద్యమాలతో సంబంధం పెట్టుకోలేకపోయింది. అంబేద్కర్ ఒక దశ తర్వాత తన అవగాహన వల్లనే కమ్యూనిస్టులతో ఉద్దేశపూర్వకంగా దూరంగా ఉంటూ వచ్చాడు. సారాంశంలో బూర్జువా ప్రజాస్వామిక సంస్థలు సాంఘిక విముక్తికి పరిష్కారమార్గమనుకున్నాడు.

దీని వల్ల దళితులకు మేలు జరగలేదా? అనే ప్రశ్న తలెత్తుతుంది. దీనికి ఒక ఉదాహరణ చాలు. బూర్జువా ప్రజాస్వామ్యంలోని అందరికీ విద్య అనే ప్రాతిపదకపై దళితులకు ఏదో ఒక స్థాయిలో అందిన చదువుతో వాళ్ల సామాజిక జీవితంలో చాలా మార్పులు వచ్చాయి. ఇలాంటివెన్నో నేరుగా అంబేద్కర్ ఆలోచనలు, కృషి వల్లనే దళితులకు అందినా ఆలోచనాపరుడిగా ఆయన బూర్జువా ప్రజాస్వామికవాది. ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక వర్గ విప్లవాలు చెలరేగిన కాలంలో ఆయన జీవించి ఉన్నందు వల్ల, ఆయన సాంఘిక ఉద్యమకారుడేగాక రాజకీయవేత్త కూడా కావడం వల్ల కూడా అంబేద్కర్ ఉదారవాద ప్రజాస్వామికవాది అని నిష్కర్షగా చెప్పవలసి వస్తుంది. విప్లవోద్యమం

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంతో తెగతెంపులు చేసుకొని వచ్చినందు వల్ల కూడా ఆయనలోని పార్లమెంటరీ విశ్వాసాల గురించి చెప్పవలసి వస్తుంది. ఇది ఎంత మాత్రం నిందార్థం కాదు. రాజకీయ అంచనా. అంబేద్కర్ చివరి దశలో జరిగిన సామాజిక ఉద్యమాలనేగాక ఇవ్వాల్టి దళిత బహుజన ఉద్యమాలను అర్థం చేసుకోడానికి కూడా ఈ అంచనా మరింత ఉపయోగపడుతుంది.

అయితే అంబేద్కర్ అనుమానించినట్లే రాజ్యాంగం చేసిన అనేక వాగ్దానాల వలె సమాజిక సమానత్వం కూడా అమలులోకి రాలేదు. రాజ్యాంగంలోని రాతగానే మిగిలిపోయింది. కుల సాంఘిక సంబంధాలు పునాదిలో ఉండిపోయినందు వల్ల సహజంగానే బూర్జువా పాలన వాటిని రద్దు చేయలేకపోయింది. కొత్తగా ఎదిగి వస్తున్న పెట్టుబడిదారీ సంబంధాలు కులాన్ని రద్దు చేయకపోగా పాత సాంఘిక సంబంధాలు కొత్త ఉత్పత్తి సంబంధాల మీద ఆధారపడి మనుగడ సాగించడం, పదే పదే పునరుత్పత్తిత చెందడం వల్ల అంటరానితనం మిగిలే ఉన్నది. అధికార మార్పిడి తర్వాత కూడా దళితుల్లో అసంఖ్యాకంగా భూమికి దూరంగానే ఉండిపోయారు. దళితుల సాంఘిక వివక్షకు ఇదొక భౌతిక ఆధారంగా ఉండిపోయింది. దళితుల్లో కూడా మెల్లగా వర్గ విభజన జరుగుతూ వచ్చినా సాంఘిక సంబంధాల్లో మార్పు రాలేదు. పాత రోజుల్లోలాగా కులం నేరుగా వర్గంతో ముడిపడిన విషయంగా కాక సాంఘిక సంబంధాలుగా ఉనికిలోకి రావడమే దీనికి కారణం. కులం నేరుగా వర్గంగా వ్యక్తమవుతున్న ప్రాంతాలు కూడా దేశంలో ఉన్న మాట వాస్తవమే. అయితే అది కూడా మార్పుకు లోనవుతున్నది.

రాజకీయ రంగంలో కూడా పెద్దగా మార్పులు రాలేదు. రాజ్యాంగం అమలులోకి వచ్చాక కూడా చిన్న చిన్న మినహాయింపులతో ఇదే వ్యవహారం నడిచింది.

4. వలసానంతరం:

అధికార మార్పిడి తర్వాత అంబేద్కర్, ఆయన అనుచరుల నాయకత్వంలో దళితుల అభ్యున్నతి లక్ష్యంగా రాజకీయ సంస్థలు కొద్ది కాలం బలంగా పని చేశాయి. అయితే దళిత సమస్యను బలంగా వ్యక్తీకరించింది మాత్రం దళిత్ పాంథర్స్. దక్షిణ భారత దేశంలో బ్రాహ్మణేతర శక్తులు సాంఘిక, రాజకీయరంగాల్లో తీవ్రంగా సంఘర్షించాయి. కాంగ్రెస్ ఒరవడిలో, అంబేద్కర్ మార్గంలో రాజకీయాల్లో దళిత బహుజన శక్తులకు కొద్దిపాటి ప్రాతినిధ్యం దొరికింది. విద్యారంగంలో కూడా సాధారణ దళితులకు ఆమేరకు చోటు చిక్కింది.

నక్సల్బరీ ఉద్యమం పల్లెలను, భూమి లేని నిరుపేదలను కేంద్రంగా ఎంచుకుంది. అప్పటి భాషలో చెప్పాలంటే హరిజన వాడలు విప్లవ కేంద్రాలు కావాలని చైతన్యయుతంగానే విప్లవకారులు నిర్ణయించుకున్నారు. తొలి దశాబ్దంలో అనేక ఆటుపోట్ల వల్ల విప్లవోద్యమమే కుంటుపడిపోయింది. దీన్నుంచి తేరుకున్నాక తెలంగాణలో గ్రామ స్థాయిలో ప్రజాపంథా అమలు చేసే క్రమంలో బలమైన భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు వెల్లువెత్తాయి. తెలంగాణ సాయుధ పోరాటం తర్వాత కూడా ఆ ప్రాంతంలో ఇంకా బలంగానే మిగిలి ఉన్న భూస్వామ్య దోపిడీ కుల సంబంధాల రూపంలో సాగుతూ వచ్చింది. అందువల్ల భూమి లేని నిరుపేదల పోరాటమనే వర్గ పోరాటం సాంఘిక అర్థంలో మాల మాదిగల పోరాటంగా గుర్తింపు పొందింది. అందుకే మా. లె పార్టీని మాల మాదిగల పార్టీ అని దొరలు అనేవాళ్లు. అనేక సాంఘిక సమస్యల జమిలి పోరాటంగా భూ పోరాటాలు జరిగాయి.

వీటి వల్ల 1970ల చివరి కల్లా ఉత్తర తెలంగాణలో జిల్లా స్థాయి నాయకత్వమంతా మాల మాదిగలు, బీసీలే. ఉత్తర తెలంగాణ రీజనల్ నాయకత్వం కూడా కింది నుంచి ఎదిగి వచ్చిన అట్టడుగు కులాల వారే. నిరుపేద అగ్రకులాలను కలుపుకొని సాగిన ఈ వెల్లువలో పాల్గొన్న దళితులకు, బహుజనులకు ఈ పోరాటం వల్ల తమకు భూమి వస్తుందనే నమ్మకంతోపాటు తమ సాంఘిక విముక్తి కూడా ఈ ఉద్యమంలో దొరకుతుందని విశ్వసించారు. అంత గొప్ప నమ్మకాన్ని ఇచ్చిన పోరాటాలవి. దళిత, బహుజనుల నాయకత్వంలో విప్లవపార్టీ మార్గదర్శకత్వంలో వర్గ దోపిడీ రద్దు, సాంఘిక విముక్తి రెండూ సాధ్యమే అనే ఆచరణాత్మక అనుభవాలను ఈ ఉద్యమాలు అందించాయి. అంటే ఏక కాలంలో అవి వర్గపోరాటాలు, సామాజిక పోరాటాలు.

ఈ పరిస్థితి 1980ల మధ్యకు వచ్చే సరికల్లా మారిపోయింది. భూస్వామ్యం బలహీనపడిపోయిన కోస్తా ప్రాంతంలో దళిత ఉద్యమాలు మొదలయ్యాయి. ఇవి వర్గపోరాటాల ద్వారా తమ సాంఘిక సమస్యలు పరిష్కారం కావనే అపనమ్మకాన్ని ప్రచారం చేయడం మొదలైంది. బలమైన వర్గపోరాటాలు జరుగుతూ ఉన్న తెలంగాణలో కూడా ఈ ధోరణి మొదలై వర్గపోరాటాలు, సాంఘిక పోరాటాలు సమాంతరంగా నడిచే పరిస్థితి వచ్చింది. చరిత్రలోకి వెళ్లిపోల్చుకోవాలంటే.. పూర్తి భిన్నమైన పరిస్థితులే కావచ్చుగాని జాతీయోద్యమ కాలంలో కమ్యూనిస్టు పోరాటాలు, అంబేద్కర్ ఉద్యమాలు సమాంతరంగా నడవడం గుర్తుకు వస్తుంది.

ఎందుకు ఇలా జరిగింది? అనేది అతిపెద్ద ప్రశ్న. దీన్ని ఉద్యమ, సిద్ధాంత కోణాల్లోనేగాక వ్యవస్థలో వస్తున్న మార్పుల వైపు నుంచి చూడాలి. భూస్వామ్యం బలంగా ఉన్న ప్రాంతాల్లో, లేదా ఉన్న కాలంలో కూలీల పోరాటంగా సాగిన వర్గపోరాటం సాంఘిక విముక్తి పోరాటంగా కూడా వ్యక్తమైంది. నిజంగా అట్లాగే నడిచింది. ఆ తర్వాత వ్యవస్థకు ఏమైంది? వ్యవస్థలో ఏం జరిగింది? కులం పని తీరులో ఏం మార్పులు వచ్చాయి? అనే వాస్తవ అన్వేషణ మార్క్సిస్టులు మాత్రమే చేయగలరు.

సాంఘిక సంబంధాలతో వలస కాలంనాటి వ్యవస్థ వ్యవహరించిన తీరుకు వలసానంతర వ్యవస్థ వ్యవహరించిన తీరుకు ఉన్న తేడానే దీనికి అసలు కారణం. వలసానంతర తొలి దశ కంటే ఆ తర్వాత ఈ తేడాను స్పష్టంగా చూడవచ్చు. ఆ రోజుల్లో వలస దోపిడీతోపాటు సాంఘిక సంబంధాలతో ఎలా వ్యవహరించాలనే విషయంలో అప్పటి వ్యవస్థ చాలా కసరత్తు చేసింది. ఈ క్రమంలో అది కొన్ని వైరుధ్యాలను ఎదుర్కొన్నది. అగ్రకులశక్తులతో దానికి ఉన్న ఒప్పందం దీనికి ఒక ప్రధాన కారణం. ఈ పరిస్థితి వలసానంతర దశలో కూడా కొంత కాలం నడిచింది.

ఆ తర్వాత మన రాజకీయార్థిక వ్యవస్థ పని తీరులో మార్పులు వచ్చాయి. దాని విస్తరణ విపరీతంగా పెరిగిపోయింది. అనేక సామాజిక ఉద్యమాల ఒత్తిడి వల్ల కూడా అంత వరకు వ్యవస్థకు

దూరంగా విసిరేయబడిన, ఖండితులైన దళితులకు ఇతర సామాజిక శ్రేణులకు వ్యవస్థలో కొంచెం చోటు దొరకడం మొదలైంది. సుదీర్ఘ కాలం జరిగిన అనేక సంక్లిష్ట పరిణామాల పర్యవసానం ఇది. దీంతోపాటు భావజాల రంగంలో మార్పులు వచ్చాయి. వ్యవస్థ రాజకీయ ప్రతినిధిగా రాజ్యం సాంఘిక ఆకాంక్షలను నోటిమాటగానైనా తిరస్కరించలేని భావజాల వాతావరణం ఏర్పడింది. ఇది వలస కాలం కంటే, తదనంతర తొలినాళ్ల కంటే చాలా భిన్నమైనది.

అంత మాత్రాన అంటరానితనం పోలేదు. అనేక రకాల వివక్షలు తీరలేదు. దళితుల మీద దాడులు ఆగలేదు. సాంఘిక సంబంధాలు మౌలికంగా ఏమీ మారలేదు కావట్టి ఇవన్నీ అలాగే ఉన్నాయి. రాజ్యం దళితులకు భూమి, విద్య వగైరా.. అని అంటూ ఉంటుంది. వ్యవస్థలో కొంచెం చోటు దొరకడం వల్ల దళితులు భూమి కోసం ప్రయత్నిస్తే కుల సామాజిక సంబంధాల వల్ల దాడులు జరుగుతూ ఉంటాయి. ఈ వాస్తవికతను అనేక వైపుల నుంచి ఎంత విశ్లేషించుకుంటే అంతగా ఈ కొత్త సన్నివేశం అర్థమవుతుంది. ఈ సంక్లిష్టత ఎలాంటిదంటే.. అనేక రకాల సామాజిక పీడనలు, వివక్షలతోనే దళితులకు ఈ వ్యవస్థ కొంచెం చోటు కల్పించింది. దీని వెనుక పీడిత కులాల పోరాటాల పాత్ర కూడా ఒక ప్రధాన కారణమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. వ్యవస్థలో చోటు అంటే రాజకీయాధికారంలో చోటు అనే అర్థం కూడా ఉంది. అందుకే సామాజిక ఉద్యమకారులు ఓట్లు మావి.. సీట్లు మీవా? అనే నినాదం ఇచ్చారు. ఉత్పత్తి సంబంధాలు మారని, లేదా ఉత్పత్తి సాధనాల మీద పీడిత కులాలకు అధికారం లేని, అదనపు విలువ దోపిడీ ఆగిపోని ఈ బూర్జువా వ్యవస్థలోని రాజ్యంలో వాటా కోసం వచ్చిన ఈ నినాదాలు, ఈ ప్రయత్నాలు బూర్జువా మార్గానికి సంబంధించినవి. వలసానంతరం వ్యవస్థలో వచ్చిన అనేక మార్పుల వల్ల పీడిత సామాజిక శ్రేణులకు దానిలో కొంచెం ఆలంబన దొరికింది. ఇప్పటి దాకా మనం చెప్పుకున్న దాని ప్రకారం సాంఘిక ఆకాంక్షలకు భక్తి ఉద్యమం కాలం నుంచీ వ్యవస్థలో ఏ ఆలంబన లేని దశ నుంచి గత ముప్పై నలభై ఏళ్ల కాలంలో వ్యవస్థ పనితీరులో వచ్చిన మార్పుల వల్ల పీడిత కులాలకు ఇందులో కొంచెం చోటు దొరికిన ప్రత్యేక సన్నివేశం ఇది. కులవ్యవస్థ వైపు నుంచి చూసినప్పుడు ఇది ప్రజాస్వామికం. అయితే ఈ బూర్జువా మార్గంలో సాంఘిక విముక్తి సాధ్యమేనా? అనే ప్రశ్న ఉంది. అయితే దళిత బహుజన ఉద్యమాలన్నీ బూర్జువా మార్గాన్నే ఆశ్రయించాయని చెప్పనవసరం లేదు. బూర్జువా పార్లమెంటరీ విధానంపై వైఖరి ఏమిటనే దాన్ని బట్టి ఈ తేడా ఉంటుంది.

నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమం మొదలయ్యాక పది పదిహేనేళ్లపాటు సాంఘిక, రాజకీయార్థిక పోరాటాలు ఒక్కటిగానే నడిచి, ఆ తర్వాత సాంఘిక విముక్తి ఆకాంక్షలు ప్రత్యేకంగా వినిపించడానికి ఉద్యమ సంబంధమైన సమస్యలతోపాటు వ్యవస్థలో మార్పులు రావడమే అతి ప్రధానం. విప్లవోద్యమం సాంఘిక సమస్యను పట్టించుకోలేదని సామాజిక ఉద్యమకారులు విమర్శించడంలో కొంచెం వాస్తవం ఉన్నా.. వ్యవస్థ ఆ రోజుల్లో ఎలా ఉండింది..తర్వాత వచ్చిన మార్పులేమిటి? అని చర్చించకపోతే అసలు విషయం పట్టించుకోనట్టే. వ్యవస్థ పనితీరులో వచ్చిన మార్పుల వైపు నుంచి చూసి సాంఘిక విముక్తి స్వరాలను అంచనా వేయడం ద్వారానే వాటి ముందుకు వచ్చిన బూర్జువా మార్గాన్ని విప్లవ శక్తులు సూటిగా ఎత్తి చూపగలవు.

సామాజిక ఉద్యమాల ముందుకు సాంఘిక విముక్తికి బూర్జువా మార్గమా? విప్లవమార్గమా? రెండు మార్గాలు వచ్చి నిలిచాయి. అంబేద్కర్ తన రాజకీయ విశ్వాసాల్లో భాగంగానే బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థలు సాంఘిక విముక్తికి ఆలంబనగా ఉంటాయనుకున్నట్లే.. ఓట్లు మావి.. సీట్లు మీవా... అనే ప్రశ్న వేసి మేం ఎంత మందిమి ఉన్నామో మాకంత వాటా అనే ప్రాతిపదికపై కాన్షీరాం దళితులకు రాజకీయాధికారం కోసం ప్రయత్నించాడు. తద్వారా సామాజిక సంపదలో వాటా వస్తుందని నమ్మాడు. దీని కోసం ఎలాంటి రాజకీయ ఎత్తుగడలు అనుసరించాడనేది పూర్తిగా వేరే విషయం. అంబేద్కర్‌తో పోలిక కాదుగాని వలస కాలంలోని సాంఘిక విముక్తి ఆంక్షలను అంబేద్కర్ ఒక దశ దాకా తీసుకొని వస్తే వలసానంతర చరిత్రకు తగిన పద్ధతిలో కాన్షీరాం తన పద్ధతిలో మరింతముందుకుకు తీసికెళ్లాడని చెప్పడమే ఉద్దేశం.

విప్లవమంటే రాజ్యాంగ యంత్రంలో మార్పు, ఉత్పత్తి సంబంధాల్లో మార్పు, సామాజిక సంబంధాల్లో మార్పు. విప్లవకారులు ఈ లక్ష్యంతో పని చేస్తున్నారు. తరతరాలుగా దళితులు వినిపిస్తూ వచ్చిన సాంఘిక విముక్తి ఆకాంక్ష ఈ బూర్జువా మార్గంలో సాధ్యమయ్యేదేనా? ఈ వ్యవస్థలో భాగంగా దళిత బహుజనులకు దక్కాల్సిన వాటాలన్నీ దక్కడం పూర్తి ప్రజాస్వామికమే అయినా అది సాంఘిక విముక్తి అవుతుందా? అనే ప్రశ్నలు ఉంటాయి. వీటితోపాటు ఉత్పత్తిసాధనాల మీది యాజమాన్యంతో సంబంధం లేని అధికారం రాజ్యాధికారమవుతుందా? అనే ఇంకో కీలక ప్రశ్న కూడా ఉంది.

అట్లాగే వర్గపోరాటం సాంఘిక విముక్తికి కావాల్సిన ఆవరణను ఏర్పరుస్తుందేగాని వర్గపోరాటమే నేరుగా సాంఘిక విముక్తి సాధించి పెడుతుందని ఇప్పుడు ఎవ్వరూ విశ్వసించరనుకుంటాను. దళితులకు భూమి సమస్య చాలా తీవ్ర స్థాయిలో ఇప్పటికీ ఉన్న మాట వాస్తవమే. ఈ సమస్య తీరే క్రమంలో దళిత సమస్య పరిష్కారానికి అవసరమైన ఆవరణ ఏర్పడుతుంది. అంత మాత్రాన దానికదే సాంఘిక విముక్తి జరిగిపోతుందని కూడా ఇప్పుడు ఎవ్వరూ అనుకోకపోవచ్చు. అసలు కుల సమస్య అంటే వర్గ సమస్యే అని అస్సలే ఎవ్వరూ అనుకోరని నమ్మవచ్చు. అట్లా అంటే ఇప్పటికీ కులానికి వ్యతిరేకంగా తరతరాలుగా సాగుతున్న సాంఘిక విముక్తి పెనుగులాటను గుర్తించనట్టే.

ఈ విషయాల్లో సామాజిక ఉద్యమకారులకు ఏ అవగాహన ఉన్నా.. విప్లవకారులకు ఏ సందేహాలూ ఉండవు. కులం సాంఘిక సంబంధాలపై ఏర్పడ్డ వ్యవస్థ అనే అవగాహనతోనే నూతన ప్రజాస్వామిక విప్లవంలో సాంఘిక విముక్తి సాధ్యమవుతుంది. రాజకీయార్థిక వ్యవస్థ, అందులోని మార్పులు సాంఘిక సంబంధాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయో గుర్తించి నిరంతరాయంగా సాగే సాంఘిక పోరాటాల వెల్లువల వల్లనే కుల సాంఘిక సంబంధాలు బలహీనపడి రద్దవుతాయి. అత్యంత దీర్ఘకాలంపాటు జరగాల్సిన సామాజిక ఉద్యమాలకు వర్గపోరాట ఆవరణ, సాయుధ పోరాట ప్రభావం గొప్ప బలాన్ని ఇస్తాయి.

సంస్మరణ

ఉరుగ్వే అరుణపతాక, అక్షర యోద్ధ ఎడ్వార్డో గలీనో (Edwardo Galeano)

- ముక్తవరం పార్థసారథి

"In history as in nature, decay is the laboratory of life" అన్న మార్క్స్ వాక్యం గలీనో రాసిన "Days and nights of love and war" కు ప్రేరణ.

అమెరికా తొత్తులుగా ఉన్న ఫాసిస్ట్ నియంతల పాలనలో పలు లాటిన్ అమెరికన్ దేశాలలోని ప్రజాస్వామ్యవాదులను జైళ్ళలో పెట్టి చిత్రహింసల పాలు చేసారు. అర్ధరాత్రి అంతర్ధానమైన యువతీయువకులెందరో. గత అయదు దశాబ్దాలలో అక్కడి ప్రజలు ఇంతటి నరకాన్ని ఎప్పుడూ అనుభవించలేదు. (ఉదాహరణకు చిలీలో అధ్యక్షుడు సాల్వడార్ అలెండే హత్య తర్వాత, విక్టర్ జారా అనబడే కవి/గాయకుడిని ఫుట్‌బాల్ స్టేడియంలో, చేతివేళ్ళు నరికి, రైఫిళ్ళతో కొట్టిచంపి ప్రదర్శనకు పెట్టారు)

తను అనుభవించిన రెండు దశాబ్దాల ఈ అమానవీయ పరిస్థితులను కవితాత్మకంగా, అద్భుతమైన కథాకథన ప్రతిభతో 'డేస్ అండ్ నైట్స్' రాసాడు గలీనో. పత్రికా కథనాలు, స్మృతులు, ఇంటర్వ్యూలు, యాత్రా కథనాలు, జానపద గాథల ప్రస్తావనలతో అనేక ప్రక్రియల సమ్మేళనం ఈ రచన. వెరసి ఒక అద్భుత వచన కావ్యం. 1978లో ప్రచురితమైన ఈ పుస్తకాన్ని లెనాన్ ఫౌండేషన్ Cultural Prize for Freedom తో సత్కరించింది.

"ఒక పదం లోకాన్ని మార్చగలదని తెలుసుకొన్న జ్ఞాని గలీనో. అయితే, కవి వాక్కుకు మాత్రమే ఇది సాధ్యం. 'డేస్ అండ్ నైట్స్'లో ఆ ప్రయత్నమే జరిగింది" అంటుంది ప్రముఖ రచయిత్రి సాండ్రా సిస్నెరాస్.

ఉరుగ్వే రాజధాని మాంటివీడియోలో జన్మించిన ఎడ్వార్డో హ్యూస్ గలీనో (3 సెప్టెంబర్, 1940-13 ఏప్రిల్ 2015) పత్రికా జీవితాన్ని ఎంచుకొని 1960లోనే 'మార్చా' పత్రికకు సంపాదకుడిగా పనిచేసాడు. (నోబెల్ బహుమతి గ్రహీత మారియో వర్గాస్ లోసా, మారియో బెనెడెట్టి లాంటి వాళ్ళ రచనల్ని ప్రచురించిన పత్రిక) ఆ తర్వాత ఇపోచ్ అనబడే దిన పత్రికకు సంపాదకుడిగా బాధ్యతలు నిర్వహించాడు. 1973లో, ఉరుగ్వేలో సైనిక తిరుగుబాటు తర్వాత ఆయన్ను జైల్లో పెట్టారు. ప్రాణానికి ముప్పు వాటిల్లటంతో దేశం వదిలి అర్జెంటీనా వెళ్ళక తప్పలేదు. కొంతకాలం అక్కడ 'క్రైసిస్' అనబడే సాంస్కృతిక పత్రిక నిర్వహించాడు. 1976లో అక్కడా సైనిక తిరుగుబాటు జరిగి అణచివేత పెరిగింది. వందలాది మందిని విచక్షణా రహితంగా హత్య చేసారు. ఈసారి స్పెయిన్ వెళ్ళాడు.

1985లో స్వదేశంలో పరిస్థితులు కాస్త కుదుట పడిన తర్వాత మాంటివీడియో తిరిగి వచ్చాడు గలీనో. 2007లో ఊపిరితిత్తుల కాన్సర్‌కు ఆపరేషన్ జరిగింది. అయినా పూర్తిగా కోలుకోలేదు.

మంత్లీ రివ్యూ పత్రికకిచ్చిన ఒక ఇంటర్వ్యూలో తనను తాను ప్రధానంగా పత్రికా రచయితనని చెప్పుకొన్న గలీనో లాటిన్ అమెరికా గురించి పలు పుస్తకాలు ప్రచురించాడు.

ఈయన తొలి రచన 'గాటెమాలా:ఆక్యుపైడ్ కంట్రీ (1967)'. ఆ తర్వాత 1971లో వెలువడిన "Open veins of Latin America" తో ప్రపంచం వ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. ఉత్తర అమెరికా ఇతర యురోపియన్ దేశాలు 500 సంవత్సరాల పాటు లాటిన్ అమెరికాను నిలువు దోపిడీ చేసిన చరిత్ర క్రమాన్ని చిత్రిస్తుందిది. ఒకటా, రెండా వందలాది విదేశీ కంపెనీలు లాభాలే లక్ష్యంగా లాటిన్ అమెరికాను పీల్చి పిప్పి చేసాయి. తమ పెట్టుబడిదారీ విధానాలను ఇక్కడి ప్రజల మీద రుద్దాయి. "పెట్టుబడిదారీ దోపిడీని అర్థం చేసుకోవటానికి ఇంతకన్నా మంచి పుస్తకం లేదు" అంటుంది ఎలిజబెత్ డోర్ (నికరాగువా: ఎ మిత్ ఆఫ్ మోడర్నిటీ రచయిత్రి)

స్వభావరీత్యా కథకుడైన గలీనో Open veins ను ఒక అద్భుతమైన, ఉత్కంఠభరితమైన కథలాగ రాసాడు. ఒకసారి చదవటం ప్రారంభిస్తే మధ్యలో ఆపలేం. (పగలంతా పత్రికలో పనిచేస్తూ, కేవలం తొంభై రాత్రులు ఏకబిగిన రాసి ఈ పుస్తకం ముగించాడు గలీనో). దోపిడీకి వ్యతిరేకంగా గళమెత్తిన రచయిత ధర్మాగ్రహం, కట్టలు తెంచుకున్న కవితా ఝరిలా ప్రవహించింది. 'సాహిత్యం పాఠకుల ఆలోచనా ధోరణిని మార్చగలదని నిరూపిస్తుంది 'ఓపెన్ వెయిన్స్" అంటుంది ఈ పుస్తకానికి ముందుమాట రాసిన ఇసాబెల్ అలెండె. "లాటిన్ అమెరికన్ ప్రజలతో మమేకమై జీవించిన వారు మాత్రమే ఇలాంటి పుస్తకం రాయగలరు. 1973లో చిలీలో సైనిక తిరుగుబాటు తర్వాత నేను దేశం వదిలినప్పుడు రెండే పుస్తకాలను వెంట తెచ్చుకున్నాను. ఒకటి పాబ్లో నెరుడా రాసిన 'Odes' మరోటి 'Open veins'. ఆ తర్వాత అనేక సంవత్సరాల పాటు ఇవి నాకు నిత్య పారాయణ గ్రంథాలు. ఏ విలువలు లేకపోతే మనం బతకటం అనవసరమో. వాటి కోసం మరణానికి సిద్ధపడినా తప్పులేదు" అంటాడు గలీనో. ఈ లాటిన్ అమెరికన్ ప్రజా రచయితతో ఏకీభవిస్తాను నేను. 2009లో అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా లాటిన్ అమెరికా పర్యటనకు వచ్చినప్పుడు, వెనెజులా అధ్యక్షుడు హ్యూగో చావెజ్ అయనకు 'ఓపెన్ వీన్స్' ప్రతికు బహూకరించడంతో ఈ పుస్తకం ప్రాచుర్యం అనూహ్యంగా పెరిగింది.

1982-1986 మధ్య, గలీనో ప్రచురించిన 'Century of the wind triology' (మూడు పుస్తకాల మాలిక)కి లాటిన్ అమెరికన్ సాహిత్యంలో ప్రత్యే స్థానమున్నది. "తనను తాను విస్మరించుకున్న లాటిన్ అమెరికాకు, ఈ పుస్తకంతో తన అస్తిత్వాన్ని గుర్తుచేసాను" అంటాడు గలీనో. Genesis, Faces and Masks, Memory of Fire అని మూడు భాగాలుగా వెలువడిన ఈ పుస్తకం హింస, దోపడీతో పురుడుపోసుకున్న తొలి రోజుల నుండీ రీగన్ దాకా గడిచిన లాటిన్ అమెరిన్ చరిత్ర. కాని రచనా ప్రక్రియగా ఇదో కొత్త ప్రయోగం. స్పెనియార్డులు, ఇంగ్లిష్ వాళ్ళు, ఆఫ్రికా నుండి వచ్చిన నల్లవాళ్ళు, అజ్‌టెక్‌లు, ఇంకా అనేక స్థానిక తెగల అనుభవాల సమాహారమే

ఈ ట్రిలజీ. ఒక వైపు చారిత్రక సంఘటనలు, మరొక వైపు వ్యక్తుల రోజువారీ దినచర్య, పత్రికా కథనాలు, (ఆయా సంవత్సరాల్లో వచ్చిన వార్తా పత్రికలు చదివితే మనకు కనిపించే టిడ్‌బిట్స్, బాక్స్ ఐటమ్స్ లాంటివి) కలగలిపి చదివిన కొత్త అనుభవం కలుగుతుంది. వెరసి ఈ ట్రిలజీ, చరిత్ర రచనలో ఒక కొత్త జెనర్, ఒక మాస్టర్ పీస్.

కథా రచయితలుగా, చరిత్రకారునిగా గలీనో చేసిన మరో ప్రయోగం The Book of Embraces (1989) కథలు, కబుర్లు, పిట్టకథలు, నీతి కథలు, కలలు, ఆత్మకథాంశాలు వగైరా సరదాగా, సీరియస్‌గా బ్లెండర్‌లో వేసి, కలిసి చెప్పిన తమాషా కథనాలు. గలీనో రచనలన్నిటిలాగే దీన్నీ ఫలాని ప్రక్రియ అంటూ విడమర్చి చెప్పలేం. "గాబ్రియెల్ గార్సియా మార్కెజ్ లాగ, ఇసాబెల్ అలెండె లాగ, లేదా పాబ్లో నెరుడా లాగ ఇవి ఒక కళాకారుడి ఆలోచనల మాయ జలతారు. డియెగో రివేరా గీసిన కుడ్య చిత్రం Book of Embraces" అంటారు విమర్శకుడు జాన్ లియోనార్డ్. "ఇలాంటి పుస్తకం రాయాలనుకోవటం కత్తి మీద సామే. కాని రచయిత అలవోకగా అసాధ్యమనుకొన్నది చేసి చూపించాడు. మెమరీ ఆఫ్ ఫైర్ లాగ ఇందులో కూడా కొలేజ్ టెక్నిక్ వాడాడు గలీనో. రచనలో అధివాస్తవికత ఉంటుంది. కాని అది కఠోర వాస్తవమని మనకు తెలుసు. ఇక హాస్యం, వ్యంగ్యం గలీనో స్వభావంలోనే ఉంది". బొమ్మలు ఈ పుస్తకానికి ప్రత్యేక ఆకర్షణ.

ఉదాహరణగా, ఉరుగ్వేలో సైనిక నియంతృత్వం అమలులో ఉన్న రోజుల గురించి, ఇందులో ఉన్న ఒక చిన్న కథ (బిట్) :-

ఛాలెంజ్

"మనల్ని మార్చలేక పోయారు. ఏం చేసీ, లొంగదీసుకో లేకపోయారు" అని నాకో సందేశం పంపాడు కాచో ఎల్ కదిని. నియంతృత్వం చివరి రోజులవి. బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ లకు భోజనం మారలేదు. మూడు పూటలా తిన్నది భయం, భయం, భయం మాత్రమే. అయినా వాళ్ళు మమ్మల్ని మార్చలేకపోయారు. లొంగదీసుకో లేకపోయారు"

చదవక తప్పదనిపించే మరో అద్భుత సంకలనం We Say No (1989) ప్రపంచవ్యాప్తంగా దురాశ, అణచివేత, దోపిడీలకు 'నో' చెప్పటం ద్వారానే స్వేచ్ఛ, సమానత్వం, మానవీయమైన విలువలు, ప్రేమలకు 'ఎస్' చెప్పటం సాధ్యమవుతుందంటాడు గలీనో. బహిష్కృతుల, పరాజితుల అతి సామాన్య జీవిన పోరాటాలను చిత్రిస్తాయి ఇందులోని ముప్పైనాలుగు వ్యాసాలు. లాటిన్ అమెరికాలో సాహిత్యానికున్న రాజకీయ ప్రాధాన్యత గురించిన చర్చ కూడా ఉంటుంది. అమెరికాలో కొలంబస్ అడుగుపెట్టిన రోజును ఒక పండగగా జరుపుకుంటారు. అది అతను అడుగు పెట్టిన రోజా లేక లాటిన్ అమెరికా పరాధీనమై బానిస జీవితం ప్రారంభించిన రోజా అని ప్రశ్నిస్తాడు గలీనో.

(1988 జులై 11 నుండి 16 దాకా చిలీలో జనరల్ పినోషె నియంతృత్వ పాలనపై అభిప్రాయ సేకరణకు ముందు, 'చిలీ క్రియేట్స్' పేరుతో వివిధ దేశాలకు చెందిన 300 మంది కళాకారులు, మేధావులు, ఆ దేశంలో ప్రజాస్వామ్యాన్ని డిమాండ్ చేస్తూ ఒక సమావేశం నిర్వహించారు. జులై 11 నాడు గలీనో అక్కడ ప్రారంభోపన్యాసం చేసాడు. దాని శీర్షికే We say no)

ఈ పుస్తకంలో నుండి చిన్న పేరా "1492లో కొలంబస్ అమెరికాను ఆవిష్కరించలేదు. ఆ సంవత్సరం అమెరికాపై దాడి జరిగింది. అంతకు వేలాది సంవత్సరాల ముందే (స్థానిక) ఇండియన్లు ఈ ఖండాన్ని ఆవిష్కరించారు. 1492లో ఇక్కడికి వచ్చిన విదేశీయులకు, ఈ కొత్త భూభాగాన్ని, ఇక్కడి ప్రజల్ని ఇక్కడి సంస్కృతిని, కట్టుబాట్లను ఎలా అర్థం చేసుకోవాలో తెలియదు. అందువల్ల దాన్ని 'ఆవిష్కరణ' అనలేం. కొలంబస్ తర్వాత నాలుగేళ్ళకు ఆయన సోదరుడు బార్తొలోమ్యూ ఇక్కడి తొలి స్మశానవాటికను ప్రారంభించాడు. జీసస్ క్రైస్ట్, వర్జిన్ మేరీల బొమ్మల్ని ఖననం చేసిన ఆరుగురు స్థానిక ఇండియన్లను సజీవ దహనం చేసాడు. నిజానికి, వాళ్ళకు ఈ క్రిస్టియన్ దేవతల మీద కోపమేమీ లేదు. వాళ్ళ ఆచారం ప్రకారం అలా చేయటం వల్ల పంటలు బాగా పండుతాయనుకున్నారు".

1993లో, హోసె ఫ్రాన్సిస్కో బోర్హెస్ వేసిన వుడ్‌కట్ చిత్రాలతో Walking words ప్రచురించాడు గలీనో. ఇంది మరో వర్డ్ మాజిక్. చిత్రాలూ, కథనాలూ కలిసి కొత్త అనుభవం కలుగచేస్తాయి. వీటి గురించి రాయటం కన్నా, మచ్చుకి ఒక పేరా తెలుగులో చెప్పటం మేలు.

"ప్లీజ్, నా మనవి ఆలకించండి. ఇది నిజంగా జరిగిందా అని అడిగి నాకు కోపం తెప్పించకండి. జరగకపోయి ఉంటే జరిగేటట్టు చెయ్యటానికి ప్రయత్నించండి. రాత్రి వర్షం కురిసిందా లేదా అని మిమ్మల్ని అడగటం లేదు తడిసి ముద్దవమంటున్నాను. రచయిత గారూ, నిర్ణయించుకోండి. పుష్ప సుగంధాన్ని వర్ణించటం కాదు, ఆ పువ్వు మీరే కావాలి. 'ఏం చేయాలి' అని రాయటం కాదు, రాసింది బతకటమే అసలైన సవాల్. ఇంకెప్పుడు తెసుకుంటారీ చిన్న విషయం".

లాటిన్ అమెరికాలోని అందరు కుర్రోళ్ళ లాగానే గలీనోకు కూడా సాకర్ (ఫుట్‌బాల్) అంటే ప్రాణం. సాకర్ క్రీడాకారుడిగానే స్థిరపడాలని కలలు కన్నాడు. కాని జీవితం అనుకోని మలుపులు తిరిగింది. చివరికి 1995లో 'Soccer in Sun and Shadow' అని పుస్తకం రాసి తన కోరిక తీర్చుకున్నాడు.

పెట్టుబడిదారీ కళ్ళద్దాలతో చూస్తే ప్రపంచం ఎలా తల్లకిందులుగా కనిపిస్తుందో చెప్పిన మరో ప్రయోగాత్మక రచన 1998 నాటి Up side Down: A Primer for the looking glass world.

ఇవి గాక ఈయన Voices of time : A life in stories (2004), Mirrors (2008, Children of the Days (2011) వగైరా అనేక పుస్తకాలు ప్రచురించాడు.

గలీనో ప్రతి వాక్యంలో, ప్రతి కథలో, ప్రతి పద చిత్రంలో మనకు కనిపించేది దోపిడీకి గురవుతున్న పేద దేశాల ముఖ్యంగా లాటిన్ అమెరికన్ ప్రజల పట్ల ఆయన కున్న నిబద్ధత. పెట్టుబడిదారీ దోపిడీకి కేంద్రమైన యు.ఎస్.ఎ. పట్ల కోపం, ద్వేషం.

"లెఫ్టిస్ట్ సాహిత్యమంటే గంభీరంగా, ఉపన్యాస ధోరణిలో సాగనక్కర్లేదు. హాస్యం, వ్యంగ్యం, చిత్ర విచిత్ర కథనాలతో పాఠకులను అలరిస్తూనే చైతన్య పరచవచ్చు" అన్న విషయం తెలుసుకోవాలంటే గలీనోను చదవక తప్పదు.

యథార్థ జీవిత దృశ్యాలు
చెట్లకూ చేతులూ, మనుషులకు కొమ్మలూ
ఎముకల గూడు లాంటి చెట్టు

ఎండిన మోదు లాంటి మనిషి
ఎండకెండీ, వానకు తడిసీ, చలికి తట్టుకునీ
నిటారుగా నిలిచిన చెట్లూ, మనుషులూ, తుపానులు ప్రకృతి వైపరీత్యాలు
గొడ్డళ్లతో, మర రంపాలతో కదలి వచ్చే కలప వ్యాపారులు
గొలుసుల బరువు కింద జంతువుల కన్నా హీనంగా బతుకుతున్న మనుషులు
చెట్లన్నీ ఒకే రకం
కాని మనిషి అలా కాదు
తుపాకీ గుళ్ల వర్షాలు
పేదల పూరిళ్ల మీద బుల్డోజర్ల జైత్రయాత్రలు
అరణ్యాల్ని ధ్వంసం చేస్తారు
ఇళ్లను ధ్వంసం చేస్తారు
జీవితాల్ని ధ్వంసం చేస్తారు
ఏడాది తిరక్కుండా కొత్త చెట్లు మొలుస్తాయి
ఏడాది తిరక్కుండా కొత్త తిరుగుబాటు కంఠం గర్జిస్తుంది
నిలువుగీతా, అడ్డగీతా
నిచ్చెన మెట్ల జీవితంలో ఎక్కువ తక్కువలున్నాయి
మానవహారంలో నువ్వూ నేను ఒక్కటే అనే భావన ఉన్నది
....
రంపాల వంటి దేహాలతో బ్రహ్మజెముడు మొక్కలు
మెలికలు తిరిగిన ఫ్యాక్టరీ పైపులు - పైపుల్లా, పాముల్లా.

ఈ బొమ్మల గురించి ఏం రాయాలా అని ఐదు నిమిషాలు ఆలోచించాను. ఈ ఐదు నిమిషాల్లో ధనిక దేశాలు పది మిలియన్ల డాలర్లు మారణాయుధాల కోసం ఖర్చు పెట్టాయి. ఈ ఐదు నిమిషాల్లో వందలాది పసిపిల్లలు ఆకలికి మాడి ప్రాణాలు విడిచారు. ఈ ఐదు నిమిషాలూ శాంతి ముసుగు తొడుక్కున్న యుద్ధం కొనసాగుతూనే ఉన్నది. హిట్లర్ గ్యాస్ ఛాంబర్ల ఆకలి లక్షలాది మంది అమాయకుల శరీరాలతో తీరింది. ఇప్పుడు గ్యాస్ ఛాంబర్లకు బదులుగా ఆకలే మనుషుల్ని బలికొంటున్నది - లక్షల్లో. ఇది మంచి జనాభా నియంత్రణ పద్ధతి.

భయపెట్టి, బెదరగొట్టి 'శాంతి స్థాపించా'లనే విధానం హిరోషిమా, నాగసాకిల మీద అణుబాంబులు వెయ్యటంతో ప్రారంభమైంది. మరో ప్రపంచ యుద్ధం వస్తే జనాభా బాగానే తగ్గుతారు. రాకపోయినా, ఆకలితో పేద దేశాల్లో అంతమందీ తగ్గుతారు. మనిషి ఒక్కసారే చావగలడు. కాని ప్రతి మనిషినీ డజన్ల సార్లు చంపగలిగినన్ని అణుబాంబులున్నాయి. ఈ ధనిక దేశాల అధిపతులు ఆకలిని నిర్మూలించటం లేదు. అన్నార్తుల్ని నిర్మూలిస్తున్నారు. ప్రపంచ జనాభానంతా పోషించగలిగిన ఆహార నిల్వలు ఉన్నాయంటారు. అయినా కొందరివి ఆకలి చావులూ, కొందరివి అజీర్తి చావులూ.

ప్రపంచ జనాభాలో, డాక్టర్లతో పోలిస్తే, సైనికులు ఇరవై అయిదు రెట్లు ఎక్కువ. ముఖ్యంగా, పేద దేశాలు కూడా ప్రజారోగ్యం మీది ఖర్చు తగ్గించి, మిలిటరీ ఖర్చు పెంచాయి. ఇంటర్నేషనల్ మానెటరీ ఫండ్‌లో పనిచేసిన ఒక గ్రెనేడియన్ ఆర్థికవేత్త దేవిసన్ బధూ తన ఉద్యోగ విరమణ సమయంలో ఇలా చెప్పాడు.

"నదుల నిండా నెత్తురు ప్రవహిస్తున్నది. ఏ నదిలో దిగినా ఒంటి మీద అట్ట కట్టుకు పోతుంది. ఈ ఐఎంఎఫ్ పేరుతో నా ఒంటికి అంటిన నెత్తురు కడుక్కోవటానికి సరిపోయనంత సబ్బు ఈ ప్రపంచంలో లేదు" ధనిక దేశాల్లో పేద దేశాల గురించి మాట్లాడాలన్నా నామోషీ. ఎయిడ్స్ ఆఫ్రికాకే గనక పరిమితమై ఉంటే ఇంత హడావుడి, ప్రచారం జరిగేదే కాదు. అక్కడ కోట్లాది మంది మరణించినా ధనిక దేశాలు పట్టించుకునేవే కావు. సల్మాన్ రష్దీ ఇండియలోనే ఉండి, బెంగాలీ లోనో, ఉర్దూలోనో రాసి, అతడి మీద ఫత్వా అమలు జరిగినా ఎవరూ ఆలోచించే వాళ్లే కాదు. లాటిన్ అమెరికా దేశాల్లో వందల మంది రచయితలు, కవులు, కళాకారుల్ని నిరంకుశ ప్రభుత్వాలు చంపేసాయి. ఎవరు నిరసన వ్యక్తం చేసారు? రష్దీకి విధించిన మరణశిక్షకు పశ్చిమ దేశాలు ఇరాన్ నుంచి తమ రాయబారుల్ని వెనక్కు పిలిపించుకున్నాయి. మా దేశాల్లో నిత్యం జరుగుతున్న హత్యల సంగతేమిటి?

రాజ్యహింస ఇక్కడ సర్వసాధారణమైన విషయం. పశ్చిమ దేశాల సమాచార మాధ్యమాలకు పేద దేశాల సమాచారమైనా చేరదు. థర్డ్‌వరల్డ్ ప్రజలు థర్డ్ క్లాసు మనుషులు, తమకూ, వాళ్లకూ, ఒకే సారూప్యం. రెండు కాళ్ళు, రెండు చేతులూ. గాలీ, ఎండలాగా, పేద దేశాలలో ఆకలీ, రోగాలూ, రాజ్యహింసా సహజ విషయాలు.

ఆర్థికశాస్త్ర గ్రంథాలలో కనిపించే అంకెలు నిజం చెప్పవు. అవి ముసుగులు తొడుక్కుంటాయి. ఉదాహరణకు ఒక దేశంలో ఇద్దరే మనుషులున్నారనుకోండి. అక్కడి తలసరి ఆదాయం $4000/- అంటే దేశ ఆదాయం $8000/-. కాని ఒక్కడి ఆదాయమే $8000/- మరొకడిది $0/-.

(సెబాస్టియ సాల్గాడో తీసిన ఛాయచిత్రాల పుస్తకానికి గలీనో రాసిన ముందుమాట కొద్దిపాటి మార్పులతో)

(30వ పేజీ తరువాత...)

జిల్లా, మేడారం) వన దుర్గగా మార్చివేడి చేస్తున్నారు. ఇవన్నీ ప్రజలు చెబుతున్న విషయాలే. కాబట్టి చప్కా బాబాలు, లక్ష్మణానంద సరస్వతులు ఆదివాసీ సమాజాల పైకి దండయాత్రకు వచ్చి హైందవాన్ని వ్యాపింప చేసిన వారే అయినపుడు పునరాగమనానికి అర్థమేంటి? ఇది హిందూ మతోన్మాదం తప్ప పునరాగమనం కానే కాదు. నిజానికి ఇది ఘర్ ఉజాడ్‌నా హై, ఘర్ వాపసీ నహీ! ఆదివాసీ ప్రజలను హైందవంలోకి మార్చడాన్ని, క్రైస్తవంలో కలుపుకోవడాన్ని నిర్ద్వంద్వంగా ఖండించి ప్రతిఘటించాలి. మతం మత్తు నుండి ప్రజలను బయట పడేసి శాస్త్రీయ అవగాహనను వారిలో పెంచడం, నిజమైన లౌకిక విధానాలతో నిర్మాణమవుతున్న జనతన సర్కార్లను రక్షించుకోవడం, పటిష్ట పరుచుకోడం ద్వారానే మతోన్మాదుల ఘర్‌వాపసీ ఆటలు అరికట్టబడతాయి. ప్రపంచానికి సంస్కృతి నేర్పింది ఆదివాసులే అంటారు పండితులు. బ్రిటిష్ సామ్రాజ్యవాద వలన వాదానికి వ్యతిరేకంగా మొదటి తూటా పేల్చింది ఆదివాసులేనని మన స్వాతంత్ర్యోద్యమ చరిత్ర చెబుతుంది. చరిత్ర పునరావృతమవుతుంది. కాకపోతే కొత్త పుంతలపై అన్నట్టు తిరిగి ఆదివాసీలు తిరగబడి తీరుతారు. తమ సంస్కృతి రక్షణ కోసం కుట్రపూరిత పునరాగమనాలను అడ్డుకుంటారు. దోపిడీ వర్గాల హరిత వేటను ఓడిస్తారు. కాకపోతే ప్రజలే చరిత్ర నిర్మాతలన్న సత్యంపై పూర్తి విశ్వాసంతో నేటి పరిస్థితులలో వారి వెంట నడుద్దాం.

-: స్వీకారం :-



పాలమూరు
వలస బతుకు చిత్రాలు
గీతాంజలి

ప్రచురణ :
వెన్నెల ప్రచురణలు

వెల : రు. 150/-

పేజీలు : 253



కె.వి.ఆర్.
సామాజిక వ్యాసాలు

ప్రచురణ :
కె.వి.ఆర్., శారదాంబ స్మారక కమిటీ

వెల : రు. 300/-

పేజీలు : 748



భారత చరిత్ర
అధ్యయనానికి ఒక పరిచయం
దామోదర్ ధర్మానంద్ కోసంబి
తెలుగు : ఎన్. వేణుగోపాల్

ప్రచురణ :
నేషనల్ ట్రాన్స్‌లేషన్ మిషన్
హైదరాబాద్ బుక్ ట్రస్ట్

వెల : రు. 250/-

పేజీలు : 488



కో...బలి
అరుణతార కథలు - 4

ప్రచురణ :
చరిత

వెల : రు. 30/-

పేజీలు : 96



కథ అడ్డం తిరిగింది
అరుణతార కథలు - 3

ప్రచురణ :
చరిత

వెల : రు. 30/-

పేజీలు : 88



అప్రజ్ఞాత యజ్ఞం
కాళీపట్నం రామారావు

ప్రచురణ :
కావ్య పబ్లిషింగ్ హౌస్

వెల : రు. 30/-

పేజీలు : 86



ఒక సామూహిక దుఃఖ
గానం
డా॥ దిలావర్

ప్రచురణ :
సమతా ప్రచురణలు, పాల్వంచ

వెల : రు. 50/-

పేజీలు : 64

పోరుబాటలో ఉప్పెన పాట
ఉప్పెన

ప్రచురణ :
అరుణోదయ సాంస్కృతిక
సమాఖ్య, ఆంధ్రప్రదేశ్

వెల : రు. 40/-

పేజీలు : 152



సత్య
అర్నాద్

వెల : రు. 150/-

పేజీలు : 160



కథల వాచకం
14 దేశాలు - 20 కథలు
ముక్తవరం పార్థసారథి

ప్రచురణ :
వికాసం బుక్స్

వెల : రు. 100/-

పేజీలు : 145



నోబెల్ తారలు
(నోబెల్ బహుమతి గ్రహీతల కథానికలు)
ముక్తవరం పార్థసారథి

ప్రచురణ :
వికాసం బుక్స్

వెల : రు. 250/-

పేజీలు : 288



కించిద్విషాదం
ముక్తవరం పార్థసారథి

ప్రచురణ :
వికాసం బుక్స్

వెల : రు. 60/-

పేజీలు : 100



మరణోపనిషత్
(మరో ఐదు కథలు)
ముక్తవరం పార్థసారథి

ప్రచురణ :
వికాసం బుక్స్

వెల : రు. 80/-

పేజీలు : 108



ప్రపంచ రచయిత్రుల
కథలు 14
ముక్తవరం పార్థసారథి

ప్రచురణ :
వికాసం బుక్స్

వెల : రు. 90/-

పేజీలు : 145



తెలంగాణ - ప్రజా
రాజకీయాలు
జగన్ వ్యాసాలు

ప్రచురణ :
దిక్సూచి ప్రచురణ

వెల : రు. 40/-

పేజీలు : 103

KLVA101M177

59

ARUNATARA A Literary and Cultural Telugu Monthly Journal of Revolutionary Writers' Association (VIRASAM)

● RNI Regn.No.21152/72 ● Published on 05/05/2015 313 - April, 2015



Edited, printed, published and owned by Chalasani Prasad, H.No. 33-13-3, Seetharampuram, Vijayawada - 520 002
Printed at Nagendra Printing Press, Vijayawada - 520 002.
Editor : Chalasani Prasad

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M177
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	53
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Y.V. Bhanu
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	Apsar
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good